SUNDAY Special
ఆదివారం 9-11-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'
పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 8.00
సంపుటి: 18
సంచిక: 228
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మొన్నటి గృహిణి.. నేటి ఉత్తమ నటి

నిన్న మొన్నటి వరకు సాధారణ గృహిణిగా ఉన్న షామ్లా హంజా తన రెండో సినిమా ఫెమినిచి ఫాతిమాతో కేరళ ప్రభుత్వం నుంచి ఉత్తమ నటి అవార్డు గెల్చుకుంది. 11 లో

టీమిండియాదే టి20 సిరీస్

భారత్, ఆస్ట్రేలియా మధ్య శని వారం జరిగిన చివరి టి20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దాంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2-1తో సొంతం చేసుకుంది. 12 లో



డిసెంబర్ 1నుంచి పార్లమెంట్

పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ విడుదలైంది. డిసెంబర్ 1 నుంచి 19వ తేదీ వరకు సమావేశాలు కొనసాగనున్నాయి.

వివరాలు 6లో ►

చెత్తకుప్పలో వీవీప్యాట్ స్లిప్పులు

బిహార్‌లోని సమస్తీపూర్‌లో పెద్ద సంఖ్యలో వీవీప్యాట్ స్లిప్పులను రోడ్డు పక్కన విసిరేసి నట్లుగా ఉన్న వీడియో కలకలం రేపింది.

వివరాలు 6లో ►

జీ-20 శిఖరాగ్రానికి వెళ్లను

డిసెంబర్ 1న దక్షిణాఫ్రికాలో నిర్వహిస్తున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు వెళ్లబోనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు.

వివరాలు 6లో ►

వైద్య విద్యార్థులను కరిచిన ఎలుకలు

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ హాస్టల్లో ఆరుగురు వైద్య విద్యార్థులను ఎలుకలు కరిచాయి.

వివరాలు 10లో ►

అమ్మో.. ఇంతలా వెన్నుపోటా!

- శాంతియుత పోరాటంపై ఇన్ని కుట్రలా?
- వెలుగులోకి వచ్చిన సర్కారు కుతంత్రం
- గతనెలలో సమ్మె విరమణకు విద్యుత్ సంఘాల మధ్య యాజమాన్యం చిచ్చు
- విభజించి పాలించడం ద్వారా ఉద్యమానికి ఎసరు.. ఒకేరోజు 102 మంది ఇంజినీర్లకు పదోన్నతులతో బదిలీలు
- యూనియన్ నేతలకు బెదిరింపులు

14 లో

మంగళగిరిలో టిఫిన్.. తిరుపతిలో లంచ్.. హైదరాబాద్‌లో డిన్నర్

10 లో

డిప్యూటీ సీఎం పవన్ తిరుపతి జిల్లా పర్యటన ఎక్కే విమానం.. దిగే విమానంలా సాగింది. పవన్ శనివారం ప్రత్యేక విమానంలో గన్నవరం నుంచి రేణిగుంటకు చేరుకున్నారు. మామండూరు అటవీ ప్రాంత పరిశీలన ముగించుకొని విమానంలో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆదివారం తిరిగి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు వస్తారు.

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

తుపాను వల్ల అనకాపల్లి జిల్లా చాకుపల్లిలో నీట మునిగిన వరి పొలాన్ని దిగాలుగా చూస్తున్న రైతు

అంత నష్టం లేదట!

పంట నష్టం అంచనాలు భారీగా కుదించిన కూటమి ప్రభుత్వం

రైతన్నల గోడు ఏమాత్రం పట్టించుకోని వైనం

మోంథా తుపాను దెబ్బకు అన్నదాత కుదేలు

క్షేత్ర స్థాయిలో 15 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

2 లో

- కానీ 4.17 లక్షల ఎకరాల్లో మాత్రమే పంట నష్టమని తేల్చిన ప్రభుత్వం
- 2,279 పశువులు, జీవాలు దుర్మరణం..155 పశువుల షెడ్లు నేలమట్టం
- బోట్లు, వలలకు అపార నష్టం జరిగితే స్వల్పంగా నిర్ధారణ.. ఆక్వా రంగంలో 50 వేల ఎకరాల్లో నష్టం అంటూ కేవలం 5 వేల ఎకరాలకే పరిమితం
- సుంకు రాలిపోయిన పంట పొలాలను పరిశీలించని బృందాలు
- తుపాను తుది అంచనాల నివేదిక తయారు చేసిన యంత్రాంగం
- రేపు కేంద్ర బృందం ముందు ఉంచేందుకు సిద్ధమైన ప్రభుత్వం
- మొక్కుబడి తంతుగా ముగిసిన క్షేత్ర స్థాయి పరిశీలన

సులభతర న్యాయంతో సామాజిక న్యాయం

న్యాయశాస్త్రం భాషను ప్రజలకు అర్థమయ్యేలా మార్చాలి

- పౌరులందరికీ న్యాయం సులభంగా అందాలి
- కోర్టు తీర్పులను, న్యాయ పత్రాలను స్థానిక భాషల్లో తీసుకురావాలి.. ప్రభుత్వ న్యాయ సహాయ వ్యవస్థతో లక్షలాది వివాదాలకు తెర
- జాతీయ సదస్సులో ప్రధాని మోదీ స్పష్టీకరణ

6 లో

ప్రధాని మోదీ, తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాటామంతి

టిడ్కో ఇళ్ల.. సం'గతేంటి' బాబూ?

- పట్టించుకోని కూటమి సర్కార్
- ప్రాజెక్టు పూర్తికి రూ.7,280 కోట్లు అవసరం
- ముందుకు కదలని ప్రాజెక్టు పనులు
- జగన్ హయాంలో లబ్ధిదారులకు లక్ష ఇళ్ల వరకూ పంపిణీ..
- కూటమి సర్కార్ 18 నెలల పాలనలో ఒక్కరికీ లభించని ఇల్లు

2 లో

క్లుప్తంగా...

భక్త కనకదాసకు వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: కులమత భేదాల గోడల్ని చెరిపేసిన భక్తి యోధుడు శ్రీ భక్త కనకదాస అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. 'శ్రీకృష్ణ భగవానుడికి గొప్ప భక్తుడు శ్రీ భక్త కనకదాస. సాహిత్యంతో సామాజిక విప్లవం సాధించవచ్చని నిరూపించిన మహానుభావుడు ఆయన. ఎన్నో భక్తి కీర్తనలతో కవిత్వానికి కొత్త ఊపిరి పోశారు. కురుబ గౌడ దాస సమాజానికి ఆరాధ్య దైవంగా నిలిచిన శ్రీ భక్త కనకదాస జయంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

శీతల్‌దేవికి వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: ఆసియా కప్ టోర్నీ కోసం భారత జట్టుకు ఎంపికైన పారా ఆర్చర్ శీతల్‌దేవికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. 'శీతల్ దేవి ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఓపెన్ ఆర్చరీ(ఏబుల్–బాడీడ్) అంతర్జాతీయ ఈవెంట్‌కు అర్హత సాధించిన తొలి భారతీయ పారా ఆర్చర్‌గా నిలిచిన శీతల్‌కు అభినందనలు. పట్టుదల, అంకితభావం ఉంటే ఏదైనా సాధించవచ్చని శీతల్ నిరూపించింది. ఆసియా కప్‌లో పాల్గొననున్న శీతల్‌కి ఆల్ ది బెస్ట్' అంటూ వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

10, 11 తేదీల్లో తుపాను ప్రభావిత ప్రాంతాలకు కేంద్ర బృందం

సాక్షి, అమరావతి: కేంద్ర అధికారుల బృందం ఈ నెల 10, 11 తేదీల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది. కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి పొసమి బసు నేతృత్వంలో 8 మంది అధికారులు.. రెండు బృందాలుగా విడిపోయి ఆరు జిల్లాల్లో పర్యటించి తుపాను నష్టాన్ని అంచనా వేయనున్నారు. ఈ బృందం 10వ తేదీ ఉదయం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో రాష్ట్ర అధికారులతో సమావేశమై వివరాలు సేకరించనుంది. అనంతరం బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఒక బృందం, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో మరో బృందం పర్యటించి పంట, ఇతర నష్టాలను అంచనా వేయనుంది. ఈ బృందాన్ని సమన్వయం చేసేందుకు నోడల్ అధికారిగా విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, రాష్ట్ర స్థాయి లైజనింగ్ అధికారిగా ఈడీ వెంకట దీపక్‌ను నియమించింది.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కాశీబుగ్గలో తొక్కిసలాట

దేవదాయ శాఖ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

హరిముకుందా పండాకు తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న శ్రీకాంత్

వజ్రపుకొత్తూరు/పలాస: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఈనెల 1న జరిగిన తొక్కిసలాట ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని దేవదాయ శాఖ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టి.కామేశ్వరితో శ్రీ వెంకటేశ్వర ఆలయ ధర్మకర్త హరిముకుందా పండాను కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ సంప్రోక్షణ బాధ్యత తాము తీసుకుంటామని, తక్షణమే భక్తుల దర్శనార్థం ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. తిరుమల నుంచి తెచ్చిన లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, క్షతగాత్రులకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరుస ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఆలయాన్ని ఇలా వదిలేయడం దోషమని, పండాతో కలిసి తానే దగ్గరుండి శాంతి హోమం, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టి సంప్రోక్షణ చేస్తానని శ్రీకాంత్ చెప్పారు.

గంజాయి మత్తులో విద్యార్థులు

హైదరాబాద్‌లో 11 మందిని గుర్తించిన ఈగల్ టీం

సాక్షి, హైదరాబాద్: గంజాయి మత్తుకు అలవాటు పడిన విద్యార్థులపై ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందాలు ఫోకస్ పెంచాయి. గంజాయి వాడుతున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈగల్‌కు చెందిన హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ సిబ్బంది శనివారం బేగంపేట్‌లోని హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ అయిన కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో సోదాలు నిర్వహించినట్టు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న 11 మంది విద్యార్థులు గంజాయి తీసుకుంటున్నట్టుగా ఈగల్ అధికారుల ఎదుట అంగీకరించినట్టు ఆయన పేర్కొన్నారు. వీరికి విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం సమక్షంలో మూత్ర పరీక్షలు చేయించగా ఆరుగురు విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు.

వజ్రాన్వేషణ..

నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్ రోడ్డులోని గాజులపల్లె సమీపంలో ఉన్న వజ్రాల వంక వద్ద జనాలు వజ్రాన్వేషణ కోసం పోటెత్తుతున్నారు. లక్షల విలువైన వజ్రాలు దొరుకుతున్నాయని ప్రచారం జరగడంతో రాయలసీమతోపాటు ఇటు కోస్తాంధ్ర నుంచి కూడా భారీగా వస్తున్నారు. అయితే ఇంతవరకు అధికారికంగా ఒక్కరికీ వజ్రం దొరికిన దాఖలాల్లేవు. - మహానంది

పర్వతారోహణ..

క్యాన్సర్‌ను జయించిన విశాఖకు చెందిన మహిళ మున్నీ కైసారే(58)ఎవరెస్ట్ బేస్ క్యాంప్ (ఈబీసీ)ను గత నెల 12న అధిరోహించారు. టింపనీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసి ఈమె రిటైర్డ్ అయ్యారు. అనారోగ్యం, వయసు..లక్ష్యాన్ని దూరం చేయలేవనే స్ఫూర్తి నింపడానికి ఈ ఘనతను సాధించారు. నేపాల్‌లోని ఎవరెస్ట్ పర్వతానికి దక్షిణం వైపున 5,364 మీటర్ల ఎత్తులో ఈ బేస్ క్యాంప్ ఉంది. - విశాఖ సిటీ

కోటి సంతకాల సేకరణ..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. శనివారం కడపలోని ఏడు రోడ్ల సర్కిల్, పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన శిబిరాల వద్దకు విద్యార్థులు, యువత, వృద్ధులు, దివ్యాంగులు, ఆటో వాలాలు, కార్మికులు ఉత్సాహంగా వచ్చి సంతకాలు చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

అంత నష్టం లేదట!

పంట నష్టం అంచనాలు భారీగా కుదించిన కూటమి ప్రభుత్వం

రైతన్నల గోడు ఏమాత్రం పట్టించుకోని వైనం

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రులో నీటిలో ఉన్న వరిపంట



PPD Farmers
only admins can send messages

మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టం జరిగింది.
కావున నష్టపోయిన రైతులందరూ ఈ క్రింద తెలిపిన పత్రాలను సంబంధిత గ్రామ సచివాలయం వద్ద వెంటనే ఇవ్వగలరు.
1. ఆధార్
2. 1B xerox
3. కౌలు గుర్తింపు కార్డు
4. బ్యాంక్ పాస్ పుస్తకం xerox.
ఈ పత్రాలు సమర్పించిన వారి పొలాలకు మాత్రమే పంట నష్టం జాబితా తయారు చేయబడును. ఆఖరి తేదీ అక్టోబర్ 31 కావున శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల లోపు తీసుకొచ్చిన డాక్యుమెంట్స్ మాత్రమే స్వీకరించబడతాయి తరువాత ఇచ్చిన డాక్యుమెంట్స్ తీసుకోబడవు

ఇట్లు
రైతు సేవ కేంద్రం
వ్యవసాయ శాఖ
9:12 AM

Today

~ kumari
దయచేసి రైతులు గమనించగలరు, ఇప్పుడు పంట నష్టం చేయించిన రైతులకి తరవాత ధాన్యం రైతు సేవా కేంద్రం కొనుగోలు చేయబడదు .
3:37 PM

Message

అక్టోబర్ 31 లోపు పంట నష్టం వివరాలను తెలపాలంటూ రైతులకు ప్రభుత్వం పంపిన మెసేజ్



and soil erosion by the field functionaries-Formation of team for enumeration
Certain instructions to the Team members – Orders - Issued - Regarding.
1) G.O.Ms.No.1 of the Rev (DM-II) Department. dated 07.01.2025
2) Preliminary crop damage report received from the concerned Mandal Agricultural Officers.
3) AGC02-26025/15/2025 Dt.30-10-2025 of the Director of Agriculture. A.P. Guntur
4) Office Note Rc No C4/ 325/2025 Dt 30.10.2025 submitted by the Joint Director of Agriculture, Krishna Machilipatnam.

e-Panta due to technical reasons the names of such farmers should still be considered for damage assessment. The details of these farmers and their crops must subsequently be recorded in Kharif, 2025 e-Panta before submitting the final lists for future reference and processing.
6. Enumeration of crop damage & social audit should be completed by 31.10.2025 & any grievances shall be redressed immediately.
7. The final proposals for input subsidy must be submitted to this office along with the list of beneficiaries through the approval of the District Collector by 01.11.2025

జాబితాల రూపకల్పనకు కేవలం 24 గంటలు సమయం మాత్రమే ఇస్తూ ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్

సాక్షి, అమరావతి: అంతా అనుకున్నట్టుగానే చేశారు. ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోలేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపలేదు. నిబంధనలను పక్కన పెట్టి పుట్టెడు కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఉదారంగా ఆదుకోవల్సిన ప్రభుత్వం వారి నోట్లో మట్టికొట్టేందుకు ఎన్యుమరేషన్ (పంట నష్టం మదింపు)ను మమ అనిపించింది. రైతులను ఆదుకునేందుకు పారదర్శకంగా ఎన్యుమరేషన్ చేయాలని యంత్రాంగం ఎంతగా శ్రమించినా, పచ్చ నేతల కనుసన్నల్లోనే తుది జాబితాలు తయారు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలను, రైతులను గుర్తించేందుకు చేపట్టిన ఎన్యుమరేషన్ ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగింది. గత నెల 31వ తేదీ సాయంత్రంలోగా తుది జాబితాలు తయారు చేయాలని ఆదేశిస్తూ ఒక్క రోజు ముందు అంటే 30వ తేదీన సర్క్యులర్ జారీ చేసిన విషయం తెలిసిందే. తుది అంచనాల తయారీకి కేవలం 24 గంటలు మాత్రమే గడువు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. గడువు పెంచాలని రైతులు, రైతు సంఘాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తాయి. అయినప్పటికీ ప్రభుత్వం గడువు పెంచుతున్నట్టు ఎలాంటి ప్రకటన చేయలేదు. పైగా గతంలో ఎన్నడూ లేని విధంగా పంట నష్టం అంచనాల పరిశీలన, సామాజిక తనిఖీలు, విజ్ఞప్తుల స్వీకరణ, పరిష్కారం, ఉన్నతాధికారుల సూపర్ చెకింగ్, పునః పరిశీలన, తుది జాబితాల తయారీ అంతా సమాంతరంగా జరిగిపోతుందంటూ బిల్డప్ ఇచ్చారు. దీంతో తుది అంచనాల తయారీపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ జాబితాలన్నీ ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే, స్థానిక టీడీపీ నేతల సిఫార్సుల మేరకు తయారవుతున్నాయన్న విమర్శలు విన్పించాయి. అయినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు.

అంచనాలు కుదించి..

మొంథా తుపాను ప్రభావం 24 జిల్లాల్లో 15 లక్షల ఎకరాలకు పైగా సాగైన పంటలపై తీవ్రంగా ఉంటుందని తొలుత ప్రభుత్వమే అధికారికంగా అంచనా వేసింది. అయితే తుపాను ఆగిపోయిన మర్నాడు నష్ట తీవ్రతను తగ్గించేందుకు తొలుత 4.40 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు ముంపునకు గురైనట్లు ప్రకటించింది. ఆ తర్వాత ఆ సంఖ్య 3.45 లక్షల ఎకరాలే అంటూ చెప్పుకొచ్చింది. తీవ్ర విమర్శలు రావడంతో చివరకు తుది అంచనాలు కొలిక్కి వచ్చే సమయానికి 4.17 లక్షల ఎకరాలుగా నిర్ధారించింది. దాంట్లో 4.11 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 16 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు లెక్క తేల్చారు. క్షేత్ర స్థాయిలో వాస్తవంగా ఆరు నుంచి 8 లక్షల ఎకరాల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లగా, తుది అంచనాల్లో మాత్రం కేవలం 3.25 లక్షల ఎకరాల్లోనే వరి పంట దెబ్బ తిన్నట్టుగా నిర్ధారించింది. దాదాపు 50 వేల ఎకరాల్లో అరటి పంట నేలమట్టమైనట్టు తెలుస్తుండగా, ప్రభుత్వం మాత్రం కేవలం 9,700 ఎకరాల్లోనే నష్టం వాటిల్లినట్టు తేల్చింది. పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, సజ్జ, కందితో సహా ఇతర పంటల నష్టాన్ని కేవలం 90 వేల ఎకరాలకు పరిమితం చేసింది. ప్రధానంగా ఐదారు లక్షల ఎకరాల్లో వరి పంట నేలకొరిగి పూర్తిగా దెబ్బతినగా, మరో రెండు లక్షల ఎకరాల వరకు పంట నిలబడినప్పటికీ సుంకు (పుప్పొడి) విరిగి ఫలదీకరణ చెందక తాలు గింజలు ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ ప్రభావంతో ఎకరాకు 20–25 బస్తాలకు మించి దిగుబడి రాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దల మౌఖిక ఆదేశాల మేరకు ర్యాండమ్ చెక్ చేస్తూ మండలానికి ఒకటి రెండు గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి అధికారులు ఎన్యుమరేషన్‌ను మమ అనిపించారు. సుంకు విరిగిపోవడం వల్ల దెబ్బతిన్న పంట పొలాల వైపు కన్నెత్తి చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమకు చెందిన పంటలకు సంబంధించి పెట్టుబడి రాయితీగా రూ.875 కోట్లు ఇవ్వాల్సి వస్తుందని లెక్క తేల్చారు.

చనిపోయింది 2,279 పశువులు, జీవాలేనట!

మొంథా తుపాను వల్ల క్షేత్ర స్థాయిలో వాస్తవంగా ఐదారు వేల జీవాలు మృత్యువాత పడినట్టుగా రైతులు చెబుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం 94 ఆవులు, గేదెలు, 393 మేకలు, గొర్రెలు, 17 ఎద్దులు, దున్నలు, 82 దూడలు, 1,693 కోళ్లు మృత్యువాత పడినట్టుగా ప్రకటించారు. 155 పశువుల షెడ్లు నేల కూలినట్టుగా నిర్ధారించారు. తొలుత వీటికి రూ.5 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా వేయగా, చివరికి రూ.1.05 కోట్లకు పరిమితం చేశారు. ఆక్వా రంగానికి తొలుత రూ.514 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టుగా ప్రకటించిన ప్రభుత్వం, తుది అంచనాల కొచ్చేసరికి కేవలం 33.23 కోట్లకు పరిమితం చేయడం పట్ల ఆక్వా రైతులు మండిపడుతున్నారు. తొలుత 50 వేల ఎకరాలకు పైగా దెబ్బతిన్నట్టుగా చెప్పుకొచ్చిన ప్రభుత్వం చివరికి 5 వేల ఎకరాలకు పరిమితం చేసింది. తొలుత 10 వేల మంది ఆక్వా రైతులకు నష్టం వాటిల్లినట్టు చెప్పగా, చివరికి 2,541 మంది రైతులకు చెందిన ఆక్వా చెరువుల్లో ఇసుక మేటలు వేయడం, పూర్తిగా దెబ్బ తిన్నట్టు నిర్ధారించారు. మత్స్యశాఖకు సంబంధించి 9 మోటరైజ్డ్ బోట్లు పూర్తిగా, మరో 304 బోట్లు పాక్షికంగా, 41 నాన్ మోటరైజ్డ్ బోట్లు, సంప్రదాయ బోట్లు మరో 18 పూర్తిగా దెబ్బ తిన్నాయని, అలాగే 121 వలలు పూర్తిగా, మరో 241 వలలు పాక్షికంగా దెబ్బతిన్నాయని నిర్ధారించారు. తుపాను వల్ల దాదాపు 20 రోజులుగా వేట లేక పస్తులతో గడిపిన మత్స్యకారులను ఉదారంగా ఆదుకోవాల్సింది పోయి, వారికి బోట్లు, వలలకు కేవలం రూ.1.06 కోట్ల నష్టం వాటిల్లినట్టు లెక్కతేల్చారు. ఇలా అన్ని విధాలుగా కోతలు వేస్తూ తుది అంచనాలను కుదించేశారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్ర పర్యటనకు వస్తున్న కేంద్ర బృందం ముందు ఈ నివేదికలు ఉంచేందుకు సన్నద్ధం చేస్తున్నారు.

పరిహారం తీసుకుంటే ధాన్యం కొనుగోలు చేయరంట

- రైతులకు చంద్రబాబు సర్కారు బ్లాక్‌మెయిల్
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్

సాక్షి,అమరావతి : మొంథా తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, పరిహారం తీసుకుంటే ధాన్యం కొనుగోలు చేయబోమని బెదిరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం, చంద్రబాబు వల్లే తుపాన్ ఆగిపోయిందంటూ నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటోందన్నారు. పంట నష్టపోయి రోజులు గడుస్తున్నా ఇంకా అంచనాలు వేయకపోవడంతోపాటు, రైతులకు ఇచ్చే పరిహారంపైనా ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఆయన ఏమన్నారంటే..

''పంట నష్టం అంచనాల్లో కూడా ప్రభుత్వం రైతులను బ్లాక్ మెయిల్ చేస్తోంది. పంట నష్టపోయిన రైతులు పరిహారం తీసుకుంటే.. వారి దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు చేసేది లేదని బెదిరిస్తున్న ప్రభుత్వాన్ని తొలిసారిగా చూస్తున్నాం. మాజీ సీఎం వైఎస్ జగన్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పుడు రైతులు తమ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని గోడు వెళ్లబోసుకున్నారు. పంట నష్టాన్ని ఒక్క రోజులో ఎలా అంచనా వేస్తారు? జగన్ ప్రభుత్వంలో రైతులు ధైర్యంగా ఉండేవారు. ఏ విపత్తు వచ్చినా ఆదుకునేందుకు జగన్ ఉన్నాడనే భరోసా ఉండేది. కానీ చంద్రబాబు మాత్రం ధాన్యం పండించడం అనవసరమని మాట్లాడుతున్నారు. కౌలు రైతులనూ ఈ సర్కారు గాలికొదిలేసింది. వైఎస్ జగన్ హయాంలో దిగ్విజయంగా అమలైన ఉచిత పంటల బీమాను నిలిపివేసింది. వరి పండించవద్దని సీఎం చంద్రబాబే చెప్పడం దురదృష్టకరం. యూరియా కూడా అందించలేని అసమర్థ ప్రభుత్వమిది. తుపాను వల్ల 11 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లితే 2 లక్షల ఎకరాలే దెబ్బతిన్నట్టు కూటమి ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోంది. కృష్ణా పరీవాహక ప్రాంత లంక భూముల్లో వాణిజ్య పంటలు మునిగిపోతే.. ఇంతవరకు ఆ వివరాలు కూడా నమోదు చేయలేదు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ పర్యటించినప్పుడు ఆయనకు కష్టాలు చెప్పుకోవడానికి వచ్చిన మహిళలపై పోలీసులు లాఠీచార్జి చేశారు. దీనిపై నేను సీఐని ప్రశ్నిస్తే... నన్ను తిరిగి దుర్భాషలాడారు. నా మీద కేసు పెట్టారు.' అని అన్నారు.

టిడ్కో ఇళ్ల.. సం'గతేంటి' బాబూ?

- 18 నెలలుగా పట్టించుకోని కూటమి సర్కార్
- ప్రాజెక్టు పూర్తికి రూ.7,280 కోట్లు అవసరం
- ముందుకు కదలని ప్రాజెక్టు పనులు
- జగన్ హయాంలో లబ్ధిదారులకు లక్ష ఇళ్ల వరకూ పంపిణీ
- కూటమి ప్రభుత్వ పాలనలో ఒక్కరికీ లభించని ఇల్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని లబ్ధిదారులు అందరికీ 2026 జూన్ నెలాఖరులోగా టిడ్కో ఇళ్లు అందజేస్తామని ఇటీవల మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రకటించారు. అయితే 'ఈ మొత్తం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.7,280 కోట్లు అవసరం. కూటమి ప్రభుత్వం 18 నెలల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ఒక్క రూపాయి ఇచ్చింది లేదు. మరో ఏడు నెలల్లో ఇచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఒక్క లబ్ధిదారుకు కూడా ఇల్లు ఇచ్చింది లేదు.

జగన్ పూర్తి చేసిన ఇళ్లే దిక్కు..

పేదలకు ఇళ్ల విషయంలో పూర్తి వైఫల్యం నేపథ్యంలో పరువు కాపాడుకునేందుకు బాబు సర్కార్ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలో గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో 90 – 95 శాతం పనులు పూర్తయిన 6 వేల ఇళ్లకు హంగులు అద్ది ఇవ్వాలని నిర్ణయించింది. కానీ, మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలంటే తమకు నిధులు ఇవ్వాలని కాంట్రాక్టు సంస్థలు పట్టుబట్టడంతో చేసేది లేక రాజీవ్ స్వగృహ నిధుల నుంచి రూ.200 కోట్లు తీసుకుని కాంట్రాక్టర్లకు చెల్లించినట్టు విశ్వసనీయ సమాచారం. కాగా బాబు ప్రభుత్వ పాలనకు భిన్నంగా జగన్ సర్కార్ ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లింది. ప్రతి చోటా ఇళ్ల నిర్మాణంతో పాటు నూరుశాతం మౌలిక సదుపాయాలు కల్పించాకే లబ్ధిదారులకు అందించడం జరిగింది. మొత్తం 2,62,212 ఇళ్లలో దాదాపు లక్ష ఇళ్లను జగన్ సర్కార్ లబ్ధిదారులకు అందించిన విషయాన్ని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ శాసనసభ సాక్షిగా అంగీకరించారు. జగన్ హయాంలోనే మరో 77,546 ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయ్యింది.

లబ్ధిదారుల ప్రయోజనాలే లక్ష్యంగా అక్రమాలకు జగన్ సర్కారు చెక్...

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం బాబు హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలను గుర్తించి రివర్స్ టెండరింగ్ ద్వారా నిర్మాణ వ్యయాన్ని భారీగా తగ్గించింది.

- చదరపు అడుగు నిర్మాణ వ్యయాన్ని రూ.1,692 తగ్గించి రూ.4,368 కోట్ల ప్రజా ధనాన్ని ఆదా చేసింది. తద్వారా ఈ ప్రయోజనాన్ని పేదలకు అందించింది.
- నిరుపేదలకు కేటాయించిన 300 చదరపు అడుగుల ఇంటిని ఉచితంగా (రూ.1కి) ఇవ్వడంతో 1,43,600 మంది లబ్ధిదారులకు ఈఎంఐ రూపంలో చెల్లించే రూ.10,339 కోట్ల భారం లేకుండాపోయింది.
- 365 చదరపు అడుగుల ఇళ్లలో 44,304 మంది లబ్ధిదారులు రూ.50 వేలు, 430 చదరపు అడుగుల ఇళ్లలో 74,312 మంది లబ్ధిదారులు రూ.లక్ష చొప్పున వాటా చెల్లించాలని గత టీడీపీ ప్రభుత్వం నిబంధన పెడితే, దాన్ని సగానికి తగ్గించి, మిగతా సగం వాటా నగదు రూ.482.32 కోట్లను ప్రభుత్వమే చెల్లించింది. దాంతో రెండు, మూడు కేటగిరీల లబ్ధిదారులకు టీడీపీ లెక్కల ప్రకారం చెల్లించాల్సిన రూ.10,797 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఆ మొత్తం రూ.4,590 కోట్లకు జగన్ సర్కారు తగ్గించింది.
- అలాగే గత టీడీపీ ప్రభుత్వం నిరుపేదలపై మోపిన అధిక ధరల భారాన్ని సైతం జగన్ ప్రభుత్వం తగ్గించింది. 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే 1,43,600 ఇళ్లలో ఒక్కో ఇంటికి రూ.6.55 లక్షలు ఖర్చవగా నిరుపేదలకు పూర్తి ఉచితంగా అందించారు.
- 365 చదరపు అడుగుల ఇంటికి రూ.7.55 లక్షలు ఖర్చవగా, ప్రభుత్వం రూ.4.15 లక్షలు భరించి లబ్ధిదారులకు వారి వాటాగా చెల్లించాల్సిన సొమ్ముకు సంబంధించి రూ.3.40 లక్షల రుణ సదుపాయం కల్పించింది.
- అలాగే రూ.8.55 లక్షలతో నిర్మించిన 430 చ.అడుగుల ఇంటికి జగన్ ప్రభుత్వం రూ.4.15 లక్షలు చెల్లించి లబ్ధిదారు వాటాగా రూ.4.40 లక్షల రుణ సదుపాయం కల్పించింది.

బాబు పాలనలో రూ. 8,929.81 కోట్ల దోపిడీ

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో రూ.8,929.81 కోట్ల దోపిడీకి పాల్పడ్డారు. అన్ని మున్సిపాలిటీల్లో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు జారీ చేయగా, చాలా మున్సిపాలిటీల పరిధిలో స్థలం లభించలేదు. అయితే, భూములు దొరికిన చోట నాడు చదరపు అడుగు నిర్మాణ ధర రూ.1,000 కంటే తక్కువే. అయితే బాబు ప్రభుత్వం మాత్రం కంపెనీలు ఇచ్చిన ముడుపుల స్థాయిని బట్టి రూ.2,534.75 నుంచి రూ.2,034.59 వరకూ నిర్ణయించి కాంట్రాక్టులు కట్టబెట్టింది. సగటున చదరపు అడుగు నిర్మాణానికి రూ.2,203.45గా చెల్లించారు. అంటే అప్పటి మార్కెట్ ధరతో పోలిస్తే రూ.1,203.45 అదనంగా ఇచ్చారు. పైగా ఎక్కడా నూరు శాతం ఇళ్లు ఇచ్చింది లేదు. కేవలం 2019 ఎన్నికలకు ముందు హడావుడిగా నెల్లూరులో ఇళ్లు పూర్తవకపోయినా రంగులు వేసి లబ్ధిదారులకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వం 2019 మే నాటికి 77,350 ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఇందులో 20 వేల వరకు మాత్రమే 60 శాతం పూర్తి చేశారు.

■ తెలంగాణ

శ్రీశైల క్షేత్రానికి లాంచీ ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో కృష్ణానది బ్యాక్‌వాటర్ ద్వారా శ్రీశైల క్షేత్రానికి టూరిజం శాఖ ఏర్పాటు చేసిన లాంచీని శనివారం పర్యాటక శాఖ జిల్లా అధికారి నర్సింహ, సీఐ మహేశ్ ప్రారంభించారు. హైదరాబాద్, విశాఖ వంటి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల్లో 65 మంది పర్యాటకులు తెల్లవారుజామున సోమశిల చేరుకున్నారు. సోమేశ్వరుడిని దర్శించుకొని లాంచీలో శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు.

తల్లిని చంపిన తనయుడు

మెదక్ జిల్లాలో ఘటన

టేక్మాల్ (మెదక్): మద్యం మత్తులో ఓ తనయుడు తన తల్లిని కర్రతో చితకబాదడంతో ఆమె మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెల్పుగొండలో జరిగింది. గ్రామానికి చెందిన మెహనగారి సుదర్శన్ మద్యానికి బానిసై తరుచూ తల్లి సత్యమ్మ (56), భార్యతో గొడవపడేవాడు. సుదర్శన్ వేధింపులతో మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన సుదర్శన్ తరుచూ భార్యను తీసుకురమ్మని, తాగేందుకు డబ్బులు ఇవ్వమని, భూమిని తన పేరుపైకి మార్చాలని తల్లిని కొట్టేవాడు. శుక్రవారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చిన అతడు డబ్బులు కావాలంటూ తల్లిని విచక్షణరహితంగా కర్రతో కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలతో సత్యమ్మ మృతి చెందింది.

క్లుప్తంగా...

హైకోర్టులో పలువురు ఏజీపీల నియామకం

సాక్షి, అమరావతి: హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదులను(ఏజీపీ) నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఖత్రావత్ దిలీప్ నాయక్, దువ్వూరి దావీదు, పెరుమాళ్ల ఉష, మోదుకూరు చంద్రశేఖర్, మటాడ యువశివ స్వామి, అనురాధ కన్నెధార, జె.నూకపతి రావు, సింగరాజు అనంత వెంకట సాయికుమార్, తలుపుల బాలకృష్ణ ఏజీపీలుగా నియమితులయ్యారు. వీరంతా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఆ పోస్టుల్లో కొనసాగుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు వినిపిస్తారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

సోషల్ మీడియా యాక్టివిస్టుకు నోటీసులు

తెనాలి రూరల్: తెనాలికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టుకు రాజంపేట పోలీసులు నోటీసులు ఇచ్చారు. పట్టణ మారీస్‌పేట సీఎం కాలనీకి చెందిన వెంకటేష్.. గతేడాది బుడమేరు వాగు కట్ట తెగి, వరద కారణంగా సుమారు 35 మంది మృతి చెందిన ఘటనలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ తన సోషల్ మీడియా అకౌంట్లలో వీడియో పోస్టు చేశారు. రాజంపేటలో పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేషన్‌కు రావాలంటూ ఫోన్ చేయగా అక్కడకు వెళ్లిన వెంకటేష్‌కు నోటీసులు ఇచ్చి పంపారు.

గోవుల మృతితో తీరంలో కలకలం

నిజాంపట్నం: బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం దిండి సమీప అడవులలో.. సముద్ర ఒడ్డున శనివారం గోవులు ఆకస్మికంగా మృతి చెందటం కలకలం రేపింది. మడ పువ్వులు తిని మృతి చెందాయని కొంత మంది అనుమానాలు వ్యక్తం చేస్తుండగా, సమీపంలోని ఆక్వా మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీ నుంచి వెలువడిన రసాయన వ్యర్థ పదార్థాలు భూమిలో కలిసిన నేపథ్యంలో పశువులు తినే ఆకులు కలుషితమయ్యాయని, దీంతో అవి మృత్యువాత పడ్డాయని మరికొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది ఆవులు మృత్యువాత పడి, వాటి కళేబరాలు అడవిలో, సముద్రపు ఒడ్డున పడి ఉన్నాయి. మరిన్ని గోవులు మృతి చెంది ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పదుల సంఖ్యలో గోవులు ఆకస్మికంగా మృతి చెందినా అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అడవులదీవి ఎస్‌ఐ బాబూరావును 'సాక్షి' వివరణ కోరగా.. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. గోవులు మృతి చెందాయని, మృతికి గల కారణాలు తెలియరాలేదన్నారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

టెక్సాస్‌లో కారంచేడు యువతి మృతి

మాస్టర్స్ డిగ్రీ పూర్తి.. ఉద్యోగ వేటలో ఉండగా మృత్యువాత


రాజ్యలక్ష్మి (ఫైల్)

కారంచేడు: ఆమె ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. తన డిగ్రీ పూర్తిచేసి మంచి ఉద్యోగం కోసం ఎదురు చూస్తోంది. ఇంతలోనే మృత్యువు కబళించింది. ఛాతీలో నొప్పి, దగ్గు ఉన్నా పెద్దగా లెక్కచేయలేదు. దీంతో.. ఎప్పటిలాగే పడుకున్న ఆమె మరుసటి రోజు లేవలేదు. స్నేహితులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం అమెరికాలోని టెక్సాస్‌లో చోటుచేసుకుంది. వివరాలివీ..

బాపట్ల జిల్లా కారంచేడు గ్రామంలో చిన్న వ్యవసాయ కుటుంబానికి చెందిన యార్లగడ్డ రామకృష్ణ, వీణాకుమారిలకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. కుమార్తె యార్లగడ్డ రాజ్యలక్ష్మి (23) ఇంజినీరింగ్ అయిన తరువాత ఎంఎస్ చేసేందుకు అప్పులుచేసి కుమార్తెను అమెరికాకు పంపించారు. తను కూడా ఎంతో కష్టపడి చదివి మాస్టర్స్ డిగ్రీ పొందింది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఆమెకు రెండు, మూడ్రోజులుగా దగ్గు, ఛాతీలో నొప్పి వచ్చినా పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ఆమె శుక్రవారం నిద్రలోనే మృతిచెందినట్లు తెలుస్తోంది. రాజ్యలక్ష్మి మృతి తల్లిదండ్రులతో పాటు, స్థానికులను కూడా కలచివేసింది. ఆమె మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎంతో కష్టపడి తనను మంచి స్థాయిలో చూడాలని ఆశపడిన తల్లిదండ్రుల కల నెరవేర్చకుండానే తనువు చాలించిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. మృతదేహాన్ని అమెరికా నుంచి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

టీనేజర్లను.. కాస్త అర్థం చేసుకోండి!

యుక్త వయసు.. జీవితంలో చాలా కీలకమైన దశ. కానీ, ఈ తరుణంలో శరీరంలో వచ్చే మార్పులు యువతను చాలా ప్రభావితం చేస్తాయి. అదే సమయంలో తల్లిదండ్రులు, సమాజం వారి నుంచి ఆశించడమూ మొదలవుతుంది. ఇవన్నీ కలిసి వారిలో ఒత్తిడి, ఆందోళన పెంచుతాయి. ఏ సందర్భంలో విఫలమైనా నిరాశ పరిచి, కుంగదీస్తాయి. యువత ఎలాంటి సమస్యనైనా సింహాల్లా పరిష్కరించగలరు అన్నారు స్వామి వివేకానందుడు. వారు సింహాల్లా ఎదగాలంటే ఏం చేయాలి.. ఎవరి పాత్ర ఏమిటి?

ఏషియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీలో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. 70 శాతం మంది విద్యార్థుల్లో నిత్యం మధ్యస్థం నుంచి తీవ్ర స్థాయి ఆందోళన కనిపించిందట. సగానికిపైగా విద్యార్థుల్లో నిరాశా నిస్పృహలు పట్టి పీడిస్తున్నాయి. మరీ ముఖ్యమైన అంశం ఏంటంటే.. 65 శాతం మంది తమ భావోద్వేగాలను లేదా ప్రవర్తనను నియంత్రించుకోలేకపోతున్నారట.



సాక్షి, స్పెషల్ డెస్క్

అనేక కారణాలు

'టీనేజర్ జీవితం చాలా కీలకమైనది. వారి శరీరంలో జరిగే మార్పుల ప్రభావం ఒక ఎత్తయితే.. సమాజంలో గుర్తింపుకోసం వారు పడే ఆరాటం మరొక ఎత్తు. 'డిజిటల్ ప్రపంచం' వారిని ఊపిరి సలపనివ్వకుండా చేస్తోంది' అంటున్నారు మానసిక నిపుణులు. మీ పిల్లల్లో అలసట, ఒత్తిడి, ఆందోళన, బాధ, కోపం వంటి వాటికి ఈ కింది అంశాలు కారణాలు కావచ్చు.

- చదువు ఒత్తిడి
- సోషల్ మీడియా, స్నేహితుల ప్రభావం
- వీడియో గేమ్స్ అతిగా ఆడటం
- సంబంధాలను సరిగ్గా మేనేజ్ చేయలేకపోవడం
- అతి సమాచారం (చదువు లేదా వినోదం) వల్ల మెదడుపై అధిక ఒత్తిడి
- బంధువులు లేదా బయటివాళ్లు భయపెట్టడం లేదా తీవ్రమైన ఒత్తిడికి గురిచేయడం
- ప్రమాదాలు లేదా దుర్ఘటనలు
- ఆర్థికపరమైన అంశాలు
- వ్యక్తిగత సంబంధాలకు సంబంధించిన సమస్యలు

వీటి ఫలితంగా టీనేజర్లు దేనిమీదా శ్రద్ధ పెట్టలేరు. ఆహారం సరిగ్గా తీసుకోరు. నిద్ర కూడా సరిగ్గా పట్టదు. ఇవి శారీరక, మానసిక అనారోగ్యాలకు దారితీస్తాయి.

ఇలా చేసి చూడండి!

టీనేజర్లు అంటే రేపటి పౌరులు. వారు అన్ని విధాలా ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లిదండ్రులూ, వాళ్లు చదివే కాలేజీల యాజమాన్యాలూ శ్రద్ధ పెట్టాలి.

- 'చదువు, చదువు' అని వారిని ఒత్తిడి చేయడం తగ్గించాలి.
- శారీరక వ్యాయామం ముఖ్యమనే విషయం వారికి అర్థమయ్యేలా చెప్పాలి.
- కాలేజీల్లో జీవన నైపుణ్యాలు నేర్పించాలి. కౌన్సిలర్లను ఏర్పాటు చేయాలి.
- చదువు ఒక్కటే కాకుండా, ఆటలు వంటి పాఠ్యేతర కార్యకలాపాలు కూడా నిర్వహిస్తుండాలి.
- రోజులో కనీసం 8–9 గంటలు నిద్రపోయేలా చూడాలి.
- రాత్రిపూట నిద్రపోవడానికి కనీసం ఒక గంట ముందే.. సెల్‌ఫోన్ లేదా టీవీ లేదా కంప్యూటర్‌లను దూరం పెట్టాలి.
- తల్లిదండ్రులు తాము చెప్పేది శ్రద్ధగా వింటారు.. తమ సమస్యకు పరిష్కారం చూపగలుగుతారు అనే నమ్మకం పిల్లల్లో కలిగించాలి.
- ముఖ్యంగా అమ్మాయిలు లైంగిక హింస లేదా దాడులకు గురైనప్పుడు వారిని ఓదార్చడం, ఆ క్షోభ నుంచి వారు బయటపడేలా చేయడంలో తల్లిదండ్రులే కీలకం.

తల్లిదండ్రులూ.. గమనించండి!

పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ ఉండాలి. వారి వ్యవహార ధోరణి, ఆహారపు అలవాట్లు, ఫోన్ వాడకం.. వీటన్నింటినీ పరిశీలించాలి. ఇంటికి వచ్చి వెళ్లే స్నేహితులు, బంధువులమీద కూడా ఒక కన్ను వేయాలి. వారి వల్ల కూడా పిల్లలు ప్రభావితం కావచ్చు. మీ పిల్లల్లో ఈ కింది లక్షణాలు గుర్తిస్తే వెంటనే అప్రమత్తం అవ్వండి.

- ప్రతి పనికీ అలసిపోవడం లేదా ఎప్పుడు చూసినా అలసటగా కనిపించడం
- ఏ పనిమీదా శ్రద్ధ పెట్టలేకపోవడం
- భావోద్వేగాలు వెంటవెంటనే మారిపోతుండటం
- ఆకలి లేకపోవడం
- తరచూ ఒంటి నొప్పులు అనడం
- ఏ విషయాన్నీ సరిగ్గా వ్యక్తీకరించలేకపోవడం

అమ్మాయిలపైనా ప్రభావం

కేంద్ర నేర గణాంక విభాగం (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం 2022లో 13,044 మంది విద్యార్థులు బలవంతంగా తమ ప్రాణాలు తీసుకున్నారు. 2023లో ఈ సంఖ్య 13,892కు పెరిగింది. సాధారణంగా అబ్బాయిలే ఎక్కువగా బలవన్మరణాలకు పాల్పడుతుంటారు అనుకుంటారు అందరూ. కానీ, 2021–23 మధ్య.. అమ్మాయిల సంఖ్య కూడా పెరగడం గమనార్హం.

సంవత్సరం	అబ్బాయిలు	అమ్మాయిలు
2021	7,396	5,693
2022	6,930	6,113
2023	7,330	6,559

రైల్వేకోడూరు టీడీపీ టికెట్ కోసం రూ.7 కోట్లు ఇచ్చా

- ఆ డబ్బు అడిగితే టీడీపీ ఎన్‌ఆర్‌ఐ నేత వేమన సతీష్ చంపేస్తామంటున్నాడు
- మీడియా సమావేశంలో రైల్వే కోడూరు టీడీపీ కార్యకర్త సుధామాధవి రోదన

సాక్షి,అమరావతి: రైల్వే కోడూరు టికెట్ ఇప్పిస్తానని టీడీపీ ఎన్‌ఆర్‌ఐ నేత వేమన సతీష్ తన వద్ద రూ.7 కోట్లు తీసుకున్నారని టీడీపీ కార్యకర్త సుధామాధవి రోదించారు. జైభీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌తో కలిసి శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఆమె ఏమన్నారంటే..

''నేను ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేశా. చంద్రబాబు సార్ జైల్లో ఉన్నప్పుడు 53 రోజుల పాటు నిరాహార దీక్ష చేశా. సొంత వాహనాలు పెట్టుకుని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తిరిగి బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంతోపాటు టీడీపీ గెలవాలని కార్యక్రమాలు చేపట్టా. నేను చేపట్టిన కార్యక్రమాలను దగ్గరగా గమనించిన టీడీపీ ఎన్‌ఆర్‌ఐ నేత వేమన సతీష్ నా దగ్గరకు వచ్చి తనకు చంద్రబాబు సార్, లోకేశ్, భువనేశ్వరమ్మ బాగా తెలుసని, రైల్వే కోడూరు ఎమ్మెల్యే (టీడీపీ) టికెట్ ఇప్పిస్తానని నమ్మబలికారు. దీంతో పెద్దలు సంపాదించిన ఆస్తులు అమ్మి.. తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి సీటు కోసం సతీష్ అన్నతో పాటు అతను సూచించిన వారికి పలుదఫాలుగా రూ.7 కోట్లు ఇచ్చాం. తీరా ఎన్నికల సమయానికి టికెట్ ఇవ్వలేదు. ఈ విషయం తెలిసి మా గ్రామస్తులంతా టీడీపీ కార్యాలయం ముందు ధర్నాకు సిద్ధపడినా.. నేనే వారిని సముదాయించి బాబు సార్ సీఎం కావాలని చెప్పాను. టికెట్ కోసం నేను ఇచ్చిన డబ్బు ఇవ్వాలని కోరితే సతీష్ అన్న బెదిరించారు. మాకు జరిగిన అన్యాయం గురించి చెబుదామని టీడీపీ కార్యాలయానికి వెళితే నంబర్‌లేని కారులో నా భర్తను, నన్ను తీసుకెళ్లిపోయారు. మా పిల్లలు శ్రావణ్ సార్ దగ్గరకు వెళ్లి విషయం చెప్పడంతో ఆయన కేసు పెట్టడం వల్ల మేము బయటకు వచ్చాం. డబ్బులు ఇవ్వాలని అడిగితే తనకు టీడీపీ పెద్దలందరూ తెలుసు అని ఫొటోలు చూపించడంతోపాటు తన మామ పోలీస్ ఆఫీసర్ అని డబ్బులు అడిగితే నన్ను, నా పిల్లలను చంపేస్తామని సతీష్, అతని అనుచరులు బెదిరిస్తున్నారు.'' అని సుధామాధవి కన్నీటి పర్యంతమయ్యారు.

విచారణ చేసి న్యాయం చేయండి

జైభీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ మాట్లాడుతూ బాధితురాలు సుధామాధవి కుటుంబం ఎన్నికల ముందు నుంచి తనకు తెలుసని చెప్పారు. టికెట్, డబ్బు లావాదేవీలకు సంబంధించి సతీష్ పెట్టిన మెసేజ్‌ల స్క్రీన్‌షాట్లు ఉన్నాయని వివరించారు. రూ.50 లక్షలు సతీష్‌కు చెందిన ఖాతాల్లో వేశారని, మరో రూ.50 లక్షలు ఆయన చెప్పిన వారి ఖాతాకు వేశారని చెప్పారు. మరో 2.5 కోట్లు సతీష్ అనుచరులకు ఇచ్చేటప్పుడు వీడియోలు తీశారని వెల్లడించారు. సతీష్ పీఏకి దఫదఫాలుగా రూ.1.5 కోట్లు ఇచ్చేటప్పుడు కూడా వీడియోలు తీశారని తెలిపారు. ఇలా సతీష్‌కు మొత్తం రూ. 7 కోట్లు ఇచ్చినట్టు చెప్పారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణ చేయించి సుధామాధవి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్బందికర పరిస్థితిలో వారు ఆత్మహత్య చేసుకుంటే ఎవరు బాధ్యులు? అని శ్రావణ్ ప్రశ్నించారు.

కుటుంబం రోడ్డున పడింది.. భర్త మంచాన పడ్డాడు

'టికెట్ కోసం మొత్తం డబ్బు పోగొట్టుకున్నాం.. ఇల్లు లేదు.. రోడ్డున పడ్డాం. అనారోగ్యంతో నా భర్త మంచాన పడ్డాడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నాం. పార్టీ కోసం ఇంత కష్టపడిన మమ్మల్ని చిత్రహింసలు పెడుతున్నారు. మాకు ప్రాణ రక్షణ కల్పించండి.. సతీష్ నుంచి మా డబ్బులు మాకు ఇప్పించండి చంద్రబాబు సార్.. మాకు జరిగిన అన్యాయం ఏ ఒక్క ఆడబిడ్డకు జరగకూడదు. సతీష్ అన్నకు ఖాతాల్లో రూ.50 లక్షలు వేశాం. దానికి ఆధారాలు ఉన్నాయి. మిగిలినవి నగదు రూపంలో ఇచ్చాం. మాకు ఏం జరిగినా సతీష్ అన్నకే సంబంధం. సతీష్‌ను మందలించి మా డబ్బులు మాకు ఇప్పించండి చంద్రబాబు సార్' అని సుధామాధవి వేడుకున్నారు.

మాజీ మంత్రి సీదిరిపై కక్ష సాధింపు

- గత ఏడాది నమోదైన కేసుపై తాజాగా విచారణ
- ప్రెస్‌మీట్, ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టినందుకు కేసులు

మాజీ మంత్రిని విచారిస్తున్న సీఐ పి.సూర్యనారాయణ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం, పలాస, వజ్రపుకొత్తూరు రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. కాశీబుగ్గలో ఓ వ్యాపారి కిడ్నాప్‌నకు సంబంధించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారంటూ రాజకీయ ఫిర్యాదు అందడంతో ఇచ్ఛాపురం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శిష్టు గోపిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అక్కడికి వెళ్దామని బయల్దేరేలోపు 2024 అక్టోబర్ 27న నమోదైన ప్రెస్‌మీట్ కేసును తెరపైకి తెచ్చి, హుటాహుటిన పోలీసులు 41ఏ నోటీసు ఇచ్చారు. శనివారం వెంటనే స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరు కావాలన్నారు. దీంతో అప్పలరాజు స్టేషన్‌కు వెళ్లి విచారణలో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం వరకూ విచారణ కొనసాగింది. అలాగే, కల్తీ మద్యానికి వ్యతిరేకంగా మహిళలు ఆందోళన చేసిన సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల కాశీబుగ్గలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో అప్పలరాజు వైద్యసేవలు అందించి, క్షతగాత్రుల ప్రాణాలు నిలిపారు. ఈ ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారంటూ ఈ నెల 6న అప్పలరాజుపై పలు సెక్షన్ల కింద మరో కేసు నమోదు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీదిరి అప్పలరాజును కేసులతో వేధిస్తూనే ఉంది.

మద్యం మత్తులో మేడ పైనుంచి దూకి మృతి

మృతి చెందిన మహేంద్ర

తిరుపతి క్రైమ్: మద్యం మత్తులో ఓ వ్యక్తి మేడ పైనుంచి దూకి మృతి చెందిన ఘటన తిరుపతి నగరంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలానికి చెందిన మహేంద్ర(38) మేస్త్రీ పనుల నిమిత్తం తిరుపతిలో వలస కూలీగా పనిచేస్తున్నాడు. పూలవాని గుంటలో ఉన్న బాబాయి, పిన్ని వద్ద నివాసం ఉంటున్నాడు. శుక్రవారం స్నేహితుడి ఇంటి వద్ద పూటుగా మద్యం తాగి, ఆ మత్తులో మొదటి అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్ర గాయాలైన అతన్ని హుటాహుటిన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

నిర్వహణలో నీరుగార్చి.. నిర్మాణాలపై ఏమార్చి!

- విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పంపై కూటమి సర్కార్ డబుల్ గేమ్
- ప్రభుత్వ నిర్లక్ష్య తీరుపై నిరసనలు వెల్లువెత్తడంతో మభ్యపెట్టే ప్రయత్నం
- రెస్టారెంట్, చిల్డ్రన్ పార్క్, బుక్ స్టాల్, ఐస్‌క్రీమ్ స్టాల్స్ నిర్వహణకు టెండర్ ప్రకటన
- ప్రైవేట్‌కు అప్పగించేందుకు.. ఈనెల 15 వరకు బిడ్ల దాఖలుకు గడువు
- కొద్దిపాటి పనులు పూర్తి చేయకుండా ప్రభుత్వం అలక్ష్యం

సాక్షి, అమరావతి: భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా విజయవాడ నడిబొడ్డున వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై కూటమి సర్కార్ డబుల్ గేమ్ కొనసాగిస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వస్తే వైఎస్ జగన్‌కు ఘనత దక్కుతుందనే ఉద్దేశంతో.. మొదటి నుంచీ దీన్ని ప్రైవేట్ పరం చేసేందుకు విఫలయత్నం చేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా మరో ఎత్తుగడ వేసింది. సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణం నిర్వహణలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు, దళిత, గిరిజన సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో డైవర్షన్ రాజకీయాలు మొదలుపెట్టింది. ఆ ప్రాంగణంలోని పలు విభాగాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా ఈ నెల 5న టెండర్ పిలిచింది. అంబేడ్కర్ స్మృతివనం, పీడబ్ల్యూడీ గ్రౌండ్స్‌లోని ఫలహారశాలలు, ఫుడ్ కోర్టులు, ఐస్‌క్రీం, సావనీర్, పుస్తక దుకాణాలు, పిల్లల ఆటస్థలం, ప్రకటనల సైన్ బోర్డుల నిర్వహణకు ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15లోగా టెండర్ దాఖలు చేయాలని ప్రభుత్వ అనుకూల పత్రికలో ప్రకటన ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న కొద్దిపాటి పనులు పూర్తి చేయకుండా.. అకస్మాత్తుగా పలు విభాగాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేయడంతో మళ్లీ విమర్శలు చెలరేగాయి. ఈ ప్రాజెక్టు స్ఫూర్తిని ప్రైవేట్ నిర్వహణలో నీరుగార్చి.. నిర్మాణాలపై ప్రజలను ఏ మార్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ నిర్వహణలోనే అభివృద్ధి చేయాలని ప్రజలు, దళిత సంఘాలు, రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

26లోగా స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

- లేని పక్షంలో అంబేడ్కర్ విగ్రహం వద్దే ఆత్మార్పణ చేసుకుంటాం
- కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అల్టిమేటం

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): విజయవాడలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం స్మృతివనాన్ని ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం నాటికి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం డిమాండ్ చేసింది. ఈ స్మృతివనాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిర్వహించాలని లేని పక్షంలో అదే రోజు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆత్మార్పణ చేసుకుంటామని హెచ్చరించింది. శనివారం విజయవాడ బందరు రోడ్డులోని అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పం ప్రాంగణాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం పరిశీలించింది. ప్రాంగణాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏమన్నారంటే..

రాజకీయ కోణంలోనే టీడీపీ చూస్తోంది

అంబేడ్కర్ స్మృతి వనాన్ని టీడీపీ పూర్తిగా రాజకీయ కోణంలో చూస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. ఈ ప్రపంచంలోని దళిత సమాజం మొత్తానికి అంబేడ్కర్ విగ్రహం ఎక్కడ ఉంటే అదే దేవాలయమని,. అలాంటి దేవాలయాన్ని నిర్లక్ష్యం చేస్తే తాము బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అంటరాని వాడిగా చూసినట్లే భావిస్తామన్నారు. ఈనెల 26 లోపు మా డిమాండ్లను తీర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ మాట్లాడుతూ జగన్‌పై వ్యతిరేకతతో కూటమి ప్రభుత్వం స్మృతి వనాన్ని 16 నెలలుగా నిర్వహణ గాలికి వదిలేసిందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే స్మృతి వనం వద్ద వైఎస్ జగన్ నామ ఫలకాన్ని కూల్చివేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ హయాంలో దక్షిణ భారత్‌లో అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం నెలకొల్పారని చెప్పారు. స్మృతివనాన్ని పరిశీలిస్తే ఫౌంటెన్లు పూర్తిగా పాడై పోయి కనిపిస్తున్నాయన్నారు. దీనిని ప్రైవేట్‌కు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ..వైఎస్ జగన్ నిర్మించిన సామాజిక న్యాయ మహాశిల్పాన్ని చూసి చంద్రబాబు ఓర్చుకోలేకపోతున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో నిర్మించడంతోనే దీనిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని, జగన్‌పై ఉన్న కక్ష అంతటిని చంద్రబాబు అంబేడ్కర్‌పై చూపుతున్నాడని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు విమర్శించారు. జగన్ తెచ్చిన మెడికల్ కాలేజ్‌లు, సచివాలయాలు చంద్రబాబుకు నచ్చవు. అంబేడ్కర్ విగ్రహం కూడా అందుకే ఆయనకు నచ్చదన్నారు.

స్మృతివనం ప్రాంగణంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు.
వాటి అన్నిటి నుండి ప్రభువు వానిని విడిపించును.
– క్రైస్తవ ధర్మం

అదానీ చెప్పిన అసలు 'డేటా'

జనతంత్రం



వర్ధెల్లి మురళి

చిరకాలం జరిగిన మోసం, బలవంతుల దౌర్జన్యాలు, ధన వంతుల పన్నాగాలు ఇంకానా... ఇకపై చెల్లవని మన మహాకవి ఏనాడో చెప్పారు. ఇప్పుడైనా అంతే! బూటకపు మాటలతో, నకిలీ క్రెడిట్లతో, నయవంచనలతో ఇంకెన్నాళ్లు చక్రం తిప్పుతారు? సమాచార గుత్తాధిపత్యాన్ని సాంకేతిక విప్లవం బద్దలు కొట్టిన తర్వాత వార్తలపై, వ్యాఖ్యలపై పెత్తనాలు ఇంకెంతో కాలం సాగబోవని అర్థమైంది. సంకెళ్లు తెంచుకున్న సమాచారం సోషల్ మీడియా అవతారమెత్తిన తర్వాత కూడా కొంతమంది ఆధిపత్యం కొంతకాలం సాగిందేమో! సాంకేతిక సవ్యసాచులైన నవయువతరం వాళ్ల సమాచార చైతన్యం సంతరించుకుంటున్న క్రమంలో పాత ఆధిపత్యం పలాయన మంత్రం పఠిస్తున్నది.

అరబ్ వసంతపు చివుళ్లు, సోనార్ బంగ్లా మెరుపులు, నేపాల్ ప్రకంపనలు... ఇప్పటికే సోషల్ మీడియా పవర్‌ను చాటి చెప్పాయి. చివరకు ప్రపంచపు గుత్తాధిపతుల కంచుకోటను కూడా సోషల్ మీడియా కుదిపేసింది. విశ్వగురువులూ, విజనరీ వేషధారులూ కూడా ఇక సవాళ్లను ఎదుర్కోక తప్పకపోవచ్చు. అభివృద్ధికి పర్యాయపదంగా చంద్రబాబు పేరును మన గుత్తాధిపత్య మీడియా ఎంత దీక్షగా చిత్రించిందో మొన్నటివరకూ కొంతమందికే తెలుసు. ఇప్పుడాయన అభివృద్ధి ప్రచారం బలుపు కాదు వాపేనన్న సంగతి సోషల్ మీడియా కారణంగా చాలామందికి సాక్ష్యాధారాలతో తెలిసిపోతున్నది. చంద్రబాబును విజనరీగా చూపడం కోసం యెల్లో మీడియా పూనకంతో చేసిన ప్రచారం కారణంగా తానే హైదరాబాద్ నిర్మాతననీ, సెల్‌ఫోన్‌ను తెచ్చింది తానేననీ, ప్రధానమంత్రులను, రాష్ట్రపతులను ఎంపిక చేసింది కూడా తానేననీ ఆయనే స్వయంగా నమ్మే మానసిక స్థితిలోకి జారిపోయారు. ఈ రకమైన మానసిక రుగ్మతను ప్రతిపక్ష నేతకు అంటగట్టి చంద్రబాబు ఇమేజ్‌ను కాపాడాలనుకునే దుఃస్థితికి కూడా యెల్లో మీడియా దిగజారిపోయింది.

జగన్‌మోహన్‌రెడ్డి తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ కూడా ఈ తరహా ప్రగల్భాలు పలుకలేదు. ఐటీ విప్లవం తనవల్లే వచ్చిందని ఆయన చెప్పలేదు. బస్సులో కూర్చొని తుపాన్లను కంట్రోల్ చేశానని చెప్పలేదు. ఆయన సహచరులు, పార్టీ కార్యకర్తలు కూడా అలా మాట్లాడలేదు. వీలైతే, వచ్చే తుపాన్‌ను జుట్టు పట్టుకుని వెనక్కి పంపేవాడేనని టీవీల్లో కూర్చొని ఆయన గురించి ఎవరూ చెప్పలేదు. భారత క్రీడా జట్లు సాధించిన విజయాల వెనుక ఆయన ఇచ్చిన ప్రోత్సాహమే కారణమని ఆటగాళ్లు అక్కడక్కడా చెప్పుకుంటున్నారని కూడా ఎవరూ మాట్లాడలేదు. తదుపరి ఒలింపిక్స్‌ను రాష్ట్రంలోనే నిర్వహిస్తానని కానీ, నోబెల్ బహుమతులను పట్టుకొచ్చి యువతకు రివార్డులిస్తానని కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించలేదు.

జగన్ ప్రభుత్వం అమలుచేసిన ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సరైన ప్రచారం చేసుకోలేదనే ఇప్పుడాయనపై, ఆయన క్యాంపుపై వస్తున్న విమర్శ. అభివృద్ధి పనులైనా, ప్రజా సంక్షేమ కార్యక్రమాలైనా ప్రభుత్వ బాధ్యతలే తప్ప కేవలం ప్రచారాంశాలుగా నాటి ప్రభుత్వం భావించలేదు. దీన్నే అలుసుగా భావించిన బాబు శిబిరం ప్రాపగాండా మిషనరీని మరింత అప్డేట్ చేసింది. మొన్నటికి మొన్న విశాఖ డేటా సెంటర్‌పై ఏ స్థాయిలో చెలరేగిపోయారో గమనించాము. స్వయంగా ప్రభుత్వాధినేతలే గూగుల్ కంపెనీ వారి చెవిలో మంత్రోపదేశం చేసి వారిని చేయిపట్టుకొని నడిపించి విశాఖకు తీసుకొచ్చినట్టు ప్రచారం చేశారు. 15 బిలియన్ డాలర్ల అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని తీసుకొచ్చామని ప్రకటించుకున్నారు. ఇందులో అదానీ సంస్థ ముఖ్య భాగస్వామి అనే సంగతిని మాత్రం పొరపాటున కూడా ఎక్కడా రానీయలేదు. అసలా పేరునే ప్రస్తావించలేదు. ప్రత్యక్షంగా గూగుల్‌తోనే తమ బంధుత్వమున్నట్టుగా బిల్డప్ ఇచ్చారు.

ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి అసలు సంగతి బయటపెట్టారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కోసం అదానీ సంస్థతో అప్పటి జగన్ ప్రభుత్వానికి 2020 నవంబర్‌లో అవగాహన కుదిరింది. డేటా సెంటర్‌లో కీలకమైన 3,900 కిలోమీటర్ల సబ్‌సీ కేబుల్ వేయడానికి సింగపూర్ ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభమయ్యాయి. దాంతో పాటు డేటా ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుకు కూడా పూర్వరంగం సిద్ధమైంది. ఆ తర్వాత 2023 మే నెలలో డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈలోగా 2022లోనే ఈ రంగంలో గూగుల్‌కూ, అదానీ సంస్థకూ మధ్యన ఒక అవగాహన కుదిరింది. ఇప్పుడు తాజాగా జరిగింది ఆ డేటా సెంటర్‌ను మరింత విస్తరించడం మాత్రమే.

డేటా సెంటర్‌ను విస్తరిస్తున్నప్పుడు అందుకు పూర్వరంగాన్ని సిద్ధం చేసిన తమ ప్రభుత్వాన్ని గానీ, ఏర్పాటులో కీలక భాగస్వామి అయిన అదానీ సంస్థను గానీ ఎందుకు ప్రస్తావించలేదు, ఎందుకు కృతజ్ఞతలు చెప్పలేదని జగన్ ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలెవరూ అధికారికంగా స్పందించలేదు. కానీ, గూగుల్ కంపెనీనే తాము విశాఖకు లాక్కొచ్చామనే ప్రచారాన్ని మాత్రం ఆపలేదు. ఈ వ్యవహారంపై ఈ రోజున (శనివారం) 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో అదానీ సంస్థల అధిపతి గౌతమ్ అదానీ ఒక ఎడిట్ పేజీ వ్యాసాన్ని రాశారు. భారత దేశాన్ని కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రపంచ హబ్‌గా మార్చే లక్ష్యంతోనే తాము గూగుల్‌తో కలిసి విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆ వ్యాసంలో వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఏఐ మిషన్' లక్ష్యాల సాధనకు తోడ్పడే మౌలిక వ్యవస్థను తాము ఈ సెంటర్ ద్వారా ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆ వ్యాసంలో ఎక్కడా కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రస్తావన కానీ, చంద్రబాబు – లోకేశ్‌బాబుల వ్యవహార దక్షత గురించి కానీ ఒక్క మాట కూడా లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్రెడిట్ చోరీ వ్యవహారం గురించి తెలిసినందువల్లనే అదానీ రాష్ట్ర ప్రభుత్వం గురించి ప్రస్తావించలేదా? లేకపోతే అదానీ పేరును ప్రస్తావించకుండా సొంత డబ్బా కొట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం విశ్వాస రాహిత్యానికి పాల్పడినందువల్ల టిట్ ఫర్ టాట్ చందంగా అదానీ వ్యవహరించారా? చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా న భూతో న భవిష్యత్ అనిపించేలా ఈ ప్రాజెక్టుకు 22 వేల కోట్ల కిమ్మత్తు చేసే రాయితీలిచ్చి, 600 ఎకరాల భూసంతర్పణ చేసిన రాష్ట్రం గురించి అదానీ స్పందించకపోవడంపై ప్రభుత్వం ఏమనుకుంటున్నది? నేషన్ వాంట్స్ టు నో!

ఒక్క అదానీ – గూగుల్ డేటా సెంటర్ విషయంలోనే కాదు... గత ముప్పయ్యేళ్లుగా ఇటువంటి క్రెడిట్స్‌ను తమ ఖాతాలో వేసుకోవడంలో బాబు శిబిరం, యెల్లో మీడియా నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నవి. సోషల్ మీడియా పుణ్యమా అని అప్పటి చాలా విషయాలలో లోగుట్టు కొంచెం కొంచెంగా బయటకు వస్తున్నది. ఇంకో మూడు రోజుల్లో 'పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించబోతున్నది. ఈవెంట్ మేనేజ్‌మెంట్లలో తెలుగుదేశం ప్రభుత్వాల సామర్థ్యాన్ని శంకించవలసిన పనిలేదు. కాకపోతే ఈవెంట్ల నిర్వహణే తప్ప ఆ తర్వాత అడుగు ముందుకు పడదనేదే మన విమర్శ. రెండు వేలమంది ప్రతినిధులు హాజరవుతారనీ, 30 దేశాల వాణిజ్య మంత్రులు వస్తున్నారనీ, భారీ ఎత్తున పెట్టుబడులొస్తాయనీ చెబుతున్నారు.

గతంలో కూడా ఇటువంటి ఈవెంట్‌నే నిర్వహించి భారీ ఎత్తున పెట్టుబడులొస్తున్నాయని ప్రకటించారు. కానీ, ప్రకటించిన దానిలో పది శాతం కూడా కార్యరూపం దాల్చకపోవడం విషాదం. ఇప్పుడు కూడా ఇందుకు భిన్నంగా ఉండే అవకాశం తక్కువ. ఈ పార్ట్‌నర్‌షిప్ ఈవెంట్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రధాన కారణం లోకేశ్‌బాబు ప్రమోషన్ కోసమే అనే మాట వినిపిస్తున్నది. తాజాగా శుక్రవారం జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో లక్ష కోట్ల పైచిలుకు పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. వీటి ద్వారా 86 వేలమందికి ఉపాధి లభిస్తుందని ఆయన వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఒక్క ఎమ్ఎస్ఎమ్ఈ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారానే 33 లక్షలమందికి ఉపాధి దొరికింది. కేవలం ఈ ఒక్క రంగంలో మాత్రమే. ఇందులో పెద్ద పరిశ్రమల ఉద్యోగాలు, ప్రభుత్వోద్యోగాలు కలపలేదు. అప్పటి పారిశ్రామిక విధానంలో ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు, స్థానికులకు ఎక్కువ అవకాశాలు అనే అంశాల మీద ఫోకస్ ఉండేది. ఇప్పుడది లోపించింది.

> డేటా సెంటర్‌ను విస్తరిస్తున్నప్పుడు అందుకు పూర్వరంగాన్ని సిద్ధం చేసిన తమ ప్రభుత్వాన్ని గానీ, ఏర్పాటులో కీలక భాగస్వామి అయిన అదానీ సంస్థను గానీ ఎందుకు ప్రస్తావించలేదు, ఎందుకు కృతజ్ఞతలు చెప్పలేదని జగన్ ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలెవరూ అధికారికంగా స్పందించలేదు. కానీ, గూగుల్ కంపెనీనే తాము విశాఖకు లాక్కొచ్చామనే ప్రచారాన్ని మాత్రం ఆపలేదు. ఈ వ్యవహారంపై అదానీ సంస్థల అధిపతి గౌతమ్ అదానీ ఒక ఎడిట్ పేజీ వ్యాసాన్ని రాశారు. భారత దేశాన్ని కృత్రిమ మేధ (ఏఐ)కు ప్రపంచ హబ్‌గా మార్చే లక్ష్యంతోనే తాము గూగుల్‌తో కలిసి విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆ వ్యాసంలో వెల్లడించారు. కేంద్రం ప్రకటించిన 'ఏఐ మిషన్' లక్ష్యాల సాధనకు తోడ్పడే మౌలిక వ్యవస్థను తాము ఈ సెంటర్ ద్వారా ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.
>
> ఆ వ్యాసంలో ఎక్కడా కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రస్తా వన కానీ, చంద్రబాబు – లోకేశ్‌బాబుల వ్యవహార దక్షత గురించి కానీ ఒక్క మాట కూడా లేదు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ క్రెడిట్ చోరీ వ్యవహారం గురించి తెలిసినందువల్లనే అదానీ రాష్ట్ర ప్రభుత్వం గురించి ప్రస్తావించలేదా? లేకపోతే అదానీ పేరును ప్రస్తావించకుండా సొంత డబ్బా కొట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం విశ్వాస రాహిత్యానికి పాల్పడినందువల్ల టిట్ ఫర్ టాట్ చందంగా అదానీ వ్యవహరించారా?

ఈవెంట్లలో కార్యకర్తలకు టైలు కట్టి, కోట్లు తొడిగి లెక్క పెంచడం వల్ల ఫలితముండదు. రాష్ట్రంలో పరిశ్రమలు నడిచే వాతావరణం ముఖ్యం. ఈ పదిహేడు మాసాల పాలన చూస్తే ఏమున్నది గర్వకారణం అనిపించక మానదు. పారిశ్రామిక వేత్తలను వేధించి, భయపెట్టి డబ్బులు దండుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు పోటీలుపడ్డ ఉదంతాలు తొలి ఏడాదిలోనే డజన్లకొద్దీ రిపోర్టయ్యాయి. వసూల్ రాజాల ధాటికి భయపడి ఇండియా సిమెంట్స్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడింది. బహుశా ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి ఘటన జరిగి ఉండదు. బూడిద సరఫరా కాంట్రాక్టు మాకంటే మాకే కావాలని నాయకులు రోడ్డున పడి తన్నుకున్న అసహ్యకరమైన పరిణామాలను చూడవలసి వచ్చింది.

ప్రముఖ పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్‌ను అక్రమ కేసులతో విసిగించి 3 లక్షల కోట్ల పెట్టుబడిని సాక్షాత్తు ప్రభుత్వ పెద్దలే మహారాష్ట్రకు తరిమేశారు. మామూళ్ల కోసం శ్రీకాకుళంలో యూబీ కంపెనీ బీర్ల రవాణాను తెలుగుదేశం నేతలు అడ్డుకుంటే కేంద్రం రంగంలోకి దిగి రాష్ట్ర నేతలకు తలంటాల్సి వచ్చింది. ఇటువంటి ఉదాహరణలు అనేకం. ఉన్నత స్థాయిలో జరుగుతున్న సంతర్పణలు, క్రెడిట్ చోరీలు పక్కనబెడితే, క్షేత్ర స్థాయిలో పారిశ్రామిక వాతావరణం ఇంత వైభవోజ్జ్వలంగా వెలిగిపోతున్నది. ఈ వెలుగు జిలుగుల్లో విశాఖలో జరగబోయే పెట్టుబడుల సమీకరణ సభలో లోకేశ్ అంతా తానై వ్యవహరించబోతున్నారట. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్థానంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే కొత్త భావన లోకేశ్ మేధో శిశువనే సంగతిని కూడా ఆ సభలో ప్రకటిస్తారట! ఇంతకూ ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి ఎవరో? ఎంతకూ ఆ పేరు గుర్తుకు రావడం లేదు.

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** బ.చవితి ఉ.9.55 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.2.30 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ప.11.44 నుండి 1.17 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.53 నుండి 4.36 వరకు, **అమృత ఘడియలు:** సా.5.01 నుండి 6.32 వరకు.

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం : 5.23
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

తేజస్వీ యాదవ్ (సీఎం అభ్యర్థి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

దేశంలో ఏదైనా ఒక రాష్ట్రానికి 14 కోట్ల మంది సీఎంలు ఉంటే ఎలా ఉంటుంది? ఎలా ఉంటుందో శ్రీ మోదీజీ, శ్రీ నితీశ్ కుమార్ నవంబర్ 14న ప్రత్యక్షంగా చూడబోతున్నారు. నేను సీఎంని అయితే బిహార్ ప్రజలంతా సీఎంలు అయినట్లే!

ఎల్లుండి, నవంబర్ 11న రెండో విడత పోలింగ్. 14న ఫలితాలు.

6న మొదటి విడత పోలింగ్ పూర్తయింది. నాన్నగారు, అమ్మ, నేను, రాజశ్రీ, భారతి అక్క, మిగతా ఫ్యామిలీ మెంబర్స్ అందరం కలిసి ఓటేసి వచ్చాం. తేజ్ ప్రతాప్ అన్నయ్య కూడా మాతో ఉంటే బాగుండేది.

నాన్నగారు తేజ్ అన్నయ్యను ఇంట్లోంచి, పార్టీ నుంచి వెళ్లి పొమ్మన్నాక తేజ్ అన్నయ్య వేరే పార్టీ పెట్టుకున్నారు. మాలో ఎవరితోనూ మాట్లాడటం లేదు. మొన్న పట్నా ఎయిర్ పోర్టులో ఒకరికొకరం ఎదురుపడినప్పుడు కూడా తేజ్ అన్నయ్య ముఖం తిప్పుకుని వెళ్లిపోయారు! నేను చాలా ఫీల్ అయ్యాను.

తేజ్ అన్నయ్య 'జనశక్తి జనతా దళ్' అనే పార్టీ పెట్టుకుని మహువా నుంచి పోటీ చేస్తున్నారు. ఆర్జేడీలోని 'జేడీ'ని అలాగే ఉంచేసుకుని, 'రాష్ట్రీయ'కు బదులుగా 'జనశక్తి'

అని పెట్టుకున్నారు. అంటే పూర్తిగా పార్టీలోంచి వెళ్లినట్లు కాదు.

నేను పోటీ చేస్తున్న రాఘోపుర్, తేజ్ అన్నయ్య పోటీ చేస్తున్న మహువా... రెండూ వైశాలి జిల్లాలోనివే. నాన్నగారు, అమ్మ, మా ఇద్దరి తలపై చేయి ఆన్చి వేర్వేరుగా మాకు ఆశీస్సులు అందించారు. అంటే అన్నయ్య పూర్తిగా ఇంట్లోంచి వెళ్లినట్లు కాదు.

ఎవరో అమ్మాయితో తను రిలేషన్‌లో ఉన్నట్లు తేజ్ అన్నయ్య ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టడంతోనే వచ్చింది అసలు ఇదంతా!

పాపం వదిన ఆ రోజు ఎంతగా చిన్నబోయారో ఇంట్లో అందరం చూశాం. అమ్మ వదినను గుండెల్లోకి తీసుకుంది. నాన్నగారు తేజ్ అన్నయ్యను గట్టిగా మందలించారు. "వ్యక్తిగా నీతి తప్పిన వారికి సమాజం కోసం పోరాడే శక్తి తగ్గుతుంది" అన్నారు. ఇంట్లోంచి, పార్టీలోంచి అన్నయ్యను పంపించేశారు.

బయటికి వెళ్లి, కొత్త పార్టీ పెట్టగానే తేజ్ అన్నయ్య మొదట అన్నమాట... "మృత్యువునైనా ఆలింగనం చేసుకుంటాను కానీ తిరిగి ఆర్జేడీని ఆశ్రయించేది లేదు" అని! ఆ మాటకు నాన్నగారు, అమ్మ చాలా బాధపడ్డారు.

తేజ్ అన్నయ్య జేజేడీ పార్టీ 22 చోట్ల పోటీ చేస్తోంది. ఆ పార్టీ అన్ని చోట్లా గెలిచి, నేను సీఎం అవటానికి 22 సీట్లు తగ్గితే అన్నయ్య అప్పుడేమంటారో చూడాలి. 2020 ఎన్నికల్లో నేను సీఎం అవటానికి తగ్గింది 12 సీట్లే!

ఒంట్లో హుషారుగా లేక నాన్నగారు ప్రచారానికి రాలేకపోతున్నారు. కానీ, నాన్నగారి మాటలు నేరుగా ఇళ్లలోకే వెళ్లిపోతాయి. బిహార్‌లోని ప్రతి ఇల్లూ భోజనాల దగ్గర కూర్చున్నప్పుడు నాన్నగారి సత్తువ కలిగిన మాటలను రొట్టెల్లా పంచుకుంటుంది. నాకింకా ఆ ఒరవడి రాలేదు.

నితీశ్‌జీ ఇరవై ఏళ్లుగా బిహార్‌కు సీఎంగా ఉంటున్నారు. నాన్నగారు ఏమంటారంటే... "పెనం మీద రొట్టెను తిరగెయ్యకపోతే మాడిపోతుంది. ఇరవై ఏళ్లు అంటే చాలా ఎక్కువ సమయం" అని!

ఈ ఒక్క మాట చాలు, రోజుకు నేను పది ర్యాలీలు తీసి, పది ప్రసంగాలు చేసినంత!

ఇవాళ రాహుల్‌జీ పట్నా వస్తున్నారు. ఇవాళ జరిగే అన్ని ర్యాలీలలో ఆయన నా వెంట ఉంటారు.

ప్రచారానికి సిద్ధం అవుతుంటే... "చల్లగా ఉండు" అని నాన్నగారు, అమ్మ వచ్చి నన్ను దీవించారు. నాకు మిఠాయిలు తినిపించారు. అమ్మ నా నుదుటిపై ముద్దు పెట్టింది.

ఇంట్లోంచి నేను బయలుదేరుతుంటే... తేజ్ అన్నయ్య నుంచి ఫోన్... "హ్యాపీ బర్త్ డే రా తమ్ముడూ..." అని!!

నాన్నగారికి నెహ్రూజీ అంటే ఇష్టం. ఈసారి ఎన్నికల ఫలితాలు సరిగ్గా నెహ్రూజీ బర్త్‌డే రోజే వస్తున్నాయి. బిహార్ ప్రజలంతా సీఎంలు కాబోతున్న రోజు కూడా అదే!

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

సుస్థిర వ్యవసాయమే ప్రత్యామ్నాయం

అభిప్రాయం

డా॥ జి. పద్మజ

దేశ వ్యవసాయ భూములు మరీ ముఖ్యంగా వరి పండించే భూములు యూరియాతో నిండిపోతున్నాయి. నైట్రోజన్ అధికంగా ఉండే ఈ రసాయనిక ఎరువును రైతులు వరి సాగులో దశాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. అయితే పంట దిగుబడుల పెరుగుదల ఎలా ఉన్నప్పటికీ... ఇందువల్ల కొన్ని విపరిణామాలైతే తప్పడం లేదు. భూసారం తగ్గిపోవడం, భూగర్భ జలాల్లో కాలుష్యం, అధిక వాడకం వల్ల యూరియా కొరత ఏర్పడటం... వెరసి రైతును సంక్లిష్ట పరిస్థితుల్లోకి నెడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది ఏర్పడ్డ యూరియా కొరత క్షేత్రస్థాయిలో స్పష్టమైన పాఠం నేర్పిస్తోంది. నత్రజని ఆధారిత ఎరువులపై అతిగా ఆధారపడటం తగదని చెబుతోంది. సహజ పద్ధతుల్లో భూసారాన్ని పటిష్ఠం చేసుకోవడం ద్వారా రసాయనిక ఎరువులపై ఆధారపడటం తగ్గించుకోవాలి.

సాధారణంగా వరిసాగులో ఎకరాకు 132 కిలోల యూరియా వాడుతుంటారు. ఎకరాకు ఎంత యూరియా వాడాలన్నది భూసార పరీక్షల ఆధారంగానే నిర్ణయించుకోవాల్సి ఉన్నప్పటికీ చాలామంది రైతులు నిర్దిష్ట మోతాదులకు మించి వాడుతున్నారు. అవసరానికి మించి వాడటం వల్ల మట్టిపై పడుతున్న దుష్ప్రభావాలను రైతులు గుర్తించడం లేదు. మరి ప్రత్యామ్నాయం ఏమిటి? అన్న ప్రశ్న రావచ్చు. మట్టి రకాన్ని బట్టి తేడాలుండవచ్చు కానీ స్థూలంగా చూస్తే రెండు మార్గాలున్నాయి. మొదటిది – భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల మోతాదులను నిర్ణయించుకోవడం. ఇలా చేసినప్పుడు ఎకరా వరి పంటకు సుమారు 98 కిలోల యూరియా సరిపోతుందని ఇప్పటికే జరిగిన పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఆ యా రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో ఉండే మట్టి కారణంగా భూసార పరీక్షల ఫలితాల్లో తేడాలుంటాయన్నది తెలిసిన విషయమే. ఏకీకృత సేంద్రియ పద్ధతుల ద్వారా వరిసాగులో యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని ఇప్పటికే జరిగిన పలు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఇదీ కార్యాచరణ...

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ఒక ఎకరా భూమిని నమూనాగా తీసుకుని ఒక ప్రణాళిక సిద్ధమయ్యింది. దాని ప్రకారం... వరి సాగుకు ముందు పచ్చిరొట్ట వేసుకుని దుక్కులు దున్నాలి. నారు పోసుకోవాలి. నాటు పెట్టే సందర్భంలో పశువుల ఎరువును చేర్చడంతోపాటు బయో ఫర్టిలైజర్‌ను ఉపయోగించాలి. నాట్ల తరువాత పైరు ఎదుగుతున్నప్పుడు నీటిలో అజోలా పెరిగేలా చూడాలి. ఇదే సమయంలో బ్లూ గ్రీన్ ఆల్గేను కూడా పెంచడం మొదలు పెట్టాలి. కోతలు పూర్తయిన తరువాత పొలంలో పప్పు ధాన్యాల (లెగ్యూమ్ జాతి) పంటలతో క్రాప్ రొటేషన్ చేయడం వల్ల నత్రజని అవశేషాలు నేలలోనే ఉండి పోతాయి. వీటన్నింటి కంటే ముందు పంట సాగు చేపట్టే సమయంలోనే భూసార పరీక్షలు నిర్వహించడం అవసరం. తద్వారా నేలకు ఎంత మోతాదులో నత్రజని, ఫాస్పరస్, పొటాషియాలు అవసరమో తెలుస్తుంది.

> ◆ యూరియా తయారీకి అవసరమైన ముడి రసాయనాలను మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వాడకం తగ్గితే దిగుమతులూ తగ్గుతాయి. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది.

ఇందుకు అనుగుణంగా మన పద్ధతుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పద్ధతిని వరుసగా కొన్నేళ్లు వాడటం ద్వారా కృత్రిమ యూరియా వాడకంలో తగ్గుదల నమోదవుతుంది. పంటల చేవ బలంగా ఉంటుంది. భూసారం పెరగడం మాత్రమే కాకుండా పంట దిగుబడుల స్థాయి కూడా తగ్గకుండా చూసుకోవచ్చు.

ఆదా అయ్యేది ఇలా...

రైతులు సేంద్రియ, జీవాధారిత పద్ధతులను అనుసరించినప్పుడు ఎకరా నేలలో 40 నుంచి 50 కిలోల వరకూ నత్రజనిని చేర్చవచ్చు. సగటున 45 కిలోల నత్రజని చేరిందని అనుకున్నా... రసాయన యూరియా వినియోగం బాగా తగ్గించవచ్చు. ఎందుకంటే పచ్చి ఎరువు, పంట మార్పిడిలో భాగంగా పప్పు ధాన్యాల పంటలు వేసుకోవడం వల్ల వాతావరణంలోని నత్రజనిని వేళ్ల బుడిపెల ద్వారా స్వీకరించడం వల్ల ఎకరాకు కనీసం 15 నుంచి 20 కిలోల వరకూ చేరుతుంది. ఇక అజోలా, బ్లూ గ్రీన్ ఆల్గేల కారణంగా మరో పది నుంచి ఇరవై కిలోల నత్రజని పంటలకు అందుతుంది. పాడి పశువుల ఎరువులు, కోళ్ల పెంట, వర్మీ కంపోస్ట్, అవశేషాలను కాపాడుకోవడం వంటి వాటి ద్వారా మిగిలిన నత్రజని నేలలోనే ఉండిపోతుంది.

యూరియా తయారీకి అవసరమైన ముడి రసాయనాలను మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వాడకం తగ్గితే దిగుమతులూ తగ్గుతాయి. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. యూరియాకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ అనుబంధ సేవల ద్వారా బయో ఫర్టిలైజర్‌ను రైతులకు అందుబాటులో ఉంచడం, భూసార పరీక్షలను మరింత పకడ్బందీగా, విస్తృతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం, రైతులకు అవగాహన కల్పించడం తక్షణం చేపట్టాలి. వీటన్నింటి కంటే కీలకమైన విషయం ఏమిటంటే... యూరియా విచ్చలవిడి వాడకం కంటే చాలా రకాల బ్యాక్టీరియాతో ఉండే మట్టి... పంటలకు చాలా ముఖ్యమన్న విషయాన్ని గుర్తించాలి. దేశ హరిత విప్లవం రసాయనిక ఎరువుల ఆధారంగా సాధ్యమైతే... తాజా విప్లవం జీవ విజ్ఞానం ఆధారంగా పరిఢవిల్లాలి.

వ్యాసకర్త సీనియర్ భూసార శాస్త్రవేత్త (విశ్రాంత)

సరిహద్దులు దాటిన స్ఫూర్తి

ఇన్ బాక్స్

భారత ఉపఖండ చరిత్రలో ఆలోచనలకూ, ఆత్మ గౌరవానికీ, ఆధ్యాత్మిక జ్ఞానానికీ ప్రతీక మహాకవి మహమ్మద్ ఇక్బాల్. ఆయనను కేవలం కవిగా మాత్రమే కాదు, ఒక జ్ఞాని, ఆలోచనాపరుడు, మానవతా విలువలు కలిగిన సంస్కర్తగా స్మరించుకోవాలి. ఆయన కవిత్వం మతాల సరిహద్దులు దాటి, మనిషి అంతరంగాన్ని మేల్కొలిపిన అరుదైన శక్తిగా నిలిచింది.

1877 నవంబర్ 9న సియాల్‌కోట్‌లో జన్మించిన ఇక్బాల్ తన విద్యను లాహోర్, కేంబ్రిడ్జ్, మ్యూనిక్ విశ్వవిద్యాలయాలలో కొనసాగించారు. ఆయనలో కవి హృదయం, తత్వవేత్త మేధ సమానంగా కలిశాయి. ప్రాక్ పశ్చిమ తత్వాలను అధ్యయనం చేసిన ఆయనకు ఆత్మాభిమానమనే విలువ అత్యంత ప్రీతిపాత్రం. ఇక్బాల్ భావజాలం 'ఖుదీ' (ఆత్మ గౌరవం, స్వయంచేతన) అనే సిద్ధాంతం చుట్టూ తిరుగుతుంది. ఆయన చెప్పిన 'ఖుదీ కో కర్ బులంద్ ఇత్నాం' అనే పంక్తి ఇప్పటికీ ఆత్మగౌరవానికి, స్వయం చేతనా విశ్వాసానికి చిహ్నంగా నిలిచింది.



మహమ్మద్ ఇక్బాల్

ఇక్బాల్ కవిత్వం కేవలం పదాల సమాహారం కాదు, అది మానవాళి ఆత్మను మేల్కొలిపే పిలుపు. 'సారే జహాన్ సే అచ్ఛా హిందూస్థాన్ హమారా' అనే కవిత ఆయనకు భారతీయత పట్ల ఉన్న ఆత్మీయతకు నిదర్శనం. అదే సమయంలో ఆయన ఉర్దూ కవిత్వం మతం, విజ్ఞానం, న్యాయం, సమానత్వం, ఆత్మవికాసం అనే అంశాల చుట్టూ పరిభ్రమించింది. ఇక్బాల్ దృష్టిలో ఇస్లాం కేవలం ఆచార సంప్రదాయాల సమాహారం కాదు, అది న్యాయం, ధర్మం, చైతన్యానికి మార్గదర్శి. ఆయన రాసిన 'తులూయె ఇస్లాం', 'బాంగె దరా', 'అస్రారె ఖుదీ' వంటి రచనలు వ్యక్తి శక్తినీ, మానవ విలువలనూ ప్రతిఫలించాయి.

ఇక్బాల్ తత్వంలో విద్యకు ఒక కేంద్ర స్థానం ఉంది. ఆయన అభిప్రాయం ప్రకారం జాతి పునరుజ్జీవనం కలం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ప్రపంచం ఈ రోజు ఎదుర్కొంటున్న రాజకీయ, ధార్మిక, నైతిక సంక్షోభాల మధ్య ఇక్బాల్ ఆలోచనలు మరింత ప్రాసంగికతను సంతరించుకున్నాయి. మానవ సమాజం విభజనలతో అలమటిస్తున్న ఈ కాలంలో... 'మతం మనుషులను కలపాలి, విడదీయకూడదు' అన్న ఆయన పిలుపు మనకు మార్గదర్శకం కావాలి.

భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో ఇక్బాల్ ఆలోచనలు ముస్లిం సమాజంలో విద్య, చైతన్యం, ఆత్మగౌరవం అనే విలువలను మేల్కొలిపాయి. ప్రపంచాన్ని విభజించే గోడల కంటే, మానవ హృదయాలను కలిపే బంధాలే శాశ్వతమని ఆయన తత్వం చెబుతుంది. ఆయన కవిత్వం మనకు నేర్పేది ఒకటే, 'నిన్ను నీవు తెలుసుకుంటే అది సృష్టిని తెలుసుకోవడంతో సమానం.' ఇక్బాల్ జయంతి మనకు కేవలం ఓ సంస్మరణ దినం కాదు; అది మన అంతరాత్మను పరిశీలించుకునే ఆత్మావలోకనా దినోత్సవం.

– ఎం.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్

(నేడు మహాకవి మహమ్మద్ ఇక్బాల్ జయంతి)

కంచే చేను మేసినట్లు ప్రభుత్వమే చట్టాలను ఉల్లంఘిస్తుంటే.. జనాందోళనలు తెలియనట్లే వ్యవహరిస్తుంటే.. ప్రజలు ఎవరితో చెప్పుకోవాలి? పాలకుల తీరు పగబట్టినట్లు ఉంటే సామాన్య ప్రజల గోడు పట్టించుకునేదెవరు? చట్టాలను పట్టించుకోకుండా అటవీ భూమిని అడ్డగోలుగా ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వమే కట్టబెడుతుంటే ఎవరికి చెప్పుకోవాలి? ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల్ని కలవరపెడుతున్న ప్రశ్నలు ఇవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల కోసం గిరిజన చట్టాలను ఉల్లంఘించి మరీ పెద్ద ఎత్తున భూసేకరణకు రంగంలోకి దిగడంతో అడవిలో అలజడి తీవ్రమైంది.

అడవిలో అలజడి!

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దాట్లవారిగూడెంలో ఆందోళనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్‌ల దిష్టిబొమ్మలు దహనంచేస్తున్న గిరిజనులు (ఫైల్)

గిరిజనుల్ని భయపెడుతున్న భూసేకరణ భూతం

ఏజెన్సీలో కూటమి సర్కారు చట్టాల ఉల్లంఘన

పీసా, 1/70, అటవీహక్కుల చట్టాలను పట్టించుకోని వైనం

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల కోసం వేల ఎకరాల భూసేకరణకు కసరత్తు

జనావాసాలు, పంట భూములపై కన్ను

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల్ని భూసేకరణ భూతం భయపెడుతోంది. రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో గిరిజనులకు ప్రసాదించిన హక్కులు, వారికోసం ఉద్దేశించిన చట్టాలను కాపాడాల్సిన కూటమి ప్రభుత్వం వాటి ఉల్లంఘనలకు నడుంకట్టింది. ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వేల ఎకరాల భూసేకరణకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లోని ఐదు గ్రామాల్లో నిర్మించనున్న ఆయుధ కర్మాగార డిపో కోసం 1,166 ఎకరాలు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ హైడల్ తదితర ప్రాజెక్టుల కోసం వేల ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కులకు విరుద్ధంగా చేసుకున్న హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఒప్పందాలు రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. తప్పనిసరైన ప్రాజెక్టులను జనావాసాలకు, పంటలు పండే సారవంతమైన భూములకు ఇబ్బంది లేని విధంగా చేపట్టాలని వారు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీల (ఎక్స్‌టెన్షన్) షెడ్యూల్డ్ ఏరియాలకు (పీసా) చట్టం–1996కు 2011లో చేర్చిన నిబంధనలు, అటవీహక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ)–2006, ఆంధ్రప్రదేశ్ భూమి బదిలీల నియంత్రణ (1/70 నియమం) చట్టాలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని గిరిజనులు, రాజకీయ పార్టీల నేతలు మండిపడుతున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా దుగ్గేరు హైడ్రో ప్రాజెక్టు అనుమతులు రద్దుచేయాలంటూ గిరిజనులు, సీపీఎం నేతల నిరసన (ఫైల్)

కూటమి ప్రభుత్వం కుట్రలు సాగనివ్వం

గిరిజన చట్టాలను కాదని గత టీడీపీ ప్రభుత్వం ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలకు పెద్ద ఎత్తున అనుమతి ఇవ్వడంతో గిరిజన ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గిరిజన చట్టాలు, వారి హక్కులను కాదని వేల ఎకరాల అటవీ భూమిని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే కుట్రలు చేస్తోంది. షెడ్యూల్డ్ ఏరియాలో అంగుళం భూమి తీసుకోవాలన్నా గ్రామసభ తీర్మానం చేసి దాన్ని గిరిజన సలహా మండలిలో ఆమోదం పొంది గవర్నర్ ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసీ గ్రామసభ ఆమోదం లేకుండా వేల ఎకరాలను కట్టబెట్టే ప్రభుత్వ చర్యల వల్ల ఆదివాసీల హక్కులు, భూములు, సంస్కృతి, పర్యావరణం దారుణంగా దెబ్బతింటాయి. గిరిజనులను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ కుట్రలను ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వం.

– పీడిక రాజన్నదొర, మాజీ ఉపముఖ్యమంత్రి

గిరిజన హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం

గిరిజనుల హక్కులను కాలరాస్తూ వారికి చెందాల్సిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కూటమి ప్రభుత్వం ఎలా కేటాయిస్తుంది? ఇదే విషయంపై ఇటీవల శాసన మండలి సమావేశాల్లో వైఎస్సార్ సీపీ తరఫున ప్రభుత్వాన్ని నిలదీశాను. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతూ కూటమి ప్రభుత్వం జీవోలు జారీచేసింది. ఇది ముమ్మాటికి 1/70 చట్టాన్ని ఉల్లంఘించడమే. 20 గ్రామాలతోపాటు వేలాదిమంది గిరిజనులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆ ప్రాజెక్టులు ఆదివాసీల పూర్వీకుల భూములు, అడవులు, నదులు, సంస్కృతిని, జీవనాధారాలను పూర్తిగా ధ్వంసం చేస్తాయి.

– కుంభ రవిబాబు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

ఆస్పత్రుల్లో అవసరమైన వైద్యుల్ని నియమించండి

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర వైద్య బృందాల సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జిల్లా ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్యుల్ని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర వైద్య బృందాలు సూచించాయి. చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 4 రోజులపాటు పర్యటించిన కేంద్ర వైద్య బృందాలు 19 ప్రభుత్వాస్పత్రులను సందర్శించాయి. జాతీయ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జోయ్ అలీ రిజ్వి, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉప కార్యదర్శి డాక్టర్ భవాని సింగ్ ఆధ్వర్యంలోని రెండు బృందాలు ఉమ్మడిగా ఓ నివేదికను రూపొందించాయి. అందులోని ముఖ్యాంశాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరరావు, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్లకు కేంద్ర బృందం శనివారం వివరించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ (ఫైనాన్స్) ఇంద్రాణి పాల్గొన్నారు. 'ఈ–ఔషధి వ్యవస్థను బలోపేతం చేయాలి. ఉప ఆరోగ్య కేంద్రాలకు పవర్ బ్యాకప్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ఆశా వర్కర్లు, ఇతర సిబ్బందికి పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. పెండింగ్‌లో ఉన్న క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు పూర్తి చేయాలి' అని సూచించాయి.

బావిలో దూకి ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య

మృతి చెందిన వరలక్ష్మి, వర్షిత, ప్రశాంత్

సూళ్లూరుపేట రూరల్: ఇద్దరి పిల్లలతో కలిసి ఓ తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం ఉగ్గుముడి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తుల సమాచారం మేరకు.. ఉగ్గుముడి గ్రామంలోని దళితవాడలో నివాసముంటున్న యా.మాధవయ్య, వరలక్ష్మి(24) దంపతులకు వర్షిత(4), ప్రశాంత్ (2) సంతానం. ఈ దంపతులు సొంత పొలంలో వ్యవసాయ పనులు చేసుకునేవారు. శనివారం ఉదయం భర్త పొలానికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చేసరికి భార్య ఇద్దరు పిల్లలు కనిపించకపోవడంతో పొలాలు మాధవయ్య వెతికాడు. ఈ క్రమంలో పొలాల మధ్యలో ఉన్న పెద్ద నేల బావిలో పడిపోయి వీరు మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు అక్కడకి వెళ్లి పరిశీలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు ఘటనాస్థలికి చేరుకుని తల్లి,ఇద్దరు పిల్లలను జేసీబీల సహాయంతో వెలికి తీశారు. ఆత్మహత్య చేసుకున్నారా లేదా, ఇతర ఏదైనా కారణాలు ఉన్నాయా అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతదేహాలను సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

దుస్తులు కొనుగోలుకు అని చెప్పి...

కాగా, వరలక్ష్మి పుట్టిల్లు, అత్తారిల్లు అదే దళితవాడలోనే 500 మీటర్ల దూరంలోనే ఉన్నాయి. శనివారం ఉదయం ఇద్దరు పిల్లలతో వరలక్ష్మి వెళ్తుండగా గ్రామంలో ఉన్న కొందరు వ్యక్తులు ఎదురుపడి ఎక్కడికని ప్రశ్నించగా బండిపై దుస్తులు కొనుగోలుకు వెళుతున్నట్లు వారికి సమాధానమిచ్చింది. చివరికి సాయంత్రానికి ఇద్దరి పిల్లలతో వరలక్ష్మి శవమై తేలడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతులు

గుణదల (విజయవాడ తూర్పు): ఏసుక్రీస్తు జయంతి జూబ్లీ–2025 వేడుకలు నిర్వహించడం హర్షణీయమని విశాఖపట్నం అగ్ర పీఠాధిపతి ఉడుముల బాల అన్నారు. విజయవాడ ఆంధ్ర లయోల కళాశాల దేవయ్య ఆడిటోరియం వేదికగా ఏసుక్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడ కతోలిక పీఠాధిపతి తెలగతోటి రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, ఉభయ తెలుగు రాష్ట్రాల కతోలిక పీఠాధిపతులు జ్యోతి ప్రజ్వలన చేసి జూబిలీ వేడుకలను ప్రారంభించారు. తెలుగు గడ్డపై జరుగుతున్న ఈ వేడుకలు చరిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతాయన్నారు. సమైక్యతను చాటిచెప్పే విధంగా జూబ్లీ వేడుకలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూబ్లీ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయవాడ బిషప్ రాజారావు, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరాము, గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య, నెల్లూరు బిషప్ ఎండీ ప్రకాశం, గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జూలో ఎలుగుబంటి మృతి

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కులో ఆడ ఎలుగుబంటి(స్లాత్ బేర్) శనివారం మృతి చెందింది. ఇది కొద్ది రోజులగా అనారోగ్యంతో బాధపడుతూ ఆహారం సరిగా తినలేదని జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. పన్నెండేళ్ల వయసు గల ఈ స్లాత్ బేర్ ఇటీవల గర్భస్రావానికి గురైనట్లు జూ వెటర్నరీ వైద్యులు గుర్తించినట్లు చెప్పారు. దానికి తగిన వైద్యం అందించినా ఫలితం లేకపోయిందన్నారు. దీనికి జూ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. దీనికి సెప్టీసిమియా వ్యాధిగా పోస్టుమార్టంలో నిర్ధారించినట్లు క్యూరేటర్ తెలిపారు.

డెంగీతో యువకుడు మృతి

కందుకూరు: డెంగీ జ్వరం లక్షణాలతో శనివారం ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో చోటుచేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన డాలు సింహమణి (20) అనే యువకుడు ఆదివారం నుంచి జ్వరంతో బాధపడుతూ కందుకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గిపోవడంతో గురువారం ఒంగోలులోని రిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి మెరుగుపడకపోవడంతో శనివారం మరణించాడు. ఏడాదిన్నర క్రితమే చినమోపాడు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో సింహమని తల్లి లక్ష్మి మృతిచెందగా, ఆర్నెల్ల వ్యవధిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తండ్రి హరిబాబు కూడా మృత్యువాత పడ్డాడు. దీంతో.. ప్రస్తుతం ఆ కుటుంబంలో మిగిలిన ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

యాదగిరీశుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాతకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

తెలంగాణలోని యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠ, అలంకారమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. న్యాయమూర్తికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు.

– యాదగిరిగుట్ట

అరెస్టులు.. కేసులు.. ఉద్యమాన్ని ఆపలేవు

బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న మత్స్యకార నాయకులపై అక్రమ కేసులు

అరెస్టులతో వేడెక్కిన అనకాపల్లి జిల్లా రాజయ్యపేట

నిరాహార దీక్షా శిబిరం వద్దకు వందలాదిగా చేరుకున్న మత్స్యకారులు

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంపై మత్స్యకారులు మండిపడ్డారు. 'అరెస్టులు.. అక్రమ కేసులు ఉద్యమాన్ని ఆపలేవు' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. మత్స్యకార నాయకుల్ని అరెస్టు చేయడంతో రాజయ్యపేట గ్రామం ఒక్కసారిగా వేడెక్కింది. మత్స్యకార నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడానికి నిరసిస్తూ శనివారం వందలాది మంది మత్స్యకారులు రాజయ్యపేటలో నూకతాత ఆలయం వద్ద కొనసాగుతున్న నిరాహార దీక్ష శిబిరం వద్దకు చేరుకుని ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉద్యమకారులపై అక్రమ కేసులా!

వారం రోజుల క్రితం తుపాను షెల్టర్‌లో బాధితులకు భోజనాలు పెడుతుండగా తనపై దౌర్జన్యం చేశారని, కులం పేరుతో దూషించారని పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మత్స్యకార నాయకుడు, మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు తదితర 13 మందిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి పిక్కి తాతీలు, పిక్కి రామ్‌చరణ్‌లను నక్కపల్లిలో అరెస్టు చేశారు. దీంతో మత్స్యకారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. శనివారం ఉదయం మత్స్యకారులంతా దీక్షా శిబిరం వద్దకు చేరుకుని బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును నిరసిస్తూ చేపట్టిన ఉద్యమాన్ని అణగదొక్కేందుకే మత్స్యకారులపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. గ్రామంలోకి వచ్చిన హోం మంత్రిని అడ్డుకోవడం, జాతీయ రహదారిని ముట్టడించడం వల్ల ప్రభుత్వం కక్షగట్టి తమపై కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తోందన్నారు. తక్షణమే కేసులు ఎత్తివేయాలని, అరెస్టు చేసిన మత్స్యకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కులాల మధ్య చిచ్చుపెట్టిన ప్రభుత్వం

దీక్షా శిబిరం వద్ద మత్స్యకార నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామంలో కులాల మధ్య చిచ్చుపెట్టిందని, పంచాయతీ కార్యదర్శిని పావులా వాడుకుని బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మత్స్యకారులు గోసల స్వామి, కోడ కాశీరావు, పిక్కి స్వామి, మహేష్, చేపల సోమేష్ మాట్లాడుతూ తుపాను సందర్భంగా రక్షిత భవనం వద్ద భోజనాలు పెడుతున్నారని విషయం తెలిసి గ్రామానికి చెందిన సుమారు 200 మంది వెళ్లి గ్రామస్తులందరికీ భోజనాలు పెట్టాలని కార్యదర్శిని కోరినట్టు చెప్పారు. అంతే తప్ప కార్యదర్శిపై దౌర్జన్యం చేయలేదన్నారు. జరిగిన ఘటనపై గ్రామంలో బహిరంగ విచారణ జరపాలని డీఎస్పీని కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తమపై అక్రమ కేసుల వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు.

భారీగా మోహరించిన పోలీసులు

మత్స్యకార నాయకుల అరెస్టు నేపథ్యంలో ఎటువంటి ఆందోళనలు జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వందలాది మంది పోలీసులు నక్కపల్లి, రాజయ్యపేటలో మోహరించారు. నక్కపల్లి జంక్షన్, రాజయ్యపేట జంక్షన్ వద్ద గ్రామాల్లోకి వచ్చేవారిని, వాహనాలను తనిఖీ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణను రెండో రోజు కూడా గృహనిర్బంధం చేశారు.

మద్యం దుకాణంలో వ్యక్తి మృతి

బేస్తవారిపేట: మద్యం తాగేందుకు వెళ్లి దుకాణంలోనే ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లాలో జరిగింది. బేస్తవారిపేట మండలంలోని పాతమల్లాపురం ఎస్సీ కాలనీకి చెందిన కందుల అంకయ్య (48) మద్యానికి బానిసయ్యాడు. గ్రామం నుంచి శనివారం ఆటోలో వచ్చి బేస్తవారిపేట జంక్షన్‌లో దిగి మద్యం దుకాణంలోకి వెళ్లి కుప్పకూలాడు. అక్కడున్నవారు అంకయ్యకు సపర్యలు చేసి 108కి సమాచారమిచ్చారు. 108 సిబ్బంది అంకయ్యను పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. కాగా, అంకయ్య మద్యానికి బానిస అవడంతో ఏడాది క్రితం భార్య పుట్టింటికి వెళ్లిందని, వృద్ధురాలైన తల్లి అతడి బాగోగులు చూస్తోందని కాలనీ వాసులు చెప్పారు.

నటుడు రజనీకాంత్ సోదరుడికి గుండెపోటు

తమిళసినిమా/యశవంతపుర: నటుడు రజనీకాంత్ సోదరుడు సత్యనారాయణ రావ్ గైక్వాడ్ (84) గుండెపోటుకు గురయ్యారు. బెంగళూరులోని హోసగరేహళ్లి ప్రాంతంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న ఆయన, సోదరుడు, నటుడు రజనీకాంత్ పాల్గొనే ప్రతి ముఖ్యమైన కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. సత్యనారాయణ రావు గైక్వాడ్ శనివారం ఉదయం గుండెపోటుకు గురై కింద పడిపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ విషయం తెలియడంతో రజనీకాంత్ హుటాహుటిన బెంగళూరుకు వెళ్లి ఆస్పత్రిలో ఉన్న సోదరుడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే సత్యనారాయణ రావ్ గైక్వాడ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

మాతో వస్తే వైఎస్ జగన్ కట్టిన మెడికల్ కాలేజీలను చూపిస్తాం

మంత్రి అచ్చెన్నాయుడికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల సవాల్

తోట త్రిమూర్తులు

సాక్షి, అమలాపురం: ''గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభించింది. ఏడు కాలేజీల నిర్మాణం పూర్తి చేసింది. మిగిలిన కాలేజీల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయినా మంత్రి అచ్చెన్నాయుడు గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలు నిర్మించలేదంటున్నారు. ఆయన ఒక్కసారి మాతో వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన మెడికల్ కాలేజీలను చూపిస్తాం'' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు సవాల్ విసిరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశం శనివారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం మెడికల్ కాలేజీలు నిర్మించలేదని ఆరోపించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ''కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే రూ.2 లక్షల కోట్లకు పైగా అప్పు చేశారు. దీనిలో రూ.5 వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్మించలేరా? పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీలను ఎందుకు ప్రైవేట్‌పరం చేస్తున్నారు?'' అని నిలదీశారు. దీంతో మంత్రి అచ్చెన్నాయుడు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు కిమ్మనకుండా ఉండిపోయారు.

భారీగా విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

సుమారు 40మంది రైతుల మోటార్లలో వైరు చోరీ • ధర్నాకు దిగిన రైతులు

మద్దతు పలికిన వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల: వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం కోమన్నూతల గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రైతులకు చెందిన బోరుబావుల వద్ద విద్యుత్ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను అపహరించుకుపోయారు. 3 రోజుల క్రితం కోమన్నూతలకి చెందిన పురుషోత్తమరెడ్డి తన పొలంలోని విద్యుత్ మోటర్ కాలిపోవడంతో మోటరును తీసి మరమ్మతులు చేయించడానికి వెళ్లాడు. ఇది గమనించిన దొంగలు కేబుల్ వైర్లను అపహరించి వెళ్లిపోతుండగా.. దీన్ని చూసిన రైతులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీన్ని గమనించిన దొంగలు కేబుల్ వైర్లను తీసుకెళుతున్న ఆటోను వదిలి పారిపోయారు. ఎస్ఐ అనిల్‌కుమార్ ఆటోను పోలీసుస్టేషన్‌కు తరలించారు. శుక్రవారం రాత్రి 38 మంది రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల కేబుల్‌వైర్లను కూడా దొంగలు అపహరించుకుపోయారు. దీంతో గ్రామంలోని రైతులందరూ శనివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి పార్నపల్లె.. పులివెందుల ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న కడప వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లింగాల పోలీసుస్టేషన్‌కు వచ్చి రైతులకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి ధర్నాలో పాల్గొన్నారు. కాపర్ వైర్‌ను దొంగల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న వ్యక్తులను గుర్తించామని, వారి నుంచి కేబుల్‌వైర్లను రికవరీ చేయిస్తామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఎస్ఐ హామీ ఇచ్చారు.

2 రోజుల్లోగా రికవరీ చేయాల్సిందే..

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..రైతులు పండించే అరటి ధరలు పూర్తిగా పతనం అయ్యాయని..దీనికి తోడు కేబుల్ వైర్లు చోరీకి గురికావడంతో వారిపై మరింత భారం పడుతోందన్నారు. దొంగతనాలు జరుగుతుంటే ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ఏమి చేస్తోందని ప్రశ్నించారు. చోరీకి గురైన కేబుల్‌వైర్లను రికవరీ చేయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్పీతో మాట్లాడానని, వెంటనే కేబుల్ వైర్లను రికవరీ చేయాలన్నారు. రెండు రోజుల్లోగా రికవరీ చేయకపోతే తిరిగి రైతులతో కలిపి పోలీసు స్టేషన్ వద్దే ధర్నా చేస్తామని చెప్పారు. దొంగతనాలను నివారించేందుకు ఎంపీ నిధుల ద్వారా సీసీ కెమెరాలను అందించి ప్రతి కూడళ్లలో ఏర్పాటు చేయిస్తామన్నారు. భారీ మొత్తంలో కేబుల్‌వైర్లు కోల్పోయిన పురుషోత్తంరెడ్డి అనే రైతుకు వెంటనే కేబుల్ వైర్లను రికవరీ చేయించి అందించాలన్నారు. పోలీసులు రికవరీ చేయకపోతే ఆ రైతును తానే ఆదుకుంటానన్నారు.

ధర్నాలో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఫేస్‌బుక్‌లో మహిళలపై జనసేన నేత అనుచిత వ్యాఖ్యలు

ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నూజివీడు: 'నూజివీడు భవిష్యత్ కోసం పోరాటం' పేరుతో ఫేస్‌బుక్ అకౌంట్‌ను నిర్వహిస్తోన్న జనసేన నేత మరీదు శివరామకృష్ణపై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఏలూరు జిల్లా నూజివీడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో ఉద్దేశపూర్వకంగా మహిళల పట్ల శివరామకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని, నోటితో చెప్పుకోలేని విధంగా బూతులు తిడుతూ పోస్టులు పెట్టి మహిళల పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ పార్టీ నాయకుడైన యర్రంశెట్టి రవితేజ కుటుంబానికి చెందిన మహిళలపైన కూడా అనుచిత పోస్టులు పెడుతున్నందున విచారించి శివరామకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు తులిమెల్లి పావనీ జ్యోతీ సుజన కుమారి పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురు మృతి

మరో ముగ్గురి పరిస్థితి విషమం

కిర్లంపూడి మండలం సోమవరంలో ఘటన

కిర్లంపూడి: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం వద్ద శనివారం ఉదయం కారు ఢీకొని ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... జగ్గంపేటకు చెందిన టీడీపీ నాయకుడు వేములకొండ జోగారావు కుమారుడి వివాహం శుక్రవారం విశాఖపట్నంలో జరిగింది. అక్కడి నుంచి సొంతూరు జగ్గంపేటకు కారులో బయలుదేరారు. జోగారావు నడుపుతున్న కారు శనివారం ఉదయం ఏడు గంటలకు సోమవరం గ్రామంలోని బస్టాప్ వద్ద అదుపుతప్పి రెండు బైక్‌లపై ఆగి ఉన్నవారిని, తోపుడు బండి నెట్టుకుని వెళుతున్నవారిని ఢీకొట్టింది. బస్టాప్‌లో కూర్చున్న విద్యార్థులు, ప్రయాణికులపైకి కూడా కారు దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన సోమవరం గ్రామానికి చెందిన సమీప బంధువులు మోర్త ఆనందరావు(60), మోర్త కొండయ్య(31) ఘటనాస్థలంలోనే మృతిచెందారు. ఏలేశ్వరం గ్రామానికి చెందిన కాకాడ రాజు(60)ను ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గమధ్యలో మరణించాడు. అదేవిధంగా బస్సు కోసం ఎదురుచూస్తూ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన నర్సింగ్ విద్యార్థినులు కుదరవు చైతన్య(18), చీపురుపల్లి ఫణిశ్రీ(18)తోపాటు మరో వ్యక్తి బత్తిన భద్రంను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోర్త తాతారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాకాడ రాజు (ఫైల్)

మోర్త కొండయ్య (ఫైల్)



మోర్త ఆనందరావు (ఫైల్)

OFFICE OF THE COMMISSIONER OF CENTRAL TAX (AUDIT)

GUNTUR CENTRAL GST AUDIT COMMISSIONERATE, GST Bhavan, Port Area, Visakhapatnam-530035 Phone No.0891-2853142

NOTICE TO INVITE E-TENDERS FOR VEHICLES HIRING

The Commissioner of Central Tax, Guntur Audit Commissionerate, Visakhapatnam invites e-tenders from reputed Service Providers through GeM Portal (www.gem.gov.in) for hiring of 08 operational vehicles (07 Small Sized Vehicles & 01 Mid-sized Vehicle) and 01 Staff Car Mid Size in GeM with Bid No:GEM/2025/B/6852176 (commercial vehicles only) along with Drivers (in Uniform) for a period of 12 Months from 01.12.2025 to 30.11.2026 Last date for submission of Online Bids is 15.11.2025 at 18.00 hrs.

For any query/ clarifications, Superintendent (Admin) may be contacted over telephone Nos. 0891-2853142 through e-mail: sup.admn-gntaudit@gov.in and also in person at Room No.411, Visakhapatnam CGST Commissionerate, GST Bhavan, Port Area, Visakhapatnam-35

G Venkata Ramana (Assistant Commissioner)

ఈ వాచ్ రూ. 88.50 కోట్లు

ఇది అత్యంత అరుదైన పటెక్ ఫిలిప్ కంపెనీ 1518 మోడల్ స్టీల్ వాచ్. 1943లో తయారైందీ గడియారం. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో వేలానికి రానుంది. రూ.88.50 కోట్ల వరకు ధర పలకొచ్చని అంచనా వేస్తున్నారు. 14 ఏళ్ల వ్యవధిలో ఆ కంపెనీ ఇలాంటి 281 వాచీలను మాత్రమే తయారు చేయడం విశేషం.

దక్షిణాఫ్రికాలో జీ 20 శిఖరాగ్రానికి వెళ్లను: ట్రంప్

వాషింగ్టన్: డిసెంబర్ ఒకటిన దక్షిణాఫ్రికాలో జరగనున్న జీ20 శిఖరాగ్రంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంలో ఈ భేటీ జరగడం పూర్తిగా అవమానకరమన్నారు. ఆ కార్యక్రమానికి తాను వెళ్లబోనన్నారు. అంతేకాదు, అమెరికా ప్రభుత్వ ప్రతినిధులెవరినీ అక్కడికి పంపించబోమని ప్రకటించారు. ఆ దేశంలో మైనారిటీ శ్వేత జాతీయులకు హక్కులు లేకుండా చేసినంత కాలం ఇదే విధానం కొనసాగిస్తామన్నారు. డచ్, ఫ్రెంచ్, జర్మన్ సంతతి ప్రజలను చంపుతూ వారి భూములను అక్రమంగా లాగేసుకుంటున్నారని ఆరోపించారు. అసలా గ్రూపులో అమెరికాకు సభ్యత్వం అవసరముందా అని ప్రశ్నించారు. 2026లో ఫ్లోరిడా రాజధాని మయామిలో జరిగే జీ20 శిఖరాగ్రానికి తాము ఆతిథ్యమిస్తామని ప్రకటించారు.

ఒహాయో గవర్నర్ రేసులో వివేక్ రామస్వామి

బలపర్చిన అధ్యక్షుడు ట్రంప్

న్యూయార్క్: అమెరికాలోని ఒహాయో రాష్ట్ర గవర్నర్ పదవికి పోటీ పడుతున్న భారతీయ అమెరికన్, రిపబ్లికన్ పార్టీ నేత వివేక్ రామస్వామి(40)కి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించారు. ఆయన ఒహాయోకు గొప్ప గవర్నర్ అవుతారని కితాబునిచ్చారు. వ్యాపారవేత్త, రాజకీయ నేత అయిన వివేక్ రామస్వామి రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగి, ప్రైమరీలో పోటీ నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే ట్రంప్‌కు మద్దతు పలికి, ఆయనకు సన్నిహితుడిగా మారారు. ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్ మీడియాలో..' వివేక్ రామస్వామి ఒహాయోకు గొప్ప గవర్నర్ అవుతారు. ఆయనకు నా సంపూర్ణ మద్దతు ఉంటుంది. నాకు బాగా తెలిసిన వ్యక్తి. ఆయన సమ్‌థింగ్ స్పెషల్. యువకుడు, చాలా మంచి వ్యక్తి. అమెరికాను నిజంగా ప్రేమించే వాడు'అంటూ ప్రశంసలు కురిపించారు. స్పందించిన వివేక్.. 'థాంక్యూ మిస్టర్ ప్రెసిడెంట్ ట్రంప్! ఒహాయోను మరోసారి గొప్పగా మారుద్దాం'అంటూ బదులిచ్చారు. వివేక్ తల్లిదండ్రులు కేరళకు చెందిన వారు.

పాక్‌లో కొత్త పోస్ట్.. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రభుత్వం త్రివిధ దళాలను ఏకీకృత కమాండ్ కిందికి తీసుకు వచ్చేందుకు వీలుగా 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్'అనే కొత్త పోస్టును సృష్టించింది. ఇందుకోసం షెహబాజ్ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243లో ప్రతిపాదించిన మార్పులతో 27వ రాజ్యాంగ సవరణ బిల్లును శనివారం సెనేట్‌లో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం..ఆర్మీ చీఫ్‌ను, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌ను ప్రధానమంత్రి సిఫారసు మేరకు అధ్యక్షుడు నియమిస్తారు. అనంతరంచీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రధానితో చర్చించిన తర్వాత నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ అధిపతిని నియమిస్తారు.

ఎల్‌కే అడ్వాణీ @ 98..!

దిగ్గజ నేతకు విషెస్ చెప్పిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: బీజేపీ దిగ్గజ నేత, మాజీ ఉపప్రధాని లాల్ కృష్ణ అడ్వాణీ శనివారం 98వ ఏట అడుగు పెట్టారు. ప్రధాని మోదీ ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛంతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి ఆయన చిరస్మరణీయమైన సేవలందించారని, మనందరికీ గొప్ప స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. గొప్ప దార్శనికత కలిగిన రాజనీతిజ్ఞుడు అడ్వాణీ అని కొనియాడారు. 'శ్రీ ఎల్‌కే అడ్వాణీ జీకి జన్మదిన శుభాకాంక్షలు. సుదూరమైన దార్శనికత, అద్భుతమైన మేధస్సు కలిగిన రాజనీతిజ్ఞుడు. దేశ పురోగతి కోసం అడ్వాణీ తన జీవితాన్ని అంకితం చేశారు' అని మోదీ పేర్కొన్నారు.

సులభతర న్యాయంతో సామాజిక న్యాయం

న్యాయశాస్త్రం భాషను ప్రజలకు అర్థమయ్యేలా మార్చాలి

- పౌరులందరికీ న్యాయం సులభంగా అందాలి
- కోర్టు తీర్పులను, న్యాయ పత్రాలను స్థానిక భాషల్లో తీసుకురావాలి
- ప్రభుత్వ న్యాయ సహాయ వ్యవస్థతో లక్షలాది వివాదాలకు తెర
- జాతీయ సదస్సులో ప్రధాని మోదీ స్పష్టీకరణ

వేదికపై ప్రధాని మోదీ, సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, కాబోయే సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, న్యాయశాఖ మంత్రి మేఘ్వాల్

న్యూఢిల్లీ: అందరికీ అర్థమయ్యేలా న్యాయశాస్త్రం భాషను సులభతరంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. స్థానిక భాషలోనే న్యాయశాస్త్రం అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎనలేని మేలు జరుగుతుందని చెప్పారు. ప్రజలందరికీ న్యాయం సులభంగా అందే సౌలభ్యం ఉండాలని పేర్కొన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా న్యాయం సమానంగా, సులువుగా అందుబాటులోకి రావాలన్నారు. శనివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో 'న్యాయ సహాయ వ్యవస్థల బలోపేతం' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశంలో సామాజిక న్యాయ సాధనకు సులభతర న్యాయం అత్యంత కీలకమని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. కోర్టు తీర్పులను, న్యాయ సంబంధిత పత్రాలను స్థానిక భాషల్లో తీసుకురావాలని కోరారు. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఎంతో కృషి చేస్తోందని ప్రశంసించారు. స్థానిక భాషలకు ప్రాధాన్యం ఇస్తూ సుప్రీంకోర్టు ప్రారంభించిన చర్యలను ఆయన గుర్తుచేశారు. 80 వేలకుపైగా తీర్పులను 18 భారతీయ భాషల్లోకి అనువదిస్తోందని తెలియజేశారు. ఈ గొప్ప ప్రయత్నం హైకోర్టులు, జిల్లా స్థాయి కోర్టుల్లోనూ జరగాలని ఆకాంక్షించారు.

మాతృభాషలో చట్టంతో లబ్ధి

న్యాయం అనేది సమాజంలో కొందరికే పరిమితం కాకూడదని, అది అందరికీ అందాలని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. పేదలకు, అణగారిన వర్గాలకు సులభంగా న్యాయం దక్కడంలో ప్రభుత్వ న్యాయ సహాయ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని మోదీ తెలిపారు. న్యాయాన్ని ప్రతి పౌరుడికీ చేర్చడమే మన లక్ష్యం కావాలని సూచించారు. సులభతర న్యాయాన్ని మరింత మెరుగుపర్చడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని, ఇకపై ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయనుందని ఉద్ఘాటించారు. కక్షిదారులకు అర్థమయ్యే భాషలో తీర్పులివ్వాలని, న్యాయాన్ని చేకూర్చాలని చెప్పారు. చట్టాలను రూపొందించే సమయంలో ఈ విషయాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ప్రజలకు వారి మాతృభాషలో చట్టం గురించి తెలిస్తే వివాదాలు చాలావరకు తగ్గిపోతాయని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉంటే.. నిర్దిష్ట గడువులోగా న్యాయం సులభంగా అందితే.. సామాజిక న్యాయానికి అదే బలమైన పునాది అవుతుందని తేల్చిచెప్పారు. న్యాయ విభాగంలో టెక్నాలజీ ప్రాధాన్యతను ప్రస్తావించారు. ఈ-కోర్టుల ప్రాజెక్టుతో సత్ఫలితాలు వస్తున్నాయని చెప్పారు.

కాలం చెల్లిన చట్టాలను రద్దుచేశాం

సులభతర వాణిజ్యం, సులభతర జీవనాన్ని పెంపొందించడంపై తమ ప్రభుత్వం గత 11 ఏళ్లుగా ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని ప్రధాని మోదీ వివరించారు. అవసరంలేని 40 వేలకుపైగా నియమ నిబంధనలను రద్దు చేశామని తెలిపారు. జన విశ్వాస్ చట్టం ద్వారా 3,400కుపైగా న్యాయ వ్యవహారాలను నేరరహితం(డిక్రిమినలైజ్) చేశామన్నారు. అలాగే కాలం చెల్లిన 1,500 చట్టాలను రద్దు చేశామని గుర్తుచేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న చట్టాల్లో మార్పులు చేసి భారతీయ న్యాయ సంహితను తీసుకొచ్చామని వెల్లడించారు. మధ్యవర్తిత్వంతో వివాదాలు సులువుగా పరిష్కారం అవుతాయని సూచించారు.

మూడేళ్లలో 8 లక్షల వివాదాలు పరిష్కారం

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) ఏర్పాటై 30 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై ఏర్పాటు చేసిన నూతన శిక్షణా విధానాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. వివాదాలను పరిష్కరించడానికి, లిటిగేషన్లు తగ్గించడానికి, సమాజంలో శాంతి సామరస్యం నెలకొల్పడానికి అవసరమైన వనరులను ఈ శిక్షణ అందిస్తుందని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లు, ప్రి–లిటిగేషన్ సెటిల్‌మెంట్లతో లక్షలాది వివాదాలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రారంభించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌తో కేవలం మూడేళ్లలో 8 లక్షలకుపైగా వివాదాలు పరిష్కారానికి నోచుకున్నాయని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు.

న్యాయం ప్రతి పౌరుడి హక్కు

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి

న్యూఢిల్లీ: న్యాయం అనేది కేవలం కొందరికి సంబంధించిన విశేషాధికారం కాదని.. అది ప్రతి పౌరుడి హక్కు అని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ తేల్చిచెప్పారు. న్యాయ కాంతిరేఖ ప్రతి ఒక్కరినీ చేరుకొనేలా చూడడం న్యాయమూర్తులు, న్యాయవాదుల విధి అని పేర్కొన్నారు. న్యాయ సహాయంపై జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో ఆఖరి వరుసలో ఉన్న పౌరుడికి కూడా న్యాయం అందాలని చెప్పారు. న్యాయ సేవల గొప్పదనం గణాంకాల్లో, వార్షిక నివేదికల్లో ఉండదని తెలిపారు. న్యాయం పొందిన ప్రజలు నిశ్శబ్దంగా చూపే కృతజ్ఞత, విశ్వాసమే అసలైన రివార్డు అని వ్యాఖ్యానించారు.

సులువుగా న్యాయ సహాయం

జస్టిస్ సూర్యకాంత్ సూచన

కక్షిదారులకు న్యాయ సహాయాన్ని మరింత సులువుగా అందించాలని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఈ విషయంలో టెక్నాలజీని విస్తృతంగా వాడుకోవాలని అన్నారు. న్యాయాన్ని చేకూర్చడంలో స్థానిక భాషలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్లిష్టమైన కేసులపై ఎంత త్వరగా నిర్ణయం తీసుకుంటున్నాం అనేదానికంటే సామాన్య ప్రజలకు ఎంతమేరకు మేలు చేస్తున్నాం అనేదే ముఖ్యమని స్పష్టంచేశారు. మన రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు కేవలం న్యాయ వ్యవస్థను సృష్టించడం మాత్రమే కాకుండా.. పారదర్శకత, మానవ గౌరవాన్ని కాపాడడం, అందరికీ సమానంగా రక్షణ కల్పించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకున్నారని చెప్పారు.

చెత్తకుప్పలో వీవీప్యాట్ స్లిప్పులు

బిహార్‌లో తీవ్ర కలకలం ● అవి మాక్ పోల్ స్లిప్పులన్న అధికారులు

సమస్తీపూర్: బిహార్‌లోని సమస్తీపూర్‌లో పెద్ద సంఖ్యలో వీవీప్యాట్(ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)స్లిప్పులను రోడ్డు పక్కన విసిరేసినట్లుగా ఉన్న వీడియో ఒకటి తీవ్ర కలకలం రేపింది. శనివారం సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో వైరల వుతోంది. పార్టీ గుర్తులు ముద్రించి ఉన్న ఆ స్లిప్పులను జనం ఏరుతున్నట్లుగా అందులో కనిపిస్తోంది. దీనిపై ప్రతిపక్ష ఆర్జేడీ సీరియస్‌గా స్పందించింది. అవి ఈవీఎంల నుంచి పడేసిన స్లిప్పులేనని పేర్కొంది. అయితే, అవి పోలింగ్ ముందు రోజైన బుధవారం నిర్వహించిన మాక్ పోల్‌కు సంబంధించిన స్లిప్పులు మాత్రమేనని, వాస్తవ ఓటింగ్‌నకు సంబంధించినవి కావని జిల్లా యంత్రాంగం తెలిపింది. మాక్ పోల్ తర్వాత స్లిప్పులను కత్తిరించి బయటపడేశామని, అందులో కట్ కాని కొన్ని స్లిప్పులు స్థానికులు ఏరుకున్నారని డీఎం రోషన్ కుష్వాహా వివరించారు. తాము స్వయంగా ఘటనాస్థలికి వెళ్లి వాటిని పరిశీలించామన్నారు. వాటిపై ఉన్న ఈవీఎంల నంబర్ల ఆధారంగా బాధ్యులైన పోలింగ్ సిబ్బంది గుర్తించవచ్చని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. సంబంధిత నియోజకవర్గంలోని అభ్యర్థులకు ఈ విషయం తెలిపామన్నారు. ఇందుకు బాధ్యుడైన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి(ఏఆర్‌వో)పై కఠినచర్యలు తీసుకోవాలని ఈసీ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆదేశించారు. సంబంధిత ఏఆర్‌వోను సస్పెండ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామన్నారు. ఘటనపై విచారణ చేపట్టి, సవివర నివేదిక అందజేయాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారు. ఓటింగ్ ప్రక్రియపై ఈ ఘటన ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును పరిశీలించే ఉద్దేశంతో మాక్ పోల్ ప్రక్రియను చేపడతారు. అనంతరం, అందులోని ట్రయల్స్‌కు సంబంధించిన డేటాను పూర్తిగా తొలగిస్తారు.

సమస్తీపూర్‌లో రోడ్డు పక్కన పడేసిన వీవీప్యాట్ స్లిప్పులు, కత్తిరించని కొన్ని స్లిప్పులు

హ్యాండ్సప్ కాదు.. స్టార్టప్‌లు కావాలి

- మేము కంప్యూటర్లు ఇస్తున్నాం..
- వాళ్లు తుపాకులు ఇస్తారట
- ఆర్జేడీపై ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం
- బిహార్‌లో ముగిసిన ప్రధాని ఎన్నికల ప్రచారం

సీతామర్హిలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్‌లో విపక్ష కూటమికి ఓటర్లు 65 వోల్టుల షాక్ ఇచ్చారని, దాంతో ఆ కూటమి నేతలకు నిద్రలేని రాత్రులే మిగిలాయని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. పొరపాటున ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ప్రజల తలపై నాటు తుపాకీ పెట్టి హ్యాండ్సప్ అంటారని హెచ్చరించారు. తొలి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 65 శాతానికిపైగా ఓటింగ్ నమోదైందని, ఫలితం తమకు అనుకూలంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి దశలో నమోదైన రికార్డును ఈ నెల 11న జరిగే రెండో దశలో తిరగరాయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని స్థానాల్లో ఎన్డీయే అభ్యర్థులు నెగ్గడమే కాకుండా.. అన్ని బూత్‌ల్లో భారీ ఆధిక్యం రావాలని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ శనివారం బిహార్‌లోని సీతామఢి, బేతియాలో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ప్రసంగించారు. దీంతో రాష్ట్రంలో ఆయన ప్రచార పర్వం ముగిసింది. ఈ ఎన్నికల్లో మోదీ నెల రోజుల వ్యవధిలో మొత్తం 14 సభల్లో మాట్లాడారు. రాజధాని పట్నాలో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. శనివారం బేతియాలో చివరి సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మళ్లీ ఎన్డీయే ప్రభుత్వమే కొలువుదీరుతుందని, కొత్త సర్కార్ ప్రమాణ స్వీకారానికి వస్తానని ప్రకటించారు.

అవినీతి పార్టీలను తరిమికొట్టాలి

''భారతరత్న కర్పూరీ ఠాకూర్ స్వగ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించా. గాంధీజీ మహాత్ముడిగా మారిన ప్రాంతంలో ప్రచారం ముగిస్తున్నా. మా కూటమి ప్రచారం యథావిధిగా కొనసాగుతుంది. పోలింగ్ రోజు ఓటర్ల పని ప్రారంభమవుతుంది. కట్టా(నాటు తుపాకీ) సర్కార్ రావాలని బిహార్ ప్రజలు కోరుకోవడం లేదు. ఆర్జేడీ కూటమి వస్తే మళ్లీ అరాచకమే రాజ్యమేలుతుంది. జంగిల్‌రాజ్ మనుషులకు అధికారం అప్పగిస్తే జనం తలపై తుపాకీ గురిపెట్టి హ్యాండ్సప్ అంటారు, ఉన్నదంతా దోచుకుంటారు. ఇప్పుడు కావాల్సింది హ్యాండ్సప్ కాదు.. స్టార్టప్‌లు. వాటిని ఏర్పాటుచేసే సామర్థ్యం ఎన్డీయేకు మాత్రమే ఉంది. సుపరిపాలన కావాలంటే అవినీతి పార్టీలను తరిమికొట్టాలి. ఓట్ల చోరీ అంటూ కొందరు లేనిపోని అల్లరి చేస్తున్నారు. బిహార్ ఎన్నికల్లో రాబోయే ఓటమికి సాకులు వెతుకున్నారు. అందుకోసం నెట్‌ప్రాక్టీస్ చేస్తున్నారు.

జంగిల్‌రాజ్ అంటే అదే..

యువతను రౌడీలుగా మార్చడానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం యువతకు కంప్యూటర్లు, క్రీడా పరికరాలు ఇస్తోంది. ఆర్జేడీ మాత్రం తుపాకులు ఇస్తామని చెబుతోంది. ప్రతిపక్ష నాయకులు వారి సొంత కుమారులు, కుమార్తెలను ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చేసుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇతరుల పిల్లలను మాత్రం గూండాలుగా మారుస్తారట! ఇలాంటి పెడధోరణిని బిహార్ ఎన్నటికీ అంగీకరించదు. జంగిల్‌రాజ్ అంటే పిస్తోళ్లు, క్రూరత్వం, అవినీతి, శత్రుత్వం తప్ప మరొకటి కాదు. ఆర్జేడీ ఎన్నికల ప్రచారంలో వినిపిస్తున్న పాటలు, నినాదాలు చూస్తే ప్రజలకు వణుకు పుడుతోంది. ఆర్జేడీ ప్రచార వేదికలపై అమాయక బాలలు కనిపిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్లుగా మారుతామని చెబుతున్నారు. తుపాకుల గురించి, రౌడీయిజం గురించి బహిరంగంగా మాట్లాడుతున్నారు. బాలల మనసును విషపూరితం చేస్తున్న దుష్ట నాయకులకు బుద్ధి చెప్పాలి. నహీ ఛాహియే కట్టా సర్కార్, ఫిర్ ఏక్‌బార్ ఎన్డీయే సర్కార్'' అని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు.

డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్

19వ తేదీ వరకు శీతాకాల సమావేశాలు

- మూడు వారాల వ్యవధిలో 15 సెషన్లు
- ఎస్ఐఆర్‌పై వాడీవేడి చర్చకు అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయింది. డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న ఈ సమావేశాలు 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మూడువారాల వ్యవధిలో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉంటాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు శనివారం వెల్లడించారు. ఈ సమావేశాలు 18వ లోక్‌సభకు ఎంతో కీలకమైనవని, ప్రజల సమస్యలు, దేశ అభివృద్ధి అంశాలపై చర్చ జరిగి, కొత్త చట్టాలు రూపొందే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇటీవల ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ రాజ్యసభకు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

కాక పుట్టించనున్న ఎస్ఐఆర్

బిహార్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రారంభమయ్యే ఈ సమావేశాలపై అక్కడి ఫలితాల ప్రభావం కన్పించనుంది. ఈ సమావేశాల్లో అనేక అంశాలు చర్చకు రానున్నాయి. ప్రధానంగా నవంబర్ 4– డిసెంబర్ 4 మధ్య జరిగే ఓటరు జాబితా ఎస్ఐఆర్ రెండోదశపై వాడీవేడి చర్చ జరగనుందని భావిస్తున్నారు. ఓట్ల చోరీ కోసమే ప్రభుత్వం ఈసీతో కుమ్మక్కై ఎస్ఐఆర్ చేపడుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండటం తెల్సిందే. వర్షాకాల సమావేశాల సమయంలో బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో నిరవధికంగా నిరసనలు కొనసాగించడం తెల్సిందే. అదేవిధంగా, భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపింది తానేనంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే ప్రకటనలు చేయడంపై ఈసారి ప్రతిపక్షాలు ప్రభుత్వం నుంచి సమాధానం డిమాండ్ చేస్తాయని విశ్లేషకులు అంటున్నారు. ఈ సమావేశాల్లో రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ(సవరణ)బిల్లు, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ(సవరణ) బిల్లు వంటి కీలకమైన బిల్లులు చర్చకు రానున్నట్లు సమాచారం.

ప్రభుత్వానికి పార్లమెంట్ ఫోబియా: టీఎంసీ

ప్రభుత్వం ప్రకటించిన పార్లమెంట్ సమావేశాల తేదీలపై కాంగ్రెస్ పార్టీ ఆక్షేపణ తెలిపింది. శీతాకాల సమావేశాలను ఎన్డీయే ప్రభుత్వం చాలా ఆలస్యంగా, అదీ స్వల్పకాలమే నిర్వహించాలని నిర్ణయించిందంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తప్పుబట్టారు. కేవలం 15 రోజుల పాటు మాత్రమే సమావేశాలను చేపట్టడం ద్వారా మోదీ ప్రభుత్వం ప్రజలకు ఏం సందేశం అందించాలనుకుంటోందని ఆయన ప్రశ్నించారు. 'ఈ సమావేశాల్లో చర్చించేందుకు అంశాలు లేవని ప్రభుత్వం భావిస్తోంది. ప్రవేశపెట్టేందుకు బిల్లులు లేవు అంతిమంగా ప్రభుత్వం చర్చకు సైతం ఒప్పుకోదు'అని ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం భయపడుతోందని, మోదీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఫోబియా పట్టుకుందని టీఎంసీ నేతల డెరెక్ ఒబ్రియాన్ ఆరోపించారు.

బిహార్ బరిలో ఫైనల్ రౌండ్!

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల అధ్యాయం తుది దశకు చేరుకుంది. రెండో దశలో ఈ నెల 11వ తేదీన 122 అసెంబ్లీ స్థానాలకు తుదిదశ పోలింగ్ జరగనుంది. ఇది సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానికి, తేజస్వీ యాదవ్ సారథ్యంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి రాజకీయ ఎత్తుగడలకు అసలు సిసలు పరీక్షగా మారింది. చంపారన్ కంచుకోటల నుంచి సీమాంచల్ సంక్లిష్ట సమీకరణాల వరకు అరడజనుకు పైగా మంత్రులు, మాజీ మంత్రులు, సీనియర్ నేతల తలరాతలు ఈవీఎంలలో నిక్షిప్తం కానున్నాయి. తొలి దశ హోరాహోరీగా ముగియగా, ఈ ఫైనల్ రౌండ్‌లో గెలిచి గద్దెనెక్కేదెవరన్న దానిపై నరాలు తెగే ఉత్కంఠ నడుస్తోంది.

అందరి దృష్టి వీరిపైనే...

రెండో దశ పోలింగ్ నితీశ్ కుమార్ కేబినెట్ సహచరులకు, మహాగఠ్‌బంధన్ ప్రభుత్వంలోని మాజీ మంత్రులకు చావోరేవోగా మారింది. వీరి గెలుపోటములు కూటముల భవిష్యత్తును శాసించనున్నాయి. అందరి దృష్టి వీఐపీలపైనే ఉంది. వారెవరంటే..

• • •

→ **రేణు దేవి (బీజేపీ, బెట్టియా):** రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈమె పశ్చిమ చంపారన్‌లో బీజేపీకి అత్యంత కీలకమైన, బలమైన నాయకురాలు. ఈమె గెలుపు కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం.

• • •

→ **లేషి సింగ్ (జేడీయూ, ధమ్‌దాహా):** నితీశ్ కేబినెట్‌లో ప్రస్తుత ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి. సీమాంచల్ ప్రాంతంలో జేడీయూకి బలమైన మహిళా నాయకురాలు. 2020లో స్వల్ప మెజారిటీతో గట్టెక్కిన ఈమె, ఈసారి గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు.

• • •

→ **లలిత్ కుమార్ యాదవ్ (ఆర్జేడీ, దర్భంగా గ్రామీణ):** గత మహాగఠ్‌బంధన్ ప్రభుత్వంలో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ మంత్రి. దర్భంగా ప్రాంతంలో ఆర్జేడీకి బలమైన యాదవ నేతగా ఈమెను భావిస్తున్నారు.

• • •

→ **మదన్ సహాని (జేడీయూ, బహదూర్‌పూర్):** సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి. అత్యంత వెనుకబడిన వర్గాల (ఈబీసీ) నుంచి వచ్చిన బలమైన నాయకుడు. ఈయన గెలుపు ఎన్డీయేకు ముఖ్యం.

• • •

→ **సమీర్ కుమార్ మహాసేత్ (ఆర్జేడీ, మధుబని):** గత మహాగఠ్‌బంధన్ ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రి. మిథిలాంచల్ ప్రాంతంలో, ముఖ్యంగా వ్యాపార వర్గాల్లో మంచి పట్టున్న నేత.

• • •

→ **ప్రమోద్ కుమార్ (బీజేపీ, మోతిహారి):** మోతిహారి నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచిన బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి. ఈయన గెలుపు బీజేపీకి నల్లేరుపై నడకేనని భావిస్తున్నా, ఆర్జేడీ మాత్రం గట్టి పోటీ ఇస్తోంది.

• • •

→ **అక్తరుల్ ఇమాన్ (ఎంఐఎం, అమౌర్):** ఈయన అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం పార్టీ బిహార్ రాష్ట్ర అధ్యక్షుడు. సీమాంచల్ ప్రాంతంలో ముస్లిం ఓటు బ్యాంకును చీల్చడం ద్వారా ఈయన మహాగఠ్‌బంధన్ అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

చంపారన్ కోటలో హోరాహోరీ.. ఈ నాలుగింటిపైనే ఫోకస్!

2020 ఎన్నికల్లో చంపారన్ ప్రాంతం (తూర్పు, పశ్చిమ) ఎన్డీయేకు కంచుకోటగా నిలిచింది. ఈసారి ఈ కోటను బద్దలుకొట్టాలని మహాగఠ్‌బంధన్, నిలబెట్టుకోవాలని ఎన్డీయే సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇక్కడ నాలుగు నియోజకవర్గాలు రాష్ట్ర వ్యాప్త ఆసక్తిని రేపుతున్నాయి.

• • •

→ **బెట్టియా (పశ్చిమ చంపారన్):** ఇక్కడ మాజీ డిప్యూటీ సీఎం రేణు దేవి (బీజేపీ) బరిలో ఉన్నారు. 2020లో 18 వేల మెజారిటీతో గెలిచిన ఈమెకు.. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి వాషి అహ్మద్, జన్ సురాజ్ అభ్యర్థి అనిల్ కుమార్ సింగ్‌ల నుంచి త్రిముఖ పోటీ ఎదురవుతోంది. క్షేత్ర స్థాయి సమస్యలు, నిరుద్యోగం ఇక్కడ ప్రభావం చూపే అంశాలు.

• • •

→ **మోతిహారి (తూర్పు చంపారన్):** బీజేపీకి ఇది అత్యంత పటిష్టమైన కోట. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రమోద్ కుమార్ (బీజేపీ) మరోసారి ఆర్జేడీ అభ్యర్థి ఓం ప్రకాష్ చౌదరితో తలపడుతున్నారు. 70% గ్రామీణ ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో ప్రమోద్ కుమార్ వ్యక్తిగత ఇమేజ్, బీజేపీ సంస్థాగత బలం ఎన్డీయేకు కొండంత అండగా నిలుస్తున్నాయి.

• • •

→ **నర్కటియాగంజ్ (పశ్చిమ చంపారన్):** ఇక్కడ మహాగఠ్‌బంధన్ వ్యూహం బెడిసికొట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కూటమిలో ఏకాభిప్రాయం కుదరక, ఆర్జేడీ (దీపక్ యాదవ్), కాంగ్రెస్ (శాశ్వత్ కేదార్) ఇద్దరూ బరిలో నిలిచారు. ఇది 'ఫ్రెండ్లీ ఫైట్'అని పైకి చెబుతున్నా, మహాగఠ్‌బంధన్ ఓటు బ్యాంకు స్పష్టంగా చీలిపోయే ప్రమాదం ఉంది. ఈ పరిణామం నేరుగా బీజేపీ (సంజయ్ పాండే) విజయానికి బాటలు వేసేలా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

• • •

→ **వాల్మీకి నగర్ (పశ్చిమ చంపారన్):** ఇది జేడీయూకి బలమైన స్థానం. సిట్టింగ్ ఎమ్మెల్యే ధీరేంద్ర ప్రతాప్ సింగ్ (జేడీయూ)కు వ్యక్తిగతంగా మంచి పట్టు ఉంది. 2015లో ఇండిపెండెంట్‌గా గెలిచిన ఈయనే, 2020లో జేడీయూ తరపున గెలిచారు. ఈసారి కాంగ్రెస్ తరపున ప్రియాంకా గాంధీ స్వయంగా ప్రచారం చేసినా, ఇక్కడ జేడీయూ అభ్యర్థిదే పైచేయిగా కనిపిస్తోంది.

ఆకస్మిక తనిఖీలు

నకరికల్లు: నకరికల్లులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏవో కె.దేవదాసు పాల్గొన్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతలకు ఎగువ నుంచి 75,665 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 79,910 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 45.7183 టీఎంసీలు.

వైభవంగా సుమంగళి పూజ

రేపల్లె: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుమంగళి పూజ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

అమరావతి: అమరావతిలోని బాల చాముండికా సమేత అమరేశ్వరుడిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత న్యాయమూర్తి దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్బారెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి తర్వాత స్వామివారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో రేఖ స్వామి వారి చిత్రపటాన్ని వారికి అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లేందుకు ప్రత్యేక రైలును కేటాయించినట్లు గుంటూరు డివిజన్ పీఆర్‌ఓ వినయ్‌కాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ టౌన్ – కొట్టాయం (07109) రైలును ఈ నెల 17వ తేదీ నుంచి 2026 జనవరి 19వ తేదీ వరకు ప్రతి సోమవారం నడపనున్నట్లు తెలిపారు. నాందేడ్–కొల్లాం(07111) రైలును ఈ నెల 20 నుంచి వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ వరకు ప్రతి గురువారం నడపనున్నట్లు పేర్కొన్నారు. చర్లపల్లి – కొల్లాం(07113) రైలును ఈ నెల 18 నుంచి వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు తెలిపారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సురక్షితమైన ప్రయాణం చేయాలని అన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి రిజర్వేషన్ బుకింగ్ చేసుకోవాలని అయ్యప్ప భక్తులకు సూచించారు.

వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక

తెనాలిఅర్బన్: తెనాలి ఇండోర్ స్టేడియంలో శనివారం వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో షేక్ ఆశా జ్యోతి, పి.స్వరూప, బి.రేష్మ, టి.రేణుక, జి.జయసాయికృష్ణ, షేక్ ఆఫిక్, ఎ.మల్లి కార్జునరావు, డి.మౌలాలి, డి.సాగర్‌బాబు, ఎన్‌వీ మహేష్, షేక్ సలీం, సీహెచ్ వెంకటేష్, జి.కృష్ణబాబు, సీహెచ్ వంశీ, ఎం.అశోక్‌లను ఎంపిక చేసినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి సీహెచ్ మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్, జిల్లా కోశాధికారి అడపా సంపత్‌రాయుడు, సీనియర్ వెయిట్ లిఫ్టర్ పి.వెంకటేశ్వరరావు, కోచ్‌లు తోట గోపి, పి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరమాచార్య విగ్రహావిష్కరణ



తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరు గ్రామ పరిధిలోని అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రం(మహా విద్యాపీఠం)లో ఏర్పాటు చేసిన పరమాచార్య విగ్రహాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి శనివారం ఘనంగా ఆవిష్కరించారు. విద్యాగణపతి బాలాంబికా సమేత శ్రీ సర్వహితేశ్వర స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించే ప్రక్రియను ప్రారంభించి, సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహా విద్యాపీఠం కార్యవర్గ సభ్యులు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 589.60 అడుగులకు చేరింది. ఇది 310.8498 టీఎంసీలకు సమానం. జలాశయం నుంచి కుడి కాలువకు 10,000, ఎడమ కాలువకు 5,297, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 34,226, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తం ఔట్ ఫ్లోగా 51,323 క్యూసెక్కులు విడుదల అవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 51,323 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

అంచనాలో వంచన

- పంట నష్టంపై కాకి లెక్కలు
- జిల్లాలో ఎన్యుమరేషన్ పూర్తి
- 6,062 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం
- 3,800 మంది రైతులకు నష్టం
- తేల్చిన వ్యవసాయ అధికారులు
- ఇంకా ఎక్కువే ఉంటుందంటున్న రైతులు

జిల్లావ్యాప్తంగా మొంథా తుపాను వల్ల ఖరీఫ్‌లో పంటలకు కలిగిన నష్టంపై వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు లెక్క తేల్చారు. వాస్తవంగా జరిగిన నష్టానికి, అధికారుల అంచనాకు పొంతన లేదు. అంతా కాకి లెక్కల చందంగా ఉంది. లక్షా తొమ్మిది వేల ఎకరాల నుంచి ఆరువేల ఎకరాలకు నష్టాన్ని తగ్గించి చూపడంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చాలాచోట్ల అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి అంచనాలు వేయలేదని, ఆఫీసు గదుల్లో కూర్చుని లెక్కలు వేశారంటూ రైతులు విమర్శిస్తున్నారు. కొన్ని చోట్ల ఈ– క్రాప్ నమోదు కాలేదంటూ నష్టపోయిన పంటలను అసలు లెక్కలోకి తీసుకోలేదు. కూటమి కుయుక్తులపై రైతులు మండిపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు/కొరిటెపాడు: జిల్లాలో మొంథా తుపాను వల్ల మొత్తం 3,175 మంది రైతులకు చెందిన 5,463.3 ఎకరాల్లో సాధారణ పంటలు, మరో 625 మంది రైతులకు చెందిన 598.91 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్టు అధికారులు లెక్క తేల్చారు. దీనిలో వరి 2,693.20 ఎకరాలు, పత్తి 1,282.50 ఎకరాలు, వినుము 1,243.55 ఎకరాలు, సోయాబీన్ 234.03 ఎకరాలు, కంది 10.02 ఎకరాలు ఉన్నాయి. ఉద్యాన పంటల్లో అరటి 450.61 ఎకరాలు, కూరగాయలు 123.27 ఎకరాలు, తమలపాకు 24.43 ఎకరాలు, పూలు 0.60 ఎకరాలు నష్టపోయినట్లు గుర్తించారు. సోషల్ ఆడిట్ అనంతరం ఈ నివేదికను ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు. పంట నష్టం ఇంకా ఎక్కువగానే ఉంటుందని రైతులు అంటున్నారు.

సాగు ఆరంభం నుంచి కష్టాలు

- సీజన్ ప్రారంభం నుంచి రైతుల్ని కష్టాలు వెంటాడాయి. జిల్లాలో 2,15,701 ఎకరాల్లో (86,280.53 హెక్టార్లు) రైతులు ఖరీఫ్‌లో వ్యవసాయ పంటలు, మరో 40 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. ఆగస్టులో కురిసిన అధిక వర్షాలు, ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు, సాగునీటి ఎద్దడితో తీవ్ర నష్టం వాటిల్లింది.
- చాలాచోట్ల వెద పెట్టిన వరి కుళ్లి పోయింది. సుమారు 75 వేల ఎకరాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎన్యుమరేషన్ చేసిన తర్వాత చిత్రంగా నష్టం ఏమీ జరగలేదని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.
- కంకి, పొట్ట, వెన్ను దశలో ఉండగా మొంథా తుపాను తీవ్ర నష్టం కలిగించింది. 50 శాతం విస్తీర్ణంలో పంట చిరుపొట్ట, పూత, పాలుపోసుకునే, గింజ గట్టిపడే దశల్లో ఉంది. చాలాచోట్ల వరి పంట నేల వారింది. వ్యవసాయ శాఖ అధికారులు 1.09 లక్షల ఎకరాల్లో నేల వాలినట్టు ప్రాథమికంగా అంచనా వేసింది.
- క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం జిల్లాలో వ్యవసాయ పంటలు 5,463.3 ఎకరాలు, ఉద్యాన పంటలు 598.92 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు లెక్క తేల్చారు.

దుగ్గిరాలలో పడిపోయిన వరి

పొంతన లేని లెక్కలు

వాస్తవానికి తుపాను వల్ల రైతులకు కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లింది. అయితే వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా కంటే తుది నష్టం భారీగా తగ్గింది. గ్రామ సభల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరణ, పరిశీలన అనంతరం తుది నివేదికను ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి అందజేస్తారు. అధికారులు గుర్తించిన మేరకు హెక్టారుకు రూ.25 వేలు చొప్పున రూ.6.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీగా ఇస్తుంది.దీనివల్ల రైతులకు ఎంతమాత్రం ఉపయోగం లేదు.

మండలాల వారీగా అధికారులు తేల్చిన లెక్క

మండలం	నష్టపోయిన రైతులు	పంట నష్టం ఎకరాల్లో..
కాకుమాను	1276	1026.14
పెదకాకాని	512	401.88
తెనాలి	61	48.10
వట్టిచెరుకూరు	2	0.93
తుళ్ళూరు	890	383.40
మంగళగిరి	90	67.21
చేబ్రోలు	10	6.96
పెదనందిపాడు	135	129.71
తాడేపల్లి	64	46.89
ప్రత్తిపాడు	72	43.61
తాడికొండ	14	6.77
గుంటూరు వెస్ట్	49	23.77

తెనాలి ప్రాంతంలో దెబ్బతిన్న అరటి పంట

మరోసారి సర్వే చేయాలి

జిల్లాలో ఎన్యుమరేషన్ మొక్కుబడిగా సాగింది. వరి, పత్తి, మినుము, అరటి, కూరగాయలు, తమలపాకు తదితర పంటలకు భారీగా నష్టం జరిగింది. ముఖ్యంగా వరి పంట నేలవాలిపోయింది. నేలకు ఒరిగిన వరిని యంత్రాలతో కోసే అవకాశం ఉండదు. కూలీల ఖర్చు కూడా పెరిగే అవకాశం ఉంది. కేవలం 6 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందనడం వాస్తవం కాదు. మరోమారు సర్వే చేయాలి.

– కంచుమాటి అజయ్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

పేద రైతులకు అన్యాయం

ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేశా. మూడు ఎకరాలు పూర్తిగా దెబ్బతింది. అధికారులు ఇంత వరకు కనీసం పంట నష్ట నమోదు కూడా చేయలేదు. నాలాంటి పేద రైతులను పట్టించుకునే వారు లేదు. కనీసం అంచనా కూడా వేయడానికి వారికి తీరిక లేదు. గత ప్రభుత్వంలో రైతుకు ఎంతో ప్రయోజనం చేకూరింది. నేడు అది కరువైంది.

– కోనంకి చెంచయ్య, రైతు, దుగ్గిరాల

ఆశలు అడియాస

తుపానుకు రెండు ఎకరాలు వరి పంట పూర్తి పడిపోయింది. కంకులు తడిపోయి భారీగా నష్టం వాటిల్లింది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లేదు. అధికారుల పరామర్శ కూడా లేదు. రైతులపై ఇంత దారుణంగా వివక్షతను చూపడం తగదు. గత ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేదు.

– గుర్రం శివనాగేశ్వరరావు, రైతు, దుగ్గిరాల

పట్టించుకోని అధికారులు

తుపానుకు దొండ, పొట్ల కాయ తోటలు పూర్తిగా నీట పాలయ్యాయి. రూ.40వేల వరకు ఖర్చయింది. మళ్లీ సాగు చేయాలంటే మరో రూ.30వేలు వ్యయం అవుతోంది. చేతిలో చిల్లి గవ్వ లేదు. అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక వ్యవసాయ అధికారులు పంట నష్టానికి గురైన చేనును పరిశీలించలేదు. మండలంలో పంట నష్టమే లేదంటూ అధికారులు ప్రకటించడం ఆవేదన కలిగించింది.

– రుద్రపాటి ఆదిశేషు, రైతు, ఆలూరు

ఉపాధి నిధులతో పెద్ద చెరువులకు మరమ్మతు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

గుంటూరు వెస్ట్: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల్లో భాగంగా జిల్లాలో పెద్ద చెరువులను గుర్తించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో సమావేశమయ్యారు. పెమ్మసాని మాట్లాడుతూ పెద్ద చెరువులను గుర్తించి వాటిని అందంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పెద్ద చెరువులు నీటి పరిరక్షణకు ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. వాటి వద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని అన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ క్లస్టర్లను ఏర్పాటు చేయించడానికి చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో గల 234 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, కూలీలకు 31 లక్షల పని దినాలను కల్పించినట్లు తెలిపారు. అమృత్ సరోవర్ మొదటి దశలో 74 చెరువులను ప్రారంభించి పూర్తి చేశామని పేర్కొన్నారు. రెండవ దశలో 25 చెరువులను గుర్తించామని, రెండు ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలో 1,40,000 జాబు కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి చేశామని తెలిపారు. 1,498 పంట గుంతలను మంజూరు చేయగా, ఇప్పటి వరకు 242 పూర్తి చేశామని ఆయన చెప్పారు. సమావేశంలో, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి పాల్గొన్నారు.

రీచ్‌ల్లో ఇసుక తోడేళ్లు

- యథేచ్ఛగా తరలిస్తున్న కూటమి నేతలు
- ట్రాక్టర్ల నుంచి 'వసూళ్ల'కు దిగిన మరో వర్గం
- రంగప్రవేశం చేసిన పోలీసులు
- గొడవలు పడితే కేసులు పెడతామని హెచ్చరిక

చింతర్లంక కృష్ణానది నుంచి తరలుతున్న ఇసుక ట్రాక్టర్లు

కొల్లూరు: కూటమి నేతలు చేపట్టిన ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. పగలు, రాత్రి తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా కృష్ణానది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు కూటమి నాయకుల సిఫార్సుల కారణంగా నోరు మెదపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాక్టర్ల నుంచి నగదు వసూళ్లకు మరి కొందరు కూటమి నేతలు పాల్పడుతున్నారు.

బారులుతీరిన ట్రాక్టర్లు

మండలంలోని చింతర్లంక కృష్ణానది వద్ద శనివారం ఉదయం నుంచి ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలింపునకు వందల సంఖ్యలో బారులుతీరాయి. ఇందులో కూటమి నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. టీడీపీకి చెందిన మరో నాయకుడి అనుచరులు నగదు వసూళ్లు చేపట్టారు. ప్రార్థన మందిరం పేరుతో ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తుండటాన్ని కొంతమంది అక్రమ రవాణాదారులు ఆక్షేపించారు. ట్రాక్టర్‌కు రోజుకు రూ. 100 చొప్పున తీసుకోవాలని, ఇసుక లోడ్‌కు వచ్చిన ప్రతిసారి రూ. 100 వసూలు చేయడం సరికాదనడం వివాదానికి దారితీసింది.

అడ్డుకునేవారే లేరాయే..

సమాచారం అందుకున్న కొల్లూరు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి అక్కడ నుంచి నిష్క్రమించారు. సంఘటన ప్రాంతానికి వెళ్లిన పోలీసు యంత్రాంగం ఇసుక అక్రమ రవాణా చేపట్టకుండా మాత్రం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. మరోవైపు వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించారు. కూటమి నాయకులు బాహాటంగానే నగదు వసూళ్లకు పాల్పడినా, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మిన్నకుండటంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెడి'కిల్'పై 12న ర్యాలీ

- ప్రజలు జయప్రదం చేయాలి
- వైఎస్సార్ సీపీ నేతల పిలుపు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మోదుగుల, పోతిన, నూరిఫాతిమా,మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వేమారెడ్డి, అంబటి మురళీకృష్ణ,

పట్నంబజారు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రంగా ప్రజా ఉద్యమ ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ పార్లమెంట్ జిల్లా పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ర్యాలీ పోస్టర్‌లను ఆయనతో పార్టీ జిల్లా పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్, పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, తెనాలి నియోకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబులు పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో కలిసి ఆవిష్కరించారు.

- **ఈ సందర్భంగా మోదుగుల మాట్లాడుతూ** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తానని చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో పెడితే కుప్పంలో ఆయనకి, మంగళగిరి లోకేష్‌కు డిపాజిట్లు కూడా దక్కేవి కావని తెలిపారు. చంద్రబాబు సొంత మనుషులకు కాంట్రాక్ట్ ఇచ్చుకునేందుకే మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నాడని మండిపడ్డారు. ధనవంతులను మరింత ధనవంతులుగా చేయడమే చంద్రబాబు పరిపాలన అని, కచ్చితంగా ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు.
- **పార్టీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్ మాట్లాడుతూ** లక్షలాది రూపాయలు చెల్లించి పేదలు వైద్య విద్య చదువుకునే పరిస్థితి లేకుండా వైఎస్. జగన్‌మోహన్ మెడికల్ కళాశాలను తీసుకుని వచ్చారని, 100 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయమని పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ కలిసి ఇన్ని కళాశాలలు తీసుకుని రాగలరా? అని ప్రశ్నించారు. ఈ నెల 12న జరిగే ర్యాలీలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
- **పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా** మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించిన గొప్ప కుటుంబం వైఎస్సార్‌దేనని పేర్కొన్నారు.
- **పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ** జగనన్న ఆదేశాల మేరకు ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. చంద్రబాబు ప్రైవేటీకరణ ఆలోచన విధానానికి పొన్నూరు నియోజకవర్గానికి చాలా దగ్గర సంబంధం ఉందని ఆరోపించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర భూ బకాసురుడు మాత్రమే కాదని, వైద్య బకాసురుడు కూడా అని మండిపడ్డారు. పొన్నూరు నియోజకవర్గంలో ఇప్పటికే 60 వేలు సంతకాలు పూర్తి అయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్ వలి, కొలకలూరి కోటేశ్వరరావు, మండేపూడి పురుషోత్తం, ఓర్సు శ్రీను, , అనుబంధ విభాగాల అధ్యక్షులు పఠాన్ సైదాఖాన్, గెడ్డేటి సురేంద్ర, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, ఉడుముల పిచ్చిరెడ్డి, సత్తెనపల్లి రమణి, చింతపల్లి రమణ, సూరసారి వెంకటరెడ్డి, దానం వినోద్, అబ్దుల్లాఖాన్, కీసరి సుబ్బులు, ప్రభు, పిల్లి మేరీ, ముంతాజ్, సీడీ భగవాన్, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

ఇసుక లోడింగ్‌కు అనుమతి తప్పనిసరి

సాక్షి ఎఫెక్ట్

కొల్లిపర: సాక్షి దినపత్రికలో శనివారం అక్రమంగా ఇసుక తరలింపుపై 'ఉచితం మాటున అనుచితం' వార్తకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎస్ఐ పి.కోటేశ్వరరావు స్పందించారు.శనివారం మధ్యాహ్నం మున్నంగి ఇసుక రీచ్‌ను తనిఖీ చేసి, అక్కడ లోడింగ్ కోసం ఉన్న ట్రాక్టర్లను పంపించి వేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానికి కూడా మండల ప్రజలు ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకొని, రసీదు పొందాలని తెలిపారు. ఆన్‌లైన్ పనిచేయక పోతే సంబంధి పంచాయతీలో వినియోగదారుడు నిర్మిస్తున్న భవనం వివరాలు అందజేసి, వారి అనుమతితో మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. అక్రమంగా తరలించే వారిపై వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రీచ్ వద్ద మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 800 గరిష్ఠం : రూ. 1,200

మోడల్ ధర రూ. 1,000

క్లుప్తంగా

రూ. 6కోట్లతో నృసింహుని ఆలయ అభివృద్ధి పనులు

మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఈవో సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడతగా రూ. 6 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. శ్రీకృష్ణ దేవరాయ మండపం , యాగశాల, వాహనశాల, ఆగ్నేయం దిక్కున్న బురుజు, ఫ్లోరింగ్, అంతర్గత నిర్మాణాలు జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

స్విమ్మింగ్‌లో జెడ్పీ హైస్కూలు విద్యార్థినులకు పతకాలు

తాడేపల్లి రూరల్: విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన విద్యార్థినిలు పతకాలు సాధించినట్లు స్కూలు ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పాఠశాలకు చెందిన షేక్ నజీరేన్ మూడు బంగారు పతకాలు సాధించి మన రాష్ట్రం నుంచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. మరో విద్యార్థిని షేక్ నస్రీన్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించిందని పేర్కొన్నారు. వీరిద్దరూ తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు ఎం.రవి, నూతక్కి రవి, సతీష్ తదితరులు అభినందించారు. క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

కోలాహలంగా బాలోత్సవ్

పిల్లల అభ్యున్నతి.. జ్ఞాపకశక్తి, సృజనాత్మకత, పరిసరాలపై ఆధారపడి ఉంటుందని నంబూరు వీవీఐటీయూ చాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరులోని విద్యా సంస్థలో ప్రపంచ తెలుగు బాలల పండుగ బాలోత్సవ్-2025 వేడుకలు అద్భుతంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగాయి. చాన్స్‌లర్ విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించేందుకు బాలోత్సవ్ దోహదపడుతుందని తెలిపారు. రెండవ రోజు డిజిటల్ చిత్రలేఖనం, వాద్య సంగీతం, కథా రచన, శాస్త్రీయ నృత్యం, ప్రదర్శన శాల, వక్తృత్వం, జానపద నృత్యం, నాటికలు, జానపద గీతాలు, శాస్త్రీయ సంగీతం, ఏకపాత్రాభినయం, స్పెల్‌బీ, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం, కవితా రచన, లేఖా రచన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. 280 పాఠశాలల నుంచి నాలుగు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 32 వేదికలపై 350 జానపద నృత్యాలు, 54 నాటికలతో పాటు చిన్నారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలు ఆదివారంతో ముగుస్తాయని ప్రో చాన్స్‌లర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.

-పెదకాకాని

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

పెదకాకాని: శంకర కంటి ఆసుపత్రి అదనపు భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. ఆసుపత్రికి సమీపంలో కోగంటి వెంచర్‌లో నిర్మించిన హెలీ ప్యాడ్‌ను తనిఖీ చేశారు. స్థానిక అధికారులకు, ఆసుపత్రి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సీఎం కాన్వాయి రూట్ మ్యాప్‌ను స్థానిక అధికారులు ఆమెకు వివరించారు. ఆమె వెంట జేసీ అశితోష్ శ్రీవాత్సవ్, తహసీల్దార్ పి. కృష్ణకాంత్, పలువురు అధికారులు ఉన్నారు.

టెక్నాలజీతో పాటు నైతికత, మానవత్వం అవసరం

సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

సదస్సులో మాట్లాడుతున్న చలమేశ్వర్

చేబ్రోలు: న్యాయ, పాలనా వ్యవస్థలు ప్రజల అంచనాలకు తగిన విధంగా పనిచేయాలంటే టెక్నాలజీతో పాటు నైతికత, మానవత్వం కూడా అంతే అవసరమని జస్టిస్ చలమేశ్వర్ తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రో బోనో లీగల్ సర్వీసెస్ సహకారంతో ''కృత్రిమ మేధస్సు-సాంకేతిక యుగంలో న్యాయ సహాయం- న్యాయం అందుబాటులోకి తేవడం'' అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ముందుగా యూనివర్సిటీలోని ఎన్టీఆర్ లైబ్రరీలో తన పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెక్షన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఏఐ, టెక్నాలజీ న్యాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులు లేదా న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. న్యాయం అంటే కేవలం చట్టపరమైన అర్థమే కాదు.. అది మానవ మనసు, దయ, సమానత్వం, బాధ్యతల సమ్మేళనం అన్నారు. పేద వర్గాలకు న్యాయ సహాయం చేరేలా అవగాహన కార్యక్రమాలు, సులభ న్యాయసేవలు, డిజిటల్ సదుపాయాలు విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు. ఏఐ, ఆన్‌లైన్ వివాద పరిష్కార వేదికలు న్యాయ ప్రవేశాన్ని విస్తరించగలవని తెలిపారు. టెక్నాలజీ మానవ తీర్పుకు సహాయకంగా ఉండాలి గానీ, దాని స్థానంలోకి రాకూడదని స్పష్టం చేశారు. 2050 నాటికి బయోటెక్నాలజీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో ఊహించలేని అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గా ప్రసాదరావు మాట్లాడుతూ టెక్నాలజీ శక్తివంతమైన సాధనమే గానీ దాని విలువ మానవ సేవలోనే ఉందని చెప్పారు. భారత న్యాయవ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఏఐ, డిజిటల్ సాధనాలు కేవలం సంస్థల సమర్థతకే కాకుండా, ప్రజలకు సహాయకారిగా, సమాన న్యాయం సాధనానికి దోహదపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నా ఇంట్లో చోరీపై కేసు నమోదు

లక్ష్మీపురం: సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కన్నా ఇంట్లో పనిచేస్తున్న తల్లీకుమార్తెలు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. చోరీకి పాల్పడిన తల్లీకుమార్తెలు భయంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడటంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గోప్యంగా చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి పాల్పడిన తల్లీకుమార్తెల పేర్లు, వివరాలు బయటకు రానివ్వకుండా గోప్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇద్దరిలో తల్లి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

పల్లె 'నిద్ర లేచిన' పోలీసులు

- అర్ధరాత్రి మద్యం తాగి అరాచకాలు సృష్టిస్తున్నారంటూ వాపోయిన మహిళలు
- పల్లెనిద్రలో పోలీసుల దృష్టికి 6న జరిగిన సంఘటన
- దాడి చేసిన వ్యక్తుల కోసం విచారణ చేపట్టిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంచనపల్లిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. అక్కడ ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడిన తాడేపల్లి పోలీసులకు వింత అనుభవం ఎదురైంది. ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తూ పోలీసులు ఎటువంటి సమస్యల ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అనడంతో ఆ సభలో ఉన్న కొంతమంది మహిళలు ఓ అంశాన్ని వారి దృష్టికి తెచ్చారు. ఈనెల 6న దళితవాడకు చెందిన ఓ యువకుడిపై కొంతమంది మద్యం, గంజాయి తాగి దాడికి పాల్పడ్డారని, ఫిర్యాదు చేసినా చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. దీంతో పోలీసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. విషయం తమ దృష్టికి రాలేదని మరోసారి ఆ విషయమై ఫిర్యాదు చేయాలని కోరారు. వెంటనే పల్లెనిద్రలో కళ్లు తెరచిన తాడేపల్లి పోలీసులు ఆ దాడికి పాల్పడ్డ ఎనిమిది మందిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదుపులోకి తీసుకున్న వారిలో ఒక వ్యక్తి నిత్యం గంజాయి తాగి గొడవలు చేస్తుంటాడని గ్రామస్తులు తెలిపారు.

ఖాళీ ప్లాట్లలో మద్యపానం

వడ్డేశ్వరం, ఇప్పటం రోడ్డులో ఖాళీ ప్లాట్లలో పలువురు మద్యం తాగి ఒకరిపై ఒకరు దాడిచేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. పల్లెనిద్రలో ధైర్యంగా మహిళల పోలీసులకు జరుగుతున్న సంఘటనపై ఫిర్యాదు చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆరుగురిలో ఇద్దరిని కేసు నుంచి తొలగించాలని కొంతమంది నాయకులు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. పల్లెనిద్రలో వచ్చిన ఈ ఫిర్యాదును పోలీసులు సీరియస్‌గా తీసుకుంటారో లేదా నాయకుల ఒత్తిడికి తలొగ్గుతారో వేచి చూడాల్సిందే !

అందమైన జ్ఞాపకం.. మనస్సులో పదిలం

బీహెచ్ బాలికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థినుల కలయిక

పూర్వ విద్యార్థిని జయలలితకు సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) హిందూ బాలికోన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థినుల వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. వివిధ బ్యాచ్‌లలో హైస్కూల్ నుంచి టెన్త్ వరకు చదివిన వారు హాజరయ్యారు. సహచరులను కలుసుకున్న ఆనందంలో మునిగితేలారు. సంఘ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.లలిత స్వాగతోపన్యాసంతో సమావేశం ప్రారంభమైంది. 1961 నుంచి 1966 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థినులు చింతగుంట సీతామహాలక్ష్మి, చిత్రపు రాధా, దేశిరాజు జయశ్రీ , మన్నవ వరసుబ్బలక్ష్మి, దామరాజు దమయంతి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత వందేమాతర గీతాన్ని ఆలపించారు. ప్రముఖ సినీ నటి, పూర్వ విద్యార్థిని జయలలిత మాట్లాడుతూ తన జీవితానికి దశ, దిశ చూపిన పాఠశాలను ఎన్నటికీ మరువలేనని తెలిపారు. విద్యార్థినిగా పాఠశాలలో గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థినుల సంఘ అధ్యక్షురాలు డాక్టర్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ బీహెచ్ గరల్స్ హైస్కూల్ గుంటూరు నగరానికి కాకుండా రాష్ట్రానికే విద్యాకాంతి దీపమని పేర్కొన్నారు. కార్యదర్శి డాక్టర్ సుమిత్ర మాట్లాడుతూ పూర్వ విద్యార్థినుల సంఘం ద్వారా గతేడాది పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. గ్రంథాలయానికి పుస్తకాల వితరణ, విద్యార్థినులకు యూనిఫాం, స్టేషనరీ అందజేశామని వివరించారు. ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రెండు వర్క్‌షాప్స్ నిర్వహించామని తెలిపారు. వివిధ బ్యాచ్‌లలో చదువుకున్న విద్యార్థినులు పాల్గొని పాఠశాలతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ గోవిందరాజు సాంధ్యశ్రీ, పాఠశాల అధ్యక్షుడు శాంతి భూషణ్, కరస్పాండెంట్ దేశిరాజు సాయి, కోశాధికారి శ్రీదేవి, సభ్యురాలు హరి పార్వతి, మనోరమ పాల్గొన్నారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీకి ఆసియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు

ఆసియా బుక్ ఆఫ్ రికార్డుతో కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర

తెనాలిటౌన్: కాటూరి ఆర్ట్ గ్యాలరీకి ఆసియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కిందని నిర్వాహకులు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గతంలో కాటూరి ఆర్ట్ గ్యాలరీ అమెరికన్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సంపాదించినట్లు చెప్పారు. ఈ పరంపరలో భాగంగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. మున్ముందు ఇలాంటి రికార్డులు మరెన్నో సాధించి ఆర్ట్ గ్యాలరీ శిల్పకళ ద్వారా ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకువస్తామని ఇద్దరూ తెలియజేశారు.

శివాలయంలో కుల సంఘ ఆత్మీయ సమావేశం

ఆలయం బయలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పెదకాకాని: కూటమి పాలనలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయం కల్యాణ మండపం కుల సంఘం ఆత్మీయ సమావేశానికి వేదికగా మారింది. శనివారం సాదినేని వారి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ముఖ్య అతిథిగా అఖిల కర్నాటక కమ్మవారి సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణను ఆహ్వానించారు. ఆలయాల్లో కుల సంఘాల సమావేశాలు ఏర్పాటు చేయడం సబబు కాదని భక్తులు అంటున్నారు. ఆలయ ఆధ్యాత్మిక ప్రతిష్టకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడుందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రానున్న రోజుల్లో కుల సంఘాల సమావేశాలు, సభలు జరగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

పోలీసులు అదుపులో హత్య కేసు నిందితులు ?

దుగ్గిరాల: కన్న తల్లి ముందే కొడుకుని అతి దారుణంగా హత్య చేసిన నీలం నవీన్, అత్తిలి గోపాలకృష్ణలను శనివారం దుగ్గిరాల పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దుగ్గిరాల రైలుపేటలో చికెన్ షాపు నిర్వహించే నవీన్ మృతుడు వీరబాబును వ్యాపారానికి డబ్బులు ఇప్పించమంటూ పదే పదే వేధిస్తున్నాడు. ఇప్పించను అంటూ వీరబాబు కరాఖండిగా చెప్పడంతో నవీన్ కక్ష పెంచుకున్నాడు. మృతుడి కదలికలపై కన్నేశాడు. తల్లితో కలిసి వీరబాబు బయటకు వెళుతుండగా స్నేహితుడు గోపాలకృష్ణతో కలిసి నవీన్ అతి దారుణంగా హత్య చేశాడు. గంజాయి మత్తులో ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం రక్తపు శాంపిల్, వేలిముద్రలు సేకరించింది.

రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది స్టేషన్ సమీపంలో జెండా చెట్టు వద్ద రోడ్డుపై పడి ఉన్నాడు. మృతుడు తెల్ల చొక్కా, నల్ల ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొసైటీ కుంభకోణంలో ఎనిమిది మంది అరెస్ట్

నూజిళ్లపల్లి సొసైటీ భవనం

జె.పంగులూరు: మండలంలోని నూజిళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో మూడేళ్ల కిందట జరిగిన కుంభకోణం కేసులో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారిని శుక్రవారం రాత్రి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజులపాటు రిమాండ్ విధించారని, వెంటనే వారిని ఒంగోలు జైలుకు తరలించినట్లు అద్దంకి సీఐ మల్లికార్జునరావు తెలిపారు. నాడు నూజిళ్లపల్లి పీఏసీఎస్‌లో రూ.2.20 కోట్ల కుంభకోణం జరిగింది. రైతుల డబ్బుతోపాటు బంగారం కూడా మాయమైంది. అప్పటివరకు జిల్లాలోనే ఆదర్శవంతమైన శాఖగా పేరు ఉన్న నూజిళ్లపల్లి సొసైటీ.. అవినీతి కుంభకోణం బయట పడటంతో సంచలనం కలిగింది. దీంతో అప్పటి సొసైటీ అధ్యక్షుడు పెంట్యాల భద్రయ్య, సీఈఓ అద్దంకి రవిబాబు, స్వీపర్‌గా ఉండి ఎరువుల అమ్మకం బాధ్యతలు చూసిన చెరుకూరి శివప్రసాద్‌తో పాటు మరికొంత మందిపై '51వ ఎంక్వైరీ' (విచారణ పేరు) కోసం అధికారులను నియమించారు. మూడు సంవత్సరాలుగా పరిశీలించిన అధికారులు కేసు నమోదు చేయించారు. నిందితులు పెంట్యాల భద్రయ్య, అద్దంకి రవిబాబు, చెరుకూరి శివప్రసాద్, త్రీమ్యాన్ కమిటీలో సభ్యులు అయిన కొండ్రగుంట రవిబాబు, మద్దినేని సుబ్బరామయ్య, మద్దినేని నగరాజ కుమారి, పాలపర్తి పోతురాజుతో పాటు మరో వ్యక్తిని శుక్రవారం అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు అరెస్టు చేశారు. మరో వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిసింది.

గుంటూరు నగరపాలక సంస్థ

పత్రికా ప్రకటన

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో PMAY(U) NTR Nagar అడవి తక్కెళ్ళపాడు మరియు వెంగళాయపాలెం నందు ఎ.పి. టిడ్కో గృహ పథకములో భాగముగా 3408 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు కేటాయించడం జరిగింది. వివిధ కారణముల వలన (వయసు పైబడి ఉండుట / CIBIL స్కోర్ తక్కువ ఉండుట / లబ్ధిదారు మరణించియుండుట / Not Traced / వలసపోవుట మరియు ఆసక్తి చూపకపోవుట) బ్యాంకు వారు ఋణం ఇచ్చుటకు తిరస్కరించిన 897 మంది లబ్ధిదారులకు GOMs No.39, MA & UD Department, తేది. 12.03.2025 ప్రకారం నోటీసులు జారీచేసి మీ కుటుంబంలో అర్హత గల కుటుంబ సభ్యుల పేర్లు సిఫార్సు చేయవలెను. అట్లు కాని పక్షంలో మీ ప్లాట్లు రద్దు చేసి కొత్త లబ్ధిదారులకు ప్లాట్ కేటాయించబడునని నోటీసు జారీ చేయగా వారిలో కొంత మంది మా యొక్క అర్హతని బట్టి బ్యాంకు ఋణం నకు సిఫార్సు చేయమని, కొంత మంది లబ్ధిదారులు బ్యాంకు ఋణంనకు సంబంధించిన మొత్తం డైరెక్ట్ పేమెంట్ ద్వారా చెల్లించుటకు సమయము ఇవ్వాలని వాయిదాల రూపంలో చెల్లించడానికి కమిషనర్ గారికి విన్నవించియున్నారు.

చివరగా కొంత మంది అనగా 120 మంది లబ్ధిదారులు ప్లాట్లు తీసుకొనుటకు ఆసక్తి లేదని రద్దు చేయమని, 27 లబ్ధిదారులు వలస పోవుట, 35 మంది లబ్ధిదారులు ఆచూకీ లేకపోవుట మరియు 53 మంది లబ్ధిదారులు పంపిన నోటీసులకు ఏ విధమైన సమాధానము ఇవ్వని కారణముగా వెరసి మొత్తం 235 లబ్ధిదారుల ప్లాట్లను GOMs No. 39, MA & UD Department, తేది. 12.03.2025, SOP అనుసరించి వారి ప్లాట్ కేటాయింపును రద్దు పరిచి, సదరు ప్లాట్లను అర్హత గల కొత్త లబ్ధిదారులకు కేటాయించవలసియున్నది మరియు రద్దు పరిచే లబ్ధిదారుని పేరు, బ్లాక్ మరియు ప్లాట్ నెంబర్ వివరాల జాబితాను గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గల 208 సచివాలయాల నోటీసు బోర్డు నందు ఉంచబడినది.

కావున 235 మంది లబ్ధిదారుల జాబితా పై ఏమైనా అభ్యంతరములు ఉన్నచో, సదరు విషయాన్ని లిఖిత పూర్వకముగా నగరపాలక సంస్థ కార్యాలయమునకు తేది. 15.11.2025 సాయంత్రం 4.00 గంటల లోపు (కార్యాలయ పని వేళలలో) అందజేయవలసినదిగా తెలియజేయడమైనది.

సం/- కమిషనర్
నగర పాలక సంస్థ, గుంటూరు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ గుంటూరుసిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజ మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర: జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. 9492770739

■ గుంటూరు మిర్చి యార్డ్ ప్రక్కన చిలకలూరిపేట రోడ్డు నందు 1530 గజాలు, ఆర్.సి.సి. గోడౌన్ అమ్మకానికి కలదు. ✆ 9848752471

■ Sale : Around 275Sq.Yds Vacant SITE very close to new Main Road of AT Agraharam, 14th Lane, Guntur. 8142438370

HOUSE FOR SALE

■ తెనాలి ఐతానగర్ గోలి డొంక వాటర్ ప్లాంట్ రోడ్డు ఉత్తరం ఫేసు పూర్తి వాస్తు ఇండిపెండెంట్ హౌస్ అమ్మకం. రాఘవ: 91333 91224

■ పొన్నూరు రోడ్ పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌కు 200 మీ.ల దూరంలో తూర్పు ఫేస్ గల 272 చ।। గ।। ల 2 అంతస్తుల ఇల్లు అమ్మకానికి కలదు. అద్దె 45,000 వచ్చును. ఇంటిముందు 100 అ।।ల రోడ్ ఉంది. సంప్ర: 6302727534

OLD BUILDINGS

■ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు పాత ఐరన్ కొనబడును. సంప్ర।। 97032 90782, 9700442419

PLOTS FOR SALE

■ 9.33 cents Plot for Sale. Second bit from Road, RTC Colony, Kothapeta, Chirala. Ph : 99596 73790 (Call Upto 7.00 PM only)

TOLET COMMERCIAL

■ గుంటూరు అమరావతిరోడ్ హోసన్న మందిర్ ఎదురు పెట్రోల్ బంక్ ప్రక్కన మెయిన్ రోడ్ ఫేస్ 100గ।। స్థలము షాపులకు కమర్షియల్ పర్పస్‌కు అద్దెకు కలదు. సంప్ర।। 91337 20722

SERVICES

■ Leak Proof Work 100% గ్యారంటీ స్లాబ్ లీకేజీలు, వాష్ ఏరియా వాష్ రూమ్ లీకేజీలు అపార్ట్‌మెంట్‌లు రీమోడలింగ్ చేయబడును. 7075558363

■ ప్రముఖ బ్యాంకుల నందు గల హౌసింగ్ లోన్‌లు మా యొక్క బ్యాంకుకు టేక్ ఓవర్ చేయబడును & కొత్త లోనులు చేయబడును కమీషన్ అవసరం లేదు. & DSAలు కావలెను. కమిషన్ వెంటనే ఇవ్వబడును. సంప్ర: 8121847536, 9966617161

WANTED

■ 10th చదివిన షాప్‌లో డెలివరీ బాయ్స్ మరియు Tally అనుభవం కలిగి సేల్ డేటా ఎంట్రీతో పాటు గుమస్తా వర్క్ చేయుటకు కావలెను. 8142842888, 8639348560

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Computer Operator గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Any Degree, 55 Wpm Typing Speed, MS Office Skills, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ మా సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ లేడీస్ కావలెను. 10th పాస్/ ఫెయిల్ to PG, ఫోన్: 73307 11162

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35000/- నుండి 45000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ గుంటూరులోని రెస్టారెంట్‌లో పని చేయుటకు అనుభవం గల కెప్టెన్స్, వెయిటర్స్ కావలెను. మంచిజీతం రూమ్ + భోజనం ఫ్రీ. సంప్ర: 94936 80998

■ మంగళగిరి తాడేపల్లి పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. భోజనం సౌకర్యం కలదు. Q:10th, 50సం।। లోపు వారు సంప్ర: 7337420359, 8500025995

■ రామకృష్ణ గ్రూప్ (AP No-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ16-18వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 9603203355, 8247500574.

■ రామకృష్ణ గ్రూప్ (AP No-1), HYD, VJA, Delhiకు టెలీకాలర్స్, కస్టమర్‌కేర్, అన్ని రకాల ఆఫీస్ స్టాఫ్ (స్త్రీ/పు) కావలెను. భో+వ+జీతం. ఇంటర్వ్యూ: VJA. ✆ 9502501122, 9676901122

■ 7Hills ఆఫీసు నందు వర్క్ చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ లేడీ ఎంప్లాయిస్ కావలెను. మంచి జీతం, 35సం।।లోపు. గుంటూరు. సంప్ర।। 7288877785

■ వేదం ఓల్డ్ ఏజ్ హోమ్ తక్కెళ్ళపాడు వృద్ధులకు సేవ చేయుటకు అనుభవం కలిగిన వర్కర్ వంట మనిషి కావలెను. భార్య భర్తలు. 7780791297, 9642791297

■ కేర్ టేకర్స్ (జీతం: మగ 20 వేలు; ఆడ 18 వేలు), నర్సులు (25 వేలు). పేషంట్ ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కావలెను. Eminence హోమ్ కేర్ విజయవాడ. ✆ 97018 57559, 78158 35561

■ GVK సంస్థ నందు గుంటూరు జిల్లాలో లేడి టెలికాలర్స్ కావలెను. మంచి శాలరీ కలదు. Cont: 8340855728, 7730997214

■ ప్రముఖ ఫైనాన్స్ అనుబంధ సంస్థనందు పని చేయుటకు అనుభవం కలిగిన టెలికాలర్స్ & మార్కెటింగ్ ఏజంట్స్ కావలెను. Q: ఇంటర్ /డిగ్రీ, Sal: 9000/- + Inc.✆ 95051 77327

■ గుంటూరు జిల్లా "వన్ లైఫ్ - వన్ కార్డ్" హెల్త్ కేర్ కంపెనీలో 1. హెల్త్ కార్డ్ ప్రమోషన్ కొరకు (కనోపిటెంట్ / Canopy Tent), 2.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, 3.ప్రొక్యూర్మెంట్ మేనేజర్లుగా పని చేయుటకొరకు (స్త్రీలు/ పురుషులు) ఉద్యోగులు కావలెను. అర్హత : 10th/ ఇంటర్ / డిగ్రీ. సంప్రదించగలరు : 9030150481, 9494022442

■ కేర్ టేకర్స్ (మెడికల్) జీతం 18వేలు, ఇంటివంట 18 వేలు, వార్డెన్స్ డిగ్రీ పి.జి. జీతం 18వేలు, రిసెప్షనిస్ట్ జీ: 18 వేలు, భోజనం వసతి కలదు. 98854 26486

■ తెనాలి దగ్గర, దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 80961 61777, 70939 24466.

■ అమరావతిలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. 9346138743, 8008202789

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671

■ ప్రొద్దుటూరులో నూతన హోటల్ నందు పనిచేయుటకు టీ, టిఫిన్ మరియు మీల్స్ మాస్టర్స్ కావలెను. ✆ 63050 48902

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నేడు వేమవరంలో రుద్రహోమం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం మహారుద్రహోమం నిర్వహించనున్నట్లు అర్చకులు గడియారం అయ్యన్నశాస్త్రి శనివారం తెలిపారు. కార్తిక మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున పదిమంది రుత్వికులతో నాలుగు యాగ గుండాలు ఏర్పాటు చేసి హోమం నిర్వహిస్తామన్నారు. హోమ పూజల్లో సుమారు 20 మంది దంపతులు పాల్గొంటారని చెప్పారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేస్తామని తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరగనున్న కార్తిక వన సమారాధన ఏర్పాట్లను సంఘం ఆర్గనైజింగ్ కన్వీనర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటం మామిడితోటలో మంగళగిరి నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో లచ్చి తులసీదాస్, తాత కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్.. కార్మికుల సమస్యపై స్పందించాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై మంత్రి నారా లోకేష్ స్పందించాలని యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శనివారం దీక్షా శిబిరాన్ని కార్మిక నాయకులు ఆశీర్వాదం, బి.అంకయ్య, నాగేశ్వరరావు, గురవయ్యతో కలసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 340వ రోజుకు చేరుకున్నాయని, ఇప్పటికైనా కార్మిక వర్గ సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వంపై బాధ్యత ఉందని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. దీక్షలో సువర్ణ, శారద, రమణమ్మ, లక్ష్మి, బేబమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, సుబ్బారావు, సూర్యప్రకాష్, సుభాని, మాణిక్యరావు, రమాదేవి, ఇమాంబి, శారమ్మ, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో వద్ద రిలే దీక్షలు

మంగళగిరి టౌన్: ఆర్టీసీ డిపో వద్ద రిలే దీక్షలు జరుగుతున్నాయి. 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా ఒక కేసుకు ఒక పనిష్మెంట్ ఉన్న విధానాన్ని మార్చి రెండు పనిష్మెంట్లు ఇవ్వడం సరికాదని ఎన్ఎంయూఏ నేతలు అన్నారు. నిరసనగా మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ 25 రోజులుగా పోరాటాలు చేసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. అందుకే దీక్షలు ప్రారంభించినట్లు చెప్పారు. అక్రమంగా వేరే డిపోకు ట్రాన్స్‌ఫర్ చేసిన డ్రైవర్‌ను తిరిగి ఇదే డిపోకు డ్యూటీకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్క్యులర్ ప్రకారం పనిష్మెంట్ ఇవ్వాలే కానీ వేరే డిపోలకు బదిలీచేయడం మానుకోవాలన్నారు. ఇప్పటికైనా అధికారులు, మేనేజ్‌మెంట్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంగళగిరి డిపో కమిటీ సభ్యులు, ఎన్ఎంయూఏ నేతలు పాల్గొన్నారు.

ఎల్వోసీలు అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణపరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి స్థానిక టీడీపీ నాయకులు శనివారం ఎల్ఓసీలను అందజేశారు. తాడేపల్లి పరిధిలోని చల్లా వెంకటేశ్వర్లుకు రూ.2 లక్షలు, సైదావలికి రూ.1.50 లక్షల విలువైన ఎల్వోసీలు ఇచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తాడేపల్లి రూరల్: స్థానిక సలాం హోటల్ సెంటర్‌లో ఓ వ్యక్తి కనిపించడం లేదంటూ అతని భార్య తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సలాం హోటల్ సెంటర్‌లో మట్టిపని చేసుకుంటూ నివసించే గుంజి చిన నరసింహ నెల రోజుల క్రితం మద్యం సేవించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం భార్య రమణ, కుటుంబ సభ్యులు, బంధువులు ఇతర ప్రాంతాల్లో వెదికినా ఎటువంటి ఉపయోగం లేదు. దీంతో ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు నరసింహ కోసం పోలీస్ వెబ్‌సైట్‌లో ఆయన వివరాలను పొందుపరచి విచారణ చేస్తున్నారు.

కోటి సంతకాలతో
ప్రైవేటీకరణను అడ్డుకుందాం

వైఎస్సార్ సీపీ నేతలు

ఆత్మకూరులో సంతకాల సేకరణలో వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి టౌన్: కోటి సంతకాలు సేకరించి ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందామని మంగళగిరి మండల పరిధిలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. ఆత్మకూరు కొత్త దళిత వాడలో గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదేశాల మేరకు శనివారం రాత్రి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అయితే ఎంత నష్టపోతామనేది వివరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ప్రజలకు మేలు చేసే మెడికల్ కాలేజీలను కాపాడుకునే వరకు పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించే మహోన్నత లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఆర్‌టై విభాగ మండల అధ్యక్షులు రాంబాబు, గ్రామ ఉపాధ్యక్షులు విజయ్, యూత్ అధ్యక్షులు జాలాది ప్రేమ్‌చంద్, గ్రామ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, బొమ్మ కిషోర్ రెడ్డి, గ్రామ సోషల్ మీడియా అధ్యక్షులు బుజ్జిబాబు, వాలంటరీ విభాగ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు వెంకటేష్, రత్నకోటి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి నగర పరిధిలో..

మంగళగిరి నగర పరిధిలోని బాప్టిస్ట్ పేటలో వార్డు అధ్యక్షులు వసంతరావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యం కుదేలైందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సోషల్ మీడియా అధ్యక్షులు నందిగం ఆకాష్, పట్టణ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కలకోటి చక్రి, వార్డు జనరల్ సెక్రటరి సందీప్, నాయకులు చిననాగయ్య, రమేష్, రాఖీ, యశ్వంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి పట్టణ పరిధిలోని బాప్టిస్ట్ పేటలో..

మండల పరిధిలో..

మంగళగిరి మండల పరిధిలోని చినకాకానిలో గ్రామ అధ్యక్షులు మల్లవరపు కాంతారావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర నాయకులు నూతక్కి జోష్, గ్రామ కమిటి ఉపాధ్యక్షులు రామనాగు, సెక్రటరి చిన్న, ప్రధాన కార్యదర్శి గోపి, నాయకులు గోపాలకృష్ణ, నరేంద్ర, హేమకుమార్, వెంకటేశ్వరరావు, రమేష్, ప్రసాద్, చిన్నోడు, కాటంరాజు, రామమోహన్, సాంబశివరావు, నాగేశ్వరరావు, శ్యామ్, సంగమేశ్వరరావు, నాగరాజు, షిర్డీసాయి, నాగలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చినకాకానిలో సంతకాల సేకరణ..

మాట్లాడుతున్న బాల వజ్రబాబు

పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం

బూత్ కమిటీ కన్వీనర్ల విస్తృత సమావేశంలో ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు

తాడికొండ: క్రియాశీలకంగా పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం తప్పక ఉంటుందని, పార్టీ పూర్వ వైభవానికి వారు వారధులుగా పనిచేసి బలోపేతం చేయాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. శనివారం గుంటూరు మల్లికార్జునపేటలోని తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ కన్వీనర్ల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ కన్వీనర్లు క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో స్థానికులతో మమేకమై ముందుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకొని వారి అవసరాలను గుర్తించి పని చేయాలని సూచించారు. బూత్ కమిటీల కన్వీనర్లు వారి వారి పరిధిలోని ఓటర్లను కలవడం సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావడం ద్వారా ఎన్నికల నాటికి పటిష్టమైన వ్యవస్థను బలోపేతం చేయవచ్చన్నారు. ఇందుకు వారి సంపూర్ణ సహకారం అవసరమని, తాను అందుబాటులో ఉంటానని అవసరమైన వారు సంప్రదించాలని సూచించారు. తాడికొండ నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉంది అనేందుకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పార్టీగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేసిన బాటలే నేడు ఈ ప్రజా ప్రభంజనం అన్నారు.

చేతులు దులుపుకొంటున్న కూటమి

కల్లబొల్లి మాటలతో అలవి కాని హామీలిచ్చిన చంద్రబాబు నేడు ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చకుండా అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నాడని, ప్రజా సమస్యలపై ప్రణాళికా బద్ధంగా పోరాటం చేసి ప్రజలకు ఆ ఫలాలు అందజేసే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో 4 మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, తాళ్ళూరి వంశీకృష్ణ, మైనేని నాగ మల్లేశ్వరరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఉడుముల పిచ్చిరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు చావలి రంజిత్, 4 మండలాల బూత్ కమిటీ అధ్యక్షులు దామనబోయిన వెంకటేశ్వరరావు, కాకి శ్రీకాంత్, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, బిళ్ళా లూర్థయ్య, జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, ముప్పాళ్ళ మనోహర్, కల్లం హరికృష్ణారెడ్డి, చుండు వెంకటరెడ్డి, బేతపూడి రాజేంద్ర, ఆరేపల్లి జోజి, కొప్పుల శేషగిరిరావు, ఐనవోలు సుధీర్, డీజే శ్రీనివాసరావు, కంచర్ల రాజు, కాకి శ్రీ కాంత్, యశ్వంత్, కుర్రా హరిబాబు, షేక్ నాసర్ వలి (అబ్బాస్), ముత్యాల బాలస్వామి, కొరివి కిషోర్, రసూల్, సుభానీ, కొరివి చెన్నయ రబ్బాని, శివరామకృష్ణ, బుడే పలువురు నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

నిర్మాణాలు... అధికారులకు తప్పని తిప్పలు

ట్యాంకర్లతో మురుగునీరు తరలింపు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని కార్పొరేషన్‌లో శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. దానికి తగ్గట్లు కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు జరగకపోవడం అధికారులకు తిప్పలు తప్పడం లేదు. కార్పొరేషన్‌కు ఆర్థిక భారం తప్పడం లేదు. జాతీయ రహదారి వెంట సర్వీస్ రోడ్లు నిర్మాణం చేపట్టే సమయంలో ప్రణాళికాబద్ధంగా నిర్మించకపోవడం, రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలు అతివేగంగా జరుగుతున్నాయి. దీంతో వాడుక నీరు, వాన నీరు డ్రెయిన్లలోకి చేరుతున్నా అవి వెళ్లే దారి లేక దుర్వాసన వెదజల్లుతోంది.

అప్పుడప్పుడు..

కార్పొరేషన్ అధికారులు ఎప్పుడో వీవీఐపీలు పర్యటించినప్పుడు, లేదా ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ డ్రైన్లలో ఉన్న మురుగునీరును ట్యాంకర్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు. గత 20 ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో ఆ ప్రాంతంలో నివసించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట దగ్గర నుంచి కుంచనపల్లి వరకు, మణిపాల్ హాస్పిటల్ నుంచి కుంచనపల్లి, రేవేంద్రపాడు రోడ్డు వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

కాలువను ఆక్రమించి నిర్మించడంతో..

ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ రాష్ట్ర కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో బహుళ అంతస్తులు శరవేగంగా నిర్మాణం జరుగుతున్నాయి. ఒక్కొక్క అపార్ట్‌మెంట్‌లో 50 నుంచి 150 ప్లాట్లు ఉండడంతో ఆ అపార్ట్‌మెంట్ల నుండి ప్రతిరోజూ వేలాది లీటర్ల మురుగునీరు డ్రైనేజీలోకి వచ్చి చేరుతోంది. గతంలో నిర్మాణం చేపట్టే టప్పుడు పంట పొలాలను నివాస స్థలాలుగా రెగ్యులరైజ్ చేసే సమయంలో వాటిలో ఉన్న పంట కాలువలను, డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఈ పరిస్థితి నెలకొందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా మంత్రి సలహాలు సూచనలు తీసుకుని జాతీయ రహదారి వారితో మాట్లాడి పక్కా డ్రైన్లు ఏర్పాటు చేసి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుకుంటున్నారు. అలా చేస్తే కార్పొరేషన్ అధికారులకు పనితో పాటు ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంటుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



మురుగు తోడుతున్న సిబ్బంది

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

దుగ్గిరాల: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన వివిధ అంశాలపై 16 మంది ఉపాధ్యాయులకు రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ రెండు రోజులు అందించినట్లు ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ ఉన్నం ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలోని తరగతి గదిలో బోధనా పద్ధతులు, నైపుణ్యాలను మెరుగు పరచుకోవడానికి అవసరమైన సమాచారాన్ని అందించామన్నారు. తరగతి గదిలో బోధనా నాణ్యతను పెంపొందించడానికి 2021 జాతీయ విద్యా విధానం అనుసరించి శిక్షణ అందించామని తెలిపారు. కార్యక్రమంలో చలపతిరావు, బి.వి. కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ ఈనెల 20న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం మహాధర్నాకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశంలో రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడిచేసినట్లేనని రాజ్యాంగ విలువలను రక్షించడంలో ప్రతి పౌరుడికి బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ నాగరాజు, ఇతర నేతలు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మజూరి పెంచాలి

మంగళగిరి టౌన్: మంగళగిరిలో పని చేస్తున్న చేనేత కార్మికులకు మజూరి పెంచాలని చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ మాస్టర్ వీవర్స్ అసోసియేషన్‌ను కోరనున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మండపంలో శనివారం చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేనేత కార్మికుల మజూరి రెండేళ్లకొకసారి పెంచాలన్న డిమాండ్‌తో ఉద్యమం ముమ్మరం అవుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో మాస్టర్ వీవర్స్ అసోసియేషన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈనెల 19వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో కొత్త మజూరి ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు కొనసాగుతున్నట్లు తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన ముడి సరుకు ధరలు, జీవన వ్యయాలను పరిగణనలోకి తీసుకుని చేనేత కార్మికులకు కనీసం 40 శాతం మజూరి పెంచాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఈ నెల 12న పాత మంగళగిరి భావనారుషి గుడి వద్ద నుంచి చేనేత కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు, అనంతరం మాస్టర్ వీవర్స్ అసోసియేషన్‌కు మెమోరాండం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, ధనుంజయరావు, పూర్ణచంద్రరావు, రామారావు, కోటేశ్వరరావు, గిరి, ఈశ్వరరావు, బాల తేడేరు, వెంకటేశ్వరరావు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

ఉచిత ప్రసాద వితరణకు రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఉచిత ప్రసాద వితరణ పథకానికి గుంటూరు జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన పోలవరపు వెంకట సాయి మనోజ్ చౌదరి, నీరజల పేరిట కుటుంబ సభ్యులు రూ. 1,00,501 విరాళాన్ని ఆలయ అధికారికి అందచేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

నేడు నిరసన ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 12న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళగిరిలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరగనున్నట్లు శనివారం మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ఆదివారం ఉదయం 10 గంటలకు మంగళగిరి ఆత్మకూరు బైపాస్‌రోడ్ వెంట ఉన్న నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిరసన ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు హాజరు కానున్నారని, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సెంట్రింగ్ తొలగింపు

తెనాలిఅర్బన్: కొత్తపేటలో అనాధికారికంగా పెంట్‌హౌస్‌ను నిర్మించేందుకు పెట్టిన సెంట్రింగ్‌ను శనివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ ప్రాంతంలో పర్యటించిన సమయంలో అనాధికారికంగా పెంట్ హౌస్‌ను నిర్మించడాన్ని ఆయన గమనించారు. దానిని తొలగించాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు సెంట్రింగ్‌ను తొలగించి ఎటువంటి నిర్మాణాలు జరపవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

కొల్లిపర: మండల బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యాన మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో పవిత్ర కృష్ణానది తీర ప్రాంతంలోని లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయం వద్ద బ్రాహ్మణ కార్తిక వన సమారాధన శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తిక దామోదర ప్రీత్యర్థం శ్రీరమాసహిత సత్యదేవుని వ్రతం, కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోగుల రామలింగేశ్వర శర్మ, ఉరుత సూర్యనారాయణ , పరాశరం జగన్నాథచార్యులు, కల్వకొల్లు వీరభద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించండి

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఎయిమ్స్ హాస్పిటల్ కార్మికులకు ఎరియర్స్ చెల్లించాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డులకు, కార్మికులకు వెంటనే ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో ఎయిమ్స్ గేటు వద్ద నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం శనివారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎయిమ్స్ యాజమాన్యం గతంలో పనిచేసిన కార్మికులకు ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా యాజమాన్యం అమలు చేయలేదని విమర్శించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలాజీ, బుజ్జిబాబు, రవి, ఎ. శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో కార్మికులు

సర్టిఫికెట్లు అందజేత

తాడేపల్లి రూరల్: ఐద్వా ఆధ్వర్యంలో కంప్యూటర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి మాట్లాడుతూ విద్యతోనే సమాజ వికాసం సాధ్యమన్నారు. కేవలం పుస్తకాల బట్టీపట్టడంతో సరిపెట్టుకోకుండా విద్యార్థులు సమాజంలో జరుగుతున్న విషయాలు తెలుసుకోవాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం బాధ్యులు ఉష తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు డ్రెస్సింగ్ మెటీరియల్ పంపిణీ

దుగ్గిరాల: కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయుక్తమైన డ్రెస్సింగ్ మెటీరీయల్‌ను గ్రేట్‌నాల్టెస్ ఆస్పత్రి డైరెక్టర్ హేమచందు అందజేశారు. శనివారం దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలోని గ్రేట్‌నాల్టెస్‌లో 30 మంది వ్యాధిగ్రస్తులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారికి డ్రెస్సింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉదయమార్కు, గ్రేటనాల్టెస్ వైద్య బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మేడికొండూరు విద్యార్థులు

మేడికొండూరు: చెరువు జమ్ములపాలెంలో ఇటీవల నిర్వహించిన అండర్ 17 హాకీ ఎంపికల్లో మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ కబర్చారు. రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల విభాగంలో ఎల్.శ్రామిక, ఎల్ గ్లోరీ, సిహెచ్ గీతా సింధు, బి రోషినిలు ఎంపికయ్యారు. బాలురు విభాగం ఎం కార్తీక్, వై పంకజ్ కుమార్, బి నాగచైతన్య ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. జయప్రద మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు వాణి సుశీల శిక్షణతో విద్యార్థులు సత్తా చాటారన్నారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం జయప్రద

APPEAL TO PUBLIC

We **M/s Viswa Infra**, has proposed to construction Project of Residential Apartments at Sy.No. 172 (P), Ippatam village, Under Mangalagiri-Tadepalli Municipal Corporation Limits, Guntur District, Andhra Pradesh for which State Environmental Impact Assess ment Authority (SEIAA), Andhra Pradesh has accorded Environ mental clearance Vide Letter No: SEIAA/AP/INFRA2/GNT/09/2025/1859/274.09&275. 05 dated 06-11-2025.The copy of the clearance letter is available with the State Pollution Control Board, Vijayawada / SEIAA, Andhra Pradesh.

By M/s Viswa Infra., Mangalagiri, Tadepalli Municipal Corporation, GUNTUR

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

గూగుల్ ప్లే స్టోర్‌లో హానికర యాప్స్!

ఇన్‌స్టాల్ చేసుకున్న కోట్లాది మంది యూజర్స్

భారత్ లక్ష్యంగా సైబర్ నేరగాళ్ల మొబైల్ దాడులు

ప్రపంచంలో పెరుగుతున్న ఆండ్రాయిడ్ మాల్వేర్

వెల్లడించిన స్కేలర్ థ్రెట్‌ల్యాబ్జ్ తాజా నివేదిక

అత్యధిక మొబైల్ మాల్వేర్ దాడులకు గురి అవుతున్న దేశాలు

దేశం	మొత్తం దాడుల్లో(%)
భారత్	26
అమెరికా	15
కెనడా	14
మెక్సికో	5
దక్షిణాఫ్రికా	4

ఐఓటీ మాల్వేర్ దాడులు ఎక్కువగా జరుగుతున్న దేశాలు

దేశం	మొత్తం దాడుల్లో(%)
అమెరికా	54
హాంకాంగ్	15
జర్మనీ	6
భారత్	5
చైనా	4

ఆండ్రాయిడ్ వాయిడ్ మాల్‌వేర్ 16 లక్షల ఆండ్రాయిడ్ ఆధారిత టీవీ బాక్స్‌లకు సోకింది. ప్రధానంగా భారత్, బ్రెజిల్ దీని బారినపడ్డాయి.

రిమోట్ యాక్సెస్ ట్రోజన్ (ఆర్‌పటీ), ఎక్స్‌నోటీస్ మాల్వేర్స్ చమురు, సహజవాయువు పరిశ్రమలో ఉద్యోగార్థులను లక్ష్యంగా చేసుకున్నాయి.

సాక్షి, స్పెషల్ డెస్క్: టెలికం కంపెనీల దూకుడుతో దేశంలో ఇంటర్నెట్ సేవలు పల్లెలకూ చేరాయి. ఇంకేముంది టెక్నాలజీ వినియోగం అంతకంతకూ పెరుగు తోంది. ఇదే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఆయుధమైంది. హానికరమైన సాఫ్ట్‌వేర్లతో మొబైల్, కంప్యూటర్లలోకి చొరబడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆండ్రాయిడ్ మాల్‌వేర్ పెరుగుతోంది. ఈ ముప్పు ఒక్క భారత్‌కే కాదు.. అభివృద్ధి చెందిన దేశమైన అమెరికాకు సైతం ఇది తలనొప్పిగా పరిణమించింది.

239 మాల్‌వేర్ యాప్స్..

క్లౌడ్ సెక్యూరిటీ కంపెనీ స్కేలర్ థ్రెట్‌ల్యాబ్జ్ 2025 మొబైల్, ఐఓటీ, ఓటీ థ్రెట్ నివేదిక ప్రకారం 2024 జూన్ నుంచి 2025 మే మధ్య గూగుల్ ప్లే స్టోర్‌లో 239 హానికరమైన అప్లికేషన్లు (మాల్‌వేర్) వచ్చి చేరాయి. అంతర్జాతీయంగా మొత్తం 4.2 కోట్ల మంది వాటిని ఇన్‌స్టాల్ చేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. ఆండ్రాయిడ్ మాల్‌వేర్ దాడులు గతేడాదితో పోలిస్తే 67 శాతం పెరిగాయి. అయితే స్మార్ట్‌ఫోన్లపై దాడులకు సైబర్ నేరగాళ్లు ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌ను ఎంచుకున్నారని నివేదిక వెల్లడించింది.

ఏమిటీ మాల్‌వేర్?

మాల్‌వేర్ అనేది హానికరమైన సాఫ్ట్‌వేర్. ఇది కంప్యూటర్ సిస్టమ్స్‌కు హాని, డేటాను దొంగిలించేందుకు.. అనధికారికంగా మొబైల్, కంప్యూటర్‌లోకి చొరబడేందుకు సైబర్ నేరస్తులు రూపొందించిన ఒక ప్రోగ్రామ్. ఇది కంప్యూటర్ పనితీరులో అంతరాయంతోపాటు ఇతర నష్టాన్ని కలిగిస్తుంది.

మొబైల్ చెల్లింపులు లక్ష్యంగా..

గూగుల్ ప్లే స్టోర్ ప్లాట్‌ఫామ్‌లో ఉత్పాదకత, ఆటోమేషన్, టాస్క్, డేటా మేనేజ్‌మెంట్, కస్టమైజేషన్ వంటి హైబ్రిడ్, వర్క్‌ఫ్లో యాప్స్ కోసం వెతుకుతున్న వినియోగదారులే లక్ష్యంగా మాల్‌వేర్ దాడులు జరిగాయని నివేదిక వెల్లడించింది. టూల్స్ విభాగంలో చేరిన ఈ హానికరమైన యాప్స్ వినియోగదారులను ఎక్కువగా తప్పుదోవ పట్టిస్తున్నాయని వివరించింది. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ పేమెంట్ల జోరు కొనసాగుతుండటంతో కార్డు-కేంద్రీకృత మోసాలకు బదులుగా సైబర్ నేరగాళ్లు మొబైల్ చెల్లింపులను లక్ష్యంగా చేసుకున్నారని తెలిపింది. యూజర్ల కార్యకలాపాలను రహస్యంగా పర్యవేక్షించి సమాచారాన్ని దొంగిలించే స్పైవేర్, ఆర్థిక మోసాల కోసం ఉపయోగించే బ్యాంకింగ్ మాల్‌వేర్ పెరగడం వల్లే ఆండ్రాయిడ్ మాల్‌వేర్ దాడులు అధికమయ్యాయని నివేదిక వివరించింది.

మూడు ప్రధాన ప్రాంతాల్లో..

ప్రపంచవ్యాప్తంగా మొబైల్ బెదిరింపులు మూడు ప్రధాన ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉన్నాయని నివేదిక వివరించింది. ఇందులో 26% వాటాతో అత్యధిక కార్యకలాపాలు భారత్‌లో జరుగుతున్నాయి. అంతక్రితం సంవత్సరంతో పోలిస్తే మొబైల్ బెదిరింపు దాడులు భారత్‌లో 38% ఎక్కువయ్యాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) దాడులకు అమెరికా కేంద్రంగా ఉంది. ఐఓటీ ఆధారిత మాల్‌వేర్ కార్యకలాపాల్లో అమెరికా ఏకంగా 54% వాటా కలిగి ఉంది. 15% వాటాతో ఆ తర్వాతి స్థానంలో హాంకాంగ్ నిలిచింది.

గిట్టుబాటయ్యే రంగాలపై..

గరిష్ట ప్రభావాన్ని అంటే అధిక ఆదాయం వచ్చే రంగాల వైపు దాడులు చేసేందుకే సైబర్ నేరస్తులు మొగ్గుచూపుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఇంధన రంగంలో దాడులు ఏకంగా 387% పెరిగాయి. ఇది కీలక మౌలిక సదుపాయాలకు పెరుగుతున్న ముప్పును సూచిస్తోందని నివేదిక వివరించింది. తయారీ, రవాణా రంగాలు ఐఓటీ మాల్‌వేర్ విభాగంలో అత్యంత తరచుగా సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా పెట్టుకున్న విభాగాలుగా ఉన్నాయి. మొత్తం ఐఓటీ మాల్‌వేర్ సంఘటనల్లో 40% కంటే ఎక్కువ వాటాను ఈ రెండు విభాగాలు కలిగి ఉన్నాయి.

క్లుప్తంగా...

'బ్యాంక్ అభివృద్ధిలో అసోసియేషన్ పాత్ర కీలకం'

ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ అసోసియేషన్ ఆఫీసర్స్

కొమ్మాది: విశాఖపట్నం భీమిలి బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్ వద్ద కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహా సభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో కె.సత్యన్నారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంక్ తమ ఖాతాదారులకు విశేష సేవలను అందిస్తూ, దేశ ప్రగతికి తమ వంతుగా సహకారం అందిస్తోందన్నారు. బ్యాంక్ అభివృద్ధిలో ఆఫీసర్స్ అసోసియేషన్ పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. కాగా, ఈ మహాసభలు మరో రెండు రోజులు జరగనున్నాయి. ప్రధాన కార్యక్రమంలో బ్యాంక్ కార్యదర్శి కె.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్దీప్ సింగ్ అహ్లువాలియా, విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, కమిటీ చైర్మన్ రమాప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ

తాగిన మైకంలో చిన్నారిపై తల్లిదండ్రుల దాష్టీకం

చిన్నారిని చైల్డ్‌కేర్‌కు, తల్లిదండ్రులను డి–అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

మనోహరాబాద్ (తూప్రాన్): తాగుడుకు బానిసైన తల్లిదండ్రులు పుట్టి రెండు నెలలు కూడా నిండని చిన్నారిని హింసించారు. ఈ అరాచకాన్ని చూసి తట్టుకోలేక స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బ్యాగరి స్వామి, సంధ్య దంపతులు రోజువారీ కూలీ చేసుకుంటూ తాగుడుకు బానిసలుగా మారారు. వీరికి ఇద్దరు కుమారులు, రెండు నెలల చిన్నారి సంతానం. తాగుడుకు బానిసగా మారిన తల్లిదండ్రులు పిల్లలను తరచూ హింసించే వారు. గ్రామస్తులు పలుమార్లు నచ్చజెప్పినా వారి వైఖరి మారలేదు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన చెత్త ట్రాక్టర్ ఊర్లో తిరుగుతుండగా తమకు కూలీ డబ్బులు రావాలని తమ రెండు నెలల చిన్నారిని ట్రాక్టర్ టైర్ల కింద పడవేశారు. ఇది గమనించిన స్థానికులు అప్రమత్తమై చిన్నారిని తప్పించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు ఘటనా స్థలానికి వచ్చి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చే ప్రయత్నం చేయగా.. వారు పట్టించుకునే స్థితిలో లేరు. దీంతో జిల్లా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. చిన్నారిని శిశు సంరక్షణ కేంద్రానికి, తల్లిదండ్రులను డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు జిల్లా ఐసీడీఎస్ అధికారి హేమభార్గవి తెలిపారు.

మీర్జాగూడ ప్రమాద డ్రైవర్లు మద్యం తాగలేదు

పోలీసులకు అందిన ఎస్‌ఎఫ్‌ఎల్ నివేదిక

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద ఈనెల 3న జరిగిన ప్రమాదానికి కారణమైన టిప్పర్, బస్సు డ్రైవర్లు మద్యం తాగలేదని పోలీసులకు నివేదిక అందింది. ఈ ఘటనలో 19 మంది మృతి చెందగా, 27 మంది గాయపడటం తెలిసిందే. ప్రమాదానికి కారణాలను అన్వేషించే క్రమంలో లారీ డ్రైవర్ మద్యం తాగి ఉండొచ్చని అనుమానించారు. ఇద్దరు డ్రైవర్ల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన సమయంలో రక్త నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. టిప్పర్ డ్రైవర్ ఆకాశ్ కాంబ్లే, బస్సు డ్రైవర్ దస్తగిరిబాబా మద్యం తాగలేదని ఎస్‌ఎఫ్‌ఎల్ నివేదిక అందినట్లు చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు.

మంగళగిరిలో టిఫిన్.. తిరుపతిలో లంచ్.. హైదరాబాద్‌లో డిన్నర్

రేణిగుంటలో ప్రత్యేక విమానం నుంచి దిగుతున్న పవన్

నేడు మళ్లీ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు..

ఎక్కే విమానం.. దిగే విమానం.. డిప్యూటీ సీఎం పవన్ బిజీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం తిరుపతి జిల్లా పర్యటన వన్‌మ్యాన్ షోలా సాగింది. ఎక్కే విమానం.. దిగే విమానం.. అన్నట్లు తన రెండు రోజుల పర్యటనను బిజీబిజీగా ప్లాన్ చేసుకున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న పవన్.. రోడ్డు మార్గాన మామండూరు అటవీ ప్రాంతానికి వెళ్లారు. వాచ్ టవర్ ఎక్కి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం తిరుపతి మంగళంలోని గోదాముల్లో నిల్వ ఉన్న ఎర్రచందనం దుంగలను పరిశీలించారు. ఆ తర్వాత తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు విలేకరుల సమావేశం ఉంటుందని, ఎవరూ ఎలాంటి ప్రశ్నలు అడగరాదని సమాచార శాఖ అధికారులు హుకుం జారీ చేశారు. 'దొంగల నుంచి పట్టుబడ్డ 2.65 లక్షల టన్నుల ఎర్రచందనం దుంగలు తిరుపతిలోని గోదాములో ఉన్నాయి. వాటి విలువ రూ.2వేల నుంచి రూ.5 వేల కోట్లు ఉంటుంది. పట్టుబడకుండా స్మగ్లింగ్‌లో తరలిపోయింది చాలా ఉంటుంది. కర్ణాటక రూ.140 కోట్లు సొమ్ము చేసుకుంది. ఎక్కడ ఎర్రచందనం దొరికినా అది ఏపీకే చెందేలా ఒప్పందం జరిగింది. స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న నలుగురు కీలక వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటాం. ఎర్రచందనం జోలికెళితే తాట తీస్తా' అని పవన్ చెప్పుకొచ్చారు.

ఎవరినీ కలవని పవన్..

కాగా, పవన్ వచ్చారని తెలిసి దివ్యాంగులు, రైతులు, జనసేన శ్రేణులు.. పలు సమస్యలపై అర్జీలు తీసుకుని రేణిగుంట విమానాశ్రయం, తిరుపతి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అయితే పవన్ ఏ ఒక్కరినీ కలువలేదు. శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌చార్జ్ కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు కుటుంబ సభ్యులు.. ప్లకార్డులు పట్టుకుని కేకలు వేసి పిలుస్తున్నా పట్టించుకోకుండా ముందుకు సాగారు. రేణిగుంట విమానాశ్రయంలో ప్రత్యేక విమానం ఎక్కి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. కాగా, పవన్ ఆదివారం తిరిగి ప్రత్యేక విమానంలో రేణిగుంట రానున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో పలమనేరు వెళతారు. అక్కడ కుంకీ ఏనుగులను పరిశీలించి, తిరిగి హెలికాప్టర్‌లో రేణిగుంటకు వస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ లేక గన్నవరం వెళ్లనున్నారని అధికారులు తెలిపారు.

వైద్య విద్యార్థులను కరిచిన ఎలుకలు

ఆందోళనలో విద్యార్థులు

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ హాస్టల్లో ఆరుగురు వైద్య విద్యార్థులను ఎలుకలు కరిచిన ఘటన చోటుచేసుకుంది. దీంతో బాధితులంతా ఏఆర్‌వీ ఇంజక్షన్లు చేయించుకున్నారు. ఏలూరు సర్వజనాస్పత్రి ప్రాంగణంలో ప్రభుత్వ వైద్య విద్యార్థుల వసతి గృహ సముదాయాలున్నాయి. ఈ క్రమంలో వసతి గృహంలో నిద్రిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులను ఎలుకలు కరవడంతో శనివారం ఆస్పత్రి అత్యవసర విభాగంలో వైద్యులు వారికి ఏఆర్‌వీ ఇంజక్షన్లు చేశారు. వసతి గృహంలో ఎలుకలు సంచరిస్తుండటంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రిలో ఎలుకల నివారణకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఓ కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవటంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. గతంలోనూ ఆస్పత్రిలో ఓ చిన్నారిని ఎలుక కరిచిన సందర్భాలున్నాయి. మార్చురీలోని మృతదేహాన్ని కూడా ఎలుకలు వదలకుండా కొరికేశాయి.

కుల దురహంకారంపై పోరాడిన యోధుడు భక్త కనకదాస

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా 538వ జయంతి

సాక్షి, అమరావతి: సాహిత్యంతో సామాజిక విప్లవం సాధించవచ్చని నిరూపించిన మహానుభావుడు భక్త కనకదాస అని వైఎస్సార్‌సీపీ నేతలు, కురుబ సంఘం నాయకులు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం భక్త కనకదాస జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ ఏపీ కురుబ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాలతో భక్త కనకదాస జయంతిని పార్టీ కేంద్ర కార్యాలయంతోపాటు అన్ని జిల్లా కార్యాలయాల్లో నిర్వహిస్తున్నందుకు వారు ధన్యవాదాలు తెలిపారు. భక్త కనకదాస స్ఫూర్తితోనే మాజీ సీఎం జగన్ సామాజిక అంతరాలు తొలగించేలా పాలన అందించారని కొనియాడారు. వెనకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయ పదవులిచ్చి ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన భక్త కనకదాస జయంతి కార్యక్రమంలో నేతలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక భక్త కనకదాస విగ్రహంతోపాటు ఆయన పేరుతో సామాజిక భవనం ఏర్పాటుచేయాలని కురుబ సోదరులు కోరగా.. ఈ విషయాన్ని వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తానని లేళ్ళ అప్పిరెడ్డి వారికి హామీ ఇచ్చారు.

వెనుకబడిన వర్గాలకు అండగా జగన్: గోరంట్ల

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. భక్త కనకదాస కుల దురహంకారంపై సాహిత్యమనే ఆయుధంతో పోరాడి సామాజిక విప్లవం తీసుకొచ్చారని చెప్పారు. ఈయన స్ఫూర్తితోనే వైఎస్ జగన్ వెనకబడిన వర్గాలకు అండగా నిలిచారన్నారు. ఏపీ కురుబ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారు

- తప్పుడు కేసులు పెట్టే ఏ అధికారిని వదిలిపెట్టం
- మాజీ మంత్రి విడదల రజిని హెచ్చరిక
- నరసరావుపేట డీఎస్పీ పచ్చ చొక్కా వేసుకొని పనిచేస్తున్నట్లుందని విమర్శ
- అక్రమ కేసుపై నిష్పక్షపాత విచారణకు పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావుకు వినతిపత్రం

నరసరావుపేటరూరల్: రాజకీయాల్లో రాణిస్తున్న మహిళను చూసి ఈర్ష్య, అసూయతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్న కొంతమందికి పోలీసులు వత్తాసు పలుకుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి విడదల రజిని విమర్శించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. తన అనుచరులపై చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన అక్రమ కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తనపై ఇప్పటికే ఏడు తప్పుడు కేసులు పెట్టారన్నారు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు పోలీసు చొక్కా కాకుండా పచ్చ చొక్కా వేసుకొని పని చేస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. వ్యక్తిత్వ హననం చేసేలా పత్రికా ప్రకటన ఇచ్చిన డీఎస్పీపై న్యాయ పోరాటం చేస్తామని, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. తప్పుడు కేసులు పెట్టే ఏ అధికారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

జగనన్న ఆశీస్సులతో..

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో చిలకలూరిపేట నుంచే పోటీచేస్తానని రజిని స్పష్టంచేశారు. భగవంతుడు, ప్రజల అశీస్సులతో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని తెలిపారు. మీడియాకు ఆమె తెలిపిన అంశాలు.. ''శ్రీగణేష్ చౌదరి అనే వ్యక్తి నా సన్నిహితుడని, నా ఫాలోవర్ అని, అతనికి నాకు నగదు లావాదేవీలు ఉన్నాయని కట్టుకథ అల్లి ఫిర్యాదు చేస్తే ఆఘమేఘాల మీద నా సిబ్బందిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి శ్రీగణేష్ చౌదరి గత ఎన్నికల్లో దర్శి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు (ఫొటోలు చూపించారు). టీడీపీకి చెందిన ఆ వ్యక్తిని నా అనుచరుడు అని చెప్పి కథలు అల్లి మా మీదే కేసు పెట్టారు. ఉద్యోగం ఇప్పిస్తానని పదేళ్ల కిందట శ్రీగణేష్ చౌదరి రూ.30 లక్షలు తీసుకున్నట్టు ఈ ఏడాది మార్చి 1న ప్రజావేదికలో మంత్రి నారా లోకేశ్‌కు శ్రీనివాసరెడ్డి అనే బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అనుచరుడనంటూ ఈ మోసానికి పాల్పడినట్టు ఫిర్యాదులో బాధితుడు తెలిపారు. అలాగే ఈ ప్రభుత్వం వచ్చాక శ్రీగణేష్‌చౌదరిపై గ్రీవెన్స్‌లో పలు ఫిర్యాదులు వచ్చాయి. చీటింగ్ కేసు విషయంలో మాపై ఫిర్యాదు చేసిన టీడీపీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ మాబు సుభానికి, శ్రీగణేష్ చౌదరికి మధ్య చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌లో రాజీ జరిగింది. ఇందుకు సంబంధించిన పత్రం కూడా ఉంది. ఆయా కేసుల్లో ఎక్కడా మా ప్రస్తావన లేదు. ఇప్పుడు శ్రీగణేష్‌చౌదరి బాధితుల్ని తీసుకువచ్చి మాపై ఫిర్యాదు చేయించి అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారు'' అని రజిని పేర్కొన్నారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా రేషన్ మాఫియా, పేకాట క్లబ్‌లు, గ్రావెల్ మాఫియా నడుస్తున్నాయని, అయినా వీటిపై శ్రద్ధచూపని పోలీసులు, అధికార పార్టీ పెద్దల రాజకీయ ప్రయోజనాల పరిరక్షణకు పనిచేస్తున్నారని విమర్శించారు.

శాశ్వతంగా అధికారంలో ఉంటాం..

- టీడీపీ ఇక ఎప్పుడూ విపక్షంలో ఉండదు
- గత మూడుసార్లు కంటే ఇప్పుడే వేగంగా పనిచేస్తున్నా
- భారీ ఈవెంట్లు, భారీ పెట్టుబడులతో రాష్ట్రం దూసుకెళ్తోంది
- మీడియాతో సీఎం చంద్రబాబు
- పార్టీ కార్యాలయంలో వినతుల స్వీకారం

సాక్షి, అమరావతి: టీడీపీ ఇకపై ఎప్పుడూ ప్రతిపక్షంలో ఉండదని.. శాశ్వతంగా అధికారంలో ఉంటూ సుదీర్ఘకాలం కొనసాగుతామని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇకపై పార్టీకి ఎక్కువ సమయం కేటాయిస్తానని వారంలో ఒకరోజు పార్టీ కార్యాలయానికి వచ్చి రోజంతా ఉంటానని చెప్పారు. పార్టీ కార్యాలయానికి వస్తేనే అసలు వాస్తవాలు తెలుస్తాయన్నారు. లోకేశ్ కూడా వారంలో ఒక రోజు పార్టీ కార్యాలయంలో ఉంటారని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని గాడిలో పెట్టామన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసినప్పటికంటే ఇప్పుడే ఇంకా వేగంగా పనిచేస్తున్నా. ఇప్పుడు టెక్నాలజీ పెరగడంతో పరిపాలనలో వేగం పెరిగి పాలన సులభంగా మారింది. ప్రజా సమస్యలు ఎందుకు పరిష్కారం కావడంలేదో వినతులు ఇచ్చిన వారికి అర్ధమయ్యేలా తెలిపే విధానం తీసుకొస్తాం. వాటికున్న అడ్డంకుల గురించి బాధితులకు తెలియాలి. కింది స్థాయిలో ఉన్న అవినీతి నిర్మూలనకు సమగ్ర చర్యలు చేపడుతున్నాం. ముందు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి. దీనిపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చాం. 22ఏ నిషేధిత జాబితా భూములపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా ప్రజాదర్బార్‌లు నిర్వహించాలి. పార్టీ కమిటీలను ఈ నెలాఖరులోగా పూర్తిచేస్తాం.



నిర్మాణాత్మకంగా పెట్టుబడుల సదస్సు..

ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే పెట్టుబడుల సదస్సును నిర్మాణాత్మకంగా నిర్వహిస్తాం. ప్రెజెంటేషన్, ఎగ్జిక్యూషన్, ఎగ్జిబిషన్, ఒప్పందాలు ఇలా వివిధ రూపాల్లో సదస్సు జరుగుతుంది. క్వాంటమ్ కంప్యూటర్ సిద్ధమైంది. షిప్‌మెంట్ మాత్రమే మిగిలి ఉంది. అనుకున్న సమయానికి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతికి వచ్చేలా చూస్తున్నాం. ఇక తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలో దాదాపు రూ.6 వేల కోట్ల పెట్టుబడి పెడుతుంది.

ఏడు ప్రాజెక్టులకు వర్చువల్‌గా సీఎం భూమి పూజ..

మరోవైపు.. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో కుప్పంలో ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. హిందాల్కో, శ్రీజ డెయిరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్వీఎఫ్ సోయా, మదర్ డెయిరీ, ఇ–రాయస్ ఈవీ, అలీప్ కుప్పంలో పరిశ్రమలు పెట్టనున్నాయి. ఈ ఏడు సంస్థలకు 241 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. పరిశ్రమల శంకుస్థాపన సందర్భంగా స్థానిక ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులతో ఆన్‌లైన్ ద్వారా సీఎం మాట్లాడారు. త్వరలో కుప్పం నియోజకవర్గానికి మరో ఎనిమిది సంస్థలు రాబోతున్నాయని చెప్పారు. వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ–వన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలు విస్తృత అవకాశాలు కల్పిస్తాయన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనని ఎమ్మెల్యేలపై ఆగ్రహం..

ఇదిలా ఉంటే.. పింఛన్ల పంపిణీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో 48 మంది ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడంపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేల పనితీరును విశ్లేషించిన ఆయన ఈ కార్యక్రమాల్లో పాల్గొనని 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. వారి వివరణ తీసుకున్న తర్వాత చర్యలు తీసుకుందామని ఆయనన్నట్లు తెలిసింది.

చంద్రబాబు క్రెడిట్ చోరీ మరోసారి బట్టబయలు

- విశాఖపట్నం డేటా సెంటర్‌ను తమ సంస్థ నిర్మిస్తుందన్న గౌతం అదానీ
- గూగుల్ సాంకేతిక సహకారం అందిస్తుందంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటోరియల్‌లో వెల్లడి
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుపై టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలో ప్రచురించిన ఎడిటోరియల్‌లో గౌతం అదానీ వెల్లడించిన అంశాల ద్వారా సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ మరోసారి బట్టబయలైందని మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. గౌతం అదానీ ఎడిటోరియల్‌లో వెల్లడించిన విషయాలు గత నెల 23న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ మీడియా సమావేశంలో చెప్పిన అంశాలను ధ్రువపరుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా క్రెడిట్ చోరీ మానేస్తే మంచిదని సీఎం చంద్రబాబుకు హితవు పలుకుతూ.. టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటోరియల్ పేజీలో గౌతం అదానీ రాసిన ఆర్టికల్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో గుడివాడ అమర్‌నాథ్ పోస్టు చేశారు. ఆ పోస్టులో గుడివాడ అమర్‌నాథ్ 'విశాఖపట్నం డేటా సెంటర్ విషయంలో చంద్రబాబు దాగుడు మూతలు, సంకుచిత బుద్ధి మరోసారి బట్టబయలయ్యాయి. ఆయన క్రెడిట్ చోరీకి పాల్పడ్డారని మరోసారి వెల్లడైంది. విశాఖ డేటా సెంటర్‌లో మన దేశానికి చెందిన అదానీ కంపెనీ ఉన్న విషయాన్ని దాచేసి, విశాఖలో డేటా సెంటర్ ద్వారా ఏఐ విప్లవానికి వైఎస్సార్‌సీపీ నాంది పలికిన విషయాన్ని ప్రజలకు తెలియనివ్వకుండా తొక్కిపెట్టేందుకు చంద్రబాబు చేసిన పబ్లిసిటీ గిమ్మిక్కులు మరోసారి తేలిపోయాయి. ఇవాళ టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రిక ప్రచురించిన ఎడిటోరియల్ పేజీలో గౌతం అదానీ వెల్లడించిన విషయాలు, అక్టోబర్ 23న ప్రెస్‌మీట్‌లో వైఎస్ జగన్ వెల్లడించిన విషయాలను ధ్రువపరుస్తున్నాయి. విశాఖపట్నం డేటా సెంటర్‌ను అదానీ సంస్థ నిర్మిస్తుందని, టెన్సార్ ప్రాసెసింగ్ యూనిట్స్, గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్స్‌ను గూగుల్ ఏర్పాటు చేస్తుందని, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుందని చాలా స్పష్టంగా చెప్పారు. ఏఐ టెక్నాలజీలో సబ్ సీ కేబుల్ ద్వారా ఆసియా–ఆఫ్రికా అనుసంధానం జరగబోతోందని కూడా ఆయన వెల్లడించారు. తద్వారా విశాఖలో డేటా సెంటర్‌కు పునాది పడింది, మార్గం సుగమమం చేసింది, సింగపూర్ నుంచి సబ్ సీ కేబుల్ తీసుకురావడానికి నాంది పలకడానికి వైఎస్సార్‌సీపీ విశేష కృషి చేసిందన్న వాస్తవాలు ఈ సందర్భంగా మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఇంత జరిగినా ఇప్పటికీ చంద్రబాబు గారు అదానీ అనే పేరును ఒప్పందం సమయంలోనూ ప్రస్తావించలేదు, ఇప్పుడు కూడా ప్రస్తావించడం లేదు. చంద్రబాబూ.. ఇప్పటికైనా క్రెడిట్ చోరీ మానేస్తే మంచిది.' అని పేర్కొన్నారు.

న్యూస్ మేకర్

వివాహమయ్యాక స్త్రీలు తమ ఆకాంక్షలు విడిచి పెట్టాలనే ధోరణి సమాజంలో ఉన్నా కొందరు తమ కలలను అన్వేషిస్తుంటారు. ఇద్దరు పిల్లల తల్లిగా ఉండి, నిన్న మొన్నటి వరకూ సాధారణ గృహిణిగా ఉన్న షామ్లా హంజా తన రెండవ సినిమా 'ఫెమినిచి ఫాతిమా'తో కేరళ ప్రభుత్వ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. ఉత్తమ నటుడుగా ఎంపికైన మమ్ముట్టితో సమానంగా షామ్లా ప్రతిభ చూపిందంటే కళారంగాల్లో రాణించాలనుకునే స్త్రీలకు అది కచ్చితంగా స్ఫూర్తే...

షామ్లా హంజా

నిన్న మొన్నటి గృహిణి నేటి ఉత్తమ నటి

కేరళలో 'ఫెమినిస్ట్' అనే మాటను కొందరు వ్యంగ్యంగా 'ఫెమినిచి' అంటుంటారు. స్త్రీలెవరైనా గొంతెత్తినా, ప్రశ్నించినా, హక్కుల కోసం మాట్లాడినా వారిని 'ఫెమినిచి' అని ఎత్తి పొడవడం అక్కడ కొందరి అలవాటు. అదే మాటను టైటిల్‌లో తీసుకుని ప్రతి గృహిణిలో అంతర్గతంగా ఫెమినిస్ట్ ఉంటుందని స్టేట్‌మెంట్ ఇస్తూ దర్శకుడు ఫాజిల్ ముహమ్మద్ తీసిన సినిమా 'ఫెమినిచి ఫాతిమా'.

ఇది నేరుగా థియేటర్లలో రిలీజ్ కాకపోయినా, ఓటీటీలలో రాకపోయినా ఇప్పటికి అనేక ఫెస్టివల్స్‌లో బహుమతులు సాధించి, అనేక అవార్డులు గెలుచుకుంది. తాజాగా ఇటీవల ప్రకటించిన కేరళ ప్రభుత్వ పురస్కారాలలో 'ఉత్తమ నటి' అవార్డును సాధించింది. సినిమాలో ముఖ్యపాత్ర పోషించిన షామ్లా హంజా ఈ అవార్డును సొంతం చేసుకుంది. ఆశ్చర్యం ఏమిటంటే ఇది ఆమెకు కేవలం రెండో సినిమా. ఇంతకు ముందు 2022లో వచ్చిన '1001 నూనకల్' అనే సినిమాలో చిన్న పాత్ర పోషించింది. గృహిణిగా ఉంటూ ఇటీవల సినిమాలలోకి వచ్చిన షామ్లా ఏకంగా మమ్ముట్టితో సమాంతరంగా ఉత్తమనటి అవార్డు సాధించడం సామాన్యం కాదు.

ఫెమినిచి ఫాతిమా కథేంటి?

మలప్పురం జిల్లాలోని పొన్నాని అనే చిన్న ఊళ్లో ఉండే ముస్లిం కమ్యూనిటీలో జరిగే కథ ఇది. ఫాతిమా అనే గృహిణి ఇంట్లో సగటు పురుషాహంకార భర్త అజమాయిషీలో కాపురం చేస్తుంటుంది. అతగాడు ఫ్యాను వేసుకోవాలన్నా, చెప్పులు తొడుక్కోవాలనుకున్నా భార్యను పిలుస్తుంటాడు. పైగా ఇంటిని స్వర్గంగా ఉంచానని భావిస్తుంటాడు. ఇంటి చాకిరి చేసి నడుము నొప్పి తెచ్చుకున్న ఫాతిమా ఒక మంచి పరుపును కలిగి ఉండాలని భావించడంతో కథలో ముఖ్యభాగం మొదలవుతుంది. ఆమె కోరుకున్న చిన్న కోరిక ఎన్ని అభిప్రాయాలకు తావిస్తుందో, భర్త... ఇతరులు ఎన్ని వ్యాఖ్యానాలు చేస్తారో వీటన్నింటికీ ఫాతిమా ఎలా బదులు చెప్తుందో ఈ సినిమాలో ఉంటుంది. హాస్యం, వ్యంగ్యం మిళితం చేసి ఉపన్యాసాలు లేకుండా స్త్రీల దృష్టికోణంలో ఈ కథ చెప్పడంతో అన్ని విధాలా ప్రశంసలు, అవార్డులు దక్కుతున్నాయి. ఫాతిమా పాత్ర పోషించిన షామ్లాకు ప్రశంసలు దక్కుతున్నాయి.

ఇద్దరు పిల్లలు పుట్టాక

పాలక్కాడ్‌లో పుట్టి పెరిగిన షామ్లా వివాహమయ్యాక 12 సంవత్సరాలు దుబాయ్‌లో ఉండి కేరళలోనే తన కెరీర్‌ను వెతుక్కోవడానికి భర్తతో తిరిగి వచ్చింది. కొన్నాళ్లు రేడియో జాకీగా పని చేసిన ఆమె 2022లో మొదటి అవకాశం పొందింది. ఆ విధంగా దృష్టిలో పడటంతో దర్శకుడు ఫాజిల్ ఆమెకు 'ఫెమినిచి ఫాతిమా'లో లీడ్ రోల్ ఇచ్చాడు. 'షూటింగ్ మొదలైనప్పుడు నా రెండో బిడ్డకు ఆరు నెలల వయసు. ఇంటిని, సినిమా కెరీర్‌ను సమన్వయం చేసుకోవడం అంత సులభం కాలేదు. కాని యూనిట్ సహకారం వల్ల నేను మనసు లగ్నం చేసి పని చేయగలిగాను' అందామె. 'నేను రేడియో జాకీగా ఉన్నప్పుడు కూడా స్త్రీల సవాళ్లను, వాటిని ఎదుర్కొనడానికి వారు ప్రదర్శించే సామర్థ్యాన్ని చర్చించేదాన్ని. అలాంటిది ఫాతిమా లాంటి పాత్ర వస్తే ఎలా కాదంటాను' అందామె. అతి తక్కువ బడ్జెట్‌తో తీసిన ఈ సినిమాలో దర్శకుడు తనకు తెలిసినవారిని, ఊరి వారిని తారాగణంగా తీసుకున్నాడు. త్వరలో ఈ సినిమా ఓటీటీలో విడుదల కానుంది.

సమ్‌థింగ్ స్పెషల్

కొరియన్ కోడియా ఫిదా అయ్యాడు!

మన దేశానికి వచ్చిన విదేశీయులను మన వివాహ వేడుకలు ఆశ్చర్యానందాలలో ముంచెత్తుతాయి అనడంలో సందేహం లేదు. దీనికి తాజా ఉదాహరణ జేక్ కోడియా అనే కొరియన్.

గురుగ్రామ్‌లోని కాస్మెటిక్ రిసెర్చ్ కంపెనీలో పనిచేస్తున్న కోడియా తొలిసారిగా ఒక భారతీయ వివాహ వేడుకకు హాజరయ్యాడు. ఆ వేడుకలోని వైభోగం, అతిథి మర్యాదలలోని ఆత్మీయతను చూసి అతడికి వేరే లోకంలోకి వచ్చినట్లు అనిపించింది. విందులోని రుచుల సంగతి సరే సరి. పానీపూరి అతడికి తెగ నచ్చేసింది. వధువు

ఎంట్రీ నుంచి పెళ్లి పూర్తయ్యే వరకు ప్రతి కార్యక్రమంలోనూ ఉత్సాహంగా పాల్గొన్నాడు. పెళ్లివారితో కలిసి డ్యాన్స్ చేశాడు.

'కొరియన్ విజిట్స్ ఇండియన్ వెడ్డింగ్స్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియో నెటిజనుల మనసును హోల్‌సేల్‌గా దోచేసుకుంది.

ఒక ఫారినీయుడు ఇలా స్పందించాడు...

'తాజ్‌మహల్ చూడడానికి ఇండియాకు వెళ్లాలనుకునేవాడిని. ఇప్పుడు పెళ్లి వేడుకలు చూడడానికే ఇండియాకు వెళ్లాలనిపిస్తోంది'

ఇన్నోవేషన్

ఆందోళన నుంచి వచ్చింది ఒక ఐడియా!

'అవసరం నుంచే ఆవిష్కరణ పుడుతుంది' అంటారు. శుక్రాంత్ అనే దిల్లీవాలాకు మాత్రం 'ఆరోగ్య భయం' నుంచి ఆవిష్కరణ పుట్టుకొచ్చింది. దిల్లీలో కాలుష్యం ఆందోళనకరమైన స్థాయిలో ఉన్న నేపథ్యంలో శుక్రాంత్ డిఐవై (డూ ఇట్ యువర్ సెల్ఫ్) మంత్రాన్ని జపించాడు. తన ఆలోచనలకు పదును పెట్టి ఎయిర్ ప్యూరిఫైయర్‌ను ఇంట్లోనే తయారు చేసుకున్నాడు. దీన్ని తయారు చేయడానికి అతడికి రెండు వేల రూపాయల ఖర్చు మాత్రమే అయింది. ఇది ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) ని 380 నుంచి 50కి తీసుకురాగలిగింది.

తన సొంత ఎయిర్‌ప్యూరిఫైయర్ కోసం 150 ఎంఎం ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ని, అమెజాన్ నుంచి తెప్పించిన హెప ఫిల్టర్, రెగ్యులేటర్, వైర్, కార్డ్‌బోర్డ్, గ్లూ గన్‌లను ఉపయోగించాడు. రెడిట్‌లో షేర్ చేసిన శుక్రాంత్ పోస్ట్ వైరల్‌గా మారింది. 'ఎయిర్ ప్యూరిఫైయర్‌ని తయారు చేయడమనేది రాకెట్ సైన్స్ కాదు. సింపుల్‌గా చెప్పాలంటే ఫిల్టర్స్ ద్వారా గాలి ప్రవాహాన్ని లోపలికి, బయటికి పంపించే సరళమైన పరికరాన్ని తయారు చేయడం' అన్నారు ఒక నెటిజన్.

శుక్రాంత్ పోస్ట్ చూసిన తరువాత 'మేము సైతం' అంటూ కొందరు ఎయిర్ ప్యూరిఫైయర్‌లను తయారుచేసే పనిలో పడ్డారు.

అలర్ట్

జర భద్రం

ఏ మూలన ఏ కెమెరా దాగి ఉన్నదో...

ప్రయాణం అన్నాక హోటళ్లలో బస చేయడం సాధారణం. అయితే మన ప్రైవసీకి సంబంధించి హోటల్ గదులు ఎంత వరకు క్షేమం అనే డౌటు చాలామందికి వస్తుంటుంది. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి...

హిడెన్ కెమెరాలు సాధారణంగా లైట్ పిక్చర్‌లు, డ్రెస్సింగ్ మిర్రర్స్, స్మోక్ డిటెక్చర్స్, టీవీ యూనిట్లు, ఫోటో ఫ్రేమ్‌ల వెనుక, తక్కువగా కనిపించే ప్రదేశాలలో అమర్చబడి ఉంటాయి. గదిలోని ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు, వస్తువులను జాగ్రత్తగా పరిశీలించాలి. ఏదైనా అసాధారణంగా లేదా అనుమానాస్పదంగా అనిపిస్తే దగ్గరకు వెళ్లి పరిశీలించాలి. స్మార్ట్‌ఫోన్ ఫ్లాష్‌లైట్ లేదా టార్చ్ ఆ ప్రదేశంపై వేసి చూడాలి. చిరు కాంతి, రెఫ్లెక్షన్‌లాంటిది కనిపిస్తే అవి కెమెరా లెన్స్ కావచ్చు.

రహస్య కెమెరాలలో చాలావాటిలో ఇన్‌ఫ్రారెడ్ లైట్‌ను ఉపయోగిస్తారు. దీన్ని గుర్తించడానికి గదిలోని అన్ని లైట్లను ఆపివేసి, స్మార్ట్‌ఫోన్ కెమెరా ఆన్ చేసి కెమెరా ఉందని అనుమానం ఉన్న చోట ఫోకస్ చేయాలి.

స్క్రీన్‌పై ఎరుపు లేదా ఊదారంగు కనిపిస్తే హిడెన్ కెమెరాకు అది సంకేతం కావచ్చు.

హిడెన్ కెమెరాలను గుర్తించడానికి వైఫైని కూడా ఉపయోగించవచ్చు.

మొబైల్ వైఫై ఆన్‌చేసి నెట్‌వర్క్ లిస్ట్ తనిఖీ చేయాలి. నెట్‌వర్క్‌లో కామ్, డివైజ్ డబుల్ ఎక్స్, ఐపీకామ్‌లాంటి పేర్లు కనిపిస్తే జాగ్రత్తగా ఉండాలి. రూమ్‌లో వైర్‌లెస్ కెమెరా ఉండే ప్రమాదం ఉంది.

బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్ అనేది మహిళలు తమ గృహహింస కారణంగా ఎదుర్కొనే మనోవేదన. ఒకరకంగా చూస్తే తీవ్రమైన వేదన కారణంగా అంటే రేప్‌కు గురైనవాళ్లూ, యుద్ధాల్లో సర్వం పోగొట్టుకున్నవాళ్లూ అనుభవించే అత్యంత వేదనాభరితమైన కండిషన్‌తో వచ్చే పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ)లో ఇదో రకం అని చెప్పవచ్చు. మహిళలు తమ పార్ట్‌నర్ చేతుల్లో అనుభవించిన గృహహింస కారణంగా ఇది తమ ఖర్మ అంటూ సమాధానపడుతూ నిత్యం అనుభవించే రంపపుకోత కారణంగా వాళ్లు అనుభవించే మానసిక సమస్యే ఈ 'బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్'. ఈ మానసిక సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం...

● బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్!

ఇంటి హింస ఇంతింతై!

పెళ్లి తర్వాత భర్త లేదా జీవిత భాగస్వామి పెట్టే వేదనలను అనుభవించే భార్యల్లో కొందరికి ఇది తమ ఖర్మ అనే ఫీలింగ్ తప్ప... దీన్ని ఎదుర్కోవాలనిపించడం, పోలీసులకు ఫిర్యాదు చేయాలనిపించడం కూడా ఉండదు. అలా మొదలయ్యే 'బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్'లో ఆ మహిళ... తన భర్త అలా హింసిస్తుండటాన్ని కూడా తన తప్పుగానే అనుకుంటూ 'అపరాధభావన'తో బాధపడుతుంటుంది.

సిండ్రోమ్ తాలూకు నాలుగు దశలివి...

బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్‌కు దారితీసే వాళ్ల వాళ్ల ఇంటి పరిస్థితులు ప్రతి మహిళకూ వేర్వేరుగా ఉన్నప్పటికీ... వారు అనుభవించే కొన్ని కామన్ దశలను బట్టి చూసినప్పుడు వారి మానసిక స్థితి ఈ కింద పేర్కొన్న నాలుగు దశల్లో కొనసాగుతుంది. మొదటి రెండు దశల్లో మహిళలు నిశ్శబ్దంగా తమ వేదనలు అనుభవించినప్పటికీ... ఈ వేదనల నుంచి బయటకు వచ్చేందుకు తాము చేసే ప్రయత్నాలు ఈ చివరి రెండు దశల్లో కొంతమేర జరుగుతాయి.

1. డీనియల్ : తాము వేదన అనుభవిస్తున్న సంగతి తెలియని పరిస్థితి ఇది. భర్త తమను వేధిస్తున్నారని కూడా వాళ్లు అంగీకరించరు. అదేదో ఈసారికి అలా జరిగింది తప్ప భర్త తమను హింసిస్తున్నట్టు గుర్తించడానికి నిరాకరించే దశే ఈ 'డీనియల్'.

2. గిల్టీ (అపరాధభావన) : భర్త తనను హింసించడానికి లేదా కొట్టడానికి ఒక రకంగా తాను చేసిన తప్పే అని సర్దిచెప్పుకునే ధోరణే ఈ అపరాధభావనకు కారణం.

3. ఎన్‌లైట్‌మెంట్ : భర్త చేతుల్లో ఇలా తరచూ హింసకు గురికావడం తమకు తగదనీ, దాన్నుంచి బయటకు రావాలనే భావన కలగడం ఈ ఎన్‌లైట్‌మెంట్ దశలో జరుగుతుంది.

4. రెస్పాన్సిబిలిటీ : ఈ దశలో వారు తామీ హింస నుంచి బయటపడటం అన్నది తమ చేతుల్లోనే ఉందనీ, అది తమ బాధ్యత అని గ్రహిస్తారు. అవసరమైతే బంధం నుంచి బయటపడైనా ఈ హింసనుంచి విముక్తి పొందవచ్చని అనుకునే దశ ఇది.

బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్ మొదలయ్యేదిలా...

మొదట్లో ఏదో మనస్పర్థల కారణంగా భర్త ఆగ్రహానికి గురైనప్పుడు మహిళ అంతగా ప్రతిఘటించకపోవచ్చు. ఇది పెళ్లయిన కొత్తలో ఇలా జరగడానికి అవకాశముంది. భర్త తొలుత శారీరకంగానో లేదా మానసికంగానో బాధపెట్టాక ఎందుకో అలా జరిగిపోయిందనీ, ఇకపై అలా జరగదంటూ ఎమోషనల్‌గా మాట్లాడతాడు. ఆమె ఆమోదం పొందడం కోసం అవసరమైనదానికంటే ఎక్కువ రొమాంటిక్‌గా వ్యవహరిస్తూ ఆమెను నార్మల్ చేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ ఈ హింస అక్కడితో ఆగకుండా అదేపనిగా మాటిమాటికీ కొనసాగుతూ ఉంటుంది. దాంతో తొలుత అతడు చెప్పే (కన్విన్స్ చేసే) అంశాలకు లొంగిపోయిన మహిళ ఆ తర్వాత అదో రొటీన్ తంతు అని గ్రహించి, పెద్దగా స్పందించడమూ మానేస్తుంది. అలా గృహహింస వేదనలకు గురవుతూనే ఉంటుంది. ఇలా జరగడానికి ఆర్థిక సమస్యలూ, విడిపోతామేమోనన్న భయం, తనను తాను సముదాయించుకునే సర్దుబాటు ధోరణీ... ఇలాంటి కారణాలు చాలానే ఉండవచ్చు.

చికిత్స... ఇది వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంది. వారు అనుభవించిన, అనుభవిస్తున్న బాధలూ లేదా వారిలో వ్యాధి తీవ్రతను బట్టి కౌన్సెలింగ్, ఇంటర్‌పర్సనల్ థెరపీ, అవసరాన్ని బట్టి కొన్ని యాంటీ డిప్రెసెంట్ మందులు వాడాల్సి ఉంటుంది. ఇక సామాజికంగా ఈ వేదననుంచి విముక్తి కావడం కోసం వారి కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషుల సంప్రదింపుల తర్వాత పోలీసులను సంప్రదించడం వంటి ప్రత్యామ్నాయాలూ అనుసరించవచ్చు.

గుర్తించడం ఎలా...

కొన్ని గుర్తుల (లక్షణాల) ఆధారంగా ఓ మహిళ బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్ బారిన పడిందని గుర్తించవచ్చు. అవి... ● తాను నలుగురిలో కలవకపోవడం... ఎందుకని అడిగినప్పుడు ఏవో సాకులు చెప్పి తప్పించుకుంటూ ఉండటం ● భర్త వచ్చే టైమ్‌కు చాలా తీవ్రమైన ఉద్విగ్నానికీ, ఆందోళనకు లోనవుతుండటం ● దేహంపై కనిపించే గాయాల గురించి అడిగితే ఏవేవో పొంతనలేని కారణాలు చెప్పి దాటవేయడానికి చూడటం. దుస్తులను గాయాలను దాచేలా సర్దుతుండటం. (ఉదాహరణకు మంచి వేసవిలోనూ దేహమంతా కప్పివేసే దుస్తులు ధరించడం) ● తన ఉద్యోగం కారణంగా వచ్చే జీతం వంటివన్నీ తన భర్త అధీనంలోనే ఉంచడం ● భర్తనుంచి ఏదైనా కాల్ రాగానే తీవ్రమైన కలవరపాటుకు గురవుతుండటం.


డాక్టర్ శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై
హెచ్‌వోడీ ఆఫ్ సైకియాట్రీ & సీనియర్ సైకియాట్రిస్ట్
ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రి, వరంగల్

ప్రభావాలు...

స్వల్పకాలిక ప్రభావాలివి...
● జీవితం వృథా అనుకోవడం, తీవ్రమైన కుంగుబాటు (డిప్రెషన్) ● ఆత్మవిశ్వాసం లోపించడం (లో సెల్ఫ్ ఎస్టీమ్) ● తీవ్రమైన ఉద్విగ్నత (సివియర్ యాంగ్జైటీ).

దీర్ఘకాలిక ప్రభావాలివి...
● తరచూ గతకాలపు జ్ఞాపకాల్లోకి వెళ్లడం, తానేమిటో మరచిపోయి వేరేగా ప్రవర్తించడం (డిసోసియేటివ్ స్టేట్), తీవ్రంగా ప్రతిస్పందించడం (వయొలెంట్ ఔట్ బర్స్ట్... ఇది సుదీర్ఘకాలం తర్వాత వచ్చే పరిణామం) ● హైబీపీ, గుండెజబ్బుల వంటివి కనిపించడం, కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్ ● దీర్ఘకాలికం (క్రానిక్)గా వచ్చే వెన్నునొప్పి, తలనొప్పి.

బ్యాటర్‌డ్ ఉమన్ సిండ్రోమ్‌కు ఇవే గుర్తులు...

● హింసించే తన భర్తకు అన్నీ తెలుసు... తనకేమీ తెలియనందువల్ల తనవల్లనే తప్పు జరిగిందేమోననే అపరాధభావన ● జరిగిందానికి తామే బాధ్యురాలినేమో అనే భావనతో కలిగే వేదన ● జరిగిందీ, తాను అనుభవించిన వేదనను తమ ఇంటివాళ్లకూ, ఫ్రెండ్స్‌కూ చెప్పకపోవడం ● పిల్లల జీవితం ఏమైపోతుందోనన్న తీవ్రమైన ఆందోళన.

నిర్వహణ: యాసీన్

హెల్త్



మంచి కొలెస్ట్రాల్‌తో తగ్గే అల్జైమర్స్ ముప్పు!

కొలెస్ట్రాల్ అనగానే అది చెడ్డదనే భావన చాలామందిలో ఉంటుంది. అయితే ఇటీవల వైద్యవిజ్ఞానంపట్ల పెరిగిన అవగాహనతో కొలెస్ట్రాల్‌లో మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ ఉంటాయన్న విషయాలు చాలామందికి తెలుసు.

ఇందులో మంచి కొలెస్ట్రాల్ గుండెజబ్బులను నివారించడమే కాకుండా, యౌవనంలో మంచి కొలెస్ట్రాల్ తీసుకునేవారిలో వృద్ధాప్యంలో కొందరిలో వచ్చే అల్జైమర్స్‌నూ నివారిస్తుందంటున్నారు ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌కు చెందిన పరిశోధకులు.

హై డెన్సిటీ లైపో ప్రొటీన్ (హెచ్‌డీఎల్) అని పిలిచే మంచి కొలెస్ట్రాల్ గుండె రక్తనాళాల్లో పేరుకుపోయే ప్లాక్ అనే ఒకరకం అడ్డంకిని తొలగించడంతో పాటు మెదడులో అభివృద్ధి చెందే ప్లాక్ (గార)ను పూర్తిగా తొలగించకపోయినప్పటికీ చాలావరకు నిరోధిస్తుందంటున్నారు కొలెస్ట్రాల్‌పై పరిశోధనలు సాగిస్తున్న పరిశోధకులు. అలా అది గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ ముప్పులను తప్పిస్తుంది.

ఇంకా ఆ పరిశోధకులు చెబుతున్న అంశాలను బట్టి... మన శరీరానికి అందాల్సిన మంచి కొలెస్ట్రాల్ తగినంతగా అందనివారిలో 60 ఏళ్లు దాటాక చాలామందికి మతిమరపు వచ్చే అవకాశాలు ఎక్కువ. మంచి కొలెస్ట్రాల్ తగ్గిన వారి మెదడుల్లో జ్ఞాపకశక్తిని బ్లాక్ చేసేలా ఒకరకం గార (ప్లాక్) అభివృద్ధి చెందుతుంది. అది మెదడులోని నాడీ కణాల మధ్య సాగే ఎలక్ట్రిక్ తరంగాల మధ్య ఒక అడ్డంకిగా మారి జ్ఞాపకశక్తిని తగ్గిస్తుంది. దీన్ని బట్టి తెలిసేదేమిటంటే... యుక్తవయసులో తగినంత మంచి కొలెస్ట్రాల్ తీసుకోనివాళ్లలో వారి వృద్ధాప్యంలో అల్జైమర్స్ డిసీజ్ వచ్చే అవకాశాలు ఎక్కువని చెబుతున్నారా పరిశోధకులు. ఈ విధంగా మనకు మంచి కొలెస్ట్రాల్ మేలు చేస్తుందని మరోమారు తేటతెల్లమైంది.

అందుకే ఆరోగ్యం కోసం మనం తీసుకునే ఆహారంలో మంచి కొలెస్ట్రాల్ మోతాదులు తగ్గకుండా చూసుకోవడం మేలు చేస్తుంది. ఇందులోని అంశాలన్నీ 'జర్నల్ ఆఫ్ అమెరికన్ హార్ట్ అసోసియేషన్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఇటీవల కొలెస్ట్రాల్ అంటే చెడుదనే భావన పెంచుకున్న కొందరు కొలెస్ట్రాల్‌పై అపోహలు పెంచుకుని చెడు కొలెస్ట్రాల్‌తో పాటు మంచి కొలెస్ట్రాల్‌ను కూడా తీసుకోవడం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిశోధనల నేపథ్యంలో మంచి కొలెస్ట్రాల్ మోతాదులు ఎక్కువగా ఉండే చేపలు, కోడిగుడ్లలోని తెల్లసొన (ఎగ్ వైట్), నట్స్, కాయధాన్యాల వంటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న పరిశోధకులు, న్యూట్రిషనిస్టులు సూచిస్తున్నారు.

చక్కెర బాధితులు తినదగ్గ దుంప... చిలగడదుంప!

భూమిలో పండే దుంపలు షుగర్ బాధితులకు మంచివి కావనీ, ఎందుకంటే అందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువ కాబట్టి డయాబెటిస్ బాధితుల్లో చక్కెర మోతాదులను పెంచేస్తాయని నిపుణులు చెబుతుంటారు. అందుకే చాలామంది షుగర్ బాధితులు ఆలుగడ్డలు (బంగాళదుంపలు) తినడానికి వెనకాడుతుంటారు. అయితే మిగతా దుంపల విషయం ఎలా ఉన్నా... చిలగడదుంపలతో మాత్రం ఆ ప్రమాదం లేదంటున్నారు ఆహార నిపుణులు. దీని నుంచి విడుదల అయ్యే చక్కెర మోతాదులు చాలా తక్కువ. అంటే ఇవి తిన్నప్పుడు వీటిలోంచి వెలువడే చక్కెర తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ (లో- గ్లైసిమిక్ ఇండెక్స్) ఉండటం వల్ల దీనితో అంతగా ప్రమాదం ఉండదనీ, పైగా ఇందులో విటమిన్-ఏ కూడా ఎక్కువగా ఉన్నందున చక్కెర వ్యాధి ఉన్నవారు ఈ దుంపను తినవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే దాన్ని పరిమితంగా తీసుకోవడమే మంచిది.

భారత్ 91వ గ్రాండ్‌మాస్టర్‌గా వీఎస్ రాహుల్

భారత చదరంగంలో తమ స్థాయిని ప్రదర్శిస్తున్న తమిళనాడు చెస్ స్టార్ల జాబితాలో మరో కుర్రాడు చేరాడు. చెన్నైకి చెందిన వీఎస్ రాహుల్ శనివారం భారత్ 91వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించాడు. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో జరుగుతున్న ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన తర్వాత చివరి జీఎం నార్మ్ దక్కడంతో రాహుల్ గ్రాండ్‌మాస్టర్ ఘనతను సొంతం చేసుకున్నాడు. 21 ఏళ్ల రాహుల్ గతంలో ఆసియా జూనియర్ చాంపియన్‌గా కూడా నిలిచాడు. 2021లో అతనికి మొదటిసారి ఇంటర్నేషనల్ మాస్టర్ నార్మ్ లభించింది. లైవ్ రేటింగ్స్‌లో 2400 దాటక ముందే అతను నాలుగో, ఐదో ఐఎం నార్మ్‌లను గెలుచుకున్నాడు. ఎంబీఏ విద్యార్థి అయిన రాహుల్ చెన్నైలోని శ్యామ్ సుందర్ రాజ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. వారం రోజుల క్రితం అక్టోబర్ 30న చెన్నైకే చెందిన ఏఆర్ ఇలంపర్తి భారత 90వ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు దక్కించుకోగా, ఇప్పుడు అతి తక్కువ వ్యవధిలో మరో జీఎం రావడం విశేషం. కొత్త జీఎంగా నిలిచిన రాహుల్‌ను అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) అధ్యక్షుడు నితిన్ నారంగ్ అభినందించారు.

‘బంగభూషణ్’ రిచా ఘోష్

భారత క్రికెటర్‌కు బెంగాల్ ప్రభుత్వ సన్మానం

రూ. 34 లక్షల బహుమతి అందించిన ‘క్యాబ్’

కోల్‌కతా: మహిళల వన్డే వరల్డ్ కప్‌ను భారత జట్టు తొలిసారి గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించిన వికెట్ కీపర్ రిచా ఘోష్‌ను బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, మాజీ ప్లేయర్ జులన్ గోస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా బెంగాల్ రాష్ట్ర అత్యుత్తమ పౌర పురస్కారం ‘బంగభూషణ్’ను రిచాకు అందిస్తున్నట్లు ప్రకటించిన మమతా బెనర్జీ దీనికి సంబంధించిన మెడల్‌ను అందజేశారు. దీంతో పాటు బెంగాల్ పోలీస్ శాఖలో రిచాను డిప్యూటీ సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నియమిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వరల్డ్ కప్‌లో 133.52 స్ట్రయిక్ రేట్‌తో 235 పరుగులు సాధించిన రిచా...ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యురాలిగా ఉన్న తొలి బెంగాల్ క్రికెటర్‌గా గుర్తింపు పొందింది. రిచాపై ప్రశంసల వర్షం కురిపించిన గంగూలీ భవిష్యత్తులోనూ ఆమె ఇదే జోరును కొనసాగించడంతో పాటు ముస్ముందు భారత కెప్టెన్ కూడా కావాలని ఆశీర్వదించారు. ‘క్యాబ్’ తరఫున రిచాకు బంగారు తాపడంతో చేసిన ఒక ప్రత్యేక బ్యాట్‌ను బహూకరించడంతో పాటు రూ.34 లక్షల నగదు పురస్కారాన్ని అందించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో రిచా 34 పరుగులు సాధించగా, ఆమె చేసిన ఒక్కో పరుగుకు ఒక్కో లక్ష చొప్పున ఈ బహుమతిని ఇస్తున్నట్లు ‘క్యాబ్’ ప్రకటించింది. మరో వైపు గంగూలీ ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులోనైనా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి అధ్యక్షుడవుతారని, అందుకు అన్ని విధాలా ఆయన అర్హుడని మమతా బెనర్జీ ఆకాంక్షించారు.

మ్యాచ్ రద్దు... మన ఖాతాలో సిరీస్

ఆస్ట్రేలియా, భారత్ చివరి టి20కి వర్షం దెబ్బ

- సిరీస్ గెలుచుకున్న టీమిండియా

బ్రిస్బేన్: వర్షంతో మొదలైన భారత్, ఆస్ట్రేలియా టి20 సిరీస్ చివరకు వర్షంతోనే ముగిసింది. శనివారం ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో టి20 మ్యాచ్ వాన కారణంగా అర్ధాంతరంగా రద్దయింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 4.5 ఓవర్లలో 52 పరుగులు చేసింది. ఈ దశలో వెలుతురులేమి కారణంగా మ్యాచ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. అయితే ఆ తర్వాత వచ్చిన వర్షం ఎంతకీ తగ్గలేదు. దాంతో చివరకు ఆటను అంపైర్లు రద్దు చేయక తప్పలేదు. ఆడింది 29 బంతులే అయినా ఓపెనర్లు అభిషేక్ శర్మ (13 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (16 బంతుల్లో 29 నాటౌట్; 6 ఫోర్లు) క్రీజ్‌లో ఉన్నంత సేపు దూకుడు ప్రదర్శించారు. ఈ క్రమంలో అభిషేక్‌కు అదృష్టం కూడా కలిసొచ్చింది. తొలి ఓవర్లోనే 5 పరుగుల వద్ద అతను ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ వదిలేయగా, 11 పరుగుల వద్ద మరో క్యాచ్‌ను డ్వార్‌షుయిస్ అందుకోలేకపోయాడు. మరో వైపు డ్వార్‌షుయిస్ ఓవర్లోనే 4 ఫోర్లు బాది గిల్ ధాటిని చూపించాడు. 161.38 స్ట్రైక్‌రేట్‌తో మొత్తం 163 పరుగులు చేసిన అభిషేక్ శర్మకు ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డు దక్కింది. సిరీస్ తొలి మ్యాచ్ రద్దు కాగా, మెల్‌బోర్న్‌లో జరిగిన రెండో పోరులో ఆసీస్ గెలిచింది. ఆ తర్వాత హోబర్ట్, కరారాలలో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి పైచేయి సాధించిన భారత్ చివరకు 2–1తో సిరీస్ సొంతం చేసుకుంది. భారత్ తమ తర్వాతి పోరులో సొంతగడ్డపై నవంబర్ 14 నుంచి జరిగే టెస్టు సిరీస్‌లో బరిలోకి దిగనుండగా... నవంబర్ 21 నుంచి ఇంగ్లండ్‌తో ‘యాషెస్’లో ఆసీస్ తలపడుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

> ‘ఆస్ట్రేలియా పర్యటన కోసం చాలా కాలంగా ఎదురు చూశాను. ఇక్కడ పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నాయి. మేం మరింత భారీ స్కోర్లు సాధించాల్సింది. అయితే జట్టు సిరీస్ గెలవడం ముఖ్యం. టీమ్ మేనేజ్‌మెంట్ నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. నేను వరుసగా 15 మ్యాచ్‌లలో డకౌట్ అయినా నా స్థానానికి ఢోకా ఉండదని చెప్పింది. అందుకే తొలి బంతినుంచే ధైర్యంగా, దూకుడుగా ఆడగలుగుతున్నా. తొలిసారి టి20 ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నా’
>
> -అభిషేక్ శర్మ, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్

> ‘తొలి మ్యాచ్ ఓడిన తర్వాత కోలుకొని గెలిపించిన జట్టు సభ్యులకు అభినందనలు. ప్రతీ ఒక్కరికి తమ బాధ్యతపై స్పష్టత ఉంది. పేసర్లు, స్పిన్నర్లు అంతా సమష్టిగా రాణించారు. దాని వల్లే మేం అనుకున్న ప్రణాళికలను సమర్థంగా అమలు చేయగలిగాం. ప్రపంచ కప్ కోసం సిద్ధంగా ఉన్న ఎంతో మంది ప్లేయర్లు మా జట్టులో ఉండటం చాలా మంచి విషయం. వరల్డ్ కప్‌కు ముందు ఉన్న 2–3 సిరీస్‌లు సన్నాహకంగా ఉపయోగపడతాయి. జట్టులోని ప్రతీ ఒక్కరికి తమదైన ప్రత్యేక ప్రతిభ ఉండటం కెప్టెన్‌గా నా అదృష్టం. బ్యాటింగ్ ఆర్డర్ విషయంలో ఎలాంటి ప్రయోగాలు చేయకుండా గత కొన్ని నెలలుగా మంచి ఫలితాలు సాధించగలిగాం. ఎలాంటి లోపాలు లేవని చెప్పను. ఎందుకంటే నేర్చుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది’
>
> -సూర్యకుమార్ యాదవ్, భారత కెప్టెన్

528 ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లో అత్యంత వేగంగా (528 బంతుల్లో) 1000 పరుగులు పూర్తి చేసుకున్న ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు.

గుకేశ్ నిష్క్రమణ

నాలుగో రౌండ్‌కు హరికృష్ణ, అర్జున్ • ప్రపంచ కప్ చెస్

పనాజీ (గోవా): ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ కప్ చెస్‌లో ముందంజ వేయడంలో విఫలమయ్యాడు. శనివారం జరిగిన మూడో రౌండ్‌లోనే అతను నిష్క్రమించాడు. జర్మనీకి చెందిన ఫ్రెడరిక్ స్వేన్ 1.5–0.5 తేడాతో గుకేశ్‌ను ఓడించాడు. నల్ల పావులతో తొలి గేమ్‌ను డ్రా చేసుకొని రెండో గేమ్‌లో విజయం కోసం బరిలోకి దిగిన గుకేశ్‌కు నిరాశాజనక ఫలితం ఎదురైంది. స్వేన్ ఒత్తిడిని అధిగమించి 55 ఎత్తుల్లో గెలుపొందాడు. ఇతర భారత ఆటగాళ్లలో అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణ, ప్రజ్ఞానంద, ప్రణవ్ నాలుగో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. మూడో రౌండ్‌లో ప్రజ్ఞానంద 42 ఎత్తుల్లో ఆర్మేనియాకు చెందిన రాబర్ట్ హోవ్‌హనిసన్‌పై గెలుపొందాడు. షంషుద్దీన్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన పోరులో తొలి గేమ్‌ను గెలుచుకున్న అర్జున్ రెండో గేమ్‌లో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా గేమ్‌ను డ్రాగా ముగించి 1.5–0.5తో ముందంజ వేశాడు. తర్వాతి పోరులో పీటర్ లెకో (హంగేరీ)తో అర్జున్ తలపడతాడు. డానియెల్ డార్డా (బెల్జియం)తో జరిగిన మూడో రౌండ్‌లో తొలి గేమ్‌ను గెలుచున్న హరికృష్ణ తర్వాతి గేమ్‌ను డ్రా చేసుకొని నాలుగో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మరో వైపు ఈ టోర్నీలో అత్యధిక సీడింగ్ ఉన్న విదేశీ ఆటగాడు అనీశ్ గిరి (నెదర్లాండ్స్) కూడా నిష్క్రమించాడు. రష్యాకు చెందిన అలెగ్జాండర్ డాన్‌చెన్‌కో 47 ఎత్తుల్లో అనీశ్‌ను చిత్తు చేశాడు. తమ మూడో రౌండ్‌లో తొలి గేమ్‌లను డ్రాలుగా ముగించిన విదిత్ గుజరాతీ, కార్తీక్ వెంకటరామన్, జీఎం నారాయణన్ ఆదివారం టైబ్రేక్ రౌండ్ ఆడతారు.

సాక్షి సినిమా

ఇఫీలో రజనీకాంత్‌కి సత్కారం

- భానుమతీ రామకృష్ణతో సహా పలువురు ప్రముఖుల శత జయంతి వేడుకలు

సాధారణ బస్ కండక్టర్ నుంచి చిత్రసీమలోకి వచ్చి సూపర్ స్టార్‌గా ఎదిగిన రజనీకాంత్‌కి 56వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో సత్కారం జరగనుంది. గోవా వేదికగా ఈ నెల 20న ఆరంభమయ్యే ఈ ‘ఇఫీ 2025’ వేడుక 28 వరకూ సాగుతుంది. ముగింపు రోజున రజనీకి సత్కారం జరగనుంది. 1975లో ‘అపూర్వ రాగంగళ్’ చిత్రం ద్వారా నటుడిగా పరిచయమై, తొలి నాళ్లల్లో విలన్‌గా, ఆ తర్వాత హీరోగా తిరుగులేని సూపర్ స్టార్ అనిపించుకున్న రజనీ 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. చిత్రరంగానికి సుదీర్ఘ సేవలు అందించినందుకుగానూ రజనీకాంత్‌ని ఘనంగా సత్కరించాలని ‘ఇఫీ’ నిర్ణయించుకుంది. అలాగే గత ఏడాది అక్కినేని నాగేశ్వరరావు, రాజ్ కపూర్, తపన్ సిన్హా, మొహమ్మద్ రఫీ వంటి లెజెండ్స్ శత జయంతి వేడుకలు నిర్వహించినట్లుగా ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది ‘ఇఫీ’. ప్రముఖ తెలుగు నటి–దర్శక–నిర్మాత–గాయని పి. భానుమతీ రామకృష్ణ, ప్రఖ్యాత నటుడు–దర్శక–నిర్మాత గురుదత్, మరో ప్రముఖ దర్శక–నిర్మాత రాజ్ ఖోస్లా, గొప్ప ఫిల్మ్ మేకర్‌గా పేరు తెచ్చుకున్న దర్శక–రచయిత రిత్విక్ ఘటక్, లెజెండరీ సింగర్–రైటర్–మ్యూజిక్ డైరెక్టర్ భూపేన్ హజారికా, మరో ప్రముఖ గాయకుడు–రచయిత సలీల్ చౌదరిల శత జయంతి వేడుకలు ‘ఇఫీ 2025’లో జరగనున్నాయి. ఈ స్టార్స్‌కి సంబంధించిన ఒక్కో ‘ఐకానిక్ ఫిల్మ్’ని ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శించనున్నారు.

ఒక రోజులో జరిగే కథ...

- శ్వేత, కన్రాడ్ కె. సంగ్మా, వేణు

టీన్నూ ఆనంద్, ఉపేంద్ర లిమయే, జార్జ్ మరియన్, రాజా రవీంద్ర, అక్షయ్ లఘుసాని, మాల్వి మల్హోత్రా ముఖ్య తారలుగా రూపొందుతోన్న చిత్రం ‘బా బా బ్లాక్ షీప్’. గుణి మంచికంటిని దర్శకునిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ మేఘాలయలో జరుగుతోంది. వేణు దోనేపూడి మాట్లాడుతూ– ‘‘ఒక రోజులో జరిగే కథతో తెరకెక్కుతోన్న చిత్రం ‘బా బా బ్లాక్ షీప్’. ఆరుగురి మధ్య సాగే ఆసక్తికరమైన కథ ఇది. గన్స్, గోల్డ్, హంట్ అంటూ ఆసక్తికరంగా ఉంటుంది. ‘బా బా బ్లాక్ షీప్’ కోసం మేఘాలయ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నాం. ఇటీవల మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ కె. సంగ్మాగారిని కలిశాం. మేఘాలయలో షూటింగ్ కోసం తమ వంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు సీఎం. మేఘాలయలో పూర్తి స్థాయిలో షూటింగ్ చేసుకుంటున్న తొలి చిత్రం మాదే. ఈ చిత్రకథ మొత్తం నార్త్, ఈస్ట్ ఇండియాలో సాగుతుంది కాబట్టి ఇక్కడే చిత్రీకరిస్తున్నాం. జలపాతాలు, కొండలు, అందమైన ప్రదేశాల్లో సాగే కథ ఇది’’ అని చెప్పారు.

ఒక్క నెగెటివ్ కామెంట్ కూడా కనిపించలేదు - తిరువీర్

- తిరువీర్, టీనా శ్రావ్య

‘‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ మూవీ కోసం మేం ఆర్థికంగా చాలా కష్టపడ్డాం. ఈ ప్రయాణంలో మీడియా మాకు అండగా నిలిచింది. మా సినిమాపై ఎక్కడా ఒక్క నెగెటివ్ కామెంట్ కనిపించలేదు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ప్రోత్సహిస్తున్న మీడియా, సోషల్ మీడియాకు ధన్యవాదాలు’’ అని తిరువీర్ చెప్పారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో తిరువీర్, టీనా శ్రావ్య జోడీగా మాస్టర్ రోహన్ కీలక పాత్రలో నటించిన చిత్రం ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’. సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని నిర్మించారు. కల్పనా రావు సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన బ్లాక్ బస్టర్ ఫన్ షో కార్యక్రమంలో దర్శకుడు, రచయిత బీవీఎస్ రవి మాట్లాడుతూ–‘‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ లాంటి చిన్న చిత్రాలు ఆడితే కొత్త హీరోలు, దర్శకులకు అవకాశాలు వస్తాయి. ‘బలగం’ తర్వాత మళ్లీ అలాంటి అనుభూతినిచ్చిన చిత్రమిదే. ఈ మూవీకి చాలా అవార్డులు వస్తాయి’’ అని చెప్పారు. ‘‘మా సినిమాని ఆడియన్స్ పెద్ద హిట్ చేశారు’’ అన్నారు రాహుల్ శ్రీనివాస్. ‘‘ఇలాంటి మంచి చిత్రాన్ని నిర్మించినందుకు నా సన్నిహితులు, మిత్రులు, కుటుంబ సభ్యులంతా మెచ్చుకోవడం సంతోషంగా ఉంది’’ అని సందీప్ అగరం పేర్కొన్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్

- యామిని, నందు

నందు, యామినీ భాస్కర్ జోడీగా నటించిన చిత్రం ‘సైక్ సిద్ధార్థ’. వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీనందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి నిర్మించారు. డిసెంబరు 12న ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీనందు మాట్లాడుతూ– ‘‘యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘సైక్ సిద్ధార్థ’. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే సినిమా. మా సినిమాని, టీమ్‌ని ప్రోత్సహించిన సురేష్‌బాబు, రానాగార్లకు థ్యాంక్స్. ఇప్పటివరకు నాలో చూడని కొత్త కోణం ఈ చిత్రంలో కనిపిస్తుంది’’ అన్నారు. ‘‘చాలా కొత్తగా అనిపించే చిత్రమిది’’ అని వరుణ్ రెడ్డి చెప్పారు. ‘‘మా టీమ్ అందరూ నమ్మకంతో చేశాం. ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం’’ అని యామిని పేర్కొన్నారు.

తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో...

- రాజ్ నరేంద్ర, నిహార్, గాంధీ, షాలిని, మల్లికార్జున్

రఘు బాబు, నాగదుర్గ, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్య నారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం ‘కలివి వనం’. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ చిత్రం విడుదల తేదీని, ట్రైలర్‌ని పలువురు సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టుల చేతుల మీదుగా విడుదల చేయించారు. రాజ్ నరేంద్ర మాట్లాడుతూ– ‘‘వనాలను సంరక్షించుకోవాలనే అంశంతో మంచి సందేశాన్నిస్తూ తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో చిత్రీకరించిన సినిమా ‘కలివి వనం’. తల్లిదండ్రులు తమ పిల్లల్ని, పిల్లలు తమ తల్లిదండ్రుల్ని కచ్చితంగా తీసుకెళ్లాల్సిన సినిమా ఇది. మా చిత్రం పిల్లల జీవిత శైలిలో ఒక పాఠ్య భాగంలా, పెద్దబాల శిక్షలో ఒక పేజీలాగా వాళ్ల మైండ్‌లో ఉండిపోతుంది’’ అని తెలిపారు. ‘‘ఇలాంటి మంచి సినిమాకు సంగీతం అందించే అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు’’ అన్నారు మదీన్ ఎస్.కె. ‘‘మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ మూవీ చిన్నది కాదు... పెద్ద సినిమా. అందరూ ఆదరించాలి’’ అని సమ్మెట గాంధీ పేర్కొన్నారు.

నేను చూసిన సమస్యనే సినిమాగా తీశాను - సంజీవ్ రెడ్డి

‘‘సంతాన ప్రాప్తిరస్తు’ సినిమాలో ప్రేమకథ ఉంటుంది. కుటుంబ భావోద్వేగాలతో పాటు వినోదం ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం సమాజంలో చాలామంది ఎదుర్కొంటున్న ఓ చిన్న సమస్యను కూడా చూపించాం’’ అని డైరెక్టర్ సంజీవ్ రెడ్డి చెప్పారు. విక్రాంత్, చాందినీ చౌదరి జోడీగా నటించిన చిత్రం ‘సంతాన ప్రాప్తిరస్తు’. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు సంజీవ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ– ‘‘ప్రస్తుతం సమాజంలో ఫెర్టిలిటీ ఇష్యూస్ ఉన్నాయి. మేల్ ఫెర్టిలిటీ అనే సమస్య నేపథ్యంగా ఇప్పటి దాకా తెలుగులో ఏ మూవీ రాలేదు. నాకు తెలిసిన ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్ కొందరు ఇలాంటి ఇష్యూస్‌తో బాధ పడ్డారు. వారికి ఆధునిక వైద్యంతో పిల్లలు పుట్టినప్పటికీ వారు సొసైటీ నుంచి, ఫ్యామిలీ మెంబర్స్ నుంచి ఎదుర్కొన్న ఇబ్బందులు చూశాను. ఈ కాన్సెప్ట్‌తో సినిమా చేస్తే బాగుంటుందని ‘సంతాన ప్రాప్తిరస్తు’ స్క్రిప్ట్ రెడీ చేశాను. ఇలా నేను చూసిన సమస్యతోనే ఈ సినిమా చేశాను. విక్రాంత్‌కి ఈ కథ బాగా నచ్చింది. ఫెర్టి లిటీ ఇష్యూ అనేది మాట్లాడకూడని అంశం కాదు... సమాజం ఎదుర్కొంటున్న ఒక సమస్య. మా సినిమాని చూసేందుకు పిల్లలు లేని కపుల్స్ గానీ ఫ్యామిలీ ఆడియన్స్ గానీ ఇబ్బంది పడరు. ఇప్పటిదాకా నాలుగు గోడల మధ్యనే మాట్లాడుకునే ఫెర్టిలిటీ అంశాన్ని మా సినిమా చూశాక బహిరంగంగా మాట్లా డతారని అనుకుంటున్నాం’’ అని చెప్పారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

దెయ్యం వదిలిందా...లేదా?

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో కన్నడ చిత్రం ‘సు ఫ్రమ్ సో’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

నమ్మకమనేది బలం, అపనమ్మకమనేది బలహీనత. సమస్య ఏదైనా, ఎవరిదైనా, ఎక్కడైనా సరే పరిష్కారమనేది ఆలోచనా బలంలో ఉంటుంది. ఆ పరిష్కారం ఒక్కోసారి మనకు అపనమ్మకంతో కనబడదు. అందుకే నమ్మకమనే బలంతో ఆలోచన చేయాలి. ఈ నేపథ్యంలో అల్లుకున్న కథే ‘సు ఫ్రమ్ సో’ (సులోచన ఫ్రమ్ సోమేశ్వర) సినిమా. ఈ కథను తానే రాసి, దర్శకత్వం వహించి, ప్రధాన పాత్రలో కూడా నటించి అలరించారు జేపీ తుమినాడ్. రూ. ఆరు కోట్లతో తీస్తే రూ. 125 కోట్ల లాభం తెచ్చి పెట్టిన సంచలనాత్మక చిత్రమిది. టాలీవుడ్‌లోని దిగ్గజ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందించింది. ‘సు ఫ్రమ్ సో సూపర్’ కామెడీ సినిమా. ఈ సినిమా కథను నడిపే ప్రధాన పాత్రలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయనడంలో సందేహం లేదు. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం... తీర ప్రాంతంలోని మార్లూరు అనే ఓ చిన్న పల్లెటూరులో నడిచే కథ ఇది. ఆ ఊర్లో ఉన్న అశోక్ అనే వ్యక్తి ఓ అందమైన అమ్మాయిని చూసి, ఇష్టపడతాడు. ఓ రాత్రి ఆ అమ్మాయి ఒంటరిగా ఉన్నప్పుడు తాగిన మత్తులో అశోక్ కలవబోతే ఊరివాళ్ళు కొట్టడానికి వస్తారు. అశోక్ భయంతో తనలో కల్పన అనే దెయ్యం ఆవహించిందని నాటకమాడతాడు. ఊరివాళ్ళు దానిని సోమేశ్వరలో చనిపోయిన సులోచన అని అర్థం చేసుకుని భయంతో వణికిపోతారు. అశోక్ ఈ ఘటనతో తప్పించుకున్నానని అనుకుంటాడు కానీ అసలు కష్టాలు అక్కడి నుండే తనకు ప్రారంభమవుతాయి. దెయ్యం పూనిన అశోక్‌ని ఆ ఊరివాళ్ళు ఓ ఇంట్లోని గదిలో బంధించి కరుణాకరన్ అనే పూజారిని ఆ లేని దెయ్యాన్ని వదలగొట్టడానికి పిలిపిస్తారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే... అశోక్‌కి నిజంగా దెయ్యం పట్టలేదు, అలాగే వచ్చిన పూజారి కరుణాకరన్‌కు దెయ్యం వదలగొట్టే పూజలు తెలియవు. ఊళ్ళో పెద్ద అని పిలుచుకునే రవన్నతో పాటు ఆ ఊరిలో ఉండే మరో నలుగురు ఈ అశోక్‌కి పట్టిన లేని దెయ్యాన్ని వదలగొట్టడానికి ఊహించని ప్రయత్నాలన్నీ చేస్తుంటారు. మరి... ఊరివాళ్ళ దృష్టిలో అశోక్‌కి పట్టిన దెయ్యం వదిలిందా లేదా అన్నది మాత్రం ‘సు ఫ్రమ్ సో’లోనే చూడాలి. ఈ సినిమా సరదాగా సాగిపోతుంది. ‘సు ఫ్రమ్ సో’ కన్నడ సినిమా అయినా జియో హాట్ స్టార్ వేదికగా తెలుగులోనూ లభ్యమవుతోంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇది. ఇంకెందుకు ఆలస్యం... చూసేయండి.

– హరికృష్ణ ఇంటూరు

వధువు కావలెను

బెస్త, గంగపుత్ర/ B.Tech / Govt. లైన్ ఇన్స్పెక్టర్/ఎలక్ట్రికల్ Dept/10 Lakhs. PA /5'10"ఎత్తు/29 సం။ల అందమైన వరునికి వధువు కావలెను. Ph 9618007652 [HA-16124]

క్రిస్టియన్ మాల / M.Tech / C.Govt. కో ఆఫీసర్ / N.H / 1 Lakh. PM /5'11" ఎత్తు/30 సం။ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16124]

యాదవ /B.Tech, NIT/ సాఫ్ట్వేర్ టీమ్ లీడర్/40 Lakhs. PA/5'11" ఎత్తు/ 28 సం။ల అందమైన వరునికి వధువు కావలెను. 8297439565 [HA-16124]

SC మాల /కట్న ప్రసక్తి లేదు/B.Tech/ C. Govt.ACTO/గ్రూప్-II ఆఫీసర్ /90,000/- PM / 5'10"ఎత్తు / 29 సం။ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16124]

మాదిగ/ 28 / 5'8"/ M.Tech / Govt. ఇంజినీర్ /HAL / 90,000/-PM / వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8790016395 [HA-16124]

యాదవ/కట్న ప్రసక్తి లేదు/B.Tech/ Govt. Jr.Asst./ రెవెన్యూ Dept/ 40,000/- PM / 5'10" ఎత్తు / 29 సం။ల వరుడికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-16124]

నో. బ్రో. డైరెక్ట్/డివోర్సీ, రిటైర్డ్, ప్రముఖ వ్యక్తికి స్నేహపూర్వక వధువు రెండో పెళ్లికి కావాలి. (తెలుగు రాష్ట్రాల మరియు ఇతర రాష్ట్రాల వారు కూడా OK) సంప్ర : Ph: 9951881755 [H-801301]

కుల పట్టింపు లేదు, 50 సం.లు, C.Govt. Job, సొంత ఇల్లు ఏ బాదరబందీ లేని వరునికి సంప్రదాయ కుటుంబం పిల్లలు లేని లేట్, 2వ, విడో వధువు కావలెను. 9499947658 [H-801301]

Setti Balija, 31 B.Tech, LLB Hyd Own House & Good Properties, NICE GROOM Looking for Suitable Bride. Direct. 9246558487 [HA-503]

★★

SC మాల/M.Tech, Civil, Pvt. Job + బిజినెస్ ఎత్తు 5'6",33 సం॥ అందమైన వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్ సంప్రదించండి. 9441286029 [H-783645]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, MBA, 28, 6' 2", 120 Crores, USA, Handsome. Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), 27, 6', Product Engineer, 24 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BBE, MS, 33, 6' 1", Software, 180 K, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA (ISB), 27, 5' 6", 31 L P/A, Hyderabad, Rich Family Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Singapore, BE, MS, 28, 5' 7", Data Analyst, 120 K, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 8", Sr. SWE, 25 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIIT), MSc, 29, 5' 10", 50 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MS, 29, 5' 6", 70 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డిMBBS, MD, 27, 6', Doctor, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 33, 5' 8", Engineer, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 28, 5' 6", Dentist, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 3", Engineer, 250 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 3", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BBA, MBA, 26, 5' 7", Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కుల, కట్న ప్రసక్తి లేదు, Govt. జాబ్, సొంత ఇల్లు,రాజులు, 2వ పెళ్లి, 46 సం. వరునకు మంచి గుణము, సాంప్రదాయ మైన వధువు కావలెను. 9573428169 [B-1280547]

Reddy boy (34) / 6 ft., Sankupala / Swathi, MS (USA), US Citizen, in Atlanta, divorcee, No encumbrance Seeks studied Reddy bride (even divorcee without encumbrance), willing to settle in US. thatimakula_sudha@yahoo.com/ Contact: 9000868636 [T-2615]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, మత భేదము లేకుండా అన్ని వయస్సుల వారికి సంబంధాలు మా వద్ద కలవు/ Age: 40, MBA/Govt.Job గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము ఓకే). Ph: 9063623252 [H-801301]

రెడ్డి/2nd (కుల, ఆస్తి) పట్టింపు లేదు, 32Y, MBA/ Pvt Job, Own House, Property's గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK). అన్ని వయస్సుల వారికి 1st & 2nd సంబంధాలు కలవు. Ph: 9030062353 [H-8013010]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 35/Qly: Degree. Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) Ph: 8074131208 [H-801301]

SC హిందూ మాల/B.Tech/C.Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/12 Lakhs. PA/5'5"ఎత్తు/26సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16124]

రజక/కట్న ప్రసక్తి లేదు / M.Tech / Govt. Asst.Exq. ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/ 80,000/- PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9550166072 [HA-16124]

SC హిందూ మాదిగ/B.Tech, NIT/C. Govt.A.A.O/LIC/10 Lakhs. PA/5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16124]

రజక/B.Tech / C.Govt. క్లర్క్ & క్యాషియర్ / కెనరా బ్యాంక్ / 40,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16124]

వైశ్య/50y / విడో / డిప్యూటీ తహసీల్దార్/ Own House & Rents/ 70 Acres Land/11 Lac Income / కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. 7702576930 [H-821218]

రెడ్డి/విడో/Govt. Rtd/గెజిటెడ్ ఆఫీసర్/సొంత ఇల్లు & Rents/30ఎకరాల పొలం/5L/-PM/ షాపింగ్ కాంప్లెక్స్ కలిగిన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 7095001526 [H-821218]

ఆస్తి కుల పట్టింపులేని అందమైన వధువుకి వరుడు కావలెను/49y/విడో/5'3"/ ఫ్యామిలీ పెన్షనర్ /60/-PM / ఆంధ్రాలో మామిడి తోటలు పిల్లలు లేరు. 9100867741 [H-821218]

కుల ప్రసక్తే లేదు/విడో/50y/విజయవాడ/ Hyd లో Own House (Rents) Well Settled పిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. 8519803423 [H-821218]

FC/ విడో/Fair/సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయ్/Own House & Rents గల వధువుకి వరుడు కావలెను. 9618752560 [H-821218]

దేవాంగ, పద్మశాలి, పట్టుశాలి, మొదటి సంబంధం. వయస్సు 26 to 35 సం॥లు, సొంత ఇల్లు, కుల వృత్తి ఉన్న అమ్మాయిలకి సాంప్రదాయ వరులు కావలెను. 8374364076. [A-1703]

బలిజ, శెట్టిబలిజ, లింగబలిజ, 1st మ్యారేజ్, 10th to డిగ్రీ, వయస్సు 25 to 34 సం॥లు. ఉన్న అమ్మాయికి ఆంధ్ర, తెలంగాణలో ఏదయినా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సెల్ : 8374364076. [A-1703]

చౌదరి, కమ్మ, నాయుడు, కాపునాయుడు, 1st మ్యారేజ్, వయస్సు 25 సం॥లు, అలాగే 30 to 40 ఉన్న వారికి సాంప్రదాయ కుటుంబ వారు కావలెను. సెల్ : 8374364076. [A-1703]

ఆచారులు, విశ్వబ్రాహ్మిన్స్, Age: 25 to 34 సం॥లు, సొంత ఇల్లు, 10th to డిగ్రీ. టైలరింగ్, టీచర్గా ఉన్న అమ్మాయిలకి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సెల్ : 8374364076. [A-1703]

రెడ్డి, కాపు, గౌడ్స్, 1st మ్యారేజ్, రెండవ పెళ్లి కొరకు Age: 27 to 45 సం॥లు వారికి ఏదయిన జాబ్ లేక బిజినెస్ వరులు కావలెను. సెల్: 8374364076. [A-1703]

మాదిగ: MBBS, MD (Gen.Med) DM (Neuro), /5'5/30Y/V.Fair 25Cr/ డాక్టర్గా చేస్తున్న వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్)గా సం.ప్ర ఫోన్: 92485 37764 [MH-124]

వేదికలు

కాకతీయ మ్యారేజస్ వారి అన్ని బ్రాంచెస్ లో పేదలకు ఫీజు లేకుండా అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9391 999 999 / 709 3200 333 [H-821108]

జై శ్రీరామ్-సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, బిజినెస్, VIP అబ్రాడ్ వారికి 1, 2 వ పెళ్ళి సంబంధాలు వ్యక్తిగత శ్రద్ధతో కుదర్చబడును. పూర్ణ మ్యాట్రిమోని,తిరుపతి,సంప్ర: 7093722724. [T-3295]

★★

1వ, 2వ, తోడు, ఒంటరి, రిటైర్డ్ సంబందాలు కలవు. అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్మెంట్ చేయబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. సంప్ర : 83095 25477 [SCA25009648]

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: (Chennai + Bengaluru + Delhi + Mumbai) 1800/- for 4 Lines 485/- Extra Line
Telangana: (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
Andhra Pradesh: (Incl. Hyd) 1350/- for 4 Lines 375/- Extra Line
* Color 25% Extra
గుంటూరు - 9912220356
కర్నూలు - 9010825556
తాడేపల్లిగూడెం-9912220558
తిరుపతి - 9912220586
విశాఖపట్నం - 9912220550
ఒంగోలు - 9912225431

పేదోడి ఇల్లు కూల్చివేత

- రాజకీయ కక్షతో టీడీపీ నేతల దాష్టీకం
- అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారుల దుశ్చర్య

పక్కా గృహాన్ని జేసీబీతో పగులగొడుతున్న దృశ్యం

తోటపల్లి గూడూరు: టీడీపీ నేతలు రాజకీయ కక్షతో ఓ దళితుడు ఇంటిని కూల్చేసిన దుశ్చర్య శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం తోటపల్లి శివారు డక్కుల వారిపాళెంలో శనివారం జరిగింది. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు ఈ దారుణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. డక్కులవారిపాళెంకు చెందిన మీదూరి శీనయ్య, ప్రత్యూష దంపతులు సర్వేనంబర్ 791–1ఏలో గల సొంత స్థలం 6 అంకణాల్లో ఇంటిని నిర్మించుకుంటున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు పథకం ప్రకారం ఆ స్థలాన్ని గ్రామ నత్తంగా రికార్డుల్లో తారుమారు చేశారు. ఆ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని తొలగించాలంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారం క్రితం పంచాయతీ కార్యదర్శి నోటీసు అందించారు. బాధిత కుటుంబ సభ్యులు తమ వద్దనున్న పత్రాలను పంచాయతీ కార్యదర్శికి చూపించినా పట్టించుకోలేదు.

భారీ బందోబస్తు నడుమ కూల్చివేత

పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులు దాదాపు 30 మంది పోలీసులతో శనివారం ఉదయం డక్కులవారిపాళెం చేరుకున్నారు. రెండు జేసీబీలతో పక్కా గృహాన్ని తొలగించేందుకు పూనుకున్నారు. అడ్డుకొన్న బాధితులను, వారి బంధువులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. కృష్ణపట్నం పోర్ట్ సీఐ రవినాయక్, స్థానిక ఎస్సై వీరేంద్రబాబు పర్యవేక్షణలో అధికారులు పక్కా గృహాన్ని నేలమట్టం చేశారు. బాధితుల రోదనలు, ఆక్రందనలతో ఆ ప్రాంతం శోకసముద్రంలో మునిగిపోయింది. ఇది అన్యాయమంటూ బాధితులు పోలీసులు, అధికారుల కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు.

రాజకీయ కక్ష సాధింపే

వైఎస్సార్సీపీ సానుభూతిపరుడననే కారణంతో టీడీపీ నాయకులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధితుడు మీదూరు శీనయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ తమ సొంత పట్టా భూమిలోని స్థలంలో 27 ఏళ్లుగా అనుభవంలో ఉన్నామన్నారు. ఆ స్థలంలో ఐదేళ్లగా పక్కా గృహాన్ని నిర్మించుకుంటూ శ్లాబ్ కూడా పూర్తి చేసుకున్నామన్నారు. టీడీపీ నాయకుడు కొండూరు వెంకటేశ్వర్లు తమపై పగబట్టి అధికారుల అండతో తమ నివాసాన్ని కూల్చేందుకు పన్నాగం పన్నాడన్నారు. అధికారులు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పట్టా భూమిని గ్రామ నత్తంగా చిత్రీకరించి అన్యాయంగా ఇంటిని కూలదోశారన్నారు. కాయకష్టం చేసుకున్న నగదు కొంత, బ్యాంక్ రుణం తెచ్చి దాదాపు రూ.10 లక్షలు ఇంటి నిర్మాణానికి ఖర్చు పెట్టామన్నారు. తమకు తీరని అన్యాయం జరిగిందని, ఈ అన్యాయంపై కోర్టును ఆశ్రయిస్తామమని చెప్పారు.

మానవత్వం మరచిన 'పల్లె'

- బైక్ను ఢీకొట్టిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి కాన్వాయ్ వాహనం
- దంపతులకు గాయాలు
- పట్టించుకోకుండా వెళ్లిపోయిన 'పల్లె'
- బాధితులపైనే పల్లె గన్మెన్ దౌర్జన్యం

బైక్పై నుంచి కింద పడిన తన చిన్నారిని హత్తుకుంటున్న తండ్రి

ధర్మవరం: టీడీపీకి చెందిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి మానవత్వం మరచిపోయారు. ఆయన కాన్వాయ్లోని ఓ వాహనాన్ని ఢీకొంది. అయినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సమీపంలో ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి ధర్మవరం మీదుగా పుట్టపర్తికి వెళ్తున్నారు. ఆయన కాన్వాయ్ వేగంగా వెళుతూ అందులోని ఓ వాహనం ప్రమాదవశాత్తూ ముందు వెళ్తున్న బైక్ను ఢీకొట్టింది. బైక్పై ప్రయాణిస్తున్న ధర్మవరం మండలం ఓబుళనాయనపల్లికి చెందిన తనీల్, ప్రవళ్లిక దంపతులు గాయపడ్డారు. తనీల్ కాళ్లకు, ప్రవల్లిక చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. రోడ్డుపై ఎగిరిపడ్డ వారి ఆరు నెలల చిన్నారి తన్విక్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు గాయపడ్డ వారిని రోడ్డు పక్కన కూర్చోబెట్టారు. పల్లె రఘునాథ్రెడ్డి కారు దిగి బయటకు వచ్చినా కనీసం వారిని పరామర్శించలేదు. పైపెచ్చు ఆయన గన్మెన్ బాధితులపై దౌర్జన్యానికి దిగారు. రోడ్డుకు అడ్డంగా ఎలా వెళ్తారంటూ పరుష పదజాలంతో దూషించారు. స్థానికులు బాధితులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బ్లూ జోన్ ఆహారం..
నిండు నూరేళ్ల ఆరోగ్యం

→ అక్కడి ప్రజల్లో నూరేళ్లు దాటినా.. ఏమాత్రం చేవ తగ్గకుండా, శారీరక పటుత్వంతో ఉంటున్నారు. చాలామంది 90వ పడిలో ఉన్నా.. హృద్రోగాలు వారిని దరి చేరడం లేదు. నీరసం, నిస్సత్తువ, అనారోగ్యాల గురించి ఎప్పుడోగానీ వినరట. ఆసక్తికరంగా అనిపించే ఆ ప్రాంతాలే 'బ్లూ జోన్స్'. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 5 ప్రాంతాల ప్రజలు.. దీర్ఘాయుష్మంతులు. కొన్ని ప్రాంతాల్లో శతాయుష్మంతులు. ఇంతకీ ఎక్కడ ఉన్నాయా ప్రాంతాలు.. వారి ఆరోగ్య రహస్యం ఏమిటి?

..: సాక్షి, స్పెషల్ డెస్క్ :..

బ్లూ జోన్.. అంటే దీర్ఘాయుష్మంతులు, శతాధిక వృద్ధులు ఉండే ప్రాంతాలు. అమెరికాకు చెందిన డాన్ బ్యూటనర్ అనే రచయిత, జర్నలిస్ట్ ఈ 'బ్లూ జోన్' సృష్టికర్త. ఇలాంటివి 5 ప్రదేశాలను ఆయన గుర్తించాడు. అవి

1. గ్రీస్ దేశంలోని ఇకారియా. ఇదో ద్వీపం
2. ఇటలీలోని సార్డీనియా ద్వీపంలోని ఓగ్లియాస్ట్రా
3. జపాన్లోని ఒకినావా
4. కోస్టారికా దేశంలోని నికోయా ద్వీపకల్పం
5. కాలిఫోర్నియాలోని లోమాలిండా ప్రాంతం

లక్షలో 68 మంది!

1999లో జరిగిన అధ్యయనం ప్రకారం.. సార్డీనియాలో ప్రతి లక్ష మంది జనాభాకు 13 మంది శతాధిక వృద్ధులు ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంత జనాభా 15.6 లక్షలు

→ జపాన్లోని ఒకినావాలో ప్రతి లక్ష మందికి 68 మంది.. నూరేళ్లకుపైగా వయసున్నవారు ఉన్నారు. ఈ ప్రాంత జనాభా సుమారు 15 లక్షలు. ప్రపంచంలోని అత్యంత వృద్ధ మహిళలు ఇక్కడే ఉన్నారు.

→ సుమారు 9వేల జనాభా ఉండే ఇకారియా మూడోవంతు మంది 90వ పడిలో ఇంకా ఆరోగ్యంగానే ఉన్నారట.

→ సుమారు 25 వేల జనాభా ఉండే లోమా లిండాలో.. 9,000 మంది ఈ బ్లూ జోన్ కిందకు వస్తారు. అమెరికన్ల సగటు ఆయుర్దాయం 78 సంవత్సరాలు కాగా, వీరిది సుమారు 88 సంవత్సరాలకుపైనే అని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

→ సుమారు 2 లక్షల జనాభా ఉండే నికోయాలో కూడా సగటు ఆయుర్దాయం 85 ఏళ్లకుపైనేనట.

ఇవే వీరి ఆరోగ్య రహస్యం

పండ్లు, కూరగాయలు
తమ ప్రాంతాల్లో ఎక్కువగా దొరికే పండ్లు, కూరగాయలు. ప్రధానంగా బఠానీలు, లెట్యూస్, ఉల్లికాడలు, బొప్పాయి, చిక్కుళ్లు

తృణధాన్యాలు
ఓట్స్, బార్లీ, బ్రౌన్రైస్, జొన్న పొడి

ఆరోగ్యకరమైన కొవ్వులు
ఆలివ్ నూనె, అవకాడో

గింజలు
బాదం, పిస్తా, అక్రోట్లు

మాంసాహారం
చేపలు (చాలా ప్రాంతాల్లో వారంలో మూడుసార్లు), చాలా తక్కువ రెడ్ మీట్.

పానీయాలు
ఎక్కువ నీరు, కొన్ని ప్రాంతాల్లో గ్రీన్ టీ.

శారీరక వ్యాయామం
తోట పని, నడక, బద్ధకం లేకుండా పనిచేయాలనుకునే మనస్తత్వం

ఉప్పు, చక్కెర
తక్కువ మోతాదులో..

భోజనం
ఒంటరిగా కాకుండా.. కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు లేదా ఇరుగుపొరుగు వారితో కలిసి, ఆహ్లాదకరమైన వాతావరణంలో భోంచేస్తారు.



ఈ ప్రాంతాల్లోని అత్యధికులు.. భుక్తాయాసం వచ్చేలా భోంచేయరట. తమ బొజ్జ 80 శాతం నిండిందని తెలియగానే తినడం ఆపేస్తారట.

సాయంత్రం సమయంలో తేలిగ్గా జీర్ణమయ్యే, తక్కువ ఆహారాన్ని.. మరీ ఆలస్యం కాకుండా త్వరగానే తినేస్తారట.

దొంగా పోలీస్ ఆటాడించి..
అత్త దారుణ హత్య

విశాఖ జిల్లాలో ఘోరం.. యూట్యూబ్లో శోధించి కిరాతకానికి పన్నాగం

- ఆట పేరుతో పిల్లలతో కాళ్లు, చేతులు.. కళ్లకు గంతలు కట్టించిన కోడలు
- ఆపై క్షణాల్లో పెట్రోల్ పోసి దీపం విసిరిన కాలాంతకురాలు
- దీపం జారిపడి అంటుకుందని కట్టుకథ
- 24 గంటల్లో కేసును చేధించిన పెందుర్తి పోలీసులు

హత్యకు గురైన జయంతి కనకమహాలక్ష్మి (ఫైల్)

పెందుర్తి: పెళ్లి నాటినుంచీ పొసగని అత్తను ఒక కోడలు అత్యంత కిరాతకంగా.. అచ్చం హర్రర్ క్రైం సినిమా స్టోరీని తలపించే రీతిలో హతమార్చిన ఘటన ఇది. విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట సమీపాన అప్పన్నపాలెంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై విశాఖ వెస్ట్ జోన్ ఏసీపీ పృధ్వీతేజ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పన్నపాలెంలో వర్షిణి అపార్ట్మెంట్లోని ఓ ఫ్లాట్లో జయంతి సుబ్రహ్మణ్యం, ఆయన భార్య లలితాదేవి (30), తల్లి జయంతి కనకమహాలక్ష్మి (63), పిల్లలు ఈశ్వర్చంద్ర, శ్రీనయన, మేనల్లుడు శరత్తో నివాసం ఉంటున్నారు. సుబ్రహ్మణ్యం–లలితాదేవికి 12 ఏళ్ళ క్రితం పెళ్లయ్యింది. అత్తాకోడళ్లు లలితాదేవి, కనకమహాలక్ష్మికి పెళ్లయిన తొలినాళ్ల నుంచే విభేదాలు తలెత్తాయి. ఇద్దరికి రోజూ ఏదో విషయంలో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో అత్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని లలిత నిర్ణయించుకుంది. హత్యచేసి ఎలా తప్పించుకోవాలన్నది తెలుసుకోడానికి యూట్యూబ్లో క్రైమ్ వీడియోలు చూసింది. తద్వారా ఒక పథకం సిద్ధం చేసుకుంది. ఈ నెల 6న సింహచలం గోశాల వద్ద ఉన్న బంక్లో సీసాలో లీటరు పెట్రోలు తీసుకుని ఇంట్లో దాచిపెట్టింది. శుక్రవారం ఉదయం భర్త సుబ్రహ్మణ్యం, మేనల్లుడు శరత్ పనిమీద బయటకు వెళ్లారు. అత్తను హత్య చేసేందుకు అదే తగిన సమయమని భావించింది. 'నాన్నమ్మతో దొంగాపోలీస్ ఆట ఆడి.. ఆమెను తాళ్లతో కట్టేసి కళ్లకు గంతలు కట్టండి' అని పిల్లలకు పురమాయించింది. విషయం తెలియని పిల్లలు నాన్నమ్మను అడగ్గా.. కనకమహాలక్ష్మి పిల్లల సరదా కోసం ఒప్పుకుంది. అంతే పిల్లలు తాళ్లతో కట్టేసి, కళ్లకు గంతలు వేయడంతో కనకమహాలక్ష్మిపై అప్పటికే సిద్ధం చేసుకున్న పెట్రోల్ను క్షణాల్లో ఆమెపై పోసి, దేవుడి పటాల వద్ద ఉన్న దీపాన్ని ఆమె మీదకు విసిరింది. దీంతో ఒక్కసారిగా మంటలు అంటుకుని కనకమహాలక్ష్మి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే శరీరం పూర్తిగా కాలిపోయిన కనకమహాలక్ష్మి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. కాగా, దీపం జారిపడటంతో మంటలు అంటుకుని తన అత్త ప్రమాదానికి గురైనట్టు ప్రజలతో పాటు పోలీసులను లలిత నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, పోలీసులు పెట్రోల్ వాసన గమనించి తమదైన శైలిలో విచారణ చేయగా నిందితురాలు నేరం ఒప్పుకుంది. హతురాలి కుమారుడు సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ప్రమాదంలో సుబ్రహ్మణ్యం కుమార్తె శ్రీనయనకు స్వల్ప గాయాలయ్యాయి.

ఉప్పాడ మత్స్యకారులకు రూ.72 లక్షల నష్టపరిహారం

ఆమోదం తెలిపిన మారిటైమ్ బోర్డు

సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి జనార్దన్రెడ్డి, మారిటైమ్ బోర్డు అధికారులు

మంగళగిరి టౌన్: మొంథా తుపాను సమయంలో ఉప్పాడలో నష్టపోయిన మత్స్యకారులను ఆదుకునేందుకు రూ.72 లక్షల నష్టపరిహారాన్ని అందించేందుకు మారిటైమ్ బోర్డు ఆమోదం తెలిపింది. మంగళగిరి నగర పరిధిలోని మారిటైమ్ బోర్డు కార్యాలయంలో శనివారం 20వ ఏపీ మారిటైమ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఐడీసీఎల్) సమీక్ష సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. గత సమావేశంలో చర్చకు వచ్చిన అంశాల పురోగతిని మారిటైమ్ బోర్డు అధికారులు మంత్రికి వివరించారు. తుపాను సమయంలో తీర ప్రాంతంలో వేటకు వెళ్లే మత్స్యకారులను దృష్టిలో పెట్టుకుని వారిని అప్రమత్తం చేయడంతో పాటు పోలీస్ రక్షణ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా టూరిజం శాఖతో సమన్వయం చేసుకుని సేఫ్గార్డ్ బాయిస్ను నియమించాలని మంత్రి సూచించారు. తుపాను నేపథ్యంలో నష్టపోయిన ఆక్వా రైతులను ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు ఆయా ప్రాంతాలను సందర్శించాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, బోర్డు సీఈవో అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబువి నియంతృత్వ పోకడలు

- అడ్డగోలు కేసులు, అరెస్టులతో వేధింపుల పర్వం
- పోలీసు వ్యవస్థను పావుగా వాడుకుంటున్నారు
- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్సీపీ నాయకులు గోరంట్ల మాధవ్, దేవభక్తుని చక్రవర్తి ధ్వజం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు తన పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కాలని చూడడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ పెనమలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవభక్తుని చక్రవర్తి ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. తండ్రి అంత్యక్రియల కోసం లండన్ నుంచి వచ్చిన ఎన్నారై భాస్కర్రెడ్డిని అరెస్ట్ చేసి కొట్టడమే కాకుండా, ఆ తర్వాత అక్రమ కేసులు నమోదు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారని తెలిపారు. సీఎం చంద్రబాబు తన ప్రతీకార రాజకీయాలకు పోలీస్ వ్యవస్థను పావుగా వాడుకుంటున్నారని, అయితే న్యాయవ్యవస్థ సమర్థంగా పని చేస్తోంది కాబట్టి, అన్నిసార్లు ఆయన ఆటలు సాగడం లేదని గోరంట్ల మాధవ్, దేవభక్తుని చక్రవర్తి చెప్పారు.

ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారు

'ఏడాదిన్నరగా అసమర్థ పాలన సాగించిన సీఎం చంద్రబాబు తననెవరూ మీడియాలో విమర్శించకూడదు, తన వైఫల్యాల గురించి పత్రికల్లో రాయకూడదు, డిబేట్లలో తన గురించి వ్యతిరేకంగా విశ్లేషించకూడదు అని కోరుకుంటున్నారు. ఇవి నియంతృత్వ పోకడలు. ప్రశ్నించిన వారిని కేసులు పెట్టి, అరెస్టులతో వేధిస్తున్నారు. సంపద సృష్టించి పేదలకు పంచుతానన్న పెద్దమనిషి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారు. రాయలసీమ ప్రజల కోసం గంటకు 350 కి.మీ.ల స్పీడ్తో నడిచే బులెట్ ట్రైన్ తెస్తానని చెప్పిన చంద్రబాబు ఆ హామీని విస్మరించి సకుటుంబ సమేతంగా స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతున్నారు. కర్నూలు బస్సు ప్రమాదంపై పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ చేసినందుకు వైఎస్సార్సీపీకి చెందిన 27 మందిపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టింది. విశాఖపట్నంలో కొండారెడ్డి అనే విద్యార్థి అరెస్ట్ విషయంలోనూ పోలీసులు కుట్రలకు పాల్పడ్డారు. సీఎం చంద్రబాబు తీరుతో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యంగా మారింది' అని గోరంట్ల మాధవ్ విమర్శించారు.

భాస్కర్రెడ్డిని చిత్రహింసలు పెట్టారు

'సోషల్ మీడియా యాక్టివిస్టు భాస్కర్రెడ్డి తండ్రి చనిపోతే ఈనెల 2న లండన్ నుంచి విజయవాడకు వచ్చారు. నవంబర్ 6న ఆయన వైద్యపరీక్షల నిమిత్తం కామినేని ఆస్పత్రికి వెళ్తే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎప్పుడో పదేళ్ల క్రితం సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్ను చూపించి అక్రమంగా అరెస్ట్ చేశారు. అతణ్ని గన్నవరం డీఎస్పీ ఆఫీసులో నిర్బంధించి అతి దారుణంగా చిత్రహింసలకు గురిచేశారు. నడవలేని స్థితిలో ఉన్న భాస్కర్రెడ్డి.. పోలీసులు తనపై వ్యవహరించిన తీరును జడ్జికి వివరించారు. జడ్జి పోలీసులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. న్యాయవ్యవస్థ లేకపోతే ఈ పోలీసుల ఆగడాలు ఎలా ఉండేవో చెప్పడానికి భాస్కర్రెడ్డి కేసు ఒక ఉదాహరణ' అని దేవభక్తుని చక్రవర్తి ఆందోళన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

'సిపెట్'లో యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

సాక్షి, అమరావతి: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్–విజయవాడ)లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన అందించే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్టు సిపెట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో 120 మందికి ఈ శిక్షణ ఇస్తామన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన అభ్యర్థులు అర్హులని, కనీసం 10వ తరగతి పూర్తి చేసి, 18 –30 ఏళ్ల వయసు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి విజయవాడలో పాలీమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్ ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్ ఇన్ ఇంజక్షన్ మౌల్డింగ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు రూ.11,300 ఉపకార వేతనం అందించనున్నట్టు వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రంతోపాటు విశాఖ, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నైలోని ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 78935 86494 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల రాష్ట్ర స్థాయి చెస్, క్యారమ్స్ పోటీలు

జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, తదితరులు

విజయవాడలీగల్: న్యాయవాదుల మానసికోల్లాసంతోపాటు క్రీడల్లో వారి ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు రాష్ట్ర స్థాయి చెస్, క్యారమ్స్ పోటీలు శనివారం విజయవాడలో ప్రారంభమయ్యాయి. బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజులు జరిగే ఈ పోటీలలో విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతుల ప్రదానం జరగనుంది. రాష్ట్రంలోని 148 బార్ అసోసియేషన్ల నుంచి దాదాపు 200 మంది న్యాయవాదులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణల్లో బెజవాడ బార్‌కు ప్రత్యేకమైన స్థానం ఉందని అన్నారు. కృష్ణాజిల్లా డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి గుట్టల గోపి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని బార్‌లను ఒక చోటకు చేర్చి పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర బార్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ కె.సీతారాం, ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ కె బాషా, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిదంబరం తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా తిరిగొచ్చిన ప్రాణం

కర్ణాటకలో గదగ్ జిల్లాలో ఘటన

రాయచూరు రూరల్: చనిపోయిన వ్యక్తి బతికొచ్చిన వింత ఘటన కర్ణాటకలోని గదగ్ జిల్లా బెటగేరిలో వెలుగుచూసింది. శుక్రవారం బెటగేరిలో ప్రైవేట్ ఆస్పత్రిలో మూత్ర పిండాల చికిత్స పొందుతూ నారాయణ(38) మృతి చెందాడు. దీంతో బంధువులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంతలోనే నారాయణ కళ్లు తెరిచి ఊపిరి తీసుకోవడం మొదలు పెట్టాడు. చనిపోయాడనుకున్న వ్యక్తి బతికొచ్చాడని అందరూ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు.

అప్పు.. అలా చేసేస్తున్నారు!

అయిదేళ్లలో ఆస్తుల పెరుగుదల 48%

అప్పులు మాత్రం ఏకంగా 104% జంప్

మ్యూచువల్ ఫండ్స్ మీద పెరిగిన మక్కువ

ఇదీ భారతీయ కుటుంబాల ఆర్థిక చిత్రం

భారతీయ కుటుంబాల అప్పులు పెరుగుతున్నాయి. ఎంతలా అంటే.. ఆస్తులను మించిన వేగంతో! రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తాజా గణాంకాల ప్రకారం.. 2019–20తో పోలిస్తే 2024–25 నాటికి కుటుంబాల వార్షిక ఆస్తులు దాదాపు 48% అధికం అయ్యాయి. ఇదే సమయంలో అప్పులు మాత్రం ఏకంగా 104% పెరగడం గమనార్హం. కుటుంబాల పొదుపు, పెట్టుబడుల్లోనూ మార్పులు వస్తున్నాయి. కొన్ని సంవత్సరాలుగా మ్యూచువల్ ఫండ్స్ వాటా వేగంగా పెరుగుతోంది.

– సాక్షి, స్పెషల్ డెస్క్

సగటు భారతీయ కుటుంబం గత ఐదేళ్లలో పొదుపు, మదుపు చేయడం కంటే.. అప్పు చేస్తున్న వేగం పెరిగింది. ఆర్థిక ఆస్తులకు 2019–20లో భారతీయ కుటుంబాలు రూ.24.1 లక్షల కోట్లు జోడించాయి. గత ఆర్థిక సంవత్సరం నాటికి ఇవి 48% వృద్ధి చెంది రూ.35.6 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మరోవైపు 2024–25లో కుటుంబాలకు రూ.15.7 లక్షల కోట్ల విలువైన రుణాల వంటి ఇతర ఆర్థిక బాధ్యతలు పెరిగాయి. వీటి విలువ 2019–20లో రూ.7.7 లక్షల కోట్లు. అంటే 5 ఏళ్ల కిందటితో పోలిస్తే ఇవి రికార్డు స్థాయిలో 104% పెరిగిపోయాయన్నమాట.

జీడీపీలో ఆస్తులు 10.8%

2019–20లో జోడించిన ఆర్థిక ఆస్తులు దేశ జీడీపీలో 12%గా ఉన్నాయి. ఇది 2024–25 నాటికి 10.8%కి తగ్గింది. అలాగే కుటుంబాల రుణ బాధ్యతలు 2019–20లో జీడీపీలో 3.9%గా ఉన్నాయి. 2023–24లో ఇవి ఏకంగా 6.2%కి ఎగబాకాయి. గత ఆర్థిక సంవత్సరంలో స్వల్పంగా తగ్గి 4.7%కి చేరాయి.

మ్యూచువల్ ఫండ్స్‌లో..

కుటుంబాలు 2019–20లో జోడించిన మొత్తం ఆర్థిక ఆస్తుల్లో వాణిజ్య బ్యాంకుల్లో చేసిన డిపాజిట్ల వాటా 32 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం నాటికి ఇది స్వల్పంగా పెరిగి 33.3%కి చేరింది. 2019–20లో కుటుంబాల డిపాజిట్ల పరిమాణం రూ.7.7 లక్షల కోట్లు. 5 ఏళ్లలో ఇది 54% అధికమై రూ.11.8 లక్షల కోట్లకు చేరుకుంది. ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. అప్పట్లో మొత్తం ఆస్తుల్లో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల వాటా కేవలం 2.6% మాత్రమే. కానీ గత ఆర్థిక సంవత్సరం నాటికి ఇది ఏకంగా 13.1%కి ఎగిసింది. 2019–20లో రూ.61,686 కోట్లుగా ఉన్న కొత్త మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు.. 5 ఏళ్లలో రికార్డు స్థాయిలో 655% పెరిగి రూ.4.7 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

అప్పు చేసి..

భారతీయ కుటుంబాల అప్పులు ఇలా..

సంవత్సరం	విలువ (రూ.లక్షల కోట్లలో)
2019 & 20	7.7
2020 & 21	7.9
2021 & 22	5.9
2022 & 23	16
2023 & 24	18.8
2024 & 25	15.7

ఎమ్ఎఫ్‌ల మీద మోజు

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు (రూ.లక్షల కోట్లు), ఏటా జమయిన మొత్తం ఆస్తుల్లో వీటి వాటా (శాతాల్లో)..

సంవత్సరం	పెట్టుబడులు	వాటా
2019-20	0.6	2.6
2020-21	0.6	2
2021-22	1.6	6.3
2022-23	1.8	6.1
2023-24	2.4	6.9
2024-25	4.7	13.1

ఆధారం : రిజర్వు బ్యాంకు

అమ్మో.. ఇంతలా వెన్నుపోటా!?

శాంతియుత పోరాటంపై ఇన్ని కుట్రలా!? ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సర్కారు కుతంత్రం

సాక్షి, అమరావతి: 'కష్టం చెప్పుకుంటే ఇంత నయవంచనా.. న్యాయంగా ఇవ్వాల్సినవి ఇవ్వకుండా ఇన్ని కుట్రలా.. శాంతియుతంగా జరిగిన పోరాటానికి ఇంతలా వెన్నుపోటు పొడవాలా'.. అంటూ కొద్దిరోజులుగా విద్యుత్ ఉద్యోగులు ఆక్రోశంతో రగిలిపోతున్నారు. విద్యుత్ సంస్థల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టాలనుకున్న విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) గతనెల 18న అకస్మాత్తుగా ఆ నిర్ణయాన్ని విరమించుకుంది. ప్రభుత్వం, యాజమాన్యంతో జరిగిన చర్చల్లో ఉద్యోగులకు అనుకూలంగా ఎలాంటి నిర్ణయాలు వెలువడనప్పటికీ జేఏసీ సమ్మె విరమించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సెప్టెంబరు 15 నుంచి దశల వారీగా చేపట్టిన ఉద్యమంలో భాగంగా మహాధర్నాలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు వంటి నిరసనలను జేఏసీ ఎందుకు విరమించిందనే విషయం అర్థంకాక ఉద్యోగులు తలలుపట్టుకున్నారు. ఉద్యోగులతో చర్చలకు ప్రభుత్వం నియమించిన స్టీరింగ్ కమిటీ ఎందుకంత మొండివైఖరిని అవలంబించిందనేది కూడా ఎవరికీ అర్థంకాలేదు. చర్చల వేళ జేఏసీ నేతలు అర్ధరాత్రి వరకూ కాళ్లావేళ్లా పడి బతిమాలినా కమిటీ కరగలేదు. పైగా.. వారికి ప్రభుత్వం ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. గంటల తరబడి విద్యుత్ సౌధ వద్ద పడిగాపులు పడేలా చేసింది. అయితే, ఇదంతా తెరముందు కనిపించగా.. తెరవెనుక అసలు కథ వేరేగా నడిచింది.

చర్చల వేళ విద్యుత్‌సౌధ వద్ద అర్ధరాత్రి వరకూ పడిగాపులు కాసిన జేఏసీ నేతలు

తెరవెనుక జరిగిందిదీ..

విద్యుత్ ఉద్యోగులు అక్టోబరు 15 నుంచి సమ్మె చేపట్టాలని నిర్ణయించగా, ప్రభుత్వం చర్చలకు పిలిచి ప్రధాని పర్యటన నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని కోరింది. దీంతో జేఏసీ అందుకు అంగీకరించింది. కానీ, అప్పుడే తెరవెనుక కుట్రలకు టీడీపీ కూటమి ప్రభుత్వం తెరలేపింది. జేఏసీతో అక్టోబరు 18న చర్చలు జరగాల్సి ఉండగా, ఒకరోజు ముందుగా, అంటే అక్టోబరు 17న ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో)లో ఉన్న 102 మంది ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు పదోన్నతులు కల్పించింది. తద్వారా.. ఒకేసారి ఇంతమందిని పదోన్నతులపై బదిలీ చేయడం ద్వారా విద్యుత్ ఉద్యోగుల సంఘాల మధ్య కూటమి చిచ్చుపెట్టింది. వారిని విభజించి పాలించడం ద్వారా ఉద్యమానికి ఎసరు పెట్టింది. జేఏసీతో ఇంజినీర్ల సంఘం కలవకుండా ఉండేందుకే వంద మందికి పైగా ఇంజినీర్లకు ఒకేసారి పదోన్నతులతో గాలం వేసింది. దీంతో.. వారు జేఏసీతో కలిసేది లేదని, సమ్మెలో పాల్గొనేది లేదని కరాఖండీగా చెప్పేశారు.



విద్యుత్ జేఏసీతో చర్చలకు ఒక రోజు ముందు ఇంజినీర్లకు పదోన్నతులపై బదిలీలు కల్పిస్తూ జారీచేసిన ఉత్తర్వులు

లొంగని వారికి బెదిరింపులు..

మరోవైపు.. ఉద్యోగుల తరపున ఆందోళనలు చేస్తూ, చర్చల్లో డిమాండ్లపై పట్టుబడుతున్న వారినీ ప్రలోభాలకు గురిచేసింది. కొందరికి పదోన్నతులు కల్పిస్తామని ఆశ పెట్టింది. వారికి, వారు కోరుకున్న వారికి తాయిలాలు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ, వీటికి లొంగని వారిని వ్యక్తిగతంతా బెదిరించింది. వారి ఉద్యోగాలకు ఇబ్బందులు ఎదురవుతాయంటూ హెచ్చరించింది. గతంలో ఉన్న వివాదాలను తెరపైకి తెస్తామని, ఆరోపణలపై విచారణలు జరిపిస్తామని, శాఖాపరంగా చర్యలు తప్పవని భయపెట్టింది. ఇవన్నీ ఓపక్క తెర వెనుక చేస్తూ మరో పక్క చర్చల పేరుతో కాలయాపన చేసింది. చివరికి.. తాను అనుకున్నట్లుగానే ఉద్యోగులకు మొండి చేయిచూపించి, ఆందోళనను విరమించేలా చేసి, సమ్మెలపై నిషేధం విధించింది. కూటమి ప్రభుత్వం నడిపిన ఈ మొత్తం ఎపిసోడ్‌తో విద్యుత్ ఉద్యోగులు ఇప్పటికీ షాక్ నుంచి తేరుకోలేకపోతున్నారు.

'టీచర్లకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 765 ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న 2,200 మంది టీచింగ్, 300 మంది నాన్ టీచింగ్ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఇతర ప్రభుత్వ యాజమాన్యాలలో పనిచేసే ఉపాధ్యాయులతో సమానంగా నెలవారీ ప్రీమియం వారి జీతభత్యాల నుంచి చెల్లించేలా చూడాలని కోరింది.

ఇమామ్ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, అంబటి రాంబాబు, నారాయణస్వామి, భూమన కరుణాకరరెడ్డి, గురుమూర్తి, సిపాయి సుబ్రహ్మణ్యం తదితరులు

'ఇమామ్ ప్రస్థానం' పుస్తకాన్ని ఆవిష్కరించిన సజ్జల

తిరుపతి సిటీ: సమాజ సేవకుడు ఇమామ్ రచించిన 'ఇమామ్ ప్రస్థానం' అనే పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. శనివారం తిరుపతి పద్మావతి పురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం అన్నమయ్య భవన్‌లో పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రులతో కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. ఇలాంటి సామాజిక వేత్తలను, సంఘసంస్కర్తలను వెలుగులోకి తెచ్చిన చరిత్ర కరుణాకరరెడ్డిదేనని ప్రశంసించారు. శ్వేత డైరెక్టర్ భూమన్ సుబ్రహ్మణ్యంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, ఆర్‌కే రోజా, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, మేధావుల ఫోరం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వైఎస్సార్‌టీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా కేశవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జంషీద్
- ఉద్యోగుల పొట్టగొడుతూ ఉద్ధరించినట్లు ప్రచారమా?
- ప్రభుత్వంపై ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజం

రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన వైఎస్సార్‌టీఏ కార్యవర్గ సభ్యులు(ఉపాధ్యాయులు)

సాక్షి, అమరావతి: సమైక్యంగా ఉంటూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని ఏపీ వైఎస్సార్‌టీఏ నూతన కార్యవర్గానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా, మండల స్థాయి కమిటీల నియామకం త్వరితగతిన పూర్తిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం ఏపీ వైఎస్సార్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం తాడేపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్రం అంతటి నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పొట్టగొడుతూ వారి సంపదను స్వాహా చేస్తున్న కూటమి ప్రభుత్వం వారిని ఉద్ధరించినట్లుగా ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. దీపావళికి ముందు ఇచ్చిన పెండింగ్ డీఏ కూడా మోసమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''నాలుగు పెండింగ్ డీఏల్లో ఒకే ఒక్కటి ఇచ్చి, ఆ ఎరియర్స్‌ను కూడా రిటైర్మెంట్ సమయంలో ఇస్తామంటూ దెబ్బకొట్టారు. పీఆర్సీ, ఐఆర్, రూ.34 వేల కోట్ల బకాయిల గురించి ప్రస్తావనే లేదు. దీంతోనే ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలిసిపోయింది'' అని ధ్వజమెత్తారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో ఆర్నెల్లకు ఒక డీఏ చొప్పున 10 డీఏలు ఇవ్వడంతోపాటు గత చంద్రబాబు ప్రభుత్వం పెండింగ్ పెట్టిన డీఏ కూడా ఇచ్చారని అన్నారు. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.22 వేల కోట్లు ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలున్నాయని చంద్రబాబు అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారని పేర్కొన్నారు. వాటిని దఫదఫాలుగా చెల్లిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఉద్యోగుల ఓట్లు పొందిన చంద్రబాబు, గెలిచాక ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. బకాయిలు చెల్లిస్తానని చెప్పి.. వాటిని మరో రూ.12 వేల కోట్లు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని... ఇది మోసం కాదా? అని నిలదీశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను 2027–28లో 12 వాయిదాల్లో ఇస్తానని చెప్పడం వేధించడమేనని అన్నారు.

ఏపీ వైఎస్సార్‌టీఏ నూతన రాష్ట్ర కార్యవర్గం

ఏపీ వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఒంగోలుకు చెందిన కేశవరపు జాలిరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంషీద్ (శ్రీ సత్యసాయి జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా ప్రేమ్‌సాగర్ (గుంటూరు)ను ఎన్నుకున్నారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తవ్వినకొద్దీ.. కట్టుకథలే..!

వెలిగొండ ప్రాజెక్టు...

వెలిగొండ ప్రాజెక్టుపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగే సవతి ప్రేమ ఒలకబోస్తోంది. సీఎం చంద్రబాబు నుంచి ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తికి, నిర్వాసితుల పునరావాసానికి దాదాపు రూ.2000 కోట్లు అవసరమంటూ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఏడాదిన్నర కాలంలో అత్తెసరు నిధులు విడుదల చేసి పనులు వేగంగా జరుగుతున్నాయంటూ మంత్రి నిమ్మల రామానాయుడు అసత్య ప్రకటనలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముచ్చటగా మూడోసారి వచ్చిన మంత్రి.. ప్రాజెక్టుకు ఎంత నిధులిచ్చారు..జరిగిన పని గురించి చెప్పకుండా వచ్చే ఏడాదిలో నీళ్లిచ్చేస్తామంటూ ఎప్పటిలాగే గొప్పలు చెప్పుకుని వెళ్లిపోయారని పశ్చిమ ప్రకాశం వాసులు మండిపడుతున్నారు.

వెలిగొండ ప్రాజెక్టుపై కూటమి దొంగాట

- 2014–19 వరకు బాబు హయాంలో తవ్వింది 4 కిలోమీటర్లలోపే..
- ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించి పనులను గాడిలో పెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- రెండు టన్నెల్స్ పూర్తి చేసి జాతికి అంకితం
- నిర్వాసితులకు కాలనీలు కేటాయించి మౌలిక వసతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నరలో అరకొరగా నిధుల కేటాయింపు
- జోరుగా పనులు సాగుతున్నాయంటూ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు గొప్పలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మూడు జిల్లాల వరప్రదాయని వెలిగొండ ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. 1997లో వెలిగొండ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. సర్వే పేరుతో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా తన నైజాన్ని ప్రదర్శించిన విషయాన్ని నేటికీ ప్రకాశం జిల్లా ప్రజలు మర్చిపోలేదు. 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల పాలనలో ఐదు సార్లు జిల్లాకు వచ్చారు. వచ్చినప్పుడల్లా 'త్వరలో వెలిగొండను ప్రారంభించి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేస్తా' అంటూ హామీలు గుప్పిస్తూ కాలం గడిపేశారు. 2018 జూన్ నెలలో జిల్లాకు వచ్చిన చంద్రబాబు.. 2019 సంక్రాంతికల్లా వెలిగొండను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానని ప్రకటించారు. అధికారం పోయిన తర్వాత జిల్లాకు వచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు విమర్శలు చేయడంపై పశ్చిమ ప్రకాశం ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. తన హయాంలో వెలిగొండ ప్రాజెక్టును గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ హయాంలో వెలిగొండ పనులు వేగంగా జరుగుతుంటే విమర్శలు చేయటమే పనిగా పెట్టుకోవటాన్ని ప్రజలు విమర్శించారు. ఈ నేపథ్యంలో 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండు సార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అత్తెసరు నిధులను వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించింది. ఈ నిధులతో పనులు జోరుగా జరుగుతున్నాయంటూ రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు కూడా సీఎం చంద్రబాబు మాదిరిగానే మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముచ్చటగా మూడోసారి...

వెలిగొండ ప్రాజెక్టు సందర్శనకు ఇప్పటికే రెండు సార్లు వచ్చిన నిమ్మల ఇటీవల దోర్నాల వచ్చి వెలిగొండ ప్రాజెక్టు టన్నెళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, సాక్షి దినపత్రికపై విరుచుకుపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్పారు. మూడు సార్లు వచ్చి ఏం సాధించారంటే.. ప్రొటోకాల్ ఖర్చులు తప్ప ఏమీ లేదనే చెప్పాలని రైతులు మండిపడుతున్నారు.

2014-19 వరకు 2 టన్నెల్స్ కలిపి 4 కిలోమీటర్లలోపే...

చంద్రబాబు మూడోసారి సీఎంగా ఉన్న 2014–19 మధ్యలో వెలిగొండకు గ్రహణం పట్టింది. ప్రాజెక్టుకు ప్రధానమైన రెండు టన్నెళ్లు కలుపుకుని కేవలం 4 కిలోమీటర్లు మాత్రమే పనులు జరిగాయి. ఆ పనులను సైతం తన బినామీ అయిన సీఎం రమేష్‌కు నామినేషన్ మీద అప్పగించి వందల కోట్ల రూపాయలు దోచుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. జలయజ్ఞంలో 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు రూ.8 వేల కోట్లకుపైగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ఆయన అకాల మరణం తర్వాత పనులు మందగించాయి. చంద్రబాబు నిధులివ్వకుండా ప్రాజెక్టును చిన్నచూపు చూసి ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల ప్రజలనూ నిలువునా మోసం చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు టన్నెళ్లు పూర్తి...

వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పొడవు 18.80 కిలోమీటర్లు. రెండో టన్నెల్ పొడవు 18.78 కిలోమీటర్లు. ఈ రెండు టన్నెళ్లకు సంబంధించిన పురోగతిని పరిశీలిస్తే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టును ఉరుకులు, పరుగులు పెట్టించారు. ఆయన హయాంలో మొదటి టన్నెల్‌కు సంబంధించి 11.58 కి.మీ పనులు పూర్తి చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రెండు టన్నెళ్లకు సంబంధించి కేవలం 4 కిలోమీటర్లు మాత్రమే పూర్తిచేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే 5.22 కిలోమీటర్ల మేర మొదటి టన్నెల్ తవ్వి పనులు పూర్తి చేశారు. అలాగే రెండో టన్నెల్‌ను కూడా 10.04 కిలోమీటర్లు తవ్వకాలు పూర్తి చేశారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు రూ.3 వేల కోట్లకుపైగా ఖర్చు చేసింది. రెండు టన్నెళ్లు పూర్తయిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.

పూర్తయిన సొరంగం పనులు

పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఒక వైపు ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తూనే మరోవైపు నిర్వాసితులకు అండగా నిలిచారు. మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువు తండా నిర్వాసితులకు మార్కాపురం మండలం కుంట వద్ద, పెద్దారవీడు మండలం సుంకేశుల, కలనూతల, చింతలముడిపి గ్రామాల వారికి గోగులదిన్నె వద్ద, సుంకేశులలోని ఎస్సీలకు తోకపల్లి వద్ద కలనూతలలో, కొంతమంది నిర్వాసితులకు ఇడుపూరు వద్ద కాలనీలు ఏర్పాటు చేశారు. అలాగే సిమెంటు రోడ్లు, వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ హాలు, పాఠశాలలు నిర్మించారు. చంద్రబాబు హయాంలో పునరావాసానికి రూ. 1.80 లక్షలు ప్రకటిస్తే.. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రూ.12.50 లక్షలకు పెంచారు. అందుకోసం రూ.1400 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. 2024లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో చిల్లచెట్లు, పిచ్చికంపతో నిండిపోయి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారాయి. దీంతో నిర్వాసితుల్లో నిరాశ, నిస్పృహలు ఏర్పడ్డాయి. ప్రాజెక్టు పరిధిలో 11 గ్రామాల ప్రజలు ప్రస్తుతానికి సొంతూళ్లలోనే ఉంటున్నారు. మొత్తం 7,270 కుటుంబాలు ఉన్నాయి. పునరావాస ప్రక్రియ పూర్తికాకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్న గృహాల్లోనే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు వీరి కష్టాలను గాలికొదిలేసి ఆర్భాటపు ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్నారని పశ్చిమ ప్రకాశం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోసం.. దగా..

- తూకాలు, కొలతల్లో భారీ వ్యత్యాసం
- డిజిటల్ వేయింగ్ మెషీన్లలోనూ అదే తీరు
- చిరువ్యాపారి నుంచి సూపర్ మార్కెట్ల వరకు అంతటా వినియోగదారుల జేబులకు చిల్లులు

▸ రమేష్ అనే యువకుడు అనంతపురం సంగమేష్ సర్కిల్‌లో ఓ దుకాణానికి వెళ్లి కేజీ మాంసం కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చాక అనుమానం వచ్చి మరో చోటుకు తీసుకెళ్లి తూకం వేయించగా.. 100 గ్రాములు తక్కువ వచ్చింది. దీంతో దుకాణదారును నిలదీయగా వంద గ్రాముల మాంసం తిరిగి ఇచ్చాడు.

▸ రాప్తాడుకు చెందిన సోము అనంతపురంలోని ఓ సూపర్ మార్కెట్‌లో 25 కిలోల బియ్యం బస్తా కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లాక తూకం పరిశీలిస్తే 22 కిలోలు మాత్రమే ఉన్నాయి. దుకాణ యజమానిని నిలదీస్తే.. ఏదో పొరపాటు జరిగిందని మూడు కిలోల బియ్యాన్ని వెనక్కు ఇచ్చాడు. ఇలా ఎంతోమంది వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు.

▸ సాంకేతికత సాయంతో కొన్ని పెట్రోల్ బంకుల్లో గుట్టుగా జరుగుతున్న దోపిడీలు వెలుగులోకి వచ్చాయి. పెట్రోల్ పరిమాణాన్ని సూచించే డిజిటల్ మీటర్‌కు ఓ చిన్నపాటి చిప్ అమర్చడం ద్వారా వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. అనంతపురం నగరంతో పాటు సోములదొడ్డి, సనప తదితర ప్రాంతాల్లోని పలు పెట్రోల్ బంకుల్లో ఈ తరహా దోపిడీ వ్యవహారాలను విజిలెన్స్ అధికారులు నిగ్గు తేల్చారు.

అనంతపురం: తూకమైనా.. కొలతైనా.. ఏదైనా సరే వ్యాపారుల చేతిలో వినియోగదారులు మోసాలకు గురవుతున్నారు. బియ్యం నుంచి బంగారం వరకు, పాల నుంచి నూనె వరకు, పెట్రోల్ నుంచి డీజిల్ వరకు ఎటు చూసినా దగానే. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. నలుగురు సభ్యులు గల కుటుంబం నిత్యావసర వస్తువుల కొనుగోలుకు నెలకు సరాసరి రూ.15 వేలకు పైగా వెచ్చిస్తోంది. తూకాల్లో మోసాల కారణంగా ఒక్కో కుటుంబం నెలకు రూ.2 వేలకు పైగా నష్టపోతోంది.

ప్యాకింగ్ నిబంధనలు బేఖాతరు

నిబంధనల ప్రకారం నిత్యావసర వస్తువులు ప్యాక్ చేసేందుకు తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా చాలామంది వ్యాపారులు అనుమతి తీసుకోకుండానే కిరాణా సరుకులు ప్యాక్ చేస్తున్నారు. ఈ ప్యాకెట్లను తూకం వేస్తే తక్కువ బరువు చూపిస్తున్నాయి. బియ్యం వ్యాపారులు 25 కేజీల బస్తాల చొప్పున ప్యాక్ చేసి విక్రయిస్తున్నారు. కానీ ఇందులో 200 నుంచి 300 గ్రాములు తక్కువగా ఉంటోంది.

తక్కెడలు, తూకపు రాళ్ల లెక్కలు లేవు

జిల్లా కేంద్రం అనంతపురంలో తూనికలు, కొలతల శాఖ కార్యాలయం ఉంది. అధికారులు ఒక్కసారి కూడా దుకాణాల్లో తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వ్యాపారులకు వరంగా మారుతోంది. జిల్లా వ్యాప్తంగా ఎంత మంది చిరు, బడా వ్యాపారుల వద్ద ముద్రలు వేసిన ఎలక్ట్రానిక్ కాటాలు, ఇనుప తక్కెడలు, తూకాలు వేసే రాళ్లు ఉన్నాయనే లెక్కలు అధికారుల వద్ద లేకపోవడం కొసమెరుపు.

డిజిటల్ వేయింగ్ మెషీన్లలోనూ..

డిజిటల్ వేయింగ్ మెషీన్లలోనూ యథేచ్ఛగా మోసం చేస్తున్నారు. మెషీన్‌లోని క్యాలిబ్రేషన్ సెట్ చేయడం ద్వారా 1000 గ్రాములకు వారు అనుకున్నంత 900, 800 గ్రాముల వరకు సెట్ చేసుకోవచ్చు. ఇది ఒకసారి సెట్ చేస్తే అలానే ఉంటుంది. అదే విధంగా ఎలక్ట్రానిక్ యంత్రాన్ని లీటర్ మోడ్‌లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని చూపిస్తుంది.

పెట్రోలు బంకుల్లోనూ అదే తీరు...

జిల్లా వ్యాప్తంగా పెట్రోలు బంకుల్లో లీటరుకు 100 నుంచి 200 ఎంఎల్ వరకు తక్కువగా ఇంధనం పోస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడక్కడా మోసాలను గుర్తించి వినియోగదారులు గొడవలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. అయినా నిర్వాహకులు మాత్రం తీరు మార్చుకోవడం లేదు.

నిబంధనలకు నీళ్లు

బరువు తూచే యంత్రాల తయారీ, మరమ్మతు, యంత్రాలు సరిచూసి అధికారుల ఆమోదంతో ధ్రువీకరిస్తారు. లైసెన్స్‌దారులు ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు బరువుతూచే యంత్రాలను ఏటా మరమ్మతు చేసి తనిఖీ అధికారి ద్వారా ధ్రువీకరించి వ్యాపారికి ధ్రువపత్రం ఇవ్వాలి. ఈ క్రమంలో తనిఖీ అధికారి యంత్రాన్ని పరిశీలించి అంతా సక్రమంగా ఉంటే సీలు వేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారుల తనిఖీల సమయంలో బరువు తక్కువగా వేసి వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తిస్తే వ్యాపారితో పాటు సదరు యంత్రం తనిఖీ చేసిన లైసెన్స్‌దారుపై చర్యలు తీసుకోవాలి. ఇందుకు విరుద్ధంగా వ్యాపారులపై కేసులు నమోదు చేసి లైసెన్స్‌దారులను వదిలేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలను అధికారులు తనిఖీ చేసిన తర్వాత సీలు వేయాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో సింహభాగం వ్యాపారులు ఉపయోగిస్తున్న యంత్రాలకు సీలు లేకపోవడం గమనార్హం. ప్రతి సంవత్సరం వ్యాపారులు వినియోగించే కాటా రాళ్లను పరిశీలించి తూనికలు, కొలతలు శాఖ ముద్ర వేసి అనుమతి ఇవ్వాలి. సింహభాగం వ్యాపారులు ఏటా ముద్రలు వేయించుకోకుండానే వీటిని వినియోగిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. ఆహారపదార్థాల సంచులపై తయారీదారుని పేరు, గడువు, బ్యాచ్ నంబర్, టోల్‌ఫ్రీ నంబర్, చిరునామా, గరిష్ట చిల్లర ధర ముద్రించాలని నిబంధనలు చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదు. జిల్లాలో బియ్యం వ్యాపారులు చేస్తున్న తూకం మోసాలతో వినియోగదారులు భారీగా నష్టపోతున్నారు.

చితికిపోతున్న చేనేత

- నేతన్నకు చంద్రబాబు సర్కారు శఠగోపం
- అధికారం చేపట్టి 17 నెలలవుతున్నా పట్టించుకోని వైనం
- కొత్త పింఛన్లు లేనే లేవు
- గత ప్రభుత్వంలో రూ.105.52 కోట్ల సాయంతో ఆదుకున్న వైఎస్ జగన్

తమ కష్టానికి 'గిట్టుబాటు ధర' లభించడం లేదు. కుటుంబ పోషణ భారమవుతోంది. అప్పులు చేస్తూ చక్రబంధనంలో ఇరుక్కుంటున్నారు. ఆదుకోవాల్సిన సర్కారు చేతులెత్తేస్తుండడంతో దిక్కుతోచడం లేదు. ఈ క్రమంలో అయిన వారిని అనాథలుగా వదిలి అనంత వాయువుల్లో కలిసిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో చేనేతల వేదన అరణ్యరోదనగానే మిగులుతోంది.

ఉరవకొండలో ఇటీవల కురిసిన వర్షానికి మగ్గం గుంతలోకి నీరు చేరి దెబ్బతిన్న సామగ్రి

అనంతపురం అగ్రికల్చర్: చేనేతలకు చంద్రబాబు ప్రభుత్వం శఠగోపం పెడుతోంది. రైతులను చిన్న చూపు చూసినట్లుగానే నేతన్నలపై కూడా చంద్రబాబు కరుణ చూపే పరిస్థితి కనిపించడం లేదు. అధికారం చేపట్టి 17 నెలలవుతున్నా ఏ రూపంలోనూ నయా పైసా సాయం చేయలేదు. నేత కార్మికులకు కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇచ్చిన పాపానపోలేదు. గతంలో మాదిరిగా పింఛన్లు ఇస్తుండటం మినహా వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు.

ఆత్మహత్యలే శరణ్యం..

ఉపాధి లేక బతుకులు దుర్భరంగా మారి చేనేతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలో ఇరువురు కార్మికులు చేతిలో పని లేక, ఉపాధి లభించక, అప్పులు తీర్చలేక, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, పోషణ భారమై ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబాలు రోడ్డున పడిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల కుటుంబాలకు పైగా చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. అందులో మొదటి స్థానంలో శ్రీ సత్యసాయి జిల్లా ఉండగా ఆ తర్వాత 9,500 మందితో అనంతపురం జిల్లా రెండో స్థానంలో ఉంది. జిల్లాలోని తాడిపత్రి, ఉరవకొండ, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు తదితర ప్రాంతాల్లో నేత కార్మికులు అధికంగా ఉన్నారు. ప్రభుత్వ సాయం, ప్రోత్సాహం లేక వారంతా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. చేయూత లేక చేనేత సొసైటీలు నిర్వీర్యం కాగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇక.. ఇటీవల వరుస వర్షాలతో మగ్గం గుంతల్లో నీరు చేరి నేతన్నలు ఉపాధి కోల్పోయారు. బతకడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో కుటుంబ పోషణ భారమై రోజు కూలీలుగా ఇతర పనులకు వలస వెళ్లే దుర్భరపరిస్థితులు నెలకొన్నాయి.

ఆదుకున్న జగన్ సర్కారు

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. నేతన్నల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఏడాదికి ఒక్కో కుటుంబానికి క్రమం తప్పకుండా రూ.24 వేలు 'నేతన నేస్తం' కింద ఐదేళ్లలో రూ.1.20 లక్షలు అందించింది. కరోనా విలయతాండవంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థమైనా సాయం చేయడంలో వెనకడుగు వేయలేదు. ఐదేళ్ల కాలంలో 43,968 మంది చేనేత కార్మికులకు రూ.105.52 కోట్ల సొమ్ము వారి ఖాతాల్లో జమ చేశారు. తొలిఏడాది 2019లో 10,525 మందికి రూ.25.26 కోట్లు, 2020లో 8,821 మందికి రూ.21.17 కోట్లు, 2021లో 7,360 మందికి రూ.17.66 కోట్లు, 2022లో 8,286 మందికి రూ.19.88 కోట్లు, 2023 లో చివరి విడతగా 8,976 మందికి రూ. 21.54 కోట్లకు పైగా నేతన్న నేస్తం సొమ్ము అందించారు. దీంతో మగ్గాల ఆధునికీకరణ లేదా సామగ్రి కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చేనేత కార్మికులు సంతోషంగా జీవనం కొనసాగించారు.

యాక్టర్స్ డైరెక్టర్స్‌గా మారడం సినిమా ఇండస్ట్రీలో కొత్తేం కాదు. అయితే ఏదో ఐదూ పదీ సినిమాలు చేశాక డైరెక్టర్లుగా మారడం కాదు... సుదీర్ఘకాలం యాక్టర్స్‌గా కొనసాగిన కొంత మంది తమ డైరెక్షన్‌ను మార్చి, దర్శకులుగా పరిచయం అవుతున్నారు. అలాగే సాంకేతిక నిపుణులుగా సక్సెస్ అయిన కొంతమంది దర్శకులు, సంగీత దర్శకులు యాక్టర్స్‌గా పరిచయం కానున్నారు. ఇలా తమ కెరీర్‌లో కాస్త డైరెక్షన్ మార్చిన కొందరిపై మీరూ ఓ లుక్ వేయండి.

డైరెక్షన్ మారింది!

- దర్శకులుగా మారుతున్న యాక్టర్స్
- యాక్టర్స్‌గా స్క్రీన్‌పైకి వస్తున్న టెక్నీషియన్స్

ఇప్పటివరకూ తెరపై యాక్టర్స్‌గా తమదైన శైలిలో నటించి, ప్రేక్షకుల మన్ననలను పొందిన కొందరు స్టార్స్ ఇప్పుడు మెగాఫోన్ పట్టారు. దర్శకులుగా తమ సత్తా చాటడానికి రెడీ అయిన ఆ యాక్టర్స్ గురించి తెలుసుకుందాం.

విశాల్

రవి మోహన్

హృతిక్ రోషన్

దేవిశ్రీ ప్రసాద్

ఇక తెరవెనక కూడా...

సూపర్ హీరో సాహసాలు

బాలీవుడ్‌లో 'క్రిష్' ఫ్రాంచైజీ సినిమాకు ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంది. ఈ సూపర్ హీరో సినిమాకు తెలుగులోనూ మంచి ఆదరణ ఉంది. ఈ 'క్రిష్' ఫ్రాంచైజీ నుంచి రానున్న తాజా చిత్రం 'క్రిష్ 4'. హృతిక్ రోషన్ హీరోగా ఈ సినిమాను రెండేళ్ల క్రితమే అధికారికంగా ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ సినిమా ఇంకా సెట్స్‌కు వెళ్లలేదు. తొలుత ఈ సినిమాకు ప్రముఖ దర్శక–నిర్మాత, హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించనున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ అనారోగ్య కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి దర్శకుడిగా తప్పుకున్నారు. ఆ తర్వాత హృతిక్ రోషన్‌తో 'బ్యాంగ్ బ్యాంగ్, వార్' వంటి బాక్సాఫీస్ హిట్ సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ పేరు 'క్రిష్ 4'కి దర్శకుడిగా వినిపించింది. కానీ ఈ చిత్రానికి తాను దర్శకత్వం వహించడం లేదని, ఓ సందర్భంలో సిద్ధార్థ్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'క్రిష్ 4' సినిమాకు తన కొడుకు హృతిక్ రోషన్ డైరెక్షన్ చేస్తాడని, ఈ సూపర్ హీరో సాహసాలను తనదైన స్టైల్లో తెరకెక్కించడానికి హృతిక్ రోషన్ సిద్ధంగా ఉన్నారని రాకేష్ రోషన్ చెప్పారు. తన 25 సంవత్సరాల సినీ కెరీర్‌లో హృతిక్ రోషన్ దర్శకత్వం వహించనున్న తొలి సినిమా ఇదే కావడం విశేషం. యశ్‌రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్య చోప్రా ఈ 'క్రిష్ 4' సినిమాను నిర్మించనున్నారని బాలీవుడ్ సమాచారం. కాగా, హృతిక్ రోషన్–నిర్మాత ఆదిత్య చోప్రా కాంబినేషన్‌లో ఇటీవల వచ్చిన 'వార్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో ఈ ప్రభావం 'క్రిష్ 4' చిత్రంపై పడే అవకాశం ఉందని, దీంతో 'క్రిష్ 4' సినిమా సెట్స్‌కు వెళ్లడానికి మరికొంత సమయం పడుతుందనే టాక్ బాలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

నేహా శర్మ

మకుటం

రెండు దశాబ్దాలుగా యాక్టర్‌గా ఇండస్ట్రీలో రాణిస్తూ, తన సత్తా చాటుకుంటున్నారు హీరో విశాల్. ఇప్పుడు దర్శకుడిగా విశాల్ తొలిసారిగా మెగాఫోన్ పట్టారు. విశాల్ హీరోగా నటిస్తున్న తమిళ చిత్రం 'మగుడం'. ఈ సినిమాకు తెలుగులో 'మకుటం' అనే టైటిల్ ఖరారు చేశారు. స్టంట్ కొరియోగ్రాఫర్ రవి అరసు దర్శకుడిగా ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. కానీ విశాల్‌కు, రవి అరసుకు మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ రావడంతో ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలను కూడా స్వీకరించారు విశాల్. కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగా 'మకుటం' సినిమాకు దర్శకత్వం వహించాల్సి వచ్చిందని, ఈ విషయాన్ని సీక్రెట్‌గా ఉంచాల్సిన అవసరం లేదని ఇటీవల విశాల్ పేర్కొన్నారు. అలాగే తాను తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు విశాల్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో జరుగుతోంది. భారీ స్థాయిలో క్లైమాక్స్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ చిత్రంలో కృపాకర్ అనే పాత్రలో విశాల్ కనిపిస్తారట. ఇంకా ఈ చిత్రంలో దుషారా విజయన్, అంజలి, తంబి రామయ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌బీ చౌదరి 'మకుటం'ను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విశాల్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఈ చిత్రంలో విశాల్ మూడు గెటప్స్‌లో కనిపించనున్నారు. సముద్ర తీరం, అక్కడి వ్యాపారం, తీర ప్రాంతాల్లో జరిగే అక్రమాలు, మాఫియా వంటి అంశాల నేపథ్యంలో 'మకుటం' కథ సాగుతుందని కోలీవుడ్ టాక్. ఈ సంగతి ఇలా ఉంచితే... విశాల్ కెరీర్‌లో వన్నాఫ్ ది బిగ్గెస్ట్ హిట్స్ అయిన 'డిటెక్టివ్' చిత్రానికి 'మిస్కిన్' దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'డిటెక్టివ్' సినిమాకు సీక్వెల్‌గా 'డిటెక్టివ్ 2' చిత్రాన్ని కూడా ప్రకటించారు. కానీ మిస్కిన్‌తో విశాల్‌కు క్రియేటివ్ డిఫరెన్సెస్ రావడంతో 'డిటెక్టివ్ 2' సినిమాకు తానే దర్శకత్వం వహించనున్నట్లుగా గతంలో ప్రకటించారు. విశాల్ దర్శకత్వం వహించే తొలి సినిమా ఇదే అవుతుందని అందరూ ఊహించారు. కానీ ఇప్పుడు 'మకుటం'తో విశాల్ దర్శకుడిగా పరిచయం కానున్నారు.

మరి... 'డిటెక్టివ్ 2' చిత్రం కూడా విశాల్ డైరెక్షన్‌లోనే సెట్స్‌కు వెళ్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

సరస్వతి

నటిగా వరలక్ష్మీ శరత్‌కుమార్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 'క్రాక్, నాంది, హనుమాన్, యశోద' వంటి స్ట్రయిట్ తెలుగు సినిమాలు కూడా చేశారామె. కథ ప్రకారం కొన్నిసార్లు క్యారెక్టర్ ఆర్టిస్టుగా కనిపిస్తే, ఇంకొన్నిసార్లు విలన్‌గా మెప్పించారు. అయితే వరలక్ష్మీ శరత్‌కుమార్ తన సినీ కెరీర్‌లో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 'సరస్వతి' సినిమాతో తాను దర్శకురాలిగా మారుతున్నట్లుగా వరలక్ష్మీ శరత్‌కుమార్ ఇటీవల ప్రకటించారు. ఈ థ్రిల్లర్ సినిమాలో ప్రియమణి, నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నట్లుగా తెలిసింది. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషలతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు వరలక్ష్మీ శరత్‌కుమార్. తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి దోశ డైరీస్ పతాకంపై 'సరస్వతి' సినిమాను నిర్మిస్తున్నారామె. ఈ సినిమాకు తమన్ సంగీతం అందించనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... గతంలో 'కన్నామూచ్చి' అనే సినిమాతో వరలక్ష్మీ శరత్‌కుమార్ దర్శకురాలిగా మారతారన్న వార్తలు వచ్చాయి. కానీ ఈ చిత్రం పూర్తి స్థాయిలో సెట్స్‌కు వెళ్లలేదన్న వార్తలు ఉన్నాయి.


వరలక్ష్మీ శరత్‌కుమార్

పీరియాడికల్ డ్రామా

రామ్‌చరణ్ హీరోగా పరిచయం అయిన 'చిరుత' సినిమాలో హీరోయిన్‌గా నటించిన నేహా శర్మ గుర్తుండే ఉంటారు. ఈ సినిమా తర్వాత నేహా శర్మ హిందీ, పంజాబీల్లో హీరోయిన్‌గా సినిమాలు చేశారు. ఇటీవల నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' చిత్రంలో ఓ మోడల్‌గా గెస్ట్ రోల్ చేశారు నేహా. ఆమె దర్శకురాలిగా పరిచయం కానున్నారని టాక్. 1945 నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది హీరోగా నటిస్తారని, మోహిత్ కీలక పాత్రలో నటించనున్నారని సమాచారం. అంతేకాదు... ఈ సినిమాను అజయ్ దేవగన్ నిర్మించనున్నారని టాక్. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుందని తెలిసింది.

ఆర్డినరీ మ్యాన్

ఇండస్ట్రీలో హీరోగా ఇరవై సంవత్సరాల సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను పూర్తి చేసుకున్న తర్వాత రవి మోహన్ ('జయం' రవి) ఇటీవల రవి మోహన్ స్టూడియోస్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ రవి మోహన్ స్టూడియోస్‌లో సినిమాలు, ఓటీటీ ప్రాజెక్ట్స్‌ను తెరకెక్కించనున్నట్లుగా ఆయన తెలిపారు. అంతే కాదు... తన నిర్మాణ సంస్థలోని 'యాన్ ఆర్డినరీ మ్యాన్' చిత్రంతో దర్శకుడిగా మారారు రవి మోహన్. ఈ హీరోకి దర్శకుడిగా ఇదే తొలి చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో యోగిబాబు లీడ్ రోల్‌లో నటిస్తారు. రవి మోహన్ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఒక ఆర్డినరీ మ్యాన్ లైఫ్ ఎలా ఉంటుంది? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశమని సమాచారం.

వీరే కాదు... మరికొందరు హీరోలు, హీరోయిన్లు దర్శకులుగా మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని టాక్. మరోవైపు ఈ ఏడాది విడుదలైన 'ఫతే' చిత్రంతో సోనూ సూద్, 'ది మెహతా బాయ్స్' చిత్రంతో బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు ఆల్రెడీ దర్శకులుగా పరిచయం అయిన సంగతి తెలిసిందే.

ఇక తెరపైకి కూడా...

ఇప్పటివరకూ తెరవెనక టెక్నీషియన్స్‌గా తమ ప్రతిభ చాటుకున్న సాంకేతిక నిపుణులు కొందరు ఇప్పుడు తెరపై నటులుగా కనిపించడానికి రెడీ అయ్యారు. వీరిలో కొందరు ఇంతకుముందు ఒకట్రెండు కీలక పాత్రల్లో కనిపించారు. ఇప్పుడు మాత్రం హీరోలుగా కొందరు, లెంగ్త్ రోల్స్‌లో కొందరు కనిపించనున్నారు. ఆ విశేషాలు...

ఎల్లమ్మలో...

రెండు దశాబ్దాలకు పైగా ఇండస్ట్రీలో సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు దేవిశ్రీ ప్రసాద్. కొన్ని పాటల్లో గెస్ట్ అప్పియరెన్స్ కూడా ఇచ్చారు. కానీ ఇప్పుడు పూర్తి స్థాయిలో యాక్టర్‌గా వెండితెరపై కనిపించనున్నారట దేవిశ్రీ ప్రసాద్. 'బలగం' వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత వేణు యెల్దండి రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో 'ఎల్లమ్మ' అనే సినిమా చేయనున్నారు. ఈ చిత్రంలో హీరోలంటూ నాని, నితిన్, శర్వానంద్ వంటి వార్ల పేర్లు వినిపించాయి. కానీ ఫైనల్‌గా ఈ చాన్స్ దేవిశ్రీ ప్రసాద్‌కు లభించిందట. ఈ 'ఎల్లమ్మ' చిత్రంలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తారని, హీరోయిన్‌గా కీర్తి సురేష్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. 'దిల్' రాజు ఈ సినిమాను నిర్మించనున్నారట. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. అలాగే ఈ సినిమాకు తొలుత తమిళ సంగీత దర్శక ద్వయం వివేక్–మెర్విన్‌లు స్వరాలు సమకూర్చనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ హీరోగా నటించడంతో పాటు ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారనే టాక్ కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

తమన్

మళ్లీ యాక్టర్‌గా...

సంగీత దర్శకుడిగా తమన్ ఎంత బిజీగా ఉంటారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ బిజీ టైమ్‌లోనూ యాక్టర్‌గా తమన్ ఓ సినిమా చేస్తున్నారు. అదే 'ఇదయమ్ మురళి' మూవీ. అథర్వ మురళి ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. కయాదు లోహర్, ప్రీతి ముకుందన్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా తమన్, నిహారిక ఎన్‌ఎమ్, ప్రగ్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ 'ఇదయమ్ మురళి' సినిమాను ప్రకటించారు. షూటింగ్ కూడా మొదలైంది. మేజర్ షూటింగ్ విదేశాల్లో జరుగుతోంది. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవానికి ఈ సినిమా విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది. ఇక యాక్టర్‌గా తమన్‌కు ఇది తొలి చిత్రం కాదు. ఆ మాటకొస్తే... తమన్ కెరీర్ యాక్టర్‌గానే మొదలైంది. 2003లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'బాయ్స్' చిత్రంలో తమన్ ఓ కీలక పాత్రలో నటించారు. ఆ తర్వాత గెస్ట్ రోల్స్‌లో కనిపించినా కొంత గ్యాప్ తర్వాత తమన్ కీలక పాత్రలో నటిస్తున్నది మాత్రం 'ఇదయమ్ మురళి' సినిమాలోనే. మరో విశేషం ఏంటంటే... ఈ సినిమాకు తమన్ సంగీతం కూడా అందిస్తున్నారు.

ప్రేమకథ

అడివి శేష్ హీరోగా నటిస్తున్న 'డెకాయిట్' చిత్రంతో సినిమాటోగ్రాఫర్ షానియల్ డియో దర్శకుడిగా మారారు. గతంలో అడివి శేష్ హీరోగా నటించిన 'క్షణం, గూఢచారి' వంటి సినిమాలకు షానియల్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేశారు. ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో రూపొందుతున్న 'డెకాయిట్' సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపిస్తారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 19న విడుదల కానుంది.

షానియల్ డియో

యాక్షన్ డ్రామా

'కల్కి 2898 ఏడీ, కేజీఎఫ్, ఖైదీ, అమరన్..' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలకు స్టంట్ కొరియోగ్రాఫర్స్‌గా పని చేసిన అన్బు–అరివులు దర్శకులుగా మారారు. ఈ చిత్రంలో కమల్‌హాసన్ హీరోగా నటించనున్నారు. 2024లోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. త్వరలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. పూర్తి స్థాయి యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కనుంది.

కమల్‌హాసన్‌తో అన్బరివు

ఎల్‌యూసీలో డీసీ?

'మా నగరం' సినిమాతో దర్శకుడిగా పాపులర్ అయ్యారు లోకేశ్ కనగరాజ్. నెక్ట్స్ మూవీ 'ఖైదీ' బ్లాక్ బస్టర్ కావడంతో లోకేశ్ తమిళ చిత్ర పరిశ్రమలో స్టార్ డైరెక్టర్ అయ్యారు. ఈ స్టార్ హోదాకు తగ్గట్లే లోకేశ్ కనగరాజ్‌కు కమల్ హాసన్‌తో 'విక్రమ్', రజనీకాంత్‌తో 'కూలీ', విజయ్‌తో 'లియో, మాస్టర్' వంటి చిత్రాలను తెరకెక్కించే చాన్స్ దక్కింది. స్టార్ హీరోలతో సినిమాలు చేసిన ఈ తమిళ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా కూడా సినిమాలు చేస్తున్నారు. రైటర్‌గానూ చేస్తున్నారు. ఇదే స్పీడ్‌లో హీరోగానూ సత్తా చాటాలని నిర్ణయించుకుని, 'డీసీ' అనే మూవీని స్టార్ట్ చేశారు లోకేశ్. గతంలో ఒకట్రెండు సినిమాల్లో గెస్ట్ రోల్‌లో, ఓ మ్యూజిక్ వీడియోలో లోకేశ్ యాక్టర్‌గా కనిపించినా, 'డీసీ'లో మాత్రం పూర్తి స్థాయిలో హీరోగా నటిస్తున్నారు. ధనుష్‌తో 'కెప్టెన్ మిల్లర్' తీసిన దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఈ 'డీసీ' సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా బాలీవుడ్ హీరోయిన్ వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో దేవ దాస్‌గా లోకేశ్, చంద్రగా వామిక నటిస్తున్నారు. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేయనున్నట్లుగా ఆల్రెడీ మేకర్స్ ప్రకటించారు. మరోవైపు డైరెక్టర్‌గా లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌యూసీ) పేరిట సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. 'ఖైదీ, విక్రమ్, లియో' వంటివి 'ఎల్‌యూసీ'లో భాగమైన చిత్రాలే. ఈ 'డీసీ' కూడా 'ఎల్‌యూసీ'లోని చిత్రమే అన్నట్లుగా ఓ టాక్ తెరపైకి వచ్చింది. మరి... 'ఎల్‌యూసీ'లో 'డీసీ' భాగం అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

లోకేశ్ కనగరాజ్

మిస్టర్ సత్య

తమిళ సూపర్ డూపర్ హిట్ ఫిల్మ్ 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషాన్ జీవంత్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. 'టూరిస్ట్ ఫ్యామిలీ'లో అభిషాన్ నటించినప్పటికీ ఈ చిత్రంలో తనది కీలక పాత్ర మాత్రమే. కాగా అభిషాన్ ఫుల్ లెంగ్త్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఆల్రెడీ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో సత్య అనే పాత్రలో నటిస్తున్నారు అభిషాన్. ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాకు రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఓ నిర్మాతగా ఉన్నారు. ఈ సినిమాను కేవలం 45 రోజుల్లోనే చిత్రీకరించారట మేకర్స్. ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్స్‌లో రిలీజ్ కానుందట. ప్రేమికుల రోజు సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.

అభిషాన్ జీవంత్

ఇలా... దర్శకులుగా మారుతున్న టెక్నీషియన్స్ మరికొంతమంది ఉన్నారు.

- మునిమి శివాంజనేయులు

థ్రిల్లర్ రెడీ

ఐశ్వర్య, అర్జున్

అర్జున్, ఐశ్వర్యా రాజేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేష్ లెట్చుమనన్ దర్శకత్వంలో జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది. ఈ థ్రిల్లర్ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషలలో ఒకేసారి ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లుగా చిత్రబృందం పేర్కొంది.

క్రిస్మస్‌కి వృషభ

మోహన్ లాల్

మోహన్‌లాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'వృషభ'. తండ్రీ కొడుకుల మధ్య గాఢమైన అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ ప్రేమ, విధి, ద్వేషం వంటి భావోద్వేగాలను మిళితం చేసి నందకిశోర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నని, జుహి పరేఖ్ మెహతా నిర్మించారు. ఈ చిత్రం క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సమర్జిత్ లంకేష్, రాగిణి ద్వివేది, నయన్ సారిక, అజయ్, నేహా సక్సేనా కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాని మలయాళం, తెలుగులో ఏక కాలంలో చిత్రీకరించారు. ఈ రెండు భాషలతో పాటు హిందీ, కన్నడలోనూ విడుదల చేయనున్నారు.

బిజినెస్ రీల్

డిజిటల్ గోల్డ్‌తో జాగ్రత్త

సెబీ హెచ్చరిక

ముంబై: డిజిటల్ గోల్డ్‌ను విక్రయించే సంస్థలు, ఆయా ఉత్పత్తులు నియంత్రణ పరిధిలో లేవని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తెలిపింది. కాబట్టి, డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేయడం రిస్కుతో కూడుకున్న వ్యవహారమని, జాగ్రత్త వహించాలని హెచ్చరించింది. సెబీ నియంత్రించే పసిడి ఉత్పత్తులతో పోలిస్తే ఇవి భిన్నమైనవని పేర్కొంది. డిజిటల్ గోల్డ్ లేదా ఈ–గోల్డ్ ప్రొడక్టుల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ యంత్రాంగంపరమైన హామీ ఉండబోదని వివరించింది. ప్రస్తుతం పసిడికి డిమాండ్ భారీగా పెరగడం, ఆన్‌లైన్‌లో అత్యంత తక్కువగా రూ. 10 నుంచి కూడా ఇన్వెస్ట్ చేయొచ్చంటూ పలు సంస్థలు ఊరిస్తుండటం తదితర పరిణామాల నేపథ్యంలో సెబీ హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టులు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ మొదలైన సాధనాల ద్వారా నియంత్రణ సంస్థ పరిధిలో పసిడిలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని సెబీ తెలిపింది.

ఎవ్రెన్ ప్రాజెక్టుకి ఆర్ఈసీ రూ. 7,500 కోట్ల నిధులు

న్యూఢిల్లీ: ఎవ్రెన్ సంస్థ తలపెట్టిన హైబ్రిడ్ ఎనర్జీ ప్రాజెక్టుకు రూ. 7,500 కోట్ల నిధులు అందించనున్నట్లు ప్రభుత్వ రంగ ఆర్ఈసీ తెలిపింది. ఒక ప్రైవేట్ రంగ ప్రాజెక్టుకు ఇంత భారీ స్థాయిలో మంజూరు చేయడం ఇదే ప్రథమం అని వివరించింది. కర్నూలులో ఎవ్రెన్ అభివృద్ధి చేస్తున్న 1.04 గిగావాట్ల ప్రాజెక్టు పెట్టుబడి వ్యయం రూ. 9,910 కోట్లుగా ఉంటుంది. అంతర్జాతీయ ఇన్‌ఫ్రా రంగ ఇన్వెస్టర్ బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ ఎనర్జీ కలిసి ఎవ్రెన్‌ని ప్రారంభించింది. ఇందులో బ్రూక్‌ఫీల్డ్‌కి 51.49 శాతం వాటాలు ఉన్నాయి.

ఫిజిక్స్‌వాలాలో థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.136 కోట్లు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూకి వస్తున్న ఎడ్‌టెక్ సంస్థ ఫిజిక్స్‌వాలాలో 'థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్' రూ.136 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. 14 మంది ఉద్యోగుల నుంచి 0.37 శాతం వాటాకు సరిసమానమైన 1.07 కోట్ల షేర్లను కొనుగోలు చేసింది. ఒక్కొక్క షేరు ధరను రూ.127గా లెక్క కట్టింది. ఐపీఓ ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 17% అధికం. నవంబర్ 11న ఫిజిక్స్‌వాలా ఐపీవో ప్రారంభం కానుంది. దీని ద్వారా కంపెనీ రూ. 3,480 కోట్లు సమీకరించనుంది. ప్రారంభ దశలో ఉన్న టెక్నాలజీ ఆధారిత వ్యాపారాల్లో ఇన్వెస్ట్ చేసే థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్ దేశీయంగా స్విగ్గీ, ఫస్ట్‌క్రై, అర్బన్ కంపెనీలాంటి సంస్థల్లో కూడా పెట్టుబడులు పెట్టింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-11-2025

విశాఖ	585-00
చిత్తూరు	623-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	590-00
వరంగల్	592-00
రిటైల్ ధర	6.50

ఓఎఫ్ఎస్ బాటలో ప్రమోటర్లు

- విలువపరంగా ఈ ఏడాది ఐపీవోల్లో 65 శాతం భాగం
- గతేడాది ఇది 59 శాతం
- టాప్‌లో విశాల్ మెగామార్ట్, మ్యాన్‌కైండ్ మొదలైనవి

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూల్లో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో ప్రమోటర్లు వాటాలను విక్రయించడం గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు (జనవరి–నవంబర్) వచ్చిన ఐపీవోల్లో విలువపరంగా ఓఎఫ్ఎస్ పరిమాణం సుమారు 65 శాతంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023లో ఇది మొత్తం ఐపీవోల్లో 58 శాతంగా, 2024లో 59 శాతంగా నిల్చింది. 2023లో మొత్తం ఐపీవోల్లో (సంఖ్యాపరంగా) 15.8 శాతం ఇష్యూలు పూర్తిగా ఓఎఫ్ఎస్ విధానంలోనే వచ్చాయి. గతేడాది ఈ నిష్పత్తి 15.4 శాతంగా ఉండగా, ఈ ఏడాది 16.5 శాతానికి చేరింది. వ్యాపార విస్తరణ ఇతరత్రా అవసరాల కోసం సదరు ఇష్యూల్లో తాజా షేర్ల జారీ ద్వారా కంపెనీలు కొత్తగా నిధులు సమీకరించలేదు. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లే తమ వాటాలను ఓఎఫ్ఎస్ విధానంలో విక్రయించుకున్నారు. 2024లో హ్యుందాయ్, 2025లో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఈ తరహా మెగా ఐపీవోల జాబితాలో నిల్చాయి.

గడిచిన మూడేళ్లలో విలువపరంగా ఓఎఫ్ఎస్ వాటా అత్యధికంగా ఉన్న టాప్ ఐపీవోల్లో విశాల్ మెగా మార్ట్, మ్యాన్‌కైండ్ ఫార్మా, టాటా టెక్నాలజీస్, ఉయ్‌వర్క్ ఇండియా, శాగిలిటీ ఇండియా, ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్, సెల్లో వరల్డ్, ఓర్కలా ఇండియా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా ప్రమోటర్లు, బడా సంస్థాగత ఇన్వెస్టర్లు మొదలైన వర్గాలు ఓఎఫ్ఎస్ విధానంలో వాటాలు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆఫర్ ఫర్ సేల్ విధానంలో అత్యధికంగా ప్రమోటర్లే విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2025లో వచ్చిన ఇష్యూలకు సంబంధించి ఓఎఫ్ఎస్ ద్వారా ప్రమోటర్లు సేకరించిన నిధులు (విలువపరంగా) 68.5 శాతంగా నమోదైంది. 2023లో ఈ నిష్పత్తి 52.8 శాతంగా నిల్చింది. పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలోనే వచ్చిన టాప్ ఐపీవోల జాబితాలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెక్సావేర్ టెక్నాలజీస్, ష్లాస్ బెంగళూరు, విక్రమ్ సోలార్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఆఫ్కాన్స్ మొదలైనవి ఉన్నాయి.

మెరుగ్గా మార్కెట్లు..

పబ్లిక్ ఇష్యూల్లో ఓఎఫ్ఎస్ వాటా పెరుగుతుండటమనేది దేశీ క్యాపిటల్ మార్కెట్ వ్యవస్థ పరిపక్వ స్థాయికి చేరుతున్న సంకేతంగా భావించవచ్చని ప్రైమ్ డేటాబేస్ వర్గాలు తెలిపాయి. 1990లు, 2000ల ప్రాంతంలో చాలా మటుకు ఐపీవోలు తాజాగా పెట్టుబడులు సమీకరించాయని, అలాంటి కంపెనీల పరిస్థితి ఏమైందనేది అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించాయి. ఇక పెద్ద సంఖ్యలో ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ బాట పడుతున్నప్పటికీ, ఆయా కంపెనీల్లో వారి పెట్టుబడులు తప్పనిసరిగా నిర్దిష్ట స్థాయిలో ఉండేలా చూసేందుకు స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నాయి. అయితే, ఐపీవోల తర్వాత ప్రమోటర్లు బల్క్, బ్లాక్ డీల్స్ కుదుర్చుకునే ధోరణి పెరుగుతోందని, ఇన్వెస్టర్లు దీనిపై ఓ కన్నేసి ఉంచాలని పరిశ్రమ వర్గాలు వివరించాయి. మరోవైపు, ఐపీవో పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉన్నంత మాత్రాన ప్రతికూలాంశంగా భావించనవసరం లేదని తెలిపాయి. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ పెట్టుబడులు ఉన్న సంస్థల్లో ఇది సాధారణమేనని వివరించాయి. ప్రారంభ దశలో రిస్క్ క్యాపిటల్ భారీగా అవసరం అవుతుందని, ఆ నిధులను సమకూర్చిన పీఈ, వీసీలు తర్వాత దశలో ఐపీవోల్లో ఓఎఫ్ఎస్ కింద వాటాలను విక్రయించుకుంటాయని పేర్కొన్నాయి.

ఓఎఫ్ఎస్ ఎందుకంటే..

మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ షేర్‌హోల్డింగ్ కనీసం 25 శాతం ఉండాలి. ఒకవేళ ప్రమోటర్ల వాటా 75 శాతానికి మించి ఉంటే, నిబంధనలను పాటించే క్రమంలో ఓఎఫ్ఎస్ ద్వారా షేర్లను విక్రయించి, వాటాను తగ్గించుకుంటారు. అంతేగాకుండా నిధులను సమీకరించుకునేందుకు కూడా ప్రమోటర్లు ఈ విధానాన్ని ఎంచుకుంటారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) వాటాలను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా దీన్ని ఉపయోగిస్తుంది.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆదాయం రూ. 656 కోట్లు

క్యూ2లో అత్యధికంగా 375 వాహనాల డెలివరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం ఎంఈఐఎల్ గ్రూప్‌లో భాగమైన ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 656.62 కోట్ల ఆదాయం ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 523.70 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 25 శాతం అధికం. లాభం రూ. 47.65 కోట్ల నుంచి 4 శాతం వృద్ధితో రూ. 49.43 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో 375 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివర్ చేశామని, వీటిలో 25 ఎలక్ట్రిక్ టిప్పర్లు కూడా ఉన్నాయని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ మహేష్ బాబు చెప్పారు. ఒక త్రైమాసికంలో ఇదే అత్యధికమని వివరించారు. కంపెనీ ఇప్పటివరకు 3,254 వాహనాలను అందించింది. 9,818 వాహనాలకి ఆర్డర్లతో భవిష్యత్ వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్నట్లు మహేష్ బాబు చెప్పారు. నిర్వహణ సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టడమనేది ఇటు ఆదాయం, లాభదాయకత వృద్ధికి దోహదపడినట్లు తెలిపారు. అటు దేశీయంగా ఎలక్ట్రిక్ బస్ సెగ్మెంట్లో తొలిసారిగా తమ బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కి సర్టిఫికేషన్ లభించినట్లు వివరించారు. వచ్చే త్రైమాసికం నుంచి ఈ టెక్నాలజీతో బస్సుల తయారీ ప్రారంభమవుతుందని మహేశ్ బాబు తెలిపారు. అర్ధ సంవత్సరానికి గాను కంపెనీ ఆదాయం రూ. 837.61 కోట్ల నుంచి 20 శాతం వృద్ధితో రూ. 1,003.85 కోట్లకు చేరింది. లాభం రూ. 71.91 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ. 75.46 కోట్లకు చేరింది.

ఎంఎస్‌ఎంఈలపై మరింత దృష్టి

అభయ్ ఇస్పాత్ చైర్మన్ వినేష్ మెహతా

న్యూఢిల్లీ: ఎంఎస్‌ఎంఈలు, పారిశ్రామిక కస్టమర్లకు ఉత్పత్తులు, సేవలు అందించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు అభయ్ ఇస్పాత్ చైర్మన్ వినేష్ మెహతా తెలిపారు. అత్యధిక వృద్ధికి అవకాశమున్న షీట్ మెటల్ కాంపోనెంట్స్, కోటింగ్ విభాగాల్లో కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఈ రెండింటిపై ఫోకస్ పెట్టడమనేది అటు పారిశ్రామిక రంగంలో, ఇటు నిర్మాణ..మౌలిక రంగాల్లో డిమాండ్‌కి తగ్గ స్థాయిలో సరఫరా చేసేందుకు తోడ్పడగలదని పేర్కొన్నారు. దేశీయంగా కోటెడ్ స్టీల్ మార్కెట్ 2024లో 27.7 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2030 నాటికి వార్షికంగా 7.4% వృద్ధితో 42 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనా.

భారత్ వైపు.. స్టార్టప్స్ చూపు...

- మన మార్కెట్లో విస్తరణపై సింగపూర్, కెనడా అంకురాల ఆసక్తి
- భారీ మార్కెట్, అధిక వృద్ధి అవకాశాలే కారణం

న్యూఢిల్లీ: దేశీయంగా భారీ మార్కెట్, వేగవంతమైన ఆర్థిక వృద్ధి తదితర అంశాల కారణంగా పలు అంతర్జాతీయ అంకుర సంస్థలు భారత మార్కెట్లో విస్తరించే యోచనలో ఉన్నాయి. సింగపూర్, కెనడా తదితర దేశాలకు చెందిన స్టార్టప్స్ వీటిలో ఉన్నాయి. హాంకాంగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పార్క్స్ కార్పొరేషన్ (హెచ్‌కేఎస్‌టీపీ) నిర్వహించిన గ్లోబల్ పిచ్ కాంపిటీషన్ 'ఎపిక్ 2025'లో పాల్గొన్న సందర్భంగా పలు విదేశీ అంకుర సంస్థలు భారత్‌పై ఆసక్తి వ్యక్తం చేశాయి. 70 పైగా దేశాలకు చెందిన 100 స్టార్టప్స్ నుంచి ఈ కాంపిటీషన్‌కి సుమారు 1,200 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భారత్ నుంచి రెండు అప్లికేషన్లు ఉన్నాయి. ఈ దరఖాస్తులను ప్రధానంగా డిజిటల్ హెల్త్ టెక్, ఫిన్‌టెక్, గ్రీన్‌టెక్ అని మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఎంట్రప్రెన్యూర్లను వర్ధమాన మార్కెట్లు, ఇన్వెస్టర్లు, ప్రపంచ స్థాయి ఆవిష్కరణల వ్యవస్థలకు అనుసంధానం చేసేందుకు ఎపిక్ 2025 తోడ్పడుతుందని హెచ్‌కేఎస్‌టీపీ చైర్మన్ సన్నీ తెలిపారు.

సానుకూల పరిస్థితులు ఆకర్షణీయం..

భారత్‌లో స్టార్టప్‌లకు అనువైన వ్యవస్థ ఉందని బ్యాటరీ రీసైక్లింగ్ కార్యకలాపాలు సాగించే సింగపూర్ సంస్థ న్యూ బ్యాటరీ మెటీరియల్స్ చైర్మన్ బ్రయాన్ తెలిపారు. ఇక్కడ భారత్‌లో పెద్ద సంఖ్యలో టూ–వీలర్లు, త్రీ–వీలర్లతో భారీ మార్కెట్ ఉందని తెలిపారు. బ్యాటరీ రీసైక్లింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న స్టార్టప్‌లు మెరుగ్గా రాణిస్తున్నాయని వివరించారు. భారత ప్రభుత్వ విధానాల గురించి మరింత తెలుసుకోవడంపై ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రీన్‌టెక్ కేటగిరీలో న్యూ బ్యాటరీస్ మెటీరియల్స్ విజేతగా నిల్చింది. మరోవైపు, ఏ ఇన్వెస్టరుకైనా భారత్‌లో పెట్టుబడులకు గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఎయిర్ కార్గో సాఫ్ట్‌వేర్ తయారు చేసే సింగపూర్ కంపెనీ 'బెల్లి' ప్రొడక్ట్ ఇంజినీర్ జేడెన్ తెలిపారు. భారత్‌లో అంకురాలకు మంచి భవిష్యత్తు ఉండగలదన్నారు. భారత మార్కెట్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కెనడాకి చెందిన కేవీ ఇమేజింగ్ ప్రెసిడెంట్ అమోల్ ఎస్ కార్నిక్ చెప్పారు. సైన్స్, మెడికల్ టెక్నాలజీల అభివృద్ధికి భారత ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుండటం తమకు ఒక అవకాశంగా ఉపయోగపడగలదని పేర్కొన్నారు. తమ సంస్థకు అనువైన మరిన్ని విధానాలపై అధ్యయనం చేస్తామని వివరించారు.

సాగుకు ఏఐ దన్ను

- వ్యవసాయం ముఖచిత్రాన్ని మార్చివేస్తున్న ఏడు టెక్నాలజీలు
- జాబితాలో రోబోటిక్స్, నానోటెక్, ఐవోటీ
- డబ్ల్యూఈఎఫ్ నివేదికలో భారత్‌లో కేస్ స్టడీస్ ప్రస్తావన

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఏడు టెక్నాలజీలు వ్యవసాయ రంగ ముఖచిత్రాన్ని మార్చివేయనున్నట్లు వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ఒక నివేదికలో తెలిపింది. జనరేటివ్ ఏఐ, రోబోటిక్స్, శాటిలైట్ ఆధారిత రిమోట్ సెన్సింగ్, నానో టెక్నాలజీ, కంప్యూటర్ విజన్, ఎడ్జ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) మొదలైనవి వీటిలో ఉన్నట్లు పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధికి భరోసా ఏర్పడటంతో పాటు ఉత్పాదకత పెరిగేందుకు కూడా ఈ సాంకేతికతలు దోహదపడతాయని వివరించింది. ఇటు పరిశ్రమ అటు విద్యావేత్తలతో సంప్రదింపుల మేరకు రూపొందించిన ఈ నివేదికలో భారత్‌లో కేస్ స్టడీస్‌ను డబ్ల్యూఈఎఫ్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. అంతర్జాతీయంగా వ్యవసాయం సంక్షోభాల్లో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో ఈ రిపోర్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లోకి వలసలు పెరగడం, వాతావరణంలో పెను మార్పులు, నేల..నీరులాంటి సహజ వనరులు వేగంగా తగ్గిపోతుండటం మొదలైన అంశాలన్నింటి వల్ల ఉత్పాదకతకు, వ్యవసాయంపై ఆధారపడిన వారి జీవనోపాధికి ముప్పు ఏర్పడుతోందని నివేదిక తెలిపింది. పెరుగుతున్న జనాభాకి తగ్గట్లుగా 2050 నాటికి ప్రపంచం మరింత భారీ స్థాయిలో ఆహారాన్ని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంటుందని ఐక్యరాజ్య సమితిలో భాగమైన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ పేర్కొంది. రైతుల సగటు వయస్సు 60 ఏళ్లకు చేరుతుండటం, 71 శాతం జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతుండటం, మూడో వంతు నేల సారం తగ్గిపోతుండటంలాంటి సవాళ్ల మధ్య దీన్ని సాధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించింది.

ఐసీఎంఆర్ పరిశోధనలు, ఫసల్ బీమాతో ప్రయోజనాలు ..

ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) దేశీయంగా ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుని నిలబడగలిగే వరివంగడాన్ని రూపొందించడాన్ని కేస్ స్టడీగా తీసుకోవచ్చని నివేదిక తెలిపింది. సంప్రదాయ పద్ధతిలో సాగును మెరుగుపర్చేందుకు ఉపయోగించే విధానాల్లో పెద్దగా కచ్చితత్వం లేకపోవడం, దిగుబడి రావడానికి సుదీర్ఘ సమయం పట్టేయడంలాంటివి ఉంటున్నాయి. దీన్ని అధిగమించేందుకు ఐసీఏఆర్ పరిశోధకులు సీఆర్ఐఎస్‌పీఆర్ ఆధారిత జీనోమ్ ఎడిటింగ్‌ను ఉపయోగించి రెండు వరి వంగడాలను తయారు చేశారు. డీఆర్ఆర్ 100 పేరిట రూపొందించిన మొదటి వెరైటీలో కరువు, వాతావరణంపరమైన ఒత్తిళ్లను తట్టుకునే సామర్థ్యం మెరుగ్గా ఉంది. దీంతో దిగుబడి 19 శాతం పెరిగి, ఉద్గారాలు 20 శాతం మేర తగ్గాయి. ఇక పూసా డీఎస్‌టీ రైస్ 1 వెరైటీలో చూస్తే ఉప్పు, క్షార గుణాలు ఎక్కువగా ఉన్న నేలల్లో సైతం ఇది వరుసగా 9.66 శాతం, 30.4 శాతం మేర దిగుబడులను సాధించింది. దీనితో దిగుబడి 20 శాతం పెరిగే అవకాశం ఉందని రిపోర్ట్ తెలిపింది.

అటు పంట బీమాకు సంబంధించి భారత్‌లో అమలవుతున్న ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను (పీఎంఎఫ్‌బీవై) కూడా నివేదిక ప్రస్తావించింది. రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ ఆధారిత సొల్యూషన్ .. మరింత వేగవంతంగా, కచ్చితత్వంతో క్లెయిమ్‌లను సెటిల్ చేయడానికి ఉపయోగపడుతోందని పేర్కొంది.

నివేదికలో మరిన్ని అంశాలు..

- పంటల పెరుగుదల, పర్యవేక్షణ, సంరక్షణ విషయంలో సంప్రదాయ ధోరణులను మార్చే సామర్థ్యం ఏడు సరికొత్త టెక్నాలజీలకు ఉంది. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని నిలబడే పంటలను తీర్చిదిద్దేందుకు, ఉత్పాదకతను పెంచేందుకు ఇవి దోహదపడగలవు.
- స్వయంచాలిత రోబోటిక్స్, కచ్చితత్వంతో కూడుకున్న సాగు పర్యవేక్షణ మొదలైన వాటిల్లో ఈ టెక్నాలజీలన్నింటినీ మేళవించి ఉపయోగిస్తే మరింత మెరుగైన ఫలితాలు రావచ్చు.
- ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొనగలిగే సామర్థ్యంతో 20% తక్కు ఉద్గారాలను వెలువరించే వరి వంగడాలను రూపొందించడం, చెరకులో కచ్చితత్వంతో కూడుకున్న సాగును అమలు చేయడంతో దిగుబడులు 40 శాతం పెరిగాయి. సరఫరా వ్యవస్థ రిస్కులను అంచనా వేసేందుకు రిమోట్ సెన్సింగ్ ఉపయోగపడుతోంది.
- సాగు వ్యవస్థలను కొత్తగా తీర్చిదిద్దేందుకు, ఉత్పాదకతపరమైన ఒత్తిళ్లను తగ్గించేందుకు మరిన్ని డీప్–టెక్ ఆవిష్కరణల అవసరముంది. సాంకేతిక పురోగతిని సత్వరం అందిపుచ్చుకునే విధానాలను నియంత్రణ సంస్థలు అమలు చేయాలి.
- వర్షపాతం ఒక పద్ధతిగా లేకపోవడం, ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ఇప్పటికే పలు హార్టికల్చర్ పంటల్లో 65% మేర నష్టాలకు దారి తీస్తున్నాయి.

క్యూ2 ఫలితాలు

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ లాభం రూ.75.36 కోట్లు

రెండంకెల స్థాయిలో అమ్మకాల వృద్ధి

న్యూఢిల్లీ: జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.75.36 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అమ్మకాల పరిమాణం రెండంకెల స్థాయిలో వృద్ధి చెందిన కారణంగా లాభాలు పెరిగినట్లు కంపెనీ తెలిపింది. కంపెనీ గతేడాది క్యూ2లో రూ.75.82 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించడం గమనార్హం. ఇదే రెండో క్వార్టర్‌లో కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.1,223.71 కోట్ల నుంచి రూ.1,436.43 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.1,348.72 కోట్లుగా ఉన్నాయి. అమ్మకాల పరిమాణం 3.11 మిలియన్ టన్నులుగా నమోదైంది. గతేడాది సెప్టెంబర్ క్వార్టర్ మొత్తం అమ్మకాలు 2.71 మిలియన్ టన్నులుగా మాత్రమే ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 30 నాటికి కంపెనీకి నికరంగా రూ.3,231 కోట్ల అప్పులున్నాయి. ''2025 జూన్ 30 నాటి రూ.4,566 కోట్ల రుణాలతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల. ఐపీఓ ద్వారా నిధుల సమీకరణతో ఇది సాధ్యమైంది'' అని కంపెనీ పేర్కొంది. ఇటీవల ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన తర్వాత కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రకటించడం ఇది రెండోసారి.

ఎస్‌బీసీ ఎక్స్‌పోర్ట్స్ నికర లాభం రెట్టింపు

న్యూఢిల్లీ: మిర్జాపూర్ కేంద్రంగా పనిచేసే ఎస్‌బీసీ ఎక్స్‌పోర్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి గానూ రూ.11.36 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే క్యూ2లో ప్రకటించిన రూ.5.36 కోట్లతో లాభంతో పోలిస్తే ఇది రెట్టింపు. వార్షిక ప్రాతిపదికన, సెప్టెంబర్ త్రైమాసికంలో ఆదాయం 28.49% వృద్ధి చెంది రూ.65.98 కోట్ల నుంచి రూ.84.70 కోట్లకు పెరిగింది. ఏప్రిల్–సెప్టెంబర్ వ్యవధికిగాను నికర లాభం 39% వృద్ధితో రూ.14.82 కోట్లు, ఆదాయం 19.32% వృద్ధితో రూ.157.15 కోట్లు నమోదు చేసింది. ఈ ఏడాదిలో పలు వర్క్ ఆర్డర్లు, ఎగుమతి ఒప్పందాలు సాధించడంతో కంపెనీ ఆర్డర్ బుక్ రూ.300 కోట్లకు పెరిగిందని కంపెనీ పేర్కొంది. తాజాగా కంపెనీకి దక్కిన ఆర్డర్లలో అధికశాతం దుబాయ్ కేంద్రంగా ఉన్న కస్టమర్లకు సంబంధించినవని తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లలో మరింతగా విస్తరిస్తున్నామని పేర్కొంది.

నైకా పటిష్ట పనితీరు

మూడింతలైన లాభం

న్యూఢిల్లీ: ఎఫ్ఎస్ఎన్ ఈ–కామర్స్ (నైకా మాతృ సంస్థ) సెప్టెంబర్ క్వార్టర్‌లో పటిష్ట పనితీరు నమోదు చేసింది. లాభం రూ.34.4 కోట్లకు దూసుకుపోయింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.10 కోట్లతో పోల్చి చూస్తే మూడింతలైంది. ఆదాయం 25 శాతం పెరిగి రూ.2,346 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.1,875 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంతో పోల్చి చూస్తే లాభం 47 శాతం, ఆదాయం 9 శాతం చొప్పున పెరిగాయి. స్థూల వస్తు విక్రయ విలువ (జీఎంవీ) 30 శాతం పెరిగి రూ.4,744 కోట్లకు చేరింది. వివిధ విభాగాల్లో వృద్ధి వేగాన్ని అందుకున్నట్టు నైకా వ్యవస్థాపకురాలు, సీఈవో ఫాల్గుణి నాయర్ తెలిపారు. సెప్టెంబర్ త్రైమాసికంలో 19 కొత్త స్టోర్లను ప్రారంభించినట్టు, దీంతో తమ ఓమ్నిఛానల్ నెట్‌వర్క్ (ఆన్‌లైన్/ఆఫ్‌లైన్) మరింత బలపడినట్టు చెప్పారు. ఫ్యాషన్ విభాగం జీఎంవీ 37 శాతం పెరిగి రూ.1,180 కోట్లుగా, బ్యూటీ జీఎంవీ 28% పెరిగి రూ.3,551 కోట్లుగా ఉన్నాయి.

సిగ్నేచర్ గ్లోబల్ నష్టం రూ.47 కోట్లు

ఆదాయ తగ్గుదల ప్రధాన కారణం

న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ సిగ్నేచర్ గ్లోబల్ సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.46.86 నికర నష్టాన్ని నమోదు చేసింది. ఆదాయం భారీ తగ్గడం ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు కంపెనీ తెలిపింది. గతేడాది క్యూ2లో రూ.4.15 కోట్ల నికర లాభాన్ని ప్రకటించడం విశేషం. వార్షిక ప్రాతిపదికన మొత్తం ఆదాయం రూ.777.42 కోట్ల నుంచి రూ.372.51 కోట్లకు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.12.42 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. అయితే, మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా రూ.1,205.40 నుంచి రూ.1,270.86 కోట్లకు పెరిగింది. గురుగ్రామ్ కేంద్రంగా పనిచేసే ఈ రియల్ ఎస్టేట్ సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,290 కోట్ల ప్రాపర్టీస్ విక్రయించింది. దీంతో సేల్స్ పరంగా దేశంలో అయిదవ అతిపెద్ద లిస్టెడ్ రియల్టీ కంపెనీగా నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.12,500 కోట్ల ముందస్తు బుకింగ్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

ట్రెంట్.. ఫర్వాలేదు

11 శాతం అప్



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ రిటైల్ సంస్థ ట్రెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో (క్యూ2) రూ.373 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.335 కోట్లతో పోల్చి చూస్తే 11 శాతం వృద్ధి చెందింది. ఆదాయం ఇదే కాలంలో రూ.4,156 కోట్ల నుంచి రూ.4,817 కోట్లకు చేరింది. నికరంగా చూస్తే ఆదాయం 15.9 శాతం పెరిగింది. వ్యయాలు 16.7 శాతం పెరిగి రూ.4,367 కోట్లుగా ఉన్నాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల కాలానికి సంస్థ లాభం 17 శాతం వృద్ధితో రూ.9,769 కోట్లకు పెరిగింది.

ధ్రువ్ జురేల్

పంత్

ధ్రువ్ జురేల్ మరో సెంచరీ

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 382/7 డిక్లేర్డ్ • దక్షిణాఫ్రికా 'ఎ' లక్ష్యం 417 • రెండో అనధికారిక టెస్టు

బెంగళూరు: సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగే టెస్టు సిరీస్‌లో ధ్రువ్ జురేల్‌కు భారత తుది జట్టుకు ఖాయమయ్యే ప్రదర్శన కనబరిచాడు. దక్షిణాఫ్రికా 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత 'ఎ' బ్యాటర్ ధ్రువ్ జురేల్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలతో కదం తొక్కాడు. శనివారం 78/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' 89.2 ఓవర్లలో 383/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ రిషభ్ పంత్ (54 బంతుల్లో 65; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) వన్డే తరహా ఆటతీరుతో అర్ధసెంచరీ సాధించాడు. జురేల్ (170 బంతుల్లో 127 నాటౌట్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకం సాధించగా, హర్ష్ దూబే (116 బంతుల్లో 84; 12 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. జురేల్, దూబే ఆరో వికెట్‌కు 184 పరుగులు జతచేశారు. దూబే అవుట్ కాగానే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన భారత్ 'ఎ' ప్రత్యర్థి ముందు 417 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించేందుకు దిగిన దక్షిణాఫ్రికా 'ఎ' ఆట నిలిచే సమయానికి 11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 25 పరుగులు చేసింది. జోర్డాన్ హెర్మన్ (15 బ్యాటింగ్), సెనోక్వానె (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆదివారం ఆఖరి రోజు సఫారీ ఇంకా 392 పరుగులు చేయాల్సివుండగా చేతిలో 10 వికెట్లున్నాయి.

పంత్ పదే పదే గాయపడినా...

భారత్ 'ఎ' కెప్టెన్ రిషబ్ పంత్ శనివారం రోజు ఆటలో పదేపదే గాయపడ్డాడు. మూడు సార్లు మూడు వేర్వేరు చోట్ల బంతి బలంగా తాకడంతో మైదానం వీడిన పంత్ జట్టు అవసరాల కోసం గాయాలను పంటిబిగువన భరించి మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చాడు. సఫారీ పేసర్ షెపో మొరకి బౌలింగ్‌లోనే ఓ సారి హెల్మెట్‌కు, మరోసారి మోచేతికి, మూడో సారి పొత్తికడుపులో బంతి వేగంగా తగలడంతో పంత్ విలవిల్లాడాడు.

రాణించిన రాహుల్ రాదేశ్

హైదరాబాద్ 295/7 • రాజస్తాన్‌తో రంజీ మ్యాచ్

రాదేశ్

పృథ్వీరాజ్

సాక్షి, హైదరాబాద్: ఓపెనర్ల వైఫల్యంతో శుభారంభం కరువైన హైదరాబాద్‌ను మిడిలార్డర్ బ్యాటర్లు రాహుల్ రాదేశ్, కెప్టెన్ రాహుల్ సింగ్ అర్ధ శతకాలతో ఆదుకున్నారు. రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి'లో సొంతగడ్డపై రాజస్తాన్‌తో శనివారం మొదలైన మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టులో ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (6), అభిరథ్ రెడ్డి (9) నిరాశపరిచారు. దీంతో 21 పరుగులకే ఓపెనర్లిద్దరిని కోల్పోయింది. ఈ దశలో వన్‌డౌన్ బ్యాటర్ హిమతేజ (68 బంతుల్లో 39; 6 ఫోర్లు)తో జతకలిసిన కెప్టెన్ రాహుల్ సింగ్ మొదట వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. తర్వాత రాజస్తాన్ బౌలింగ్‌పై అవలీలగా పరుగులు సాధించడంతో తొలి సెషన్‌లో మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించారు. రెండో సెషన్ మొదలయ్యాక సాఫీగా సాగిపోతున్న ఈ జోడీని రాహుల్ చహర్ విడగొట్టాడు. జట్టు స్కోరు 101 వద్ద హిమతేజను అవుట్ చేశాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన వరుణ్ గౌడ్ అండతో రాహుల్ (84 బంతుల్లో 55; 7 ఫోర్లు) అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. కానీ కాసేపటికే అతను కూడా పెవిలియన్ చేరాడు. స్వల్ప వ్యవధిలో వరుణ్ (23; 2 ఫోర్లు) వికెట్ పారేసుకోవడంతో 150 పరుగుల వద్ద హైదరాబాద్ జట్టు ఐదో వికెట్‌ను కోల్పోయింది. రెండో సెషన్‌లో సగం వికెట్లను కోల్పోయిన జట్టును రాహుల్ రాదేశ్ ఆదుకున్నాడు. రోహిత్ రాయుడు (86 బంతుల్లో 47; 4 ఫోర్లు) కుదురుగా ఆడటంతో ఆరో వికెట్‌కు 117 పరుగులు జోడించాడు. అర్ధసెంచరీకి చేరువైన రోహిత్ నిష్క్రమించగా, రాహుల్ రాదేశ్ నిలకడను ప్రదర్శించి ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే దశలో సీవీ మిలింద్ (14; 2 ఫోర్లు) రూపంలో హైదరాబాద్ ఏడో వికెట్‌ను కోల్పోయినప్పటికీ తొలి రోజు ఆటలో సంతృప్తికర స్థాయిలో పరుగులు సాధించింది. రాజస్తాన్ బౌలర్లలో అనికేత్, అశోక్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. ఆకాశ్, రాహుల్ చహర్, సచిన్ యాదవ్‌లకు తల ఒక వికెట్ దక్కింది.

పృథ్వీరాజ్‌కు 4 వికెట్లు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర బౌలర్లు యర్రా పృథ్వీరాజ్ (4/46), సౌరభ్ కుమార్ (2/4) తొలిరోజే తమిళనాడు బ్యాటర్ల ఆట కట్టించారు. రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ'లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేపట్టిన తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 74.3 ఓవర్లలో 182 పరుగులకే ఆలౌటైంది. పేసర్లలో పృథ్వీతో పాటు సాయితేజ (1/50), రాజు (1/39) తలా ఒక చేయి వేయడంతో తమిళ జట్టు 46 పరుగులకే 5 కీలక వికెట్లను కోల్పోయి కోలుకోలేకపోయింది. విమల్ (10), జగదీశన్ (19), సచిన్ (2), ప్రదోశ్ (8), బాబ ఇంద్రజీత్ (19), సిద్ధార్థ్ (0), కెప్టెన్‌సాయి కిషోర్ (8) సహా ఏ ఒక్కరు కనీసం 20 పరుగులైనా చేయలేకపోయారు. తొమ్మిదో వరుస బ్యాటర్ విద్యుత్ (118 బంతుల్లో 40; 4 ఫోర్లు), ఆఖరి వరుస టెయిలెండర్ సందీప్ వారియర్ (87 బంతుల్లో 29 నాటౌట్; 6 ఫోర్లు) చేసిన పోరాటంతో ఆ మాత్రం స్కోరు చేసింది. 103 పరుగులకే 9 వికెట్లను కోల్పోయి ఆలౌట్‌కు సిద్ధమైపోయిన తమిళనాడు ఇన్నింగ్స్‌ను వాళ్లిద్దరు పదో వికెట్‌కు 79 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర ఆట ముగిసే సమయానికి 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 20 పరుగులు చేసింది. శ్రీకర్ భరత్ (12) అవుటవగా, అభిషేక్ (3 బ్యాటింగ్), విజయ్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

విహారి

విహారి అజేయ శతకం

త్రిపుర 316/4 • రంజీ ట్రోఫీ రౌండప్

ముషీర్

అగర్తలా: త్రిపుర **జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న** తెలుగు క్రికెటర్ **హనుమ విహారి శతకాల జోరు** కొనసాగిస్తున్నాడు. రంజీ ట్రోఫీ గ్రూప్ 'సి'లో బెంగాల్‌తో జరిగిన గత మ్యాచ్‌లో వీరోచిత శతకంతో త్రిపురకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కట్టబెట్టిన విహారి తాజాగా అస్సాంపై కూడా అజేయ సెంచరీతో కదం తొక్కాడు. టాస్ నెగ్గిన అస్సాం ఫీల్డింగ్ ఎంచుకోవడంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 84 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఓపెనర్లు హృతురాజ్ రాయ్ (5), కాసేపటికే బిక్రమ్‌కుమార్ దాస్ (22; 3 ఫోర్లు) వికెట్లను కోల్పోయిన త్రిపురకు విహారి (215 బంతుల్లో 143 బ్యాటింగ్; 17 ఫోర్లు, 1 సిక్స్) ఆపద్బాంధవుడయ్యాడు. వన్‌డౌన్ బ్యాటర్ శ్రీదమ్ పాల్ (38; 7 ఫోర్లు)తో కలిసి జట్టు స్కోరును వంద పరుగులు దాటించాడు. మూడో వికెట్‌కు 68 పరుగులు జతయ్యాక శ్రీదమ్ అవుటయ్యాడు. తర్వాత సెంటు సర్కార్ (145 బంతుల్లో 94; 11 ఫోర్లు, 1 సిక్స్) అండతో త్రిపుర ఇన్నింగ్స్‌ను దుర్భేధ్యంగా మలిచాడు. ఇద్దరు దాదాపు రెండు సెషన్ల పాటు క్రీజులో నిలిచి పరుగులు సాధించారు. దీంతో అస్సామ్ బౌలర్లు ఈ జోడీని విడగొట్టేందుకు అలసిసొలసిపోయారు. ఇదే క్రమంలో విహారి సెంచరీ పూర్తి చేసుకోగా, సెంటు సర్కార్ కూడా శతకదారిలో పడ్డాడు. జట్టు స్కోరు 300 పరుగులు దాటిన తర్వాత దురదృష్టవశాత్తూ సెంటు సర్కార్ 6 పరుగుల తేడాతో సెంచరీ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. దీంతో 210 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఆట నిలిచే సమయానికి విహారి, రాణా దత్త (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అస్సాం బౌలర్లలో దర్శన్‌కు 2 వికెట్లు దక్కాయి.

శతక్కొట్టిన ముషీర్, సిద్ధేశ్

ముంబై: ఓపెనర్ ముషీర్ ఖాన్ (162 బంతుల్లో 112; 14 ఫోర్లు), మిడిలార్డర్‌లో సిద్దేశ్ లాడ్ (207 బంతుల్లో 100 బ్యాటింగ్; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కడంతో ముంబై కోలుకుంది. గ్రూప్ 'డి'లో హిమాచల్ ప్రదేశ్‌తో మొదలైన ఈ మ్యాచ్‌లో కేవలం ఈ ఇద్దరు సెంచరీ వీరులే తప్ప మిగతా బ్యాటర్లు కనీస స్కోర్లయిన చేయలేకపోయారు. మొదటి రోజు ఆట నిలిచే సమయానికి ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. ఓపెనర్ ఆయుశ్ మాత్రే (9), భారత వెటరన్ బ్యాటర్ అజింక్య రహానే (2), హిమాన్షు సింగ్ (0), ముషీర్ సోదరుడు సర్ఫరాజ్ ఖాన్ (16) బ్యాట్లెత్తారు. దీంతో ముంబై తొలి సెషన్‌లో 73 పరుగులకే కీలకమైన 4 వికెట్లను కోల్పోయింది. సిద్దేశ్‌తో ఆకాశ్ ఆనంద్ (26 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

ఢిల్లీని కూల్చేసిన ఆఖిబ్ నబి

ఆఖిబ్ నబి

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ సీమర్ ఆఖిబ్ నబి (16–5–35–5) ఢిల్లీ గడ్డపై ఢిల్లీ జట్టును బెంబేలెత్తించాడు. నిప్పులు చెరిగే బౌలింగ్‌తో సొంతగడ్డపై ఢిల్లీని తొలి ఇన్నింగ్స్‌లో కనీసం 70 ఓవర్లయినా ఆడకుండా కూల్చేశాడు. గ్రూప్ 'డి' పోరులో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 69 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ అర్పిత్ రాణా (0)ను నబి డకౌట్ చేయడంతో మొదలైన ఢిల్లీ పతనం 14 పరుగులకే 3 టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. సనత్ (12)ను వంశజ్, యశ్ ధుల్ (1)ను సునీల్ అవుట్ చేశారు. ఈ దశలో కెప్టెన్ ఆయుశ్ బదోని (64; 6 ఫోర్లు), ఆయుశ్ డొసెజా (65; 6 ఫోర్లు, 1 సిక్స్), సుమిత్ మాథ్యూర్ (55 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో ఢిల్లీ ఇన్నింగ్స్ చక్కబెట్టేందుకు ప్రయత్నించారు. కానీ తర్వాత బ్యాటర్లు అనుజ్ (0), హృతిక్ (7), మనన్ (0), సిమర్‌జీత్ (0), మోని గ్రేవల్ (0) చేతులెత్తేయడంతో ఢిల్లీ కుప్పకూలేందకు ఎంతో సమయం పట్టనే లేదు. కశ్మీరి బౌలర్లలో వంశజ్ శర్మ, అబిద్ ముస్తాక్‌లకు చెరో 2 వికెట్లు దక్కాయి.

ఇలవెనిల్‌కు కాంస్యం

స్వర్ణం గెలిచిన రవీందర్ సింగ్ • వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్

కైరో (ఈజిప్ట్): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తొలి రోజు శుభారంభం చేసింది. పురుషుల 50 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన రవీందర్ సింగ్ స్వర్ణం గెలుచుకున్నాడు. 47 మంది పాల్గొన్న ఈ ఈవెంట్‌లో రవీందర్ 569 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే ఈవెంట్ టీమ్ విభాగంలో రవీందర్‌కు రజతం దక్కింది. జట్టులో రవీందర్‌తో పాటు కమల్‌జీత్, యోగేశ్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. భారత బృందం మొత్తం కలిపి 1646 పాయింట్లు స్కోర్ చేసి రెండో స్థానంలో నిలవగా...దక్షిణ కొరియాకు జట్టుకు స్వర్ణం, ఉక్రెయిన్‌కు కాంస్యం లభించాయి. మహిళల విభాగంలో రెండు సార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఆసియా చాంపియన్ ఇలవెనిల్ వలరివన్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీల్లో సత్తా చాటింది. ఈ ఈవెంట్లో ఓవరాల్‌గా 232 పాయింట్లు సాధించిన ఇలవెనిల్ కాంస్యం గెలుచుకుంది. బాన్ యోజిన్ (దక్షిణ కొరియా–255) స్వర్ణం సాధించగా, వాంగ్ జైఫీ (చైనా–254) రజతం సొంతం చేసుకుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఫైనల్ చేరడంలో సఫలమైన అర్జున్ బబూటా చివరకు 7వ స్థానంతో ముగించాడు.

తై జు-యింగ్ గుడ్‌బై

• బ్యాడ్మింటన్‌కు వీడ్కోలు పలికిన దిగ్గజం

న్యూఢిల్లీ: మహిళల బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ప్లేయర్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న చైనీస్ తైపీ స్టార్ తై జు-యింగ్ (టీటీవై) తన కెరీర్‌ను ముగించింది. గత ఏడాది కాలంగా వరుస గాయాలతో బాధపడుతున్న ఆమె 31 ఏళ్ల వయసులో ఆటనుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. 'జీవితంలో అన్నీ ఇచ్చిన బ్యాడ్మింటన్‌కు కృతజ్ఞతలు. ఒక అద్భుత అధ్యాయం ముగింపునకు వచ్చింది. నా గాయాలే నన్ను ఆటనుంచి తప్పుకునేలా చేశాయి. వరుసగా శస్త్ర చికిత్సలు, రీహాబిలిటేషన్ బాగా ఇబ్బంది పెట్టాయి. భవిష్యత్తు గురించి నిర్ణయించుకోలేదు కానీ ప్రస్తుతానికి జీవితాన్ని పూర్తిగా ఆస్వాదిస్తాను. టీటీవై అందరికీ గుర్తుండిపోవాలని ఆశిస్తున్నా' అని రిటైర్మెంట్ ప్రకటనలో తై జు వెల్లడించింది.

ఘనమైన రికార్డులు...

తైజు సుదీర్ఘ కెరీర్‌లో ప్రతిష్టాత్మక విజయాలన్నీ ఉన్నాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ఆమె రజత పతకాన్ని సొంతం చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆమె ఒక రజతం, ఒక కాంస్యం గెలుచుకుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణం, కాంస్యంతో పాటు ఆసియా చాంపియన్‌షిప్‌లో 4 స్వర్ణాలు, కాంస్యం ఆమె ఖాతాలో ఉన్నాయి. 2009లో ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుచుకొని తొలిసారి గుర్తింపులోకి వచ్చిన తై జు ఆ తర్వాత సీనియర్ స్థాయిలో వరుస విజయాలతో శిఖరానికి చేరింది. రికార్డు స్థాయిలో నాలుగు సార్లు బీడబ్ల్యూఎఫ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన ఈ తైవాన్ షట్లర్ ఆల్ ఇంగ్లండ్ టోర్నీని 3 సార్లు గెలుచుకుంది. కెరీర్‌లో 17 బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్స్ గెలిచిన ఆమె మరో 12 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. 22 ఏళ్ల వయసులో తొలి సారి వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్న తై జు ఓవరాల్‌గా 214 వారాల పాటు అగ్రస్థానాన నిలవడం విశేషం.

వన్డే సిరీస్ కూడా పాక్‌దే

• ఆఖరి మ్యాచ్‌లో 7 వికెట్లతో దక్షిణాఫ్రికా చిత్తు

ఫైసలాబాద్: సొంతగడ్డపై ఇప్పటికే టి20 సిరీస్ చేజిక్కించుకున్న ఆతిథ్య పాకిస్తాన్ తాజాగా దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్‌ను కూడా సొంతం చేసుకుంది. శనివారం ఇక్కడ జరిగిన ఆఖరి మూడో వన్డేలో పాక్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 37.5 ఓవర్లలో 143 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు డికాక్ (70 బంతుల్లో 53; 6 ఫోర్లు, 1 సిక్స్), ప్రిటోరియస్ (45 బంతుల్లో 39; 4 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 72 పరుగులు జోడించారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు మూకుమ్మడిగా చేతులెత్తేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అబ్రార్ అహ్మద్ (4/27), సల్మాన్ ఆగా (2/18), షాహిన్ అఫ్రిది (2/18), నవాజ్ (2/31) సమష్టిగా సఫారీని కూల్చారు. 72/0తో పటిష్టంగా కనిపించిన దక్షిణాఫ్రికా మరో 71 పరుగుల వ్యవధిలో పది వికెట్లను సమర్పించుకుంది. తర్వాత సులువైన లక్ష్యాన్ని పాకిస్తాన్ 25.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 144 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ సయిమ్ అయూబ్ (70 బంతుల్లో 77; 11 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, మొహమ్మద్ రిజ్వాన్ (32 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. డికాక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

హాంకాంగ్ సిక్సెస్ నుంచి భారత్ అవుట్

సెమీస్‌లో ఆసీస్, పాక్

హాంకాంగ్: 'హాంకాంగ్ సిక్సెస్' 6–ఎ సైడ్ టోర్నమెంట్‌లో భారత జట్టు నిష్క్రమించింది. వరుసగా మూడు పరాజయాలతో సెమీస్ అర్హతను కోల్పోయింది. శనివారం జరిగిన గ్రూప్ 'సి'లో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ 27 పరుగుల తేడాతో కువైట్ చేతిలో ఓడింది. మొదట కువైట్ నిర్ణీత 6 ఓవర్లలో 5 వికెట్లకు 106 పరుగులు చేయగా, భారత్ 5.4 ఓవర్లలో 79 పరుగులకే 6 వికెట్లూ కోల్పోవడంతో ఆలౌటైంది. అంతకుముందు జరిగిన పోటీల్లో భారత్ 4 వికెట్ల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేతిలో ఓడింది. నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 92 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. నేడు జరిగే సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో పాకిస్తాన్ తలపడుతుంది. భారత్ మిగిలిన తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడుతుంది.

క్రిస్మస్ లైట్లతో ముస్తాబైన
లండన్‌లోని ప్రముఖ షాపింగ్ ప్రాంతం రీజెంట్ స్ట్రీట్

అమెరికాలోని కాన్సాస్ నగరంలో శరదృతువు శోభతో
కాన్వాస్‌పైని చిత్రాన్ని తలపిస్తున్న మేపుల్ వృక్షం

దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో
ప్రభుత్వ విధానాలపై కార్మిక సంఘాల నిరసన ర్యాలీ

మౌలిక సదుపాయాలతోనే దేశాభివృద్ధి

మన దేశం ప్రగతి పథంలో దూసుకెళ్తోంది

ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

వారణాసిలో నాలుగు వందేభారత్ రైళ్లు ప్రారంభం

వారణాసి: ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక ప్రగతికి మౌలిక సదుపాయాలే అత్యధికంగా దోహదం చేస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మన దేశం ప్రగతి పథంలో అత్యధిక వేగంతో దూసుకెళ్తోందని అన్నారు. ప్రధాని మోదీ శనివారం సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. బనారస్ రైల్వే స్టేషన్‌లో నాలుగు నూతన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుంటే దేశం వేగంగా ప్రగతి సాధిస్తుందని స్పష్టంచేశారు. మౌలిక సుదుపాయాలు అంటే కేవలం రోడ్లు, వంతెనలు మాత్రమే కాదన్నారు. ఒక ప్రాంతంలో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధికి తోడ్పాటునందించే వ్యవస్థనే మౌలిక సదుపాయాలు అంటారని వివరించారు.

విదేశీయులు ఆశ్చర్యపోతున్నారు

''వందేభారత్ రైళ్లు దేశమంతటా పరుగులు తీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల నుంచి విమానాలు మన దేశానికి రాకపోకలు సాగిస్తున్నాయి. కొత్తతరం భారతీయ రైల్వేకు వందేభారత్, నమోభారత్, అమృత్ భారత్ వంటి రైళ్లు పునాదిగా నిలుస్తున్నాయి. మన అభివృద్ధి ప్రయాణం వేగం పుంజుకుంది. వందేభారత్ అంటే భారతీయుల కోసం భారతీయులు రూపొందించుకున్న రైళ్లు. ఇవి ప్రతి ఒక్కరికీ గర్వకారణం. వందేభారత్ రైళ్లను చూసి విదేశీయులు కూడా ఆశ్చర్యపోతున్నారు. మన వనరులను మెరుగుపర్చుకోవడంలో ఈ రైళ్లు మైలురాయి లాంటివి. దేశమంతటా 160కిపైగా వందేభారత్ రైళ్లు పరుగులు తీస్తుండడం సంతోషంగా ఉంది.

'వికసిత్ కాశీ' నుంచి 'వికసిత్ భారత్'

ఉత్తరప్రదేశ్‌లో ఆధ్యాత్మక పర్యాటకం నానాటికీ ఊపందుకుంటోంది. దేశ విదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం లభిస్తోంది. పుణ్యక్షేత్రాల సందర్శన మన సంస్కృతిలో భాగం. ఆధ్యాత్మిక యాత్రలు దేశ ఆత్మను అనుసంధానిస్తాయి. ప్రయాగ్‌రాజ్, అయోధ్య, హరిద్వార్, చిత్రకూట్, కురుక్షేత్ర వంటి పుణ్యస్థలాలు మన ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్ర స్థానాలు. వందేభారత్ రైళ్ల రాకతో మన పుణ్యక్షేత్రాల మధ్య అనుసంధానం ఏర్పడింది. కాశీ విశ్వనాథుడిని గతేడాది 11 కోట్ల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత 6 కోట్ల మంది వచ్చారు. శ్రీరాముడి ఆశీస్సులు స్వీకరించారు. భక్తుల రాకవల్ల ప్రభుత్వానికి ఆదాయంతోపాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రధానంగా యువతకు లబ్ధి చేకూరుతోంది. 'వికసిత్ కాశీ' నుంచి 'వికసిత్ భారత్' కలను నెరవేర్చడానికి ఇక్కడ మరిన్ని ప్రాజెక్టులు ప్రారంభిస్తాం'' అని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. వందేభారత్ రైళ్ల ప్రారంభోత్సవంలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కొత్త రైళ్లు బనారస్–ఖజురహో, లక్నో–శహరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్–ఢిల్లీ, ఎర్నాకుళం–బెంగళూరు మధ్య ప్రయాణిస్తాయి.

వందే భారత్ రైలులో విద్యార్థితో మోదీ ముచ్చట్లు

కాశీ పిల్లలు నాకు గర్వకారణం

వారణాసిలో వందేభారత్ రైళ్లు ప్రారంభించిన అనంతరం ఓ రైలులో చిన్నారులతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా మాట్లాడారు. కొందరు పిల్లలు పద్యాలు, కవితలు చదివి వినిపించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. 'వికసిత్ కాశీ, వికసిత్ భారత్, సురక్షిత భారత్'పై కవితల రూపంలో తమ భావాలు పంచుకున్న చిన్నారులను అభినందించారు. నైపుణ్యం కలిగిన కాశీ చిన్నారులను చూసి స్థానిక ఎంపీగా ఎంతగానో గర్విస్తున్నానని చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగే కవి సమ్మేళనాలకు ఇక్కడి పిల్లలను తీసుకెళ్లే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలతో కవి సమ్మేళనాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వందేభారత్ రైళ్లు ప్రారంభించినప్పుడు పిల్లలకు వేర్వేరు అంశాలపై పోటీలు నిర్వహించాలని సూచించారు. దేశ అభివృద్ధి, వందేభారత్ రైళ్లు, అభివృద్ధి చెందిన భారత్‌కు సంబంధించిన ఊహాచిత్రాలు, పద్యాలపై ఈ పోటీలు ఉండాలన్నారు.

రైలుపై డేగ దాడి!

అది శీతాకాలపు ఉదయం..

జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నుండి బనిహాల్ వైపు రైలు బయల్దేరింది.. హిమాలయాల మధ్య, ట్రాక్ నంబర్ 19/10 వెంట ప్రశాంతంగా పరుగులు తీస్తోంది. లోకోపైలట్ క్యాబిన్‌లో నిశ్శబ్దం. లోకోపైలట్ దృష్టి అంతా ముందున్న పట్టాలపైనే ఉంది. కానీ, ఆ క్షణంలో ఆయనకు తెలియదు.. ఆకాశం నుంచి ఒక అదృశ్య శక్తి కొన్ని సెకన్లలో ఆ ప్రశాంతతను భయంకరంగా మార్చబోతోందని!

బద్దలైన అద్దం.. ఒళ్లంతా రక్తం

మధ్యాహ్నం సుమారు 1 గంట ప్రాంతంలో, కశ్మీర్ లోయ ప్రకృతి అందాల మధ్య.. రైలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతోంది. అకస్మాత్తుగా.. భీకరమైన శబ్దం! రాకెట్ దూసుకొచ్చినట్లు.. లోకోపైలట్ క్యాబిన్ ముందున్న మందపాటి గ్లాస్ విండ్‌షీల్డ్ ఒక్కసారిగా బద్దలైంది. గాజు పెంకులు గాల్లో ఎగిరి లోపలికి దూసుకొచ్చాయి. దట్టమైన గాజు ధూళి, రక్తపు చినుకులు, భయం.. ఒక్క క్షణంలో రైలు క్యాబిన్ నిండా అలముకున్నాయి! ఆ గాజు తుపాను మధ్య లోపలికి దూసుకొచ్చింది.. ఒక భారీ డేగ!

లోకోపైలట్ హాహాకారాలు

ఊహించని ఈ విపత్తుతో లోకోపైలట్ హాహాకారాలు చేశాడు. బద్దలైన గాజు పెంకులు అతని ముఖాన్ని, నుదుటిని తీవ్రంగా గాయపరిచాయి. ముక్కుపై లోతైన గాటు పడింది. రక్తం స్రవిస్తున్నా.. ఆఖరి ప్రయత్నంగా లోకోపైలట్ రైలు అత్యవసర బ్రేకులను గట్టిగా నొక్కాడు. రైలు మొత్తం ఒక్కసారిగా కుదుపుతో ఆగిపోయింది. ప్రయాణికులు షాక్‌లో ఉండగా, లోకోపైలట్ క్యాబిన్‌లో దృశ్యం మరీ భయానకంగా ఉంది. పగిలిన అద్దంలోంచి చల్లటి గాలి లోపలికి వస్తోంది. లోకోపైలట్ రక్తం కారుతున్న ముఖంతో కంగారుగా కనిపించాడు. అతని పక్కనే.. భారీ డేగ ఫ్లోర్‌పై కూర్చుని ఉంది. ప్రమాదాన్ని గమనించిన కొందరు రైల్వే సిబ్బంది, ప్రయాణికులు వెంటనే లోకోపైలట్ క్యాబిన్‌కు చేరుకున్నారు. అపస్మారక స్థితికి చేరుకోకముందే లోకోపైలట్‌కు ప్రథమ చికిత్స అందించారు. ఆ సంఘటనను వీడియో తీసిన ఒక వ్యక్తి మాట్లాడుతూ.. 'వేగంగా దూసుకొచ్చిన డేగ వల్లే అద్దం పగిలింది. లోకోపైలట్ గాయపడ్డాడు. ఆశ్చర్యకరంగా, ఆ డేగ ఇప్పటికీ ఇక్కడే ఉంది'.. అని వివరించాడు. సాధారణంగా పక్షి ఢీకొంటే కేవలం విండ్‌షీల్డ్ పగలవచ్చు, కానీ లోపలికి దూసుకువచ్చి, డ్రైవర్‌ను గాయపరిచేంతటి శక్తితో ఢీకొట్టడం అనేది రైల్వే చరిత్రలోనే అత్యంత అరుదైన, నిగూఢమైన ఘటనగా మిగిలిపోనుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

రోబో ఇంటర్వ్యూ!

కొన్నిసార్లు కళ్లతో చూస్తున్నా నమ్మశక్యంగా ఉండదు. ఇంటర్వ్యూకు హాజరైన ఒక అభ్యర్థికి అలాంటి అనుభవమే ఎదురైంది. ప్రముఖ సంస్థలో ఉద్యోగం కోసం అతను ఆన్‌లైన్ ఇంటర్వ్యూ కాల్‌లో చేరాడు. స్క్రీన్‌పై చిరునవ్వుతో కూడిన మహిళ కనిపించింది.. కాదుకాదు రోబో సినిమానే చూపించింది. 'నా ప్రాణం నువ్వే.. నా సర్వస్వం నువ్వే...'అని రోబో సినిమాలో పాడే యంత్రుడిలా... ఆమె తీరు, ఆమె ప్రతిస్పందనలు పూర్తిగా యాంత్రికంగా అనిపిస్తుంటే అభ్యర్థి విస్తుపోయాడు.

చెమటలు పట్టిన అభ్యర్థి

మొదట్లో అంతా సాధారణంగానే అనిపించినా.. నిమిషాలు గడిచే కొద్దీ అభ్యర్థికి భయం మొదలైంది. 'రెడ్డిట్'అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో ఆ యూజర్ తన అనుభవాన్ని పంచుకుంటూ ఇలా రాశాడు.. 'ఆమె తల ఊపు ఒక లూప్‌లో ఉన్నట్లు అనిపించింది. ప్రతి రెండు సెకన్లకు చిన్న చిన్న కదలికలు కనిపించాయి'.. అని వివరించాడు.

తారెత్తించిన 'రోబో భామ'

'రోబో' సినిమాలోని చిట్టి రోబో నవ్వినట్లు.. మాట్లాడినట్లు ఇంటర్వ్యూ చేసిన ఆ మహిళ స్పందనల్లో ఎక్కడా మానవ సహజమైన తడబాటు లేదు. విరామం అసలే లేదు. ప్రశ్న ఏదైనా సరే.. సమాధానం 'డేటాబేస్ నుండి తీసినట్లు.. దోషరహితంగా' వస్తుంటే.. అభ్యర్థి నోటమాట రాలేదు. లోపల ఏఐ ఉండి, బయట మనిషిలా నటిస్తున్న ఈ ఇంటర్వ్యూయర్ తీరు ఆ అభ్యర్థికి నిద్ర పట్టనివ్వలేదు.

తడబడకుండా సమాధానాలు

ఎదురుగా ఉన్నది మనిషి కాదని దాదాపు నిర్ధారించుకున్న అభ్యర్థి, ఆ రోబోను పరీక్షించాలని నిశ్చయించుకున్నాడు. 'ఈ పోస్ట్ ఎందుకు ముఖ్యమో మీరు చెప్పగలరా?'అని ఎదురు ప్రశ్నించాడు. వెంటనే పాఠ్యపుస్తకంలో ఉన్నట్లుగా పర్ఫెక్ట్‌గా సమాధానం వచ్చింది. మళ్లీ అదే ప్రశ్న అడిగితే.. అదే సమాధానం.. ఒక్క పదం కూడా మారకుండా తిరిగి వచ్చింది!అంతలోనే, స్క్రీన్ కొద్ది క్షణాలు స్తంభించింది. తిరిగి తెర తెరుచుకోగానే, రోబో భామ ఏమీ జరగనట్లుగా, ఎక్కడ ఆగిందో అక్కడ నుంచే సంభాషణను కొనసాగించింది! రోబోకు ఉన్న బ్యాకప్ ప్లాన్ లేదా ఫాల్ట్ రికవరీ సిస్టమ్ లాగా ఆ దృశ్యం అభ్యర్థిని వణికించింది.

చెప్పకపోవడం నైతికమేనా..

తనకు ఎదురైన ఈ వింత అనుభవంపై అభ్యర్థి లేవనెత్తిన ప్రశ్న ఒక్కటే.. 'ఏఐ బోట్ అని అభ్యర్థికి చెప్పకపోవడం నైతికంగా సరైనదేనా?'.. ఈ కథనం సోషల్ మీడియాలో భారీ చర్చకు తెర లేపింది. నేటి ఉద్యోగార్థులు తాము మాట్లాడేది మనిషితోనా?, మనిషి రూపంలోని యంత్రంతోనా? అన్న స్పష్టత కోసం పరితపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాబోయే కాలంలో మనం ఏఐకి సహచరులుగా ఉంటామా? లేక ఏఐ మనకు యజమాని అవుతుందా? అన్న తీవ్రమైన ప్రశ్న.. నేటి జాబ్ మార్కెట్‌లో ఉత్పన్నమవుతోంది. ఏఐ అని చెప్పకుండా, అభ్యర్థుల సమయాన్ని, ఆశలను వృథా చేయడం నైతికంగా ఎంతవరకు సమంజసం?. ఈ విచిత్ర ఇంటర్వ్యూ కథ.. ఆ చర్చకు పదును పెట్టింది!

– సాక్షి, నేషనల్ డెస్క్

'చంద్రయాన్-2' నుంచి విలువైన సమాచారం

- చంద్రుడి వాతావరణం, స్థితిగతులు తెలుసుకొనే అవకాశం
- వెల్లడించిన ఇస్రో

బెంగళూరు: చందమామ ధ్రువపు ప్రాంతాలకు సంబంధించి చంద్రయాన్–2 లూనార్ ఆర్బిటార్ నుంచి విలువైన సమాచారాన్ని సేకరించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ డేటాతో చంద్రుడి వాతావరణం, అక్కడి స్థితిగతుల గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి వీలవుతుందని స్పష్టం చేసింది. జాబిల్లి ఉపరితలానికి చెందిన ఫిజికల్, డైఎలక్ట్రిక్ లక్షణాలు తెసుకోవచ్చని పేర్కొంది. భవిష్యత్తులో చంద్రుడిపై చేపట్టబోయే కీలక ప్రయోగాలకు ఈ సమాచారం ఎంతగానో తోడ్పడుతుందని ఇస్రో తేల్చిచెప్పింది. చంద్రయాన్–2 ఆర్బిటార్ 2019 నుంచి చంద్రుడి చుట్టూ కక్ష్యలోకి తిరుగుతోంది. నాణ్యమైన డేటాను భూమిపైకి చేరవేస్తోంది. ఇందులోని డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్(డీఎఫ్ఎస్ఏఆర్) అనే పేలోడ్ చంద్రుడి ఉపరితలాన్ని స్పష్టంగా చిత్రీకరించింది. ఈ అడ్వాన్స్‌డ్ రాడార్ సంకేతాలను నిలువు దిశ, అడ్డం దిశల్లో పంపగలదు, స్వీకరించగలదు. చందమామ ఉపరితలాన్ని అధ్యయనం చేయడానికి దోహదపడుతోంది. చంద్రుడి ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువానికి సంబంధించిన సమాచారాన్ని చంద్రయాన్–2లోని 1,400 రాడార్ డేటాసెట్లు సేకరించి, విశ్లేషించాయి. ఈ సమాచారం ఆధారంగా అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(ఎస్ఏసీ) సైంటిస్టులు అడ్వాన్స్‌డ్ డేటా ప్రొడక్ట్‌లను అభివృద్ధి చేశారు. చంద్రుడిపై మంచు రూపంలోని నీరు, ఉపరితలం పరిస్థితులను సరిగ్గా అంచనా వేయడానికి ఈ ప్రొడక్ట్‌లు సహకరిస్తాయని సైంటిస్టులు చెబుతున్నారు.

కశ్మీర్‌లో పోలీసుల విస్తృత దాడులు

జైళ్లలోనూ సోదాలు

శ్రీనగర్: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లోని ఉగ్రవాదులకు వివిధ రూపాల్లో సాయం అందించే వారిని గుర్తించేందుకు జమ్మూకశ్మీర్ పోలీసు యంత్రాంగం శనివారం విస్తృత స్థాయిలో దాడులు చేపట్టింది. అనంత్‌నాగ్, పుల్వామా, షోపియాన్, బండిపొర, బుద్గామ్, అవంతిపొర, గండేర్‌బల్, కుల్గాం, హంద్వారా, సోపోర్‌లతో ఈ తనిఖీలు జరిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అనంత్‌నాగ్ నిషేధిత హిజ్బ్–ఉల్–ముజాహిదీన్ కమాండర్‌గా చెప్పుకునే గులాం నబీ అలియాస్ అమిర్ ఖాన్, పహల్గాంలోని ఆ సంస్థ ఆర్థిక విభాగం చీఫ్ జఫర్ భట్ ఇళ్లలో సోదాలు జరిపింది. వీరిద్దరూ 1990ల్లోనే పాకిస్తాన్‌కు పరారయ్యారు. సరిహద్దు ఆవలి నుంచి ఉగ్ర కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. కుల్గాం, హంద్వారా, సోపోర్‌లలో పలువురు ఉగ్ర వాదుల ఇళ్లపై దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఉగ్ర సంస్థలకు చెందిన పలువురు ఓవర్ గ్రౌండ్ వర్కర్లను అదుపులోకి తీసుకున్నామని, వీరిని ప్రశ్నిస్తున్నామని అధికారులు వెల్లడించారు. సరిహద్దుల ఆవలి నుంచి అందే ఆదేశాల మేరకు ఉగ్రవాదులకు స్థానికులు నిధుల సేకరణ, రవాణా, స్థానికంగా ఆశ్రయం కల్పించడం వంటి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమన్నారు. స్థానిక యువతను ఉగ్ర ఊబిలోకి లాగేందుకు జరిగే ప్రయత్నాలను అడ్డుకుంటామని చెప్పారు. అదేవిధంగా, జమ్మూలోని దోడా జిల్లా పెద్ద సంఖ్యలో అనుమానితులను పిలిపించిన పోలీసులు వారిని ప్రశ్నిస్తున్నారు. హతమైన ఉగ్రవాదుల ఇళ్లు, ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకున్న నివాసాల్లోనూ సోదాలు జరుపుతున్నామన్నారు. కేంద్ర సాయుధ పోలీసు విభాగాలు కూడా తమకు సహకారం అందిస్తున్నాయని వివరించారు. కశ్మీర్ లోయ వ్యాప్తంగా ఉన్న జైళ్లలోనూ శనివారం సోదాలు చేపట్టామన్నారు. డ్రగ్స్, ఆయుధాలు, సెల్‌ఫోన్లు తదితరాలు దొరికిన పక్షంలో చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

ఓ ఉగ్రవాది నివాసంలో సోదాల సమయంలో అప్రమత్తంగా ఉన్న జవాను

ఒప్పందం లేకుండానే ముగిసిన పాక్-అఫ్గాన్ చర్చలు

ఇస్లామాబాద్: తుర్కియేలోని ఇస్తాంబుల్ వేదికగా పాకిస్తాన్-అఫ్గానిస్తాన్‌ల మధ్య జరుగుతున్న చర్చలు ఎలాంటి అంగీకారం కుదరకుండానే ముగిశాయి. సీమాంతర ఉగ్రవాదం కట్టడి తదితర అంశాలపై గురువారం నుంచి కొనసాగుతున్న ఈ చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని ఓ అధికారి వెల్లడించారు. అఫ్గాన్ భూభాగం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) మిలిటెంట్లు తమ పౌరులు, సైన్యంపై దాడులకు పాల్పడుతున్నారని పాకిస్తాన్ ఆరోపిస్తోంది. టీటీపీ కార్యకలాపాలను నియంత్రిస్తామంటూ లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని అఫ్గాన్ తాలిబన్లను డిమాండ్ చేస్తోంది. చర్చలు ఎలాంటి పురోగతి లేకుండా ముగియడంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియాతో శుక్రవారం మాట్లాడుతూ..'ఈ చర్చలను నిలిపివేశాం. నాలుగో రౌండ్ చర్చల్లోనూ ఎలాంటి ప్రగతి కన్పించలేదు. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది'అని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను చల్లార్చేందుకు మధ్యవర్తిత్వం వహించిన తుర్కియే, ఖతార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బిహార్ బాతాఖాని

నాడు బ్రిటిషర్లపై.. నేడు మోదీ సామ్రాజ్యంపై

కాంగ్రెస్ పోరాటం

బిహార్ ఎన్నికల ర్యాలీల్లో ప్రియాంకా గాంధీ వ్యాఖ్య

కటిహార్: ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పోరాటం సాగించిన కాంగ్రెస్ అదే పోరాటాన్ని నేడు మోదీ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా చేస్తోందని ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. బిహార్‌లోని కటిహార్, భాగల్పూర్‌లలో శనివారం ఆమె కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. నాటు తుపాకులు తదితర మాటలను వాడుతున్న ప్రధాని మోదీ తన స్థాయికి తగిన విధంగా గౌరవప్రదంగా వ్యవహరించడం లేదని ఆమె ఆరోపించారు. అహింసా మార్గాన్ని ఉపదేశించే వందేమాతరం అని ఓ వైపు నినదిస్తున్న ప్రధాని మోదీ కట్టా(నాటు తుపాకీ) వంటి మాటలను వాడుతున్నారన్నారు. దేశ ఐక్యతను ప్రతిబింబించే వందేమాతర గేయాన్ని ఆలపించేందుకు వెనుకాడిన చరిత్ర బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఉందని ఆమె అన్నారు. యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడంలో విఫలమైన మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలను తన ఇద్దరు కార్పొరేట్ మిత్రులకు కట్టబెడుతోందని విమర్శించారు.

ఎల్‌వోపీ బాధ్యతలను ఎస్సీ, ఎస్టీల కివ్వాలి

రాహుల్ గాంధీకి రాజ్‌నాథ్ సవాల్

ససరాం: తరచూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చిత్తశుద్ధి ఉంటే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత(ఎల్‌వోపీ) పోస్టును ఆయా వర్గాల నేతకు అప్పగించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సవాల్ విసిరారు. బిహార్‌లోని రాహతాస్, కైమూర్ జిల్లాల్లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో మాట్లాడారు. ఓట్ చోరీ అంటూ రాహుల్ గాంధీ చేసే ఆరోపణలు నిరాధారాలని ఆయన కొట్టిపారేశారు. దీనిపై ఏవైనా ఆధారాలుంటే తీసుకెళ్లి ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలని ఆయన సూచించారు. అది చేయకుండా, రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల కమిషన్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాహుల్ చెప్పేవన్నీ అబద్ధాలని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ వ్యవహరిస్తుండటం తెల్సిందే.

బిహార్‌లో రాహుల్ దుకాణం బంద్: అమిత్ షా

పుర్ణియా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దుకాణం బిహార్‌లో త్వరలో మూతబడనుందని హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి తుడిచిపెట్టుకుపోనుందన్నారు. మొత్తం 243 సీట్లకు గాను 160 చోట్లకు పైగా విజయం సాధించి ఎన్డీయే మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని ఆయన జోస్యం చెప్పారు. పుర్ణియా, కటిహార్, సుపౌల్‌లలో శనివారం ఆయన ఎన్నికల ర్యాలీల్లో మాట్లాడారు. బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటుదార్లకు డెన్‌గా మార్చేందుకు రాహుల్, తేజస్వీ యాదవ్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రాంతంలోని ప్రతి అక్రమ వలసదారుడినీ కేంద్రం గుర్తించి, వాళ్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంతోపాటు వెనక్కి పంపేస్తుందని స్పష్టం చేశారు. బిహార్‌లో సీఎం ఎవరన్నది చొరబాటుదార్లు తేల్చరాదని భావిస్తే, ఆర్జేడీ–కాంగ్రెస్‌ల కూటమిని సాగనంపాలన్నారు.

మోదీ క్షమాపణ చెబుతారా: కాంగ్రెస్

న్యూఢిల్లీ: బిహార్‌లోని సీతామర్హిలో సీతా మాత జన్మించిందనటానికి ఎలాంటి చారిత్రక ఆధారాల్లేవంటూ వ్యాఖ్యానించిన ప్రధాని మోదీ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా అవమానించారని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. మిథిల నగరానికి ఉన్న సాంస్కృతికమైన గుర్తింపును, ప్రజల విశ్వాసాలను మోదీ దెబ్బతీశారంది. ఈ మేరకు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు. పవిత్ర సీతామర్హి గడ్డపై అడుగుపెట్టే ముందు ప్రధాని మోదీ అక్కడి ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెబుతారా అని ప్రశ్నించారు. రద్దీ ఉండదనే కారణం చూపుతూ మోతిహరి–శిహోర్–సీతామర్హి రైల్ లింక్‌ను రద్దు చేయడం, టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయకపోవడం ద్వారా బిహార్ పట్ల మోదీ సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారన్నారు. ఇరవైయేళ్లపాటు సాగిన ఎన్డీయే పాలన తర్వాత కూడా బిహార్‌లో అడుగుపెట్టిన ప్రధాని మోదీ ఇప్పటికీ తుపాకులు, బుల్లెట్ల గురించే మాట్లాడుతున్నారన్నారు. బిహార్ అభివృద్ధి విషయానికి వచ్చే సరికి ఆయన రిక్తహస్తాలు చూపుతూ, తప్పుడు హామీలతో ప్రజలను మోసగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రి గిరిరాజ్ సింగ్ బిహారీయే అయినప్పటికీ సొంత రాష్ట్రానికి ఆయన ఒక్క టెక్స్‌టైల్ పార్కును కూడా తీసుకురాలేక పోయారని ఆరోపించారు.

పార్థ రూ.42 కోట్లిస్తేనే ఆ డీల్ రద్దు

బాధ్యులెవర్నీ వదలమన్న సీఎం ఫడ్నవీస్

పుణె: మహారాష్ట్రలోని పుణెలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కుమారుడు పార్థ పవార్‌కు చెందిన సంస్థ ప్రభుత్వ భూమిని కొనుగోలు చేయడంపై తలెత్తిన వివాదం మరో మలుపు తిరిగింది. ఈ ఒప్పందాన్ని రద్దు చేసినట్లు అజిత్ పవార్ ప్రకటించారు. అయితే, పార్థ పవార్‌కు చెందిన సంస్థ సుమారు రూ.42 కోట్లు చెల్లిస్తేనే ఈ డీల్ రద్దవుతుందని అధికారులు తెలిపారు. స్టాంప్ డ్యూటీకి రెట్టింపు మొత్తం పెనాల్టీ పడుతుందన్నారు. డీడ్ రద్దుకు మరో 7 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని, ఎవర్నీ ఉపేక్షించేది లేదని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన వారితోపాటు వెండర్లపైనా కేసు నమోదైందన్నారు. అయితే, ఎఫ్ఐఆర్‌లో పార్థ పవార్ పేరు లేదని చెప్పారు. కంపెనీపైనా, సంతకాలు చేసిన వారిపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. ముంధ్వా ప్రాంతంలోని ప్రభుత్వానికి చెందిన 40 ఎకరాల భూమిని పార్థకు చెందిన కంపెనీకి రూ.300 కోట్లకు విక్రయిస్తూ డీల్‌పై సంతకం చేసిన తహశీల్దార్‌ను ప్రభుత్వం ఇప్పటికే సస్పెండ్ చేసింది. వాస్తవంగా ఈ భూమి విలువ రూ.1,800 కోట్లపైమాటేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఎంపీ ఖాతా నుంచి రూ.57 లక్షలు మాయం

- ఆ డబ్బు జమ చేసిన జాతీయ బ్యాంకు
- పోలీసులకు దొరకని కేటుగాళ్లు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌కు చెందిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీకి చెందిన పనిచేయని ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.57 లక్షలను బ్యాంకు పరిహారంగా ఆయనకు చెల్లించింది. అయితే, ఈ నేరానికి పాల్పడిన కేటుగాళ్లు మాత్రం ఇప్పటికీ పోలీసులకు దొరకలేదు. కల్యాణ్ బెనర్జీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఓ జాతీయ బ్యాంకులో ఆయనకు ఖాతా ఉంది. అందులో కొంత డబ్బు కూడా ఉంది. ఎంపీ అయ్యాక ఆ ఖాతా విషయం పట్టించుకోలేదు. ఇటీవల చూడగా అందులో నుంచి రూ.57 లక్షల సొమ్ము డ్రా అయినట్లు కనిపించింది. దీంతో, ఆయన షాక్‌కు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఫొటోకు బదులుగా వేరే ఫొటో, నకిలీ ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి కొత్త పాస్‌బుక్‌ను తయారు చేసిన నేరగాళ్లు.. వేరే ఫోన్ నంబర్‌తో ఓటీపీలు కూడా వచ్చేలా చేసుకుని పలుమార్లు ఈ డబ్బును డ్రా చేసినట్లు గుర్తించారు. దీనిపై కోల్‌కతా సైబర్ విభాగం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోయిన సొమ్మును సంబంధిత బ్యాంకు తిరిగి ఆయన ఖాతాలో జమ చేసింది. ఎంపీ కల్యాణ్ బెనర్జీ స్వయంగా ఈ విషయం తెలిపారు.

11న భూటాన్‌కు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఈ నెల 11, 12వ తేదీల్లో పొరుగుదేశం భూటాన్‌లో పర్యటించనున్నారు. రెండు దేశాలు కలిసి నిర్మిస్తున్న 1020 మెగావాట్ల భారీ జల విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించడం సహా పలు కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొంటారు. భూటాన్ రాజు జింగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్‌తో సమావేశమవుతారు. మాజీ రాజు జింగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జన్మదిన వేడుకల్లో పాల్గొంటారు.

సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి?

న్యాయమూర్తులు రకరకాల ప్రభావాలకు, ప్రలోభాలకు దూరంగా ఉండాలి. వృత్తి నిబద్ధతను, నిష్పాక్షికతను, అత్యున్నతమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండి జాతి, మత, కుల ప్రాంతాలకు అతీతంగా తీర్పులను వెలువరించే గొప్ప లక్షణాలను కలిగి ఉండాలి. అప్పుడే ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ద్విగుణీకృతం అవుతుంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

క్రియాశీలత - ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయ సమీక్ష అధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అంటే.. న్యాయ వ్యవస్థ తన అధికారాలు, విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి, సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడతారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- ★ శాసన, కార్య నిర్వాహక శాఖలు విధి నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ★ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడంతో ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపరచలేని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ★ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పించడంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టుల దృష్టికి తీసుకువచ్చాయి.
- ★ న్యాయస్థానాలు స్వయం ప్రేరిత (Suo-Moto) కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీ చేయడం.
- ★ దత్త శాసనాధికారాల వల్ల కార్య నిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై, అధికారాన్ని దుర్వినియోగం చేయడం, జవాబుదారీతనం లోపించడం.

న్యాయశాఖ క్రియాశీలత - ప్రధాన వివాదాలు

- ★ ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాలకార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- ★ లక్ష్మీకాంత్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్న పిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- ★ తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం, దాని ద్వారా తాజ్‌మహల్‌కు ఉన్న ముప్పునకు సంబంధించిన కేసులు.
- ★ బిహార్ పశుగ్రాసం కేసు.
- ★ జార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి వివాదం.
- ★ రక్షణ శాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- ★ జడ్జీల నియామకం.
- ★ కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్. బొమ్మై తొలగింపు వివాదం.
- ★ ఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడలు.
- ★ పెట్రోల్ బంక్‌ల కేటాయింపులు.
- ★ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని అనుమతించడం.
- ★ ఎర్రబుగ్గ కార్లు, సైరన్లకు సంబంధించిన అంశాలు.

మొదలైన కేసుల్లో సుప్రీంకోర్టు క్రియాశీలక తీర్పులను వెలువరించింది.

ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం [Public Interest Litigation (PIL) Or Socially Interested Litigation (SIL)]:

సాధారణంగా న్యాయస్థానాలను ఆశ్రయించడానికి వివాదంలో భాగస్వామికి మాత్రమే హక్కు ఉంటుంది. దీన్నే లోకస్ స్టాండై (Locus Standi) అంటారు. అయితే 1980 తర్వాత సుప్రీంకోర్టు నూతన శకానికి శ్రీకారం చుట్టింది. వివాదాలతో సంబంధం లేని వ్యక్తులు కూడా న్యాయస్థాన జోక్యాన్ని కోరవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. విషయం లేదా వివాదంలో ప్రజా ప్రయోజనాలు ఉంటే మూడో వ్యక్తి కూడా (థర్డ్ పార్టీ) జోక్యం చేసుకునే అవకాశం ఉంటుంది. దీన్నే 'ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (PIL)' అంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పి.ఎన్. భగవతి, వి.ఆర్. కృష్ణ అయ్యర్ చొరవ వల్ల ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అనే భావన ప్రచారంలోకి వచ్చింది. పిల్‌ను సుప్రీంకోర్టు, హైకోర్టులో మాత్రమే దాఖలు చేయాలి. కేసుల్లో ప్రజా ప్రయోజనాలు ఉన్నట్లు జోక్యం కోరే వ్యక్తి నిరూపించగలగాలి. ఈ పద్ధతి ద్వారా చాలా ప్రజా సమస్యలు పరిష్కారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ప్రజలకు న్యాయాన్ని చేకూర్చడమే కాకుండా పేదలు, బలహీన వర్గాల హక్కులను కాపాడగలిగింది. అనేక కుంభకోణాలు బయటపడటానికి పిల్ దోహదం చేసింది.

గమనిక: PIL అనే భావన మొదటగా అమెరికా రాజ్యాంగంలో ప్రారంభమైంది. కొన్ని మార్పులతో భారత సుప్రీంకోర్టు అదే పద్ధతిని అనుసరిస్తోంది.

ప్లీ బార్గెయినింగ్ (Plea Bargaining)

నిందితుడు నేరాన్ని అంగీకరిస్తే న్యాయస్థానం విచారణ ఆపేసి అతడికి తక్కువ శిక్ష విధించవచ్చు. దీన్ని 2006 నుంచి అమలు చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయి. అయితే ఈ సౌకర్యం అన్ని నేరాలకు వర్తించదు.

న్యాయ ప్రవర్తన

ఇటీవల న్యాయ ప్రవర్తన (Judicial Behaviour) అనే ప్రక్రియ ప్రాముఖ్యతను సంతరించుకుంది. సమాచార హక్కు చట్టం, రాజకీయ ప్రక్రియల అధ్యయనంలో ప్రవర్తన పద్ధతి అనుసరించడం వల్ల న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్న అంశాలు, వారి క్రమశిక్షణ, పనితీరు, నిబద్ధత మొదలైన విషయాలు ప్రజా సమీక్షకు గురవుతున్నాయి. న్యాయమూర్తులు శీఘ్రంగా కేసులను విచారించడం, విచారణ సమయంలో విపరీత జాప్యానికి బాధ్యత వహించేలా చేయడం, న్యాయమూర్తుల ప్రవర్తన ఆదర్శంగా ఉండేలా చేయడం మొదలైన అంశాల పరిశీలనను న్యాయ వ్యవస్థ ప్రవర్తన అంటారు.

కోర్టు ధిక్కారం - శిక్ష

కోర్టు తీర్పులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినా, అమలు చేయకపోయినా, తీర్పులకు పక్షపాతం ఆపాదించినా అలాంటి వారిని ప్రకరణలు 129, 215ల ప్రకారం శిక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంది.

ఉదా: కర్ణాటక కేడర్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ వాసుదేవన్‌కు కోర్టు ధిక్కారం నేరం కింద నెల రోజులపాటు జైలు శిక్ష విధించారు.

సోషల్ జస్టిస్ బెంచ్

భారత రాజ్యాంగం ప్రవేశికలో పేర్కొన్న - సామాజిక, ఆర్థిక, రాజకీయ అనే మూడు రకాలైన న్యాయాలను సాధించడానికి రాజ్యాంగంలో అనేక ఏర్పాట్లు ఉన్నాయి. అయితే వీటి అమల్లో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అణగారిన వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు తగిన రీతిలో అమలు కావడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ, బాల కార్మిక వ్యవస్థ, పేదరికం, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యం, దళిత హక్కుల ఉల్లంఘన మొదలైన అంశాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని న్యాయస్థానాల ద్వారా పరిష్కరించడానికి విపరీతమైన జాప్యం జరుగుతోంది.

ప్రజల సామాజిక సమస్యలను, ప్రభుత్వం ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను త్వరితగతిన విచారించడానికి సుప్రీంకోర్టులో సామాజిక న్యాయ బెంచ్ అనే ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ ఉదయ్ యు. లలిత్ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. 2014 డిసెంబర్ 12 నుంచి ఈ బెంచ్ పనిచేయడం ప్రారంభించింది. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ బెంచ్ సమావేశమవుతుంది. సుప్రీంకోర్టులో సామాజిక న్యాయానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు సహా కొత్త కేసులనూ విచారిస్తుంది.

నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్

పార్లమెంట్ చేసిన గ్రీన్ ట్రైబ్యునల్ చట్టం 2010 ప్రకారం దీన్ని ఏర్పాటు చేశారు. 1992లో ఐక్యరాజ్య సమితి పర్యావరణ, అభివృద్ధి సమావేశం; రియో డి జెనిరియోలో చేసిన తీర్మానం నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు ప్రాతిపదికగా చెప్పొచ్చు.

నిర్మాణం

ఇది ఒక చట్టబద్ధమైన సంస్థ. ఇందులో ఒక చైర్మన్, 10 మందికి తక్కువ కాకుండా, 20 మంది సభ్యులకు మించకుండా 'జ్యుడీషియల్ మెంబర్లు', అదేవిధంగా 10 మందికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా పర్యావరణం, సంబంధిత రంగాల్లో నిష్ణాతులైన ఇతర సభ్యులుంటారు. వీరందరినీ కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది.

చైర్మన్, సభ్యుల పదవీకాలం 5 ఏళ్లు. పునర్నియామకానికి అర్హులు కారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, చైర్మన్ లేదా జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులైతే వారి పదవీ విరమణ వయసు 75 సంవత్సరాలు. హైకోర్టు న్యాయ మూర్తులు జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులైతే వారి పదవీ విరమణ వయసు 67 ఏళ్లు. నిష్ణాతులైన సభ్యుల పదవీ కాలం 65 ఏళ్లు.

అర్హతలు

- ★ చైర్మన్ లేదా జ్యుడీషియల్ సభ్యుడిగా నియామకం పొందే వ్యక్తి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ఉండాలి.
- ★ పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వారిని నిష్ణాతులైన సభ్యులుగా నియమిస్తారు.

తొలగింపు - రాజీనామా

- ★ చైర్మన్, సభ్యులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు కేంద్ర ప్రభుత్వం తొలగిస్తుంది.
- ★ అవినీతి, అసమర్థత, దివాళా తీయడం, నేరారోపణ రుజువు కావడం మొదలైన కారణాల ఆధారంగా తొలగిస్తారు. వీరందరూ వారి రాజీనామాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు.

అధికారాలు, విధులు - పరిధి

- ★ పర్యావరణానికి సంబంధించిన అన్ని ప్రధాన వివాదాలు దీని పరిధిలోకి వస్తాయి.
- ★ అటవీ పరిరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ మొదలైన చట్టాల్లోని అంశాలను విచారిస్తుంది.
- ★ మెజార్టీ సభ్యులు ఇచ్చిన తీర్పే తుది తీర్పు. అయితే ప్రత్యేక సందర్భాల్లో ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై 90 రోజుల్లోగా సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.

జాతీయ న్యాయ సర్వీసుల సంస్థ (National Legal Services Authority)

జరిగిన అన్యాయాన్ని లేదా నష్టాన్ని కోర్టుల ద్వారా సత్వరమే పరిష్కరించుకొని తగిన పరిహారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుంది. అయితే పేదరికం, అవిద్య కారణంగా వారు న్యాయాన్ని పొందలేకపోవచ్చు. భారత రాజ్యాంగం నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39(ఎ) ప్రకారం ప్రజలందరికీ సమన్యాయాన్ని వర్తింపజేయడానికి సమాన అవకాశాలు ఉండాలని ఉచిత న్యాయ సలహాను పొందేందుకు తగిన ఏర్పాటు చేశారు. ఇలాంటి సేవలను అందించడానికి జాతీయ స్థాయిలో ఒక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికనుగుణంగా 1987లో జాతీయ న్యాయ సలహా సేవల చట్టాన్ని పార్లమెంట్ రూపొందించింది. ఈ చట్టం ప్రకారం 1998లో 'జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ'ను ఏర్పాటు చేశారు.

జాతీయ స్థాయిలో ఈ సంస్థకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య పోషకులు (Patron-in-Chief)గా, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు కార్య నిర్వాహక చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

రాష్ట్రస్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య పోషకులు (Patron-in-Chief)గా హైకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరు, రిటైర్ అయిన న్యాయమూర్తుల్లో ఒకరు కార్య నిర్వాహక చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

జిల్లా స్థాయిలో జిల్లా న్యాయమూర్తి హోదా రీత్యా ఈ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. తాలూకా లేదా మండల స్థాయిలో ఈ సంస్థకు సీనియర్ సివిల్ జడ్జి హోదా రీత్యా చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

విధులు

- ఉచిత న్యాయ సలహా అందించడానికి చర్యలు తీసుకోవడం.
- దేశ వ్యాప్తంగా న్యాయ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడం.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- ★ సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీబీ.
- ★ సుప్రీంకోర్టులో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్, రెండో వారు కె.జి. బాలక్రిష్ణన్.
- ★ గతంలో 9 మంది మహిళా న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో సేవలందించారు. ప్రస్తుతం బి.వి. నాగరత్నమ్మ, బేలా ఎం.త్రివేదిలు న్యాయమూర్తులుగా కొనసాగుతున్నారు.
- ★ సుప్రీంకోర్టులో అతి తక్కువ కాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తి కె.యస్.సింగ్. ఈయన 18 రోజులు మాత్రమే పనిచేశారు.
- ★ ఆంధ్రప్రదేశ్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన వారు కోకా సుబ్బారావు, ఎన్వీ రమణ.
- ★ దళిత వర్గాల నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన వ్యక్తి కె.జి. బాలకృష్ణన్.
- ★ గోలక్‌నాథ్ కేసు సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు.
- ★ కేశవానంద భారతి కేసు సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎం. సిక్రి.
- ★ ఇందిరాగాంధీ లోక్‌సభ సభ్యత్వ అనర్హతకు సంబంధించి విచారించింది – జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్ బెంచ్.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - ఎస్ఏ, ఎల్పీ

ఆధునిక కవిత్వోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు – అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి – కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి – నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి – గీత కవిత్వం

- ❖ భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ❖ ఆంగ్లంలోని **'లిరికల్ పోయెట్రీ'**నే తెలుగులో **'భావ కవిత్వం'** అని పిలుస్తున్నారు.
- ❖ 'లిరిక్' అంటే **'గాన గుణం అమరిన రచన'** అని అర్థం.
- ❖ భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- ❖ తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి **'ముసలమ్మ మరణం'** నాందిగా చెప్పవచ్చు.
- ❖ భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- ❖ తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- ❖ తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం.** దీనికి మూల పురుషుడు **రూసో.**
- ❖ ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత – **రూసో.**
- ❖ ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన **'రొమాంటిసిజమ్'**ను అనుసరించిన కవులనే **'కాల్పనికవాద కవులు'** అంటారు.
- ❖ రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయేట్రిగా పిలుస్తారు.
- ❖ **'లిరికల్ పోయెట్రీ'**ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- ❖ కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712–88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- ❖ రూసో 'న్యూ హెలాయిన్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- ❖ కాల్పనికోద్యమానికి మూలసూత్రం – **ఆత్మాశ్రయ సిద్ధాంతం.**
- ❖ భావకవిత్వోద్యమం మూడు (1910–40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' – **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి ప త్రికలో)
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' – **విశ్వనాథ సత్యనారాయణ.**
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరిసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' – **శ్రీశ్రీ.**
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' – **సి.నా.రె.**

భావ కవిత్వం లక్షణాలు

1) ఆత్మాశ్రయత 2) ప్రకృతి ప్రీతి
3) స్వేచ్ఛాప్రియత్వం 4) ప్రణయం
5) దేశభక్తి 6) సంఘ సంస్కరణాభిలాష
7) స్త్రీ ఉదాత్త చిత్రణ
8) మానవ సామాజిక స్పృహ
9) మార్మికత 10) స్మృతి

భావ కవిత్వం - శాఖలు

- ❖ డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- ❖ భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు – లలిత, అనుమితి, తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం, స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు – సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి – కాటూరి కవులు – తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు – గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి – కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి – పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

నండూరి సుబ్బారావు – యెంకి పాటలు

నాయని సుబ్బారావు – సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి – దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు – మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం, నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి, కాపుపాలు, మాతృ భూమి, తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు – శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ – ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవిత్వోద్యమం **అభ్యుదయ కవిత్వం.** ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని **'ప్రోగ్రెస్'** అనే పదానికి సమానార్థకంగా తెలుగులో **'అభ్యుదయం'** అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి **'పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం'** అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే.**

- ❖ సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో **'పారిస్'**లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- ❖ 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో **'ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'**ను ఏర్పాటు చేశారు.
- ❖ 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే **'ది డెయిరీ ట్రిబ్యూన్'** పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- ❖ 1936 ఏప్రిల్ 9, 10 తేదీల్లో లక్నోలో **'మున్షీ ప్రేమ్ చంద్'** అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- ❖ 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో **'న్యూ సిగ్నేచర్స్'** అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- ❖ 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- ❖ తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘా**న్ని ఏర్పరిచారు.
- ❖ 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- ❖ 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- ❖ చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **చాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ **అభ్యుదయ కవిత్వం'.**
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' – **దేవులపల్లి కృష్ణశాస్త్రి.**
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' – **వేల్చేరు నారాయణరావు.**

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- ❖ తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్ – **శ్రీశ్రీ** అని సి. నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- ❖ **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ **'జ్వాల'** పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- ❖ తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం **'నయాగరా'.** 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం కలిసి రచించారు.
- ❖ **శ్రీశ్రీ మహాప్రస్థానం** సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ): మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర: త్వమేవాహం, సినీవాలి, గాయాలు – గేయాలు

ఆవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహాంధ్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ: సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి, భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు – మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి – నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్, పఠాభి పంచాంగం (1964)

శిష్ట్లా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?
1) కులపాలికా ప్రణయం
2) కరుణ విప్రలంభం
3) అమలిన శృంగారం
4) విప్రలంభ శృంగారం

2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?
1) విప్లవ కవిత్వం
2) అభ్యుదయ కవిత్వం
3) ఆధ్యాత్మిక కవిత్వం 4) భావ కవిత్వం

3. 'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీ రంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?
1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
3) భావ కవిత 4) విప్లవ కవిత

4. అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?
1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?

భారతదేశంలో పారిశ్రామిక రంగం

ఖనిజ ఆధారిత పరిశ్రమలు: భారతదేశం ఇనుము – ఉక్కు ఉత్పత్తి పరంగా ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. (చైనా, జపాన్, యూఎస్ఏ, రష్యాల తర్వాత). స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. భారతదేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధిని రెండు దశల్లో పరిశీలించవచ్చు అవి...

- **స్వాతంత్ర్యానికి పూర్వం:** ఈ దశలో ఇనుము – ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధి ప్రైవేటు రంగంలోనే జరిగింది.
- **స్వాతంత్ర్యానంతరం:** ఈ దశలో విదేశీ సహకారంతో ప్రభుత్వ రంగంలో ఇనుము – ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందింది.

స్వాతంత్ర్యానికి పూర్వం

1. 1830 – భారత్‌లో మొట్టమొదటి ఇనుము – ఉక్కు కర్మాగారాన్ని చెన్నై సమీపంలోని పోర్టోనోవాలో స్థాపించారు.
2. 1864 – పశ్చిమ బెంగాల్‌లోని 'కుల్టీ' అనే ప్రదేశంలో 'బెంగాల్ ఐరన్ వర్క్స్' ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.
3. 1907 – జార్ఖండ్‌లోని 'జంషెడ్‌పూర్' (సక్చి) అనే ప్రాంతంలో జంషెడ్ జీ టాటా మొదటి సారి సమీకృత ఇనుము ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. దీన్నే టిస్కో (TISCO - టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) అని పిలుస్తారు.

   ముడి పదార్థాల సరఫరా
   - ఐరన్ ఓర్– జార్ఖండ్‌లోని నేముండి, ఒడిశాలోని గురుమహ – సాని, బాదమ్ పహాడ్
   - బొగ్గు – ఝరియా, రాణిగంజ్
   - మాంగనీస్ – జోడామైన్స్ (ఒడిశాలో కియోంజార్ జిల్లా)
   - నీరు – సువర్ణరేఖ
   - డోలమైట్ అండ్ లైమ్‌స్టోన్ – సుందరగఢ్
4. 1908 – కుల్టీ సమీపంలోని హీరాపూర్ అనే ప్రాంతంలో మరో ఇనుము ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు.
5. 1919 – బెంగాల్‌లోని బర్న్‌పూర్ వద్ద ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (IISCO) ఏర్పాటు చేశారు. దీనిలో కుల్టీలోని బెంగాల్ ఐరన్ వర్క్స్, హీరాపూర్‌లోని హీరాపూర్ స్టీల్ ప్లాంట్లను విలీనం చేశారు. 1972లో IISCOను భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

   ముడి పదార్థాల సరఫరా
   - ఐరన్‌ఓర్ – జార్ఖండ్‌లో సింగ్భమ్ జిల్లాలో ఉన్న 'గున' గనులు
   - బొగ్గు – ఝరియా, రాణిగంజ్
   - విద్యుత్ – దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
   - నీరు – బార్కార్ నది

- డోలమైట్, లైమ్‌స్టోన్ – సుందరగఢ్

6. 1923 – కర్ణాటకలోని భద్రావతి వద్ద 'మిస్కో' (మైసూర్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) ఏర్పాటు చేశారు. 1929లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో దీని పేరును విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారంగా మార్చారు. 1962లో దీన్ని భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

   ముడి పదార్థాల సరఫరా
   ఐరన్ ఓర్ – కెమ్మంగుడి
   విద్యుత్ – శరావతి పవర్ ప్లాంట్
   నీరు – భద్రావతి నది
   లైమ్ స్టోన్ – బుందిగూడ
   మాంగనీస్ – షిమోగా, చిత్రదుర్గ

స్వాతంత్ర్యానంతరం
రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో

7. 1957 – చత్తీస్‌గఢ్ (గతంలో మధ్యప్రదేశ్) యూఎస్ఎస్ఆర్ సహాయంతో 'భిలాయ్' ఇనుము – ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

   ముడి పదార్థాల సరఫరా
   ఐరన్ ఓర్ – రాజ్‌హర
   బొగ్గు – కోర్బా, కార్గాలి
   లైమ్ స్టోన్ – నందిని
   విద్యుత్ – కోర్బా థర్మల్ పవర్ ప్లాంట్
   మాంగనీస్ – భాండారా, బాల్గాయ్
8. 1959 – బ్రిటన్ సహాయంతో పశ్చిమ బెంగాల్‌లో ఇనుము–ఉక్కు కార్మాగారాన్ని 'దుర్గాపూర్'లో స్థాపించారు.

   ముడిపదార్థాల సరఫరా
   ఐరన్ ఓర్ – బొలానిమైన్స్
   కోల్ – ఝరియా, రాణిగంజ్
   లైమ్‌స్టోన్ – బిర్‌మిత్రాపూర్
   మాంగనీస్ – కియోంజార్
   విద్యుత్ – దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
9. 1959 – ఒడిశాలో పశ్చిమ జర్మనీ సహాయంలో 'రూర్కెలా' ఇనుము–ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

   ముడి పదార్థాల సరఫరా:
   ఐరన్‌ఓర్ – సుందరగఢ్, కియోంజార్
   బొగ్గు – ఝరియా
   విద్యుత్ – హీరాకుడ్ హైడ్రోపవర్ ప్లాంట్
   మాంగనీస్ – బరాజమ్‌డా
   లైమ్‌స్టోన్ – పూర్ణాపాండ్

మూడో పంచవర్ష ప్రణాళిక కాలంలో

10. 1964 – జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో యూఎస్ఎస్ఆర్ సహాయంతో 'బొకారో' స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

    ముడిపదార్థాల సరఫరా
    ఐరన్ ఓర్ – కిరిబరు (ఒడిశా)
    బొగ్గు – ఝరియా
    లైమ్‌స్టోన్ – పాలము
    విద్యుత్ – దామోదర్ వ్యాలీ కార్పొరేషన్

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో

11. 1972 – ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖతీరంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ సహాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 1982లో నిర్మాణాన్ని ప్రారంభించగా 1992లో పూర్తైంది.
    - 1992 ఆగస్టు 1న దివంగత ప్రధాని పి.వి. నరసింహారావు ఈ కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

- ఈ కర్మాగారం దేశంలో అత్యాధునికమైంది, తీర ప్రాంతంలోని ఏకైక ఇనుము – ఉక్కు కర్మాగారం.

ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో

12. 1982 – తమిళనాడులోని సేలం వద్ద ఇనుము – ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఇది నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి.

ఏడో పంచవర్ష ప్రణాళిక

13. 1989 – కర్ణాటకలోని హోస్పేట్ వద్ద విజయనగర్ ఐరన్ – స్టీల్ కంపెనీని ఏర్పాటు చేశారు.

కొత్తగా ఏర్పాటు చేయనున్న స్టీల్ ప్లాంట్‌లు

1. ఒడిశాలో పోస్కో స్టీల్ కంపెనీ. దీన్ని దక్షిణ కొరియా సహాయంతో ఎంఓయూ పద్ధతిలో నిర్మించనున్నారు.
2. బైలడిల్లా – చత్తీస్‌గఢ్
3. సూరజ్‌గఢ్ – మహారాష్ట్ర

అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ సమీపంలో జయక్ నగర్‌లో అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్థాపించారు. దీన్ని భారత ప్రభుత్వం 1954లో జాతీయం చేసింది. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ పరిధిలో ఐదు ప్రభుత్వ రంగ కంపెనీల ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. అవి....

1. బాల్కో (భారత్ అల్యూమినియం కంపెనీ – కోర్బా (చత్తీస్‌గఢ్), రత్నగిరి (మహారాష్ట్ర)
2. ఇండాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ) – హీరాకుడ్, బెల్గాం, అలూపురం
3. నాల్కో (నేషనల్ అల్యూమినియం కంపెనీ) – కోరాపుట్ సమీపంలోని దామన్ జోడి, అంగుల్
4. హిందాల్కో (హిందూస్థాన్ అల్యూమినియం కంపెనీ – రేణికూట్ (ఉత్తరప్రదేశ్)
5. మాల్కో (మద్రాస్ అల్యూమినియం కంపెనీ – మెట్టూరు (తమిళనాడు)

కాపర్ పరిశ్రమ

భారత్‌లో మొదటి కాపర్ పరిశ్రమను జార్ఖండ్‌లోని 'ఘాట్‌సీలా' వద్ద ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న రాగి ఉత్పత్తి కేంద్రాలు...

1. మహుభాండార్ (జార్ఖండ్)
2. ఖేత్రి (రాజస్థాన్)

హెచ్ఎంటీ (హిందూస్థాన్ మిషన్ టూల్స్): 1953లో కర్ణాటకలోని బెంగుళూరులో మొదటి హెచ్ఎంటీ యూనిట్‌ను స్థాపించారు. ప్రస్తుతం దేశంలో ఆరు హెచ్ఎంటీ యూనిట్లు ఉన్నాయి. అవి....

1) శ్రీనగర్ 2) బెంగుళూరు
3) పింజోర్ 4) హైదరాబాద్
5) జైపూర్ 6) కాలమస్సేరి

బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్): 1956లో మొదటి బీహెచ్ఈఎల్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో ఆరు బీహెచ్ఈఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...

1) భోపాల్ 2) హరిద్వార్
3) రాణిపేట్ (తమిళనాడు)
4) బెంగళూరు 5) హైదరాబాద్
6) జగదీశ్‌పూర్

హెచ్ఏఎల్ (హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్): 1964లో బెంగళూరులో మొదటి హెచ్ఏఎల్ యూనిట్‌ను స్థాపించారు. దేశంలో ఆరు హెచ్ఏఎల్ యూనిట్లున్నాయి. అవి....

1) నాసిక్ 2) కోరాపుట్
3) హైదరాబాద్ 4) లక్నో
5) కాన్పూర్ 6) బెంగళూరు

ఐడీపీఎల్ (ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్):
ప్రస్తుతం దేశంలో ఐదు ఐడీపీఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...

1) రిషికేశ్ 2) హర్యానాలోని గుర్గావ్
3) హైదరాబాద్ 4) ముజఫర్‌పూర్
5) చెన్నై

మాదిరి ప్రశ్నలు

1. భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) జంషెడ్‌పూర్
2. 'భిలాయ్' ఇనుము ఉక్కు కర్మాగారానికి ఏ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు?
   1) ఫరక్క థర్మల్ పవర్ ప్లాంట్
   2) దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
   3) కోర్బాథర్మల్ పవర్ ప్లాంట్
   4) హీరాకుడ్ పవర్ ప్లాంట్
3. కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారానికి అవసరమైన నీటిని ఎక్కడ నుంచి సరఫరా చేస్తారు?
   1) కావేరి నది 2) తుంగ
   3) నేత్రావతి 4) భద్రావతి
4. జర్మనీ సహకారంతో దేశంలో ఏర్పాటు చేసిన ఇనుము ఉక్కు కర్మాగారం ఏది?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) విశాఖ
5. దేశంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన ఏకైక స్పాంజ్ ఇనుము – ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) హోస్పేట్
   2) మెట్టూరు
   3) విశాఖ
   4) పాల్వంచ(ఖమ్మం)
6. భారత్ అల్యూమినియం కంపెనీ (బాల్కో) ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ యూనిట్ ఉన్న ప్రదేశం ఏది?
   1) రాణిపేట్
   2) రేణికూట్
   3) బెల్గాం
   4) కోర్బా
7. కింది వాటిలో హెచ్ఎంటీ యూనిట్ లేని ప్రదేశం ఏది?
   1) రిషికేశ్ 2) పింజోర్
   3) కాలమస్సేరి 4) అజ్మీర్
8. రైల్వే ఎలక్ట్రిక్ ఇంజన్లను తయారు చేసే బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్) యూనిట్ ఏది?
   1) హరిద్వార్ 2) భోపాల్
   3) రాణిపేట్ 4) బెంగుళూరు
9. ట్రాక్టర్స్‌ను తయారుచేసే హెచ్ఎంటీ యూనిట్ ఏది?
   1) శ్రీనగర్ 2) కాలమస్సేరి
   3) అజ్మీర్ 4) పింజోర్
10. 'సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్'ను తయారు చేసే ఐడీపీఎల్ యూనిట్ ఏది?
    1) రిషికేశ్ 2) చెన్నై
    3) ముజఫర్‌పూర్ 4) గుర్గావ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 4; 4) 2; 5) 4;
6) 4; 7) 1; 8) 2; 9) 4; 10)2.

The synonym of Tranquility is..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Due to the financial crisis (1)/ the price of food grains (2)/ has risen sharply (3) / over the past few months. (4) / No error (5)
2. Under the Hindu Minority and Guardianship Act, (1)/ a child natural guardian, (2)/ both of person and property, (3)/ is first the father and then the mother. (4)/ No error (5)
3. New data for rural households (1)/ will reveal by the Socio Economic and Caste Census (2)/ represent a grim reminder(3)/ of the state of rural India. (4)/ No error (5)
4. Ensuring financial services and health care (1)/ to the poor can be done (2)/through create (3)/ social businesses. (4) / No error (5)
5. A committees will be set up (1)/ to study and to reconsider (2)/ the rejected applications of forest encroachers (3)/ in the State. (4) / No error (5)

Directions (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given in bold in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The union minister said that all the States **had been instructed** to have a contingency plan ready in the wake of a drought forecast this season.
   1) has being instructed
   2) were been instructed
   3) will been instructed
   4) has been instructed
   5) No correction required
7. The attendance for the movie **release** yesterday was sparse and reviews were negative.
   1) releasing 2) will release
   3) released 4) was released
   5) No correction required
8. Singles and albums will be released on Friday **upon**.
   1) from now on 2) together
   3) from know 4) from within
   5) No correction required
9. Millions of people across the world **could affect** by cyber attack.
   1) will affect 2) would effect
   3) can effect 4) were affected
   5) No correction required
10. In the heaviest commercial launch **of it's formation**, the Indian Space Research Organization's PSLV on Friday launched five satellites.
    1) since its inception
    2) from it beginning
    3) with an initiation
    4) at the starting
    5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), and (E) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) What this means is that the weaver has to figure out where on the loose threads the dye should go in order for it to form the proper pattern when it is woven on the loom.

B) Some ikats are made by dyeing the warp threads, some by dyeing the weft threads and some by dyeing both, a technique known as double ikat.

C) The word 'ikat' comes from the Malaysian word 'meng-ikat,' or 'to tie'.

D) It gets more complicated as you add more colors.

E) It's like an aesthetic logic puzzle, and just thinking about it makes my head hurt.

F) Because the loose threads are tied into bundles using grasses or wax-treated cotton to specify where the dye is able to sink in and color the thread.

11. What is the FOURTH sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) A
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) E 4) D 5) C
13. What is the LAST sentence after rearrangement?
    1) A 2) C 3) B 4) E 5) D
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) A
15. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. The master dispensed ______ the services of his servant.
    1) of 2) with 3) off 4) for 5) at
17. He has great _______ for me.
    1) affection 2) affectation
    3) effect 4) affect 5) affliction
18. My friend is ________ very good at cricket.
    1) coincidence 2) affectionate
    3) passion4) really 5) fact
19. Turkey's economy has grown _______ over the past ten years.
    1) prodigiously 2) providently
    3) provisional 4) affectionate
    5) increasing
20. In an abrupt ______ of violence, Boko Haram ______ killed around 200 people in Nigeria over the past week.
    1) surge… insurgents
    2) rush… rebel
    3) push… content
    4) radical… revolt
    5) revolution… captive

Directions (Q. 21-25): In the following passage there are blanks, each of which has been numbered. These words are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The model code of conduct places _____ (21) on the government initiating welfare schemes and development projects in a constituency going to the polls. But voters ___ (22) they would be rewarded later if they vote for the ruling party. However, there is no guarantee that the _____ (23) in a by-election would hold in a general election. When voters sense an opportunity to throw out a ruling party in a general election, and not just embarrass it as in a by-election, they vote in a very _______ (24) manner. While these by-elections are thus cause for some celebration for those in power in the respective States, they are by no means pointers to what ______ (25) follow in a general election.

21. 1) restrictions 2) barricades
    3) obstacle 4) impediment
    5) hurdle
22. 1) aware 2) know
    3) welfare 4) benefit
    5) object
23. 1) outcast 2) formality
    3) results 4) affect
    5) distress
24. 1) new 2) creation
    3) innovate 4) different
    5) symptomatic
25. 1) must 2) may
    3) have 4) shall 5) could

Directions (Q. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

"The whole sky was blazing with stars, larger and brighter than they appear through the dense atmosphere breathed by inhabitants of the lower parts of the earth. They seemed actually suspended from the dark vault of heaven, and their gentle light shed a fairylike gleam over the snow-fields around the foot of the Matterhorn, which raised its stupendous pinnacle on high, penetrating to the heart of the Great Bear and crowning itself with a diadem of his magnificent stars. Not a sound disturbed the deep **tranquillity** of the night except the distant roar of streams that rush from the high plateau of the St. Theodule glacier and fall headlong over precipitous rocks till they lose themselves in the mazes of the Gorner glacier."

26. "The lower parts of the earth" refers to
    1) lower altitudes
    2) people with poorer vision
    3) the underworld 4) plains
    5) stars
27. A vault is
    1) a place for safekeeping
    2) a jumping-off place
    3) an arched structure
    4) a welcoming place
    5) the whole sky
28. The Great Bear is
    1) a rock formation
    2) a constellation of stars
    3) a mountain in the Alps
    4) a wild animal
    5) a special species
29. A maze is
    1) a corn field
    2) a remarkable place
    3) a river
    4) a confusing network of paths
    5) a constellation
30. The synonym of **Tranquillity** is
    1) surreptitious
    2) clandestine
    3) serendipity
    4) providence 5) serenity

ANSWERS

1) 1	2) 2	3) 2	4) 3	5) 1
6) 5	7) 3	8) 1	9) 4	10)1
11) 3	12) 1	13) 4	14) 2	15) 2
16) 2	17) 1	18) 4	19) 1	20) 1
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 3	28) 2	29) 4	30) 5